
ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 465
వెల : రూ.40/-
డిసెంబర్ 2023
&
జనవరి 2024



## చెరగని నినాదం....

జనసాహితి ప్రచురణ

కవిత

# అది చెరగని నినాదం


యుద్ధం జరుగుతున్న కాలంలో
ఖైదీలైన సైనికులు, తాగుబోతులు, దొంగలతో
ఇటలీలోని క్రిక్కిరిసిన సాన్‌కార్లో జైలుగదిలో
ఒక సోషలిస్టు సైనికుడు
చెరపడానికి వీలులేని పెన్సిల్‌తో
గోడపై రాశాడు - "లెనిన్ చిరకాలం వర్ధిల్లాలి!"



ఆ మసకమసక గదిలో, గోడపైన ఎత్తుగా
కనబడీ కనబడని పెద్ద అక్షరాలు
జైలు వార్డర్ చూసి, బకెట్‌నిండా సున్నం ఇచ్చి
ఒక పెయింటర్‌ను పురమాయించాడు
అతడేమో ఆ భయపెడ్తున్న అక్షరాలపై
తన పొడుగాటి బ్రష్‌తో సున్నం పులిమాడు!
కానీ ఆ అక్షరాలు "లెనిన్ చిరకాలం వర్ధిల్లాలి!"
కనబడుతూనే వున్నాయి!
ఆ తర్వాత మరో పెయింటర్ వెడల్పాటి బ్రష్‌తో
గోడంతా సున్నం పూసాడు
దానితో ఆ అక్షరాలు కొన్ని గంటలపాటు
అదృశ్యమయ్యాయి కానీ,
ఉదయానికి వేసిన సున్నం ఎండిపోయి
దాని క్రింద అక్షరాలు "లెనిన్ చిరకాలం వర్ధిల్లాలి!"
మరలా ప్రత్యక్షం!



అప్పుడు వార్డర్ ఒక బేలుదారిని పిలిచి
గంటసేపు ఆ అక్షరాలను ఒక్కొక్కటి
చెక్కించేసాడు -
ఎత్తైన ఆ గోడపై లోతుగా చెక్కిన
అజేయమైన ఆ శాసనం
నినదిస్తూనే వుంది
'లెనిన్ చిరకాలం వర్ధిల్లాలి!' అంటూ
అపుడా సైనికుడన్నాడు గదా!
"ఇక ఈ జైలు గోడ పగులగొట్టండి!"



1934లో బెర్టోల్ట్ బ్రెఖ్ట్ "The Unconquerable Inscription"కు తెలుగు : డా॥ ఉదయ

జనసాహితి ప్రచురణ

47 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

465

సంపుటి : 47
సంచిక : 5, 6
డిసెంబర్ 2023 & జనవరి 2024

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ముఖచిత్రం | : | లెనిన్ | | 01 |
| రెండవ అట్ట | : | అది చెరగని నినాదం – కవిత : బెర్టోల్డ్ బ్రెహ్ట్ | అను : డా॥ ఉదయ | 02 |
| మూడవ అట్ట | : | డిసెంబర్ 13 ఘటనలు – కవిత | – రవి | 67 |
| నాల్గవ అట్ట | : | లెనిన్ లెనిన్ లెనిన్ – కవిత | – డా॥ ఆర్కే | 68 |
| సంపాదకీయం | : | ప్రపంచమంతటా నేటికీ కొనసాగుతున్న కామ్రేడ్ లెనిన్ ప్రభావం! | | 05 |
| కథ | : | రాజీనామా | – ఎన్.వి.యస్. నాగభూషణ్ | 08 |
| సజీవ సాహిత్యం | : | లెనిన్ సంతాపసభ | – నికొలాయ్ ఓస్ట్రోవిస్కీ | 55 |
| వ్యాసాలు | : | తొల్‌స్తోయి, కార్మికవర్గపోరాటమూ | – లెనిన్ | 07 |
| | : | లెనిన్ – సాహిత్యం | – జి.వి. భద్రం | 20 |
| | : | తెలుగు కవితలలో లెనిన్ | – పులుపుల వెంకట శివయ్య | 26 |
| | : | లెనిన్ ఇష్టపడిన సాహిత్యం – నాటకాలు | – ఓవీవీయస్ | 32 |
| | : | లెనిన్ గ్రంథాలయ విధానం | – తమ్మినేని అక్కిరాజు | 44 |
| | : | లెనినిజం చూపుతున్న దారి | – డా॥ బి. అరుణ | 46 |
| | : | ఉర్దూ సాహిత్యంలో లెనిన్ | – అను : భానుతేజ | 49 |
| | : | లెనిన్ రాసిన నిర్బంధ అధికారభాష అవసరమా? | – గౌరీశంకర్ | 59 |
| పుస్తక పరిచయాలు | : | భౌతికవాదం అనుభవైక విమర్శన | – డా॥ ఆర్కే | 12 |
| | : | మన లెనిన్ | – ప్రసన్న | 23 |
| | : | చారిత్రాత్మక నాటకం "క్రెమ్లిన్ గంటలు" | – దివికుమార్ | 52 |
| సినిమా సమీక్ష | : | 29వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం | – బాలాజీ (కోల్‌కతా) | 61 |
| | : | లెనిన్ గురించి మూడు గేయాలు | – కొత్తపల్లి రవిబాబు | 29 |
| బుర్రకథ | : | లెనిన్ | – సుంకర సత్యనారాయణ | 35 |

- కవితలు / పాట : కొత్తపల్లి రవిబాబు (**19**); జీవన్ (**22**); పెనుగొండ లక్ష్మీనారాయణ (**25**); జనజ్వాల (**34**); సుగమ్‌బాబు (**41**); బెర్టోల్డ్ బ్రెహ్ట్ (**43**); మయకోవిస్కియ్ (**60**)
- వివిధ : మైత్రీబుక్‌హౌస్ ప్రకటన (**04**); సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**28, 42, 51**); సోమేపల్లి వెంకట సుబ్బయ్య మరణానికి సంతాపం (**31**); ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**58**); చైతన్యవాహిని (**64**); ఈ పుస్తకాలు అందాయి (**65**); వార్తాసాహితి (**66**)
- కృతజ్ఞతలు : కొత్తపల్లి (తుమ్మల) సుధాబాల (**48**)


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

*రచనలు పంపవలసిన చిరునామా :*
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER ISSN 0971-278X
LIBRARY OF CONGRESS LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
*0680101004936*
*IFSC No. CNRB0000680*
**ఫోన్ : 94901 96890**



| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి



**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రికపంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం


# 34వ విజయవాడ పుస్తక ప్రదర్శన

**28-12-2023 నుండి**
**07-01-2024 వరకు**

**గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ**
రమేష్ హాస్పిటల్స్ ఎదురుగా,
విజయవాడ-520008.

**మైత్రి బుక్‌హౌస్**
అభ్యుదయ, విప్లవ సాహిత్య కేంద్రం

**మా స్టాల్ నెం. 33ను**
**తప్పక సందర్శించండి**

**వివరాలకు : 70755 08270**

సంపాదకీయం

# ప్రపంచమంతటా నేటికీ కొనసాగుతున్న కామ్రేడ్ లెనిన్ ప్రభావం!

**"క్రెమ్లిన్‌లో** లెనిన్ నిద్రపోలేదురా! నిన్ను ఒకంట కనిపెడుతూనే ఉన్నాడు!!" వియత్నాం విముక్తి పోరాట కాలంలో 50 ఏళ్ల క్రితం అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని హెచ్చరిస్తూ శ్రీ శ్రీ రాసిన వాక్యాలు ఇవి. ఈనాటి ఉక్రేయిన్ యుద్ధం వెనుక, పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై జాత్యహంకార ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న యుద్ధోన్మాద దురాగతాల వెనుక అమెరికన్ సామ్రాజ్యవాదమే ప్రధానంగా ఉంది. గడచిన వందేళ్లకు పైగా ప్రపంచంలో జరిగిన జరుగుతున్న చిన్న పెద్దా యుద్ధాల వెనుక ప్రత్యక్షంగానో పరోక్షంగానో సామ్రాజ్యవాదం పాత్ర ఉంటూ వుంది. సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం అన్నాడు లెనిన్.

మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతూ ఉండగా సామ్రాజ్యవాదాన్ని పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశగా, పతన దశగా, ఒక మట్టి కాళ్ళ మహా రాక్షసిగా లెనిన్ విశ్లేషించారు. మొదటి ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకంగా రష్యా ప్రజలను నిలిపి, 1917 అక్టోబరు విప్లవంతో (నవంబర్ 7) జారు చక్రవర్తుల నిరంకుశ పాలనను ఓడించి సామ్రాజ్య వాదాన్ని సంపూర్ణంగా కూలద్రోసే పోరాట బావుటాను యావత్తు ప్రపంచం ముందు లెనిన్ ఆవిష్కరించాడు. "ఇప్పుడు పెట్టుబడికి కూడా యుద్ధాన్ని అదుపులో పెట్టడం అసాధ్యమైంది!"

"అదనపు విలువ కన్నపు దొంగల్ని కన్నంలోనే" కార్ల్‌మార్క్స్ పట్టుకుంటే జాతీయ విముక్తి పోరాటాలే, ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దక్షిణ అమెరికా ఖండాలలోని సామ్రాజ్యవాద పీడిత దేశాల ప్రజలు విప్లవించడం ద్వారానే యుద్ధాలకి శాశ్వత పరిష్కారం లభిస్తుందని, శాంతి ఏర్పడుతుందని చెప్పిన వాడు లెనిన్!!

విప్లవ ద్రోహియైన ఒక సోషలిస్ట్ రివల్యూషనరీ తనపై పేల్చిన తుపాకీ గుళ్ళకు 1921లో గురైన లెనిన్, 53 ఏళ్ల వయసుకే వంద సంవత్సరాల క్రితం మరణించాడు. ఈ జనవరి 21వ తేదీ ఆయన నూరవ వర్ధంతి.

ప్రసిద్ధ కవి మయకోవస్కి మాటల్లో చెప్పాలంటే "లెనిన్ బ్రతుకు జనం కొరకు!" "లెనిన్ నేడు లేడూ! చూడు జనంలో ఉన్నాడు!!"

భారతదేశాన్ని తమ ప్రత్యక్ష వలసగా మార్చుకుని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఆర్థిక రాజకీయ దోపిడీ అణిచివేతలకు పాల్పడి నప్పుడు, అత్యంత సహజంగా భారత జాతీయ నాయకులు సోవియట్ విప్లవం వైపు దాని ఆదర్శాల వైపు చూశారు. "ప్రపంచమంతా భూఖండమంతా ఆయనకేసి చూస్తోంది. ప్రతి చోట నుంచీ చైనా నుంచీ, ఇండియా నుంచీ, అమెరికా నుంచీ జీవనాదులు ఆయన్ను పెనవేసుకుని ఉన్నాయి. ఆయన ఆత్మ శాశ్వతంగా అందరికీ చెందుతుంది." మాక్సిమ్ గోర్కి చెప్పిన పై మాటలు లియో టాల్‌స్తోయ్ గురించి అయినప్పటికీ, అవి ప్రపంచ శ్రామిక వర్గ విప్లవ నేత లెనిన్‌కి నూటికి నూరుపాళ్ళూ సరిపోతాయి.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు లెనిన్ పై దుష్ప్రచారం చేస్తుండటాన్ని ఖండిస్తూ బాలగంగాధర తిలక్ తన కేసరి పత్రికలో 1918 జనవరి లోనే "రష్యా నాయకుడు లెనిన్!" అనే సంపాదకీయంలో లెనిన్‌ను శాంతికాముకునిగా కీర్తించాడు. అగ్ర రాజ్యాలు తమ స్వార్థ ప్రయోజనాలకై యుద్ధాలను రెచ్చగొడుతూ ఉంటే లెనిన్ వాటిని వ్యతిరేకించాడని అభినందించాడు. అంతేకాక పేద రైతాంగానికి భూమిని పంచిపెట్టటానికి సంకల్పించడం పేదలను ఉద్ధరించే గొప్ప విప్లవాత్మక చర్యగా పేర్కొన్నాడు. ఈయనే కాక వివిధ సందర్భాలలో లాలాజపతిరాయ్ గాంధీ, సుభాష్ చంద్రబోస్ తదితరులు తమ తమ పద్ధతులలో లెనిన్‌ను శ్లాఘించారు.

సావర్కారు బ్రిటిష్ వాళ్లకు లొంగిపోవటానికి ముందు లండన్‌లో ఉండగా లెనిన్‌ను ఇండియా హౌస్‌లో కలిశాడు. ఉత్తరప్రదేశ్‌లో మధుర ప్రాంతానికి చెందిన రాజా మహేంద్ర ప్రతాప్, ఒబేదుల్లా సింధి అనే జాతీయ వీరునితో కలిసి మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో 1915లో ఆఫ్ఘనిస్తాన్‌లో భారత ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, 1919లో మాస్కో వెళ్లి స్వయంగా లెనిన్‌ను కలిశారు. 1920లో శౌకత్ ఉస్మాని, ఎం.ఎన్ రాయ్ తదితరులు రష్యా వెళ్ళినప్పుడు లెనిన్ స్వయంగా వారిని స్వాగతించాడు. భగత్‌సింగ్ తదితర కామ్రేడ్స్ 1930 జనవరి 21న అనగా లెనిన్ 6వ వర్ధంతి నాడు లెనిన్ వర్ధిల్లాలి అని నినదిస్తూ, సోవియటు విజయాలను శ్లాఘిస్తూ సందేశం పంపిన సంగతి మనకు బాగా తెలుసు. ఆ విధంగా లెనిన్ స్ఫూర్తితో మొత్తంగా ఆసియా ప్రజలకు ప్రత్యేకించి భారత జాతీయ నాయకత్వానికి విడదీయరాని బంధం ఉంది.

లెనిన్ కు సమకాలికులైన భారతీయులకు ఆయనపై జరుగుతున్న విషప్రచారం గురించి తెలుసు, అందుకే దానిని వారు విమర్శించారు. లెనిన్‌పై నేడు కొందరు స్వయంప్రకటిత జాతీయవాదులూ, మతిమాలిన తనంతో, ఆయనపై అసహ్యం నింపుకొని, దుష్ప్రచారంచేస్తూ, ఉగ్రవాదిగా, సామూహిక హంతకుడుగా, ఓ విదేశీయుడిగా, ముద్ర వేయబోయేముందు, మన జాతీయ ఉద్యమ చరిత్రను కొంచెం అధ్యయనం చేయడం మంచిది. సామ్రాజ్యవాదుల ఏజెంట్లు, ప్రైవేటీకరణకు, సమస్త బడుగు జాతులను దోపిడీ చేసే ప్రపంచీకరణకు లొంగిపోయిన

వారు మాత్రమే నేడు లెనిన్ స్ఫూర్తిని సహించలేరు, భరించలేరు. వలస విధానం నయా వలస విధానంగా మారిన నేటి కాలంలో కూడా లెనిన్ బోధించిన "కలోనియల్ థీసిస్" ఇప్పటికీ అర్థవంతంగానే ఉంది.

ఆ విధంగా 21వ శతాబ్దపు కీలక ప్రపంచ వైరుధ్యాల పరిష్కారానికి, జాతుల సమస్య భాషా సమస్య తదితరాల పరిష్కారానికి లెనిన్ బోధనలు ఇంకా సమకాలీనతను కలిగే ఉంటాయి. ఆసియా దేశాలలోని ముస్లింలను ముస్లిమేతరులను ఐక్యంగా నిలవమని నూరేళ్ల క్రితం లెనిన్ ఇచ్చిన పిలుపు నేటికీ చారిత్రక అవసరంగానే ఉంది.

లెనిన్ సాహిత్యకారులకు కూడా తగిన అవగాహనను, సాహిత్య సామాజిక దృక్పథాన్ని అందించిన మేధావి.

లియో టాల్‌స్టాయ్ తన విస్తార సాహిత్య కృషి ద్వారా రష్యా దేశపు సామాజిక వాస్తవాన్ని అంటే అంతర్వైరుధ్యాలను, జీవన సంఘర్షణను, సాధారణ ప్రజల ఆర్తిని చాలా విస్తారంగా తన సృజనాత్మక సాహిత్యం ద్వారా ప్రపంచానికి అందించారు. రాజ్యాన్ని సహితం నిర్దాక్షిణ్యంగా విమర్శించారు. అయితే "టాల్ స్థాయ్ భావాలలోని అంతర్వైధ్యాలు ఆయన వ్యక్తిగత భావాలలో మాత్రమే అంతర్నిహితమైన అంతర్వైధ్యాలు కాదు. అవి సంస్కరణానంతరపు, కానీ విప్లవ పూర్వపు యుగంలోని రష్యన్ సమాజపు వివిధ వర్గాల వివిధ విభాగాల మనస్తత్వాన్ని నిర్ణయించిన మహా సంక్లిష్ట పరస్పర విరుద్ధ పరిస్థితులకూ సామాజిక ప్రభావాలకూ చారిత్రక సాంప్రదాయాలకూ ప్రతిబింబం" అంటాడు లెనిన్. మొత్తం టాల్ స్టాయ్ రచనలపై ఐదు వ్యాసాలు ఆయన రాశారు. అవి కేవలం టాల్ స్టాయ్‌ని అర్థం చేసుకోవడానికే కాక సామాజిక ప్రగతికి అభివృద్ధి నిరోధకత్వానికి గల వైరుధ్యాన్ని అర్థం చేసుకోవడానికి కూడా తోడ్పడతాయి. ఏనాడో కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్ ఏంగిల్సులు విమర్శించిన ఫ్యూడల్ సోషలిస్టు లక్షణాలు, ఊహాస్వర్గం పట్ల అభిరుచులు టాల్ స్టాయ్‌లో ఎలా వ్యక్తమైనాయో మనకు అర్థమయ్యేట్లు చేస్తాడు లెనిన్. ఆశ్చర్యకరంగా టాల్ స్టాయ్ లోని ఈ లక్షణాలనే గాంధీ చాలా ఇష్టపడటం మనం గమనించవచ్చు.

రష్యాలో 1905 విప్లవం విఫలమైన తర్వాత కొందరు మేధావులు, తత్త్వవేత్తలు మార్క్సిజంకి కాలం చెల్లిందని, కొత్తగా భౌతిక శాస్త్రంలో వచ్చిన నూతన ఆవిష్కరణల వెలుగులో మార్క్సిజాన్ని మెరుగు పరుస్తున్నామని, సరిచేస్తున్నామని గతితార్కిక భౌతికవాదంపై దాడి మొదలుపెట్టారు. (ఆస్ట్రియా దేశపు శాస్త్రవేత్త ఎర్నెస్ట్ మక్ పునరుద్ధరణ పేరుతో తత్వశాస్త్రంలో భావవాద దృక్పథాన్ని చేర్చి భౌతికవాదంతో మతాన్ని ముడివేయచూశాడు. ఈ ప్రపంచం వాస్తవికమైనది కాదు, జ్ఞానేంద్రియాలు కలిగించే అనుభూతులు మాత్రమే వాస్తవం అంటాడు, మక్. 18వ శతాబ్దపు బర్కిలీ అనే తత్త్వవేత్త మన మనసుల్లో జ్ఞానేంద్రియాలు కలిగించే అనుభూతులు తప్ప వేరే వస్తువేమీ లేదంటాడు. వీరు ప్రచారం చేసిన భావాలను అనుభవవాద విమర్శ అనేవారు. ఇది స్వీయాత్మక భావవాదం. మన దేశంలోని శంకరుని అద్వైతం లాంటిదిది. ఈ భావజాలంలోని అశాస్త్రీయతను తెలియపరుస్తూ 'భౌతికవాదం – అనుభవైక విమర్శ' అనే గ్రంథాన్ని లెనిన్ రచించాడు. "ప్రపంచాన్ని మార్చడం కూడా తత్త్వవేత్తల లక్ష్యమేనన్న" మార్క్స్ సూక్తిని లెనిన్ ఉదహరించేవాడు. సమరశీల భౌతిక వాదం యొక్క ఆవశ్యకతను చెప్పినవాడు లెనిన్. మతం పట్ల తీసుకోవలసిన వైఖరి, వ్యవహరించవలసిన సున్నితాలు విప్పి చెప్పిన వాడు లెనిన్. గోర్కి అమ్మ ఒక మత విశ్వాసిగా మొదలై ప్రజా ఉద్యమ చైతన్యంలోనే సమిష్టి సృజనాత్మక కార్యకలాపంలోనే దేవుని చూసినట్లుగా మార్పు తీసుకున్న క్రమం, లెనిన్ మతం గురించి బోధించిన సున్నిత వ్యవహార సరళికి గొప్ప ఉదాహరణ.

లెనిన్ కున్న కుటుంబ నేపథ్యం వల్ల రష్యా భాషతోపాటు ఫ్రెంచ్, జర్మన్, ఇంగ్లీషు భాషలలో ప్రావీణ్యం కలిగింది. ఆయా భాషలలో వచ్చే సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసేవాడు. కళలు, సాహిత్యం ప్రజా జీవితాన్ని ఆవిష్కరించాలని, ప్రజాప్రయోజన దృష్టి ఉండాలని రచయితలను కోరాడు. నిరంతరం సైద్ధాంతిక విషయాలతో విప్లవ నిర్మాణాలతో గడిపే లెనిన్‌కు సాహిత్యం, కళలు అంటవేమోనని. అనుకునేవారు. కానీ రష్యన్ రచయితలు సృజిస్తున్న సాహిత్యాన్ని గమనిస్తూ, వాటిని విశ్లేషిస్తూ ఆ సాహిత్య ధోరణులను రచయితలకు ఎరుకలోకి తెచ్చాడు. కళ కోసం కళ అంటూ రూపానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే ఫార్మలిజాన్ని, భావవ్యక్తీకరణ వాదాన్ని, భవిష్యవాదం (ఫ్యూచరిజాన్ని), రేఖాచిత్ర కళావాదం (క్యూబిజం)ల ప్రయోజనాలు... సాహిత్య ప్రయోజనాలను పరిపూర్తి చేయలేవని. అభిప్రాయపడ్డారు. పుష్కిన్, గోర్కీ, టాల్‌స్టాయ్, మయకోవస్కీ, విక్టర్ హ్యూగో, హెర్జన్, పిసరెవ్ మొదలైన రచయితల సాహిత్యాన్ని చదివేవాడు. ప్రదర్శించే నాటకాలకు హాజరయ్యేవాడు. సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం భావజాల రంగంలో తీసుకువస్తూన్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సాహిత్యం, కళలు ప్రజా సంస్కృతిని ప్రతిబింబించాలని, పరాయివిగా ఉండకూడదని అభిప్రాయపడ్డాడు.

నేటి పరిస్థితిని కూడా దృష్టిలో పెట్టుకుందాం.

"ఈనాటి జీవితాన్ని సామ్రాజ్యవాద సంస్కృతి స్పృశించని పార్శ్వమూ, కోణమే లేదు. అది మన అలవాట్లనూ, ఆచారాలనూ, ప్రవర్తననూ, సంస్కారాలనూ, కుటుంబాలనూ, సామాజిక సంబంధాలనూ, మన కోర్కెలనూ, ఆశలనూ, రాజ్యాన్నీ, రాజకీయాలనూ, వ్యక్తులనూ, సంస్థలనూ, కళల్నీ, కలల్నీ తీవ్రంగా ప్రభావితం చేస్తూ ఉంది. క్షీణవిలువలకు ముఖ్యాధారంగా సాంస్కృతిక సామ్రాజ్యవాదం నిలచి వున్నది.

సామ్రాజ్యవాదమంటే అశాంతి. సామ్రాజ్యవాదమంటే మానవ వినాశనానికి దారి తీసే యుద్ధం. ఇప్పటికే రెండు ప్రపంచ యుద్ధాలకు అది కారణం. ప్రపంచంలోని అనేక దేశాల ప్రాంతాల నడుమ యుద్ధాలకు అది ప్రేరకం. అణ్వాయుధాల వ్యాప్తికి అదే మూలం. ఆయుధ పోటీకి అదే ఆధారం. అటువంటి సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజల, పీడిత జాతుల వెనుకబడిన దేశాల ఉమ్మడి శత్రువు. దాన్ని ఓడించకుండా ఈనాడు ఏ దేశంలోనూ ప్రగతిశీల మార్పులు అసాధ్యం. దాని దుర్మార్గం యొక్క తీవ్రతనూ, దోపిడీ క్రౌర్యాన్ని అర్థం చేసుకోనివ్వకుండా రకరకాల మేధావులు సరికొత్త వాదనలు తెస్తున్నారు. అంతిమంగా అవన్నీ తెలిసో తెలియకో సామ్రాజ్యవాదానికే తోడ్పడతాయి." (జనసాహితి నిర్వహించిన సాంస్కృతిక సామ్రాజ్యవాద వ్యతిరేక సదస్సు పత్రాలు 1994 ఏప్రిల్)

రష్యాతో సహా ఏ విప్లవం అయినా ఒక వ్యక్తిది కాదు. లక్షలాది ప్రజలది. ఇది గ్రహించాడు కనుకనే లెనిన్ శ్రామిక వర్గ విప్లవ నేత అయ్యాడు. మహాప్రస్థానం కవితలో శ్రీశ్రీ ప్రస్తావించిన అగ్ని కిరీటానికి ధగధగల వెలుగుని అందించిన వాడు లెనిన్!

"తనెంత గొప్పవాడో తానే గుర్తించని ప్రముఖ వ్యక్తి... లెనిన్" అన్నాడు బెర్ట్రండ్ రస్సెల్...

హంగేరి మార్క్సిస్టు తాత్వికుడు, విమర్శకుడు అయిన జార్జ్ లూకాస్ ఇలా చెప్పాడు "మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆచరణాత్మక శక్తిగా 20వ శతాబ్దంలోకి నడిపించిన వ్యక్తి లెనిన్...."

శ్రీశ్రీ మాటలతోనే దీన్ని ముగిద్దాం.

"ప్రపంచమనే కావ్యానికి ప్రతిపదార్థం లెనిన్! బతుకనే చిక్కు సమస్యకి పరిష్కారం లెనిన్!!"

**4-1-2024** ✵

వ్యాసం

# తొల్‌స్తోయ్యీ, కార్మికవర్గ పోరాటమూ

**(లెనిన్ ఈ వ్యాసం రాసిన కాలం 1910)**

**పాలించే** వర్గాల మీద తొల్‌స్తోయ్ అభియోగం, ప్రచండమైన శక్తితోనూ, చిత్తశుద్ధితోనూ, చేయబడింది. ఆధునిక సమాజాన్ని నిలబెట్టే మతవ్యవస్థా, న్యాయస్థానాలూ, మిలిటరిజమూ, "చట్టబద్ధ" వివాహమూ, బూర్జువా శాస్త్ర విజ్ఞానమూ – అనే ఆ సకల సంస్థల లోపలి బూటకాల్నీ, ఆయన పరమ స్పష్టతతో బట్టబయలు చేసినాడు.[1]

కానీ తొల్‌స్తోయ్ సిద్ధాంతం, ఆధునిక (పెట్టుబడిదారీ) సామాజిక వ్యవస్థకు మారకుడైన కార్మికవర్గం యొక్క జీవితానికీ, కృషికీ, పోరాటానికీ, పూర్తి విరుద్ధంగా వున్నట్లు తేలింది. మరి తొల్‌స్తోయ్ బోధనలలో ప్రతిబింబించిన దృక్పథం యెవరిది? ఆయన ద్వారా మాట్లాడింది యెవరు? అది ఆధునిక జీవిత అధిపతులను అప్పటికే యేవగిస్తున్నట్టి – విస్తారమైన రష్యన్ ప్రజా బాహుళ్యమే. కానీ, ఆ ప్రజా బాహుళ్యం, తెలివితేటలతో కూడి, కొరతలు లేని, రాజీలేని, పోరాటం చేసే స్థితికి యింకా చేరుకోనట్టిది.

వర్గచైతన్యపూరిత సోషలిస్టు కార్మికవర్గానికీ, పాత వ్యవస్థ యొక్క పరిరక్షకులకూ మధ్య, ఆ ప్రజా బాహుళ్యం వుండిందని, రష్యన్ విప్లవపు చరిత్రా, దాని ఫలితమూ, తెలియజేసినాయి. ప్రధానంగా 'రైతాంగం' అయిన యీ ప్రజా బాహుళ్యం, పాతదానిపట్ల తన ద్వేషం యెంత యెక్కువగా వుండిందో, ఆధునిక వ్యవస్థ యొక్క బాధలన్నిటినీ తాను యెంత తీవ్రంగా అనుభవించిందో, వాటిని వదిలించుకొని మేలైన జీవితం సంపాయించుకోవాలనే తపన తన లోపల యెంత గాఢంగా వుండిందో, ఆ లక్షణాలన్నిటినీ, విప్లవంలో చూపించింది.

కానీ, ఆ ప్రజా బాహుళ్యం, అదే సమయంలో, తన ద్వేషంలో తనకు తగినంత రాజకీయ చైతన్యం లేదనీ; తన పోరాటంలో, మేలైన జీవితం కొరకు తన అన్వేషణ సంకుచిత పరిధులకు పరిమితమైందనీ; ఆ లక్షణాలను కూడా ఆ విప్లవంలోనే చూపించింది.

అంతరాంతరాల దాకా సంచలితమైన యీ మానవ మహా సముద్రం, తన బలహీనతలన్నిటితోనూ, తన బలీయతలన్నిటితోనూ, తొల్‌స్తోయ్ భావాలలో ప్రతిబింబించింది. తొల్‌స్తోయ్ భావాలలో బలమూ, బలహీనతా, రెండూ వున్నాయి.

తొల్‌స్తోయ్ సాహిత్య కృతులను అధ్యయనం చేయడం ద్వారా రష్యన్ కార్మికవర్గం, తన శత్రువులను మరింత బాగా తెలుసుకో గలుగుతుంది. కానీ తొల్‌స్తోయ్ సిద్ధాంతాన్ని పరీక్షించడంలో, యావత్తు రష్యన్ ప్రజలూ, తమ బలహీనత యెక్కడుందో, తమ విమోచనను ముగింపు దాకా సాగనివ్వని బలహీనత యెక్కడుందో గ్రహించవలసి వుంది. తమని ముందుకు పోనివ్వకుండా చేసే బలహీనత యేమిటో, తప్పకుండా గ్రహించుకోవాలి.

తొల్‌స్తోయ్‌ని "విశ్వజనీన అంతరాత్మ" అనీ, "జీవిత బోధకుడు" అనీ, ప్రకటించే వాళ్ళందరూ, నిజంగా తెలుసుకోవలసిన పురోగతికి, ఆటంకాలు కలిగిస్తున్నారు. ఉదారవాదులు, తొల్‌స్తోయ్‌లోని విప్లవ వ్యతిరేక పార్శ్వాన్ని వినియోగించుకోవాలనే కోరికతో, ఉద్దేశపూర్వకంగా, వ్యాప్తిచేస్తున్న అబద్ధం యిది. "తొల్‌స్తోయ్ జీవిత బోధకుడ"ని ఉదారవాదులు చెప్పే అబద్ధాన్నే అనుసరిస్తూ, సాధించుకుంటారు. ఆ వర్గం, కార్మికవర్గమే![2]

మాజీ సోషల్ డెమోక్రాట్లు కొందరు ఆ అబద్ధాన్నే పునశ్చరణ చేస్తున్నారు.

మేలైన జీవితాన్ని సంపాయించుకోవడం యెలాగో తెలుసుకోవలసింది తొల్‌స్తోయ్ నుండి కాదు. ఏ వర్గం యొక్క ప్రాముఖ్యాన్ని తొల్‌స్తోయ్ గ్రహించలేదో, తొల్‌స్తోయ్ ద్వేషించిన పాత ప్రపంచాన్ని ధ్వంసం చేసే సామర్థ్యం ఏ వర్గం మాత్రమే కలిగివుందో, ఆ వర్గాన్ని రష్యన్ ప్రజలు గుర్తించినప్పుడు మాత్రమే, వాళ్ళు తమ విమోచనను సాధించగలరు.

1. లెనిన్, బూటకాలతో వుండే కొన్ని విషయాల్ని చెపుతూ "చట్టబద్ధ వివాహాన్ని" కూడా వాటిలో కలిపాడు. దాన్ని కూడా టాల్‌స్టాయి అలా అంటాడని. చట్టబద్ధ వివాహంలో వుండే బూటకం ఏమై వుంటుంది? దీన్ని లెనిన్, ఫుట్‌నోట్ ద్వారా వివరించలేదు. (a) మొదట, ప్రేమ లేకుండా ఆ సంబంధం ఏర్పడుతుంది. (b) భర్త ఆధిపత్యం, భార్య మీద వుంటుంది. (c) భర్తకి ఇతర స్త్రీలతో సంబంధాలు వుంటాయి. (d) భార్య విచారంలో మునిగి వుంటుంది. (e) లేదా, భార్య వల్ల భర్త అయినా. (f) సుఖశాంతులు లేకుండానే ఆ సంబంధం సాగుతూ వుంటుంది. – ఈ లక్షణాల్ని 'బూటకం'గా చెప్పాడా రచయిత? – ఈ వివరాలు లేవు.
2. ఏ దేశ శ్రామిక ప్రజలైనా ఈ సంగతి గుర్తించినప్పుడే, వాళ్ళు తమ విముక్తిని సాధించుకుంటారు. "వర్గాలూ, శ్రమదోపిడీ" అనే విషయాలు ప్రతీ దేశానికీ వర్తిస్తాయి.

**'రబోచయ గజేత' నం. 2, డిసెంబర్ 18 (31), 1910 (వి.ఐ. లెనిన్ సాహిత్యం మీద వ్యాసాలు నుండి)** ✵

కథ

# రాజీనామా

పాక్షిక ఆధారం : లెనిన్ రచనలు, బోల్షివిక్ పార్టీ చరిత్ర, తదితరాలు

- ఎన్.ఐ.యస్. నాగభూషణ్

**యూరప్** ప్రాచీన పట్టణాల్లో ఒకటైన వీబొర్గ్...

ఫిన్లండ్ సింధుశాఖ తీరాన.... నిర్మల తటాకంలో తెలితామరపువ్వులా అందంగా ఉండే చిన్న పట్టణం.... ఆ అతిగడ్డు శీతా కాలాన.... బురదగుంటలో గొడ్లు తొక్కిడికి నలిగిపోయిన ఎర్రమందారంలా ఊరంతా బురదతో లసలస లాడిపోతోంది. సెప్టెంబరు వెళ్ళి, అక్టోబరు వచ్చి కూడా నాలుగు రోజు లయింది. ఫిన్లండు అఖాతం నుండి వీచే అతి చల్లని మంచుగాలులు ఉండుండి ఒక్కసారి తుపానుగాలిలా చెర్నాకోలతో ఛెళ్ళున ఒక్కటిచ్చి, అంతలోనే తప్పుకుపోతున్నాయి. అప్పుడప్పుడు కుండపగిలినట్లు దబాటున వర్షం గబగబా బాది, అంతలోనే ఎక్కడో తొందరపని ఉన్నట్లు మరోచోటుకి మరలి పోతోంది....

రైలుస్టేషన్‌లో గంట గణగణ మోగింది. పెట్రోగ్రాడ్ నుంచి రైలు మరికొద్దిసేపట్లోనే రానున్నట్లు అది తెలియచేసింది. అయినప్పటికీ స్టేషన్‌లో ఏ హడావిడీలేదు. ఎందుకంటే యుద్ధం కారణంగా ప్రయాణాలు బాగా తగ్గిపోయాయి. ఎప్పుడేం జరుగుతుందో ఎవరికీ తెలీడంలేదు.

కొద్ది నిమిషాల్లోనే రైలు పొగలు కక్కుకుంటూ రావడం చూసి, స్టేషన్‌లో కూర్చున్న కొద్దిమంది జనమూ హడావిడిగా ప్లాట్‌ఫాంపైకి పరుగులు తీశారు. నిజానికి వారిలో ప్రయాణీకులు సగం మంది కూడా లేరు. తక్కినవారంతా ప్రచ్ఛన్న వేషంలో వున్న గూఢచారులూ, పోలీసులే. జారిజం అంతమయినా (ఆ ఏడే, అంటే 1917 ఫిబ్రవరి విప్లవంలో జార్‌ని దించేశారు.), ఇంకా దాని వాసనలు పోలేదు. ఎందుకంటే, ఫిబ్రవరి విప్లవంకన్నా మరింత తీవ్రమైన 'ఎర్ర విప్లవ' భయం ప్రభుత్వానికి కంటిమీద కునుకుక్కూడా రానియ్యడంలేదు. దాంతో గూఢచారుల హడావిడి..! అడుగడుగునా పోలీసు రాజ్యం నడుస్తోంది.

రైలు రావడం, వెళ్ళిపోవడం కూడా జరిగిపోయింది. దిగిన కొద్దిమంది ప్రయాణీకుల్నీ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసిగానీ వదలడంలేదు. వారిలో ఒక వ్యాపార సంస్థ ఏజెంట్ కూడా ఉన్నాడు. అతడి పాస్‌పోర్ట్ తనిఖీ చేశారు. వై.కె. యూసుపొవ్, పారిస్ ఇంటర్నే షనల్ ఫర్నిచర్స్ ఏజెంట్.... ఈ వివరాలతో సంతృప్తిపడ్డ పోలీసులు, అతడి లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చెయ్యకుండానే, ఇక దయచెయ్యండన్నారు. ఫిన్లండ్ వేరే దేశమే గానీ, అప్పుడు రష్యా సామ్రాజ్యంలో భాగమే. అయినా అక్కడిక్కూడా పాస్‌పోర్ట్ ఉండాల్సిందే. అక్కడికే అనేమిటి, రష్యాలో కూడా ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లాలంటే పాస్‌పోర్ట్ కావాల్సిందే. ఇక ఇలాంటి ఏజెంట్లు రష్యా నుండి వీబొర్గ్‌కు తరచు వస్తూంటారు. ఎందుకంటే, ఆ పట్టణంలో నాణ్యమైన కలప ఫర్నిచర్ తయారుచేసే పెద్ద పెద్ద కార్ఖానాలు అనేకం ఉన్నాయి. అందువల్ల పోలీసు అధికారి ఏ ప్రశ్నలూ అడక్కుండానే అతణ్ణి వదిలేశాడు. యూసుపొవ్ అదేమీ పట్టించుకోనట్లు బయట కొచ్చి, ఓ గుర్రబ్బండిని మాట్లాడుకుని, ఫర్నిచర్ కార్ఖానాలు ఎక్కువగా వుండే పల్లపు వీధికి చేరాడు.

బండిని పల్లపు వీధి మొగలోనే ఆపి, కిరాయి ఇచ్చేసి, వీధిలోకి నడుస్తూ వెనక్కి తిరగకుండానే ఓర కంట గమనించాడు. రైల్వేస్టేషన్నుంచీ తనను అనుసరిస్తూ వస్తున్న మరో గుర్రబ్బండి, తను దిగిన బండిని వేగంగా దాటుకుంటూ వెళ్లిపోవడం, అందులోనున్న ఓ వ్యక్తి తననే గమనిస్తూండటం చూసి, యూసుపొవ్ నవ్వుకున్నాడు.

ఆ వీధిలో కనిపించిన మొదటి కార్ఖానాలోకి వెళ్లి, మేనేజర్‌కి తన విజిటింగ్ కార్డు చూపించి, అక్కడ తయారుచేసే వివిధ ఫర్నిచర్ వస్తువుల ఖరీదులు తెలుసుకున్నాడు యూసుపొవ్. అనంతరం ఆయా వస్తువుల నాణ్యతను పరిశీలించి సంతృప్తిచెంది, పెట్రోగ్రాడ్ వెళ్లాక ఆర్డర్ పంపిస్తామని చెప్పాడు. అతడా విధంగా మరి రెండు కార్ఖానాల్లో కూడా చేసి, మూడో దాంట్లో ఫర్నిచర్ నాణ్యతను పరిశీలిస్తూ, అక్కడున్న ఒక వడ్రంగం మేస్త్రీతో మాటలు కలిపాడు. కొంతసేపు అదీ ఇదీ మాట్లాడి, చివరికి "విక్టర్ అనే మేస్త్రి ఎక్కడ పనిచేస్తున్నాడో చెప్పగలరా?" అనడిగాడు.

"ఒక్క మా కార్ఖానాలోనే ముగ్గురు విక్టర్లున్నారు. మీకే విక్టర్ కావాలి?" అడిగాడామేస్త్రి.

తనక్కావలసిన వ్యక్తి పూర్తిపేరు యూసుపొవ్‌కి తెలీదు. కాసేపు ఆలోచించి, "ఆ మేస్త్రీ కుర్చీల స్పెషలిస్టు. అంతవరకు మాత్రమే గుర్తుంది... అంతే" అన్నాడు.

"సింహాసనాలు తయారు చేస్తాడు... అతడేనా? చూపిస్తా పదండి...." అంటూ ఆ మేస్త్రి అతణ్ణి విక్టర్ దగ్గరకు తీసుకెళ్ళి, "వీరి పేరు యూసుపొవ్.. ఫర్నిచర్ కంపెనీ ఏజెంట్. నీతో పనుందట" అని చెప్పి, తను వెళ్ళిపోయాడు.

"నాతో మీకేంపని?" విక్టర్ యూసుపొవ్ వంక ఎగాదిగా చూస్తూ అడిగాడు.

"మనం కొంచెం అవతలికెళ్ళి మాట్లాడు కుంటే బాగుంటుందేమో" తగ్గించిన గొంతుతో యూసుపొవ్ అన్నాడు. విక్టర్ ఎందుకో తటపటాయించి కూడా పక్కనే ఉన్న కుర్చీలు నిలవవుంచిన షెడ్డులోకి నడిచాడు.

"నాతో కస్టమర్ మాట్లాడాలిసిందేం వుంటుంది? మీకు ఎలాంటి కుర్చీలు కావాలో మేనేజర్‌కి ఆర్డరిస్తే, అలాంటివి చేసిస్తాం"

"కుర్చీల విషయంలో అయితే మీరన్నది నిజం. కానీ నేను మాట్లాడాలనుకుంటున్నది అది కాదు" యూసుపొవ్ అన్నాడు.

"మరి దేన్ని గురించి?" విక్టర్ అనుమానంతో రెండడుగులు వెనక్కి వేసేసరికి, యూసుపొవ్ స్నేహపూర్వకంగా నవ్వి, అతడి భుజం తట్టాడు.

"భయపడకండి విక్టర్‌గారూ, నేను మీకు హానిచేసేందుకు రాలేదు. మీ సహాయంకోసం వచ్చాను" అన్నాడు.

అతడి ఆప్యాయతకు విక్టర్ లొంగిపోలేదు. పైగా మరింత ఎడంగా జరిగి, "మీకు నేనేం సహాయం చెయ్యగలను? నేనో పేద వడ్రంగిని. మీరో పెద్ద వ్యాపారసంస్థ ఉద్యోగి...." అంటూ వెళ్లడానికన్నట్లు వెనక్కి తిరిగాడు.

దాంతో యూసుపొవ్ అతడి చెయ్యి పట్టుకుని, మీరు నాకు చెయ్యాల్సింది ఆర్థిక సాయం కాదు. నిజానికది చేద్దామనే నేనిక్కడికి వచ్చాను.... క్షమించండి, తప్పుగా అర్థం చేసుకోకండి.... నా ఉద్దేశం ఏమంటే, మా మావయ్యకు చేద్దామని! ఆయనీమధ్యనే ఇక్కడికొచ్చాడు. పాపం చాలా పేదవాడు. ఒక పల్లెటూళ్లో మతగురువుగా పనిచేస్తూ, జబ్బు పడి, శలవు పెట్టడం వల్ల, ఆ కొద్ది ఆదాయాన్ని కూడా కోల్పోయాడు. వైద్యుల సలహా మీద కోలుకునేందుకు సముద్రపు గాలికోసం ఈ ఊరొచ్చాడు. పాపం ఆయన్నీ ముసలితనంలో ఆదుకునేందుకు పిల్లాజెల్లా ఎవరూలేరు. భార్య కూడా కాలం చేసింది. ఆయన్ని పలకరించి, నాచేతనైన ఏదో కొద్దిపాటి సాయం చేద్దామని అనుకున్నాను. ఎలాగూ ఆఫీసు పనిమీద ఈ ఊరొచ్చాను కదా, పనిలోపని ఇది కూడా పూర్తి చేసుకురమ్మని నా భార్య మరీమరీ చెప్పింది...."

హృదయం కరిగేలా చెప్పిన ఈ వృత్తాంతం విక్టర్ రాతిగుండెనేమాత్రం కరిగించినట్లులేదు. "అయితే నన్నేంచెయ్యమంటారు?" అని పెడసరంగా అని కూడా, మళ్లీ ఏం ఆలోచించాడో, "ఆయనుండే అడ్రస్ ఏమిటి?" అడిగాడు.

"అది వారికీ తెలిసినట్లు లేదు. మీకైతే తెలుస్తుందని చెప్పారు" అంటూ తన మేనమామ పేరు చెప్పాడు యూసుపొవ్.

"ఆ పేరెక్కడా వినలేదు. అయినా, నా పేరు చెప్పినవాళ్లు, అడ్రస్ చెప్పలేకపోయారా?"

"సరిగ్గా అదే నేనూ అడిగాను. వారికి మీ పేరొక్కటే తెలుసునట! ఒకవేళ ఆయన మీ ఇంటి చుట్టుప్రక్కలగానీ ఉన్నాడేమో, అడ్రసు చెబితే, కలుసుకుంటాను. ఒకవేళ నేను రావడం ఇష్టంలేకపోతే, డబ్బు ఇస్తాను.... తెరిషెంకో ఇచ్చాడని చెప్పి ఇవ్వండి....." యూసపొవ్ డబ్బు తియ్యడానికన్నట్లు జేబులో చెయ్యి పెట్టాడు.

తెరిషెంకో అనే పేరు వినగానే, విక్టర్ వైఖరి ఒక్కసారిగా మారిపోయింది.

"ఏమన్నారూ... తెరిషెంకోనా? ఇందాక మీ పేరు యూసుపొవ్ అని విన్నట్లు గుర్తు?"

"నిజానికి నాపేరు యూసుపొవే. కానీ మా బంధువులంతా నన్ను తెరిషెంకో అనే పిలుస్తారు. దానికో కథుందిలెండి...."

"ఇప్పుడా కథలన్నీ నాకెందుగ్గానీ, అంత దూరం నుంచీ శ్రమపడి వచ్చారు కాబట్టి, నాకు తెలీకపోయినా, తెలుసుకువచ్చి, మీకు చెబుతాను. కాసేపు మా కార్ఖానా గేటుకి ఎదురుగా ఉన్న హోటల్లో వేచి వుండండి...." విక్టర్ మధ్యలోనే అందుకుని అన్నాడు. "బాబ్బాబు.... ఆ పనిచేసి పుణ్యం కట్టుకోండి" ఆనందంతో అన్నాడు యూసుపొవ్.

❖ ❖ ❖

మతగురువు ఇవనోవ్ ఆరోగ్యం కోసమన్నట్లు ఆ ఊరొచ్చాడుగానీ, అందుకు అవసరమైన ఏ జాగ్రత్తలూ పాటిస్తున్నట్లు లేదు. విశ్రాంతి తీసుకోవడంగానీ, ఆహారంలో శ్రద్ధగా ఉండటంగానీ లేదు. ఏ మందులూ వాడుతున్నట్లు కూడా లేదు. ఎప్పుడూ రాయడం, చదవడం, లేదా ఆలోచిస్తూండటం... ఇవి తప్ప, ఏమీ అక్కరలేదాయనకు. ఏదో కాస్త కడుపు నిండితే చాలు... తనలోకంలోకి వెళ్ళి పోతాడు. కనీసం కంటినిండా నిద్రపోతున్నట్లు కూడా లేదు.

ఇలాగైతే ఎలాగని ఆ ఇంటి ఇల్లాలు ఆయన్ని మందలించాలని చూసిందిగానీ, భర్త చేసిన కట్టడి గుర్తొచ్చి, ఆగిపోయింది. మత గురువుకి ఇంత రాతపని ఉంటుందా అని ఆశ్చర్యపోయిందామె. అయితే ఆయనో గొప్ప మేధావి అనిగానీ, తన దేశ భవితవ్యాన్నే మార్చే ఒక గొప్ప పథక రచనలో నిండా మునిగి పోయాడనిగానీ ఆమె ఊహించే అవకాశంలేదు.

ఆరోజు ఇవనోవ్ ఎందుకో దిగులుగా ఉన్నాడు. గంటల తరబడి దీర్ఘాలోచనలో మునిగి ఉన్నాడు.

ఎన్ని కలలు కన్నాడు తను! తన కలల్ని నిజం చేసేందుకు, తనకు మార్గదర్శకులయిన పెద్దల ఊహల్ని వాస్తవం చేసేందుకు, ఒక నూతన ప్రపంచాన్ని... దోపిడీ, పీడనలు లేని ఒక వాస్తవిక ప్రపంచాన్ని నిర్మించేందుకు పూనుకొన్నాడు తను! అందుకోసం ఒక గొప్ప ఆదర్శప్రాయమైన, పోరాట పటిమగల, త్యాగ శీలురతో కూడిన ఒక రాజకీయపార్టీని కూడా నిర్మించాడు!

కానీ అదే సమయంలో అతివాదులుగా పోజుపెట్టిన కొన్ని సోషలిస్టు పార్టీలు, నిరంకుశత్వాన్ని తట్టుకోలేక, రాజీల బాట పట్టాయి. సామ్రాజ్యవాదయుద్ధం (మొదటి ప్రపంచయుద్ధం)లో అవి బూర్జువాలతో కుమ్మక్కై, జాతీయ దురహంకారాన్ని రెచ్చగొడుతూ, స్వార్థ బుద్ధితో సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చాయి. కానీ తన పార్టీ మాత్రం నష్టాల్ని తట్టుకుంటూ, అంతర్జాతీయ శ్రామికవర్గ ఐక్యత కోసం కృషిచేస్తూ, సామ్రాజ్య వాదంపై అలుపెరగని పోరాటం చేస్తోంది...

తన ఆలోచనల్లో సతమతమవుతున్న ఇవనోవ్, ఒక్కసారిగా గాలి తీవ్రంగా వీచి కిటికీ రెక్కలు టపటపా కొట్టుకోవడంతో, వెళ్లి రెక్కలకు బోల్టులు పెట్టి, అసంకల్పితంగా నడుస్తూ తిరిగి ఆలోచనల్లో మునిగిపోయాడు.

ఇంకా ముగియని యుద్ధంలో దేశం తీవ్రంగా నష్టపోయింది. సమాజంలో ఉన్నత వర్గాలు తప్ప, మిగిలిన ప్రతి సెక్షనూ అతలా కుతలమయింది. పనిచేసే వయసులోని జనాన్ని బలవంతంగా యుద్ధభూమికి తరలిస్తున్నారు. పరిశ్రమలేకాదు, వ్యవసాయమూ కుంటుపడి, దేశం కరువుతో అల్లాడిపోతోంది. యుద్ధ

భూమిలో శత్రువుల చేతుల్లో కంటే, తిండిలేక, చలికి తట్టుకునే దుస్తులూ, బూట్లూ లేక, జబ్బుపడి చనిపోయేవారి సంఖ్య అధికమైంది. అయినా యుద్ధం ఆగే సూచనలు లేక, జనం తిరగబడి జార్‌ని దించేశారు. ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకు బూర్జువాలూ, రాజీవాదులూ కలిసి పలు వాగ్దానాలు చేసి ప్రజలకు బంగారు భవిష్యత్తు ఆశగా చూపించి, అధికారాన్ని చేపట్టారు....

నడిచేవాడు కాస్తా ఆగిపోయాడు ఇవనోవ్. బయట చలిగాలి హోరుమని వీస్తున్నా, ఒక్కసారిగా చెమట పట్టింది. తన కోటు గుండీలు కొన్నింటిని తీసి గట్టిగా ఊపిరి పీల్చుకుని, కూర్చుండిపోయాడుగానీ, ఆలోచనలు మాత్రం ఆగలేదు.

....శాంతి నందిస్తామన్న బూర్జువాలు, యుద్ధ కాంట్రాక్టుల వల్ల వచ్చే అత్యధిక లాభాల రుచిమరిగి, యుద్ధాన్ని మరింత ఉధృతం చేశారు. భూమినిస్తామన్న రాజీవాదులు, భూస్వాములతో కుమ్మక్కై, వాయిదాల బాట పట్టారు. దాంతో రైతాంగమే చొరవచూపి భూస్వాధీనాలకు పూనుకుంటే, సైన్యాల్ని ప్రయోగించి కాల్పులు జరిపిస్తున్నారు. దీనికి తోడు, నష్టపోతామని తెలిసి కూడా, ప్రజల్ని రెచ్చగొట్టేందుకు, యుద్ధభూమిలో చాలినన్ని ఆయుధాలు లేకుండానే, జూదం లాంటి దాడికి పాల్పడి, ఒక్క దాడిలోనే 60,000 సైనికుల నష్టానికి కారణమైంది ప్రభుత్వం. పర్యవసానంగా చెలరేగిన ప్రజాగ్రహాన్ని అణిచేందుకు, బూర్జువాలూ, భూస్వాములూ, బ్యూరాక్రసీ అంతాకలిసి, విదేశీ సామ్రాజ్యవాదులతో కుమ్మక్కై, జనరల్ కొర్నీలొవ్ ద్వారా సైనిక తిరుగుబాటుకి ప్రయత్నించారు. అప్పుడు తమ పార్టీ, శ్రామిక ప్రజల సహకారంతో సైనిక తిరుగుబాటుని విఫలం చేసింది. ఫలితం రైతాంగంతోపాటు, సాధారణ ప్రజలూ తమ వైపుకురావడం! ఆ విధంగా పార్టీ తిరుగుబాటుకి పూనుకుంటే, మెజారిటీ ప్రజల మద్దతుతో అధికారాన్ని చేపట్టే స్థితికి వచ్చింది....

ఫాదర్ ఇవనోవ్ పెదాలపై జీవంలేని నవ్వు విరిసింది. తిరిగి లేచి నిలబడి, మేజోళ్ల పాదాలతో నడక సాగించాడు.

.....తిరుగుబాటు జరిగితే విజయం తథ్యమయిన సమయంలో.... ఆలశ్యం చేస్తే ఓటమి తప్పనిసరి అయిన తరుణంలో... స్వంత పార్టీ నుండే.... తను స్థాపించి, పెంచి పెద్దచేసిన పార్టీనుండే... ఊహించని ఎదురు దెబ్బ.... తిరుగుబాటు పిలుపుకి సహాయ నిరాకరణ? జవాబులేమి....! ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? తన ప్రతిస్పందన సరైందేనా?

ఇవనోవ్ ఆలోచనలకు తలుపు చప్పుడు అంతరాయం కలిగించింది. ఆ చప్పుడును బట్టి ఇంటి ఇల్లాలు వార్యా భోజనం తెచ్చి వుంటుందని ఊహించాడాయన. వెంటనే ఆయన గోడకు తగిలించిన వేషాన్ని వేగంగా తగిలించుకున్నాడు. వెంటనే ఆయన రూపు రేఖలు మారిపోయాయి. దిట్టమయిన ఆ పొట్టి వ్యక్తి, నెరిసిన గడ్డం, మీసాలతో, వంగిన నడుంతో ముసలివాడయిపోయాడు!

❖ ❖ ❖

ఇవనోవ్ భోజనం పూర్తికాక ముందే తిరిగి తలుపు చప్పుడు.... అయితే ఈసారి ఒక క్రమంలో...

వచ్చిందెవరో ఊహించి, తలుపు తెరిచేందుకు లేచిన ఆయన, అప్రయత్నంగా అద్దంలోకి తొంగిచూశాడు. వార్యా వచ్చినప్పుడు తగిలించుకున్న వేషం ఇంకా అలాగే వుంది. 'సరే మంచిది' అనుకుంటూ తలుపు తీశాడు.

వచ్చిన వ్యక్తి ఎవరోకాదు, పాఠకులకు మొదట పరిచయమైన తెరిషెంకోనే! ఏమంత ప్రయాస లేకుండానే తనకు కావలసిన వ్యక్తిని కలుసుకోబోతున్న ఆనందంలో వున్న అతడు, లోపల వున్న ఓ ముసలివాణ్ణి చూసేసరికి ఆ ఆనందం ఆవిరయిపోయింది అతడిలో. పైపెచ్చు ఏదో ప్రమాదం జరిగిందని ఊహించి, "ఫాదర్.... ఈ ఇల్లు మీదేనా? ఇల్యీచ్ ఏరి? ఏమయ్యారు? ఏదో మోసం జరిగింది...." ఖంగారుపడిపోయాడు.

ముసలాయనకు అతని ప్రశ్నలు అర్థమయి నట్లులేదు. "ఇంతకీ అసలు నువ్వెవరు? నా గదిలోకి వచ్చి, ఈ ఇల్లు మీదేనా అని అడుగుతావేమిటి?" అంటూ దబాయించాడు.

ఈ అమర్యాదకి తెరిషెంకోకి కోపం వచ్చింది. "నా సంగతి మీకనవసరం. ముందు ఇల్యీచ్ ఎక్కడున్నారో చెప్పండి అంటూ ఓ అడుగు వెనక్కివేసి, జేబులో చెయ్యిపెట్టాడు.

"ఇల్యీచ్చా? ఆయనెవరు? ఆ పేరే నేనింతవరకూ వినలేదు" ఇవనోవ్ అతనివైపు రాబోయాడు.

"ఆగండి.. ముందుకు రావద్దు. పేల్చేస్తాను.." తెరిషెంకో అకస్మాత్తుగా జేబులోంచి పిస్తోలు చూసి గురిపెట్టి, మరో అడుగు వెనక్కి వేశాడు.

అయితే ఈ హెచ్చరికకు ఫాదర్ భయ పడ్డాడుకాదు. పైపెచ్చు పకపకా నవ్వి,

"జెన్కీ.... తొందరపడకు.... ముందు పిస్తోలు లోపల పెట్టు...." అంటూ తన విగ్గు తీసేశాడు.

దాంతో ఆశ్చర్యపోవడం తెరిషెంకో, వురఫ్ ఝుర్‌జెన్కీ వంతయింది. తన ఎదురుగా నిలబడింది ఎవరో ఫాదర్ కాదు, తనకు కావలసిన వ్లదీమిర్ ఇల్యీచ్చే! ప్రపంచంలోని సకల శ్రామికవర్గానికీ ఎంతో ఇష్టమైనవాడూ, మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడూ, బోల్షివిక్ పార్టీ అధ్యక్షుడూ అయిన లెనినే!

"అంత భయమైతే ఎలా కామ్రేడ్ జెన్కీ? పిస్తోలు కూడా తీశావ్, కాల్చేద్దామనే?" వేళా కోళం చేశాడు, ఇప్పటిదాకా ఫాదర్ ఇవనోవ్‌గా పాఠకులకు పరిచయమైన లెనిన్.

ఝుర్‌జెన్కీ సిగ్గుతో తలదించుకున్నాడు. ఆ తర్వాత కుశల ప్రశ్నలయ్యాక, జెన్కీ తను వచ్చిన పనిలోపడ్డాడు.

"కామ్రేడ్ ఇల్యీచ్! మీరు చేసిన పనికి పార్టీ యావత్తుకూ దిమ్మతిరిగిందంటే నమ్మండి.... అసలు ఇప్పటికీ మీరు రాజీనామా చేశారంటే నమ్మలేకపోతున్నాను. మీరు రాజీనామా చేస్తూ, అందుకు కారణాలతో, ప్రస్తుత రాజకీయ పరిస్థితిని సమీక్షిస్తూ రాసిన "సంక్షోభం పరిణతమైంది" అనే వ్యాసాన్ని కొరియర్ నుంచి అందుకుంది నేనే. ఈ విషయాన్ని చర్చించడానికి సి.సిలోని ఆర్గనైజింగ్ కమిటీ మూడుసార్లు సమావేశం జరిపింది. పెట్రోగ్రాడ్, మాస్కో కమిటీలు సి.సి.ని పదే పదే టెలిఫోన్, టెలిగ్రాఫ్‌లతో విసిగించివేశాయి. మొత్తానికి నిన్న రాత్రి సి.సి. తన ప్రతినిధిగా నన్ను ఎన్నుకొని పంపించింది. అయితే ఒక విషయం

మాత్రం వింతగా వుంది. తిరుగుబాటు పరాజయం పాలవుతుందని బలంగా నమ్మిన కామెనెవ్ ప్రభృతులు, మీ రాజీనామాను మాత్రం నమ్మలేకపోయారు..."

"వారి విషయం సరే, మరి కామ్రేడ్ జెన్స్కీ ఎందుకు నమ్మలేకపోయాడు?" అతడి వాగ్ధోరణికి అడ్డుకట్టవేశాడు లెనిన్.

"ఎందుకంటే.... ఎందుకంటే.... కామ్రేడ్ వ్లదీమిర్ ఇల్యీచ్, పార్టీని మీరే స్థాపించారు, మీరే తీర్చిదిద్దారు. అలాంటి మీరే పార్టీని వదిలేస్తానంటే, ఎలా నమ్మమంటారు?"

"పార్టీని వదిలేస్తానని ఎవరన్నారు? పదవికి మాత్రం రాజీనామా చేస్తున్నాననీ, ప్రచారహక్కు అట్టేపెట్టుకున్నాననీ రాశానుకదా!"

"అంటే సి.సి. మీద, అలాగే సి.సి. సభ్యుణ్ణయిన నా మీద, పోరాటం చేస్తా రన్నమాట! అంతేనా కామ్రేడ్ వ్లదీమిర్ ఇల్యీచ్?"

"ఒక రకంగా చూస్తే అవును, ఒక రకంగా చూస్తే కాదు. అవును ఎందుకంటే, సి.సి.లో నువ్వొకడివి గనుక! కాదు ఎందుకంటే, నా పోరాటం వ్యక్తులమీదగాక, సమష్టిపై, అంటే సమష్టి చర్యలపై, అది కూడా పార్టీని సక్రమ పంథాలో పెట్టడానికి గనుక!"

"ఏమైనా, ఇది చాలా అన్యాయం, కామ్రేడ్ ఇల్యీచ్! మేమంతా నీ పిల్లలం..."

"పార్టీ ఆర్గనైజర్‌గా ఈ అనుబంధాలు సరే. కానీ క్రమశిక్షణలో కాదు. వ్యక్తులుగా మీరు సాహసులే. కానీ పార్టీకి అవసరమైనప్పుడే.."

"పిరికివాళ్ళమంటారు? వెంటనే సమాధానం ఇవ్వకపోవడమే పిరికితనమా కామ్రేడ్ వ్లదీమిర్ ఇల్యీచ్?"

"మరిదాన్నేమనాలో నువ్వేచెప్పు జెన్స్కీ! వెంటనే తిరుగుబాటుకి పూనుకుంటే, బాల్టిక్ నౌకాదళం, క్రొన్‌స్టాడ్ట్ సైన్యం, పెట్రోగ్రాడ్ గారిసన్.. ఇలా మూడువేపుల నుండీ దాడి జరిపి, విజయం కచ్చితంగా సాధించగలిగినప్పుడు....

"కామ్రేడ్ ఇల్యీచ్, మెజారిటీ సి.సి. మీ వైపునే వుంది. కానీ కామెనెవ్ బృందానికి మన బలంపై నమ్మకంలేదు. వారు సోవియట్ల రెండో కాంగ్రెస్ దాకా ఆగాలంటున్నారు. అప్పుడయితే సోవియట్ల బలం కూడా తోడవుతుందని వారి వాదన"

"కాంగ్రెస్ దాకా ఆగాలంటే, పోరాటం ఈ నెలలో జరిగే అవకాశంలేదు. ఈ లోపు ప్రధాని కెరెన్స్కీ, విప్లవంవైపు వున్న పెట్రోగ్రాడ్ పటాలాన్ని యుద్ధరంగానికి పంపేసి, తన విధేయ దళాల్ని పెట్రోగ్రాడ్ రప్పించేస్తాడు. అప్పుడు ఓటమి తథ్యం..."

"మీరన్నది నిజమే, కామ్రేడ్ ఇల్యీచ్! సి.సి.లో కామెనెవ్ వాదాన్ని ఓడించటానికి, ఇతర సైనిక కేంద్రాల్లో విప్లవానికి ఎంత మద్దతు వుందో తెలుసుకోవడానికి స్వెర్డ్‌లోవ్ ప్రభృతులు వెళ్ళారు. అందుకే మీ ప్రతిపాదనకు వెంటనే సమాధానం ఇవ్వలేకపోయారు..."

"స్వెర్డ్‌లోవ్ సరిగ్గానే చేశాడు... అయితే కామెనెవ్ బృందం గురించి అతిగా ఆలోచన అనవసరం. అతని బలం స్వల్పం..."

"ఇక మీ ఆరోపణల్లో మరో అంశం – పార్టీ పత్రికల్లో మీ వ్యాసాల్లో చేసిన కత్తిరింపుల గురించి..."

"పార్టీ తప్పుల్ని ఎత్తిచూపితే, వాటిని సవరించుకోవాలిగానీ, ఆ అంశాల్ని తీసేసి ప్రచురించడమే పరిష్కారమా?"

"ముమ్మాటికీ కాదు. అయితే విషయం ఏమిటంటే, ఆ సంగతే సి.సి.కి తెలీదు. మరో విషయం ఎత్తింతర్వాత, ఆ సంగతి విచారించి, ఆ సంపాదకుల్ని సి.సి. సమావేశానికి, పిలిచి మందలించడమేగాక, కొందర్ని పదవుల్నుంచి తప్పించారు. ఇక రాజీవాదులు ఏర్పాటుచేసిన 'డెమొక్రాటిక్ కాన్ఫరెన్స్' గురించి. అందులో పాల్గొనడం వల్ల ప్రజలకు తప్పు సందేశం వెళ్లే అవకాశం ఉన్నదన్న మీ ఆలోచనతో సి.సి. మెజారిటీ ఏకీభవించింది. అయితే కామెనెవ్, జినోవ్‌యేవ్ ప్రభృతులు పట్టుబట్టి మరీ అందులో పాల్గొన్నారు. ఏమైనా వారిని నిరోధించడంలో సి.సి. కఠినంగా వ్యవహరించలేకపోయింది. అయితే, కాన్ఫరెన్స్ కొనసాగింపుగా జరిగిన ప్రీ-పార్లమెంటులో మాత్రం మన బృందం నిరసనగళం వినిపించి, వాకౌట్ చేయించడంలో మాత్రం, గట్టిగా వ్యవహరించింది."

"మంచిపని చేసింది. విప్లవపార్టీ తప్పులు చేయడం తప్పుకాదు కామ్రేడ్; చేసిన తప్పుల్ని దిద్దుకోలేకపోవడమే పెద్ద తప్పు!"

"ఈ మాటలతో అతడు శాంతించినట్లు గ్రహించిన జెన్స్కీ, తన గుండెల మీంచి పెద్ద బరువు దిగిపోయినట్లుగా పెద్దనిట్టూర్పు విడిచాడు.

"ఏమైనా కామ్రేడ్ ఇల్యీచ్! జరిగిన తప్పులన్నీ మీమీద అగౌరవంతో కాదు, అనుభవరాహిత్యం, దానికితోడు సమాచార లోపం వల్లనే. మీరు దూరంగా ఉండటం వల్ల, కొందరి నోటికి సరైన తాళాలు పడటంలేదన్నది నా వ్యక్తిగతాభిప్రాయం. కనుక మీరు రాజీనామాను దయచేసి ఉపసంహరించుకుని, వెంటనే పెట్రోగ్రాడ్ వచ్చి, పార్టీకి ప్రత్యక్ష నాయకత్వం వహించమని సి.సి. మిమ్మల్ని గట్టిగా కోరుతోంది. తద్వారా పార్టీని త్వరలో మనం చేపట్టబోయే సాయుధపోరాటంలో విజయపథంలో నడిపించమని చెప్పింది."

"సరే, కామ్రేడ్ జెన్స్కీ! సి.సి. చెప్పిన కారణాల్ని అంగీకరించి, రాజీనామాను ఉపసంహరించుకుంటున్నాను. రేపు నా కొరియర్ రాహ్యా వస్తాడు. అతడు రాగానే, ఎల్లుండే, అంటే అక్టోబరు 7న పెట్రోగ్రాడ్ వస్తాను. ఇక నువ్వు బయలుదేరు.... ట్రైన్‌కి వేళయింది...."

*(లెనిన్ రాజీనామా వ్యవహారం అలా సుఖాంతమైంది. అన్నట్లుగానే ఆయన అక్టోబర్ 7న పెట్రోగ్రాడు వెళ్లి, నగర శివార్లలో షెల్టర్ తీసుకున్నాడు. 10వ తేదీన 'స్మోల్నీ' ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన సి.సి. సమావేశానికి మారువేషంలో హాజరయ్యాడు. అందులో సాయుధపోరాటానికి పార్టీకి పిలుపునిచ్చే తీర్మానాన్ని స్వయంగా ప్రవేశపెట్టాడు. దానికి కామెనెవ్, జినోవ్‌యేవ్‌ల అభ్యంతరాన్నీ, ట్రాట్స్కీ సవరణలను ఓడించి, తీర్మానాన్ని ఆమోదింప చేశాడు. అక్టోబరు 24న సాయంకాలం మొదలైన సాయుధపోరాటానికి స్వయంగా నాయకత్వం వహించి, నడిపించాడు. అక్టోబరు 25 ఉదయానికి విజయం లభించడంతో, ప్రపంచ చిత్రపటంలో తొలిసారిగా ఒక సోషలిస్టు రాజ్యం అవతరించడం.... ఇదంతా తదనంతర చరిత్ర!*

**– రచయిత)**

**('ప్రజాసాహితి' ఏప్రియల్ 2015 నుండి)** ✺

పుస్తక పరిచయం

# భౌతికవాదం, అనుభవైక విమర్శన

## అభివృద్ధినిరోధక తత్త్వశాస్త్రంపై సునిశిత వ్యాఖ్యలు

## Materialism and Empirio-criticism
## Critical comments on a Reactionary Philosophy

### లెనిన్ గ్రంథం - ఒక పరిచయం

- డా॥ ఆర్కే

**నేపథ్యం :**

1904-05లో ఆసియా-పసిఫిక్ ప్రాంతంపై ఆధిపత్యం కోసం జపాన్, జర్మనీ, బ్రిటిష్, ఫ్రెంచ్ సామ్రాజ్యవాద దేశాల మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. ఈ పోటీలోకి జారిస్టు రష్యా కూడా ప్రవేశించింది. చైనాలోని మంచూరియా, కొరియాల భూభాగాల కోసం జపాన్, జారిస్ట్ రష్యాల మధ్య యుద్ధం జరిగింది. రష్యా ఘోరంగా ఓడిపోయింది. తమకు సంబంధంలేని ఆ యుద్ధంతో ప్రజలు భారీగా నష్టపోయారు.

రష్యా కమ్యూనిస్ట్ పార్టీలో సిద్ధాంత విభేదాలున్నాయి. అప్పటికి ఒకే పార్టీలో వున్నా బోల్షివిక్కులు, మెన్షివిక్కులు రెండుగా చీలి వున్నారు. మెన్షివిక్కులు పితృభూమి రక్షణ పేరుతో పాలకవర్గం వైపు మొగ్గారు. లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్కులు యుద్ధంలో ఓటమి జారు చక్రవర్తి బలహీనపడటానికి, విప్లవం బలపడటానికి తోట్పడుతుందని భావించారు.

రష్యా అంతటా తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొంది. కార్మికులు, రైతులు, మేధావులు వీధుల్లోకి వచ్చి మిలిటెంట్ పోరాటాలు చేశారు. 9 జనవరి 1905, ఆదివారం, పీటర్స్‌బర్గ్ ప్రజలు జార్‌కి మెమొరాండం యివ్వటానికి పెద్ద ఊరేగింపుగా వెళ్ళారు. వారిపై సైన్యం కాల్పులు జరిపింది. వెయ్యిమంది చనిపోయారు. ఇంతవరకు జరిగిన ఆర్థిక పోరాటాలు ఇపుడు రాజకీయ మలుపు తీసుకున్నాయి. 'జార్ చక్రవర్తి నిరంకుశత్వం నశించాలి' అనే నినాదం దేశమంతటా మార్మోగింది. మాస్కో, బాకు, రీగా, వార్సా తదితర నగరాలలో కార్మికులు విప్లవ పోరాటానికి నాయకత్వం వహించారు. వారు సమ్మె చేయని ఫ్యాక్టరీ లేదు. గ్రామాలలో రైతులు తమ హక్కులకోసం భూస్వామ్యానికి వ్యతిరేకంగా తిరగబడ్డారు. నల్ల సముద్రం తీర నావికులు తిరుగుబాటు చేశారు కాని అది అణచివేయబడింది.

జార్ ప్రభుత్వం ఒకవైపు విప్లవోద్యమాన్ని చీల్చటానికి పన్నాగాలు పన్నింది. మరోవైపు ప్రజాగ్రహానికి భయపడి డూమా పేరుతో చట్ట సభను ఏర్పాటు చేస్తానని ప్రకటించింది. ఆ సభకు అధికారాలు లేవు. చక్రవర్తికి నచ్చని తీర్మానాలు చేస్తే రద్దు చేయవచ్చు. మెన్షివిక్కులు బలపరిచారు. బోల్షివిక్కులు బహిష్కరించారు.

గత్యంతరం లేక రష్యా జపాన్‌తో శాంతిసంధి చేసుకొంది. విప్లవం విజయవంతమవుతుందనే భయంతో లిబరల్ బూర్జువా వర్గం జార్‌తో రాజీకొచ్చింది. రైతాంగం కూడా ఊగిసలాడింది. స్థానిక భూస్వాములతో రైతులు పోరాడారుగాని జార్ చక్రవర్తిపై విశ్వాసాన్ని వారు పూర్తిగా కోల్పోలేదు. పార్టీలో మెన్షివిక్కుల సైద్ధాంతిక దివాళా కోరుతనం ఉద్యమానికి తీవ్ర నష్టం చేకూర్చింది. 1905 మొదటి విప్లవం విఫలమైంది.

లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీ చెక్కుచెదరలేదు. గత ముప్పై ఏళ్ళ శాంతియుత పోరాటంలో తెలుసుకోలేని గుణపాఠాలను మూడేళ్ళ విప్లవోద్యమంలో నేర్చుకొంది. బూర్జువా ప్రజాస్వామిక విప్లవానికి శ్రామికవర్గం నాయకత్వం వహించాలి. రైతాంగమే కార్మికవర్గానికి నమ్మకమైన మిత్రుడని పార్టీ 5వ కాంగ్రెస్‌లో తీర్మానం చేసింది.

విప్లవం ఉధృతంగా వున్నప్పుడు పెట్టి బూర్జువ మేధావులు ఒక అడుగు ముందుకు వేస్తారు. చల్లారినపుడు రెండు అడుగులు వెనక్కి వేస్తారు. మొదటి రష్యా విప్లవంలో అదే జరిగింది. విప్లవ గమ్యంపై నమ్మకం కోల్పోయిన కొందరు పాలకవర్గం వైపుకి పోయారు. మరికొందరు మార్క్సిజంపై విశ్వాసం కొల్పోయారు. వాళ్ళతో ఇబ్బంది లేదు. విప్లవంలో చురుగ్గా పాల్గొన్న పెట్టీ బూర్జువా మేధావులులోని ఒక సెక్షన్‌తోనే పేచీ మొదలైంది. మార్క్సిజాన్ని అంగీకరిస్తారు. అయితే కొన్ని లోపాలు సరిదిద్దాలంటారు. ఆధునిక సైన్సు, ముఖ్యంగా ఫిజిక్స్ నూతన ఆవిష్కరణలు అనుగుణంగా మార్క్సిస్ట్ తత్త్వశాస్త్రాన్ని మార్చాలన్నారు. ఇది మార్క్సిజాన్ని తిరుగుముఖం పట్టించటం కాదు, పరిపుష్టం చేయటమన్నారు. ఏకంగా గతితార్కిక భౌతివాదంపైనే తమ దొంగ దాడిని ఎక్కుపెట్టారు.

జార్ ప్రభుత్వం పార్టీ కార్యకర్తలను, నాయకులను అరెస్టు చేయటం, కాల్చి చంపటం, సైబీరియాకి ప్రవాసం పంపటం ద్వారా భయోత్పాతాన్ని సృష్టించింది. విప్లవానంతర పరిణామాలు ప్రజలలో నిరాశ, నిస్పృహ కలిగించాయి. పార్టీకి గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ఒకవైపు ప్రభుత్వ దాడులు ముమ్మరమయ్యాయి. మరోవైపు ద్రోహులు పార్టీని విధ్వంసం చేయటానికి ఏ అవకాశాన్ని విడవలేదు. బొగ్దనోవ్, బజరోవ్ లాంటి మేధావులు పార్టీ సైద్ధాంతిక పునాదిని మార్చాలన్నారు. ఇది రష్యాకే పరిమితం కాలేదు. యూరప్‌లోని ఇతర కమ్యూనిస్టు పార్టీలకు కూడా పాకింది. మార్క్సిజం పేరుతో జర్మన్ తత్త్వవేత్త ఎవినారియస్ భావవాదాన్ని తలకెత్తుకున్నాడు. ఫిజిక్స్ పేరుతో స్విట్జర్లాండ్ సైంటిస్టు

ఎర్నెస్ట్ మాక్ గతితార్కిక భౌతికవాదాన్ని వక్రీకరించాడు. ఎంగెల్స్ చెప్పిన తాత్త్విక సిద్ధాంతం కరక్టే గాని నూతన సైన్సు ఆవిష్కరణల కనుగుణంగా దానిని అభివృద్ధి చేయాలన్నాడు. మాక్ అనుభవైక విమర్శ మార్క్సిజానికి విరుద్ధమైనదికాదని కాట్స్కీ అన్నాడు.

మార్క్సిజం జపం చేస్తూనే, తత్త్వశాస్త్ర అభివృద్ధి అంటూ, 6 నెలలలో నాలుగు పుస్తకాలను ప్రచురించారు. తత్త్వశాస్త్రాన్ని సంస్కరించాలనే వాళ్ళంతా మాక్ వెనుక దాక్కొన్నారు. అందుకే ఆనాటి తాత్త్విక రివిజనిజాన్ని లెనిన్ 'మాకిజం' అన్నాడు.

ఎంగెల్స్ తత్త్వంలో మార్మికత వుందని, పాతబడి పోయిందని మాకిస్టులు ఆరోపణలు చేశారు. తమ వక్ర భాష్యాలకు 'కొత్త జ్ఞాన సిద్ధాంతం', '20వ శతాబ్దపు ఆధునిక సైన్సు తత్త్వశాస్త్రం' అంటూ శీర్షికలు తగిలించారు. కొందరు పోకడలు మరీ విపరీతంగా వున్నాయి. మతం అంటే ప్రజలకు పిచ్చి. వాళ్ళని ఆకర్షించాలంటే వేష, భాష మారాలి. కార్మికవర్గాన్ని దేవుడుగా చూడాలి. సోషలిజం మతరూపం తీసుకోవాలి. మత నాస్తికత్వం బోధించాలంటూ విపరీత పెడ ధోరణులకు లోనయ్యారు.

ప్లెఖనోవ్ మార్క్సిస్ట్ తాత్త్వికుడు. గౌరవనీయుడైన నాయకుడు. తాత్త్విక రంగంలో తలెత్తిన కొత్త రివిజనిస్ట్ పోకడలను ఆయన విమర్శించిన మాట వాస్తవమే.. కాని ఆ విమర్శలో పదునులేదు. గతితార్కిక భౌతికవాదంపై దాడి తీవ్రతను, పార్టీకి జరుగుతన్న సైద్ధాంతిక నష్టాన్ని సరిగ్గా గుర్తించినట్టులేదు. తేలికగా తీసుకున్నాడు. చివరికి ఆ బాధ్యతని లెనిన్ చేపట్టవలసి వచ్చింది.

ఆనాటి రష్యన్ తాత్త్విక రివిజనిస్టులలో బొగ్దనోవ్ ప్రముఖుడు. పార్టీ సెంట్రల్ కమిటీ మెంబరు. గోర్కీకి ప్రియ మిత్రుడు. అతని ప్రభావం గోర్కీ, కొందరు మేధావులపై వుంది. 1908 ఫిబ్రవరిలో లెనిన్ గోర్కీకి ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరంలో 'కాదు, కాదు, ఇది మార్క్సిజం కాదు'. 'బాహ్య ప్రపంచం వాస్తవికతని విశ్వసించటం మార్మికతగా పాఠకుడిని ఒప్పించటానికి వారు ప్రయత్నించారు'. 'కాంట్ అజ్ఞేయవాదం, భావవాదంతో భౌతికవాదాన్ని గందరగోళం చేయాలని చూశారు' అంటూ అనుభవైక విమర్శకుల్ని లెనిన్ తీవ్రంగా ఖండిస్తాడు. 'మామూలు మార్క్సిస్టులమైన మాకు తత్త్వశాస్త్రం బాగా తెలిసివుండక పోవచ్చు. కాని ఈ చెత్తనంతా పోగేసి అదే మార్క్సిస్ట్ తత్త్వశాస్త్రంగా చెప్పి మమ్మల్ని అవమానపరచటం ఏమిటి?' అని ఆ ఉత్తరంలో ప్రశ్నిస్తాడు. తాత్త్విక రంగంలో కూడా రివిజనిస్టులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేయాలన్నాడు.

లెనిన్ రాజకీయ యోధుడు. మార్క్సిస్ట్ సిద్ధాంతవేత్త. రష్యా విప్లవానికి మార్గదర్శకుడు. ఆయన కాలంలో పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా అభివృద్ధి చెందింది. లెనిన్ సామాజ్యవాదాన్ని నిర్వచించాడు. ఆ యుగంలో కమ్యూనిస్టులు అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడలను రూపొందించాడు. రష్యా విప్లవోద్యమానికి నూతన పరిస్థితి – నూతన కర్తవ్యాలు ఎదురైనప్పుడల్లా లెనిన్ పార్టీకి దిశానిర్దేశం చేసేవాడు.' ఏం చేయాలి?', 'ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి', 'సోషల్ డెమోక్రసి, రెండు ఎత్తుగడలు', 'సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీవిధానం అత్యున్నత దశ' లాంటి గ్రంథాలను అందుకే రాశాడు. ఇప్పుడు లెనిన్ మరో పరిస్థితిని ఎదుర్కొన్నాడు. అటు తత్త్వశాస్త్రాన్ని, ఇటు సైన్సును అధ్యయనం చేయాల్సిన అవసరం ముందుకొచ్చింది.

1908లో లెనిన్ లండన్, జినివాలలో ప్రవాస జీవితం గడిపాడు. లండన్ గ్రంథాలయానికి వెళ్ళాడు. ఫిబ్రవరి నుండి అక్టోబర్ వరకు పాశ్చాత్య తత్త్వశాస్త్రాన్ని చదివి నోట్స్ రాసుకున్నాడు. ఆధునిక సైన్సు పరిశోధనలను పరిశీలించాడు. 'భౌతికవాదం, అనుభవైక విమర్శ, అభివృద్ధి నిరోధక తత్త్వశాస్త్రంపై సునిశిత వ్యాఖ్యలు' అనే పేరుతో గ్రంథాన్ని రాశాడు 1909లో అది మాస్కోలో ప్రచురించారు. యూరప్‌లో ప్రచార బాధ్యతలను రోజా లక్జెంబర్గ్‌కి అప్పగించాడు. లెనిన్ తాత్త్విక గ్రంథం మాకిజాన్ని ధీటుగా ఎదుర్కొంది. 20 భాషలలో ప్రచురితమైంది. మార్క్సిస్ట్ తత్త్వశాస్త్రాన్ని సమున్నత శిఖరాలకు జేర్చింది.

★ ★ ★ ★

ఇపుడు "భౌతికవాదం, అనుభవైక విమర్శ" గ్రంథంలో లెనిన్ వ్యాఖ్యలను పరిశీలిద్దాం. మార్క్సిస్ట్ తత్త్వశాస్త్ర మౌలిక సూత్రాలని మాకిజం ఎలా వక్రీకరించిందో తెలుసుకుందాం.

తత్త్వశాస్తం మూల ప్రశ్నల్ని, ముఖ్యంగా జ్ఞాన సిద్ధాంతాన్ని లెనిన్ గ్రంథం ప్రధానాంశంగా తీసుకొంది. పదార్థమా? భావమా? ఏది ముందు? ఏది వెనుక? భౌతిక ప్రపంచం వాస్తవమా? కాదా? దాని గురించి తెలుసుకోగలమా? లేదా? సైన్సు కొత్త పరిశోధనలు గతితార్కిక భౌతికవాదాన్ని నిరాకరిస్తున్నాయా? మార్క్సిజానికి జ్ఞాన సిద్ధాంతం ఉందా? లేదా? బాహ్య ప్రపంచానికి, మనస్సుకు వున్న సంబంధం ఏమిటి? ఆనాటి తాత్త్విక రివిజనిస్టల కువిమర్శలకు లెనిన్ జవాబు చెబుతాడు.

**భౌతికవాదం ఇలా చెబుతుంది.**

మనకో మనస్సు వుంది. దానికి వెలుపల ఓ ప్రపంచముంది. అది భౌతికమైనది. అది మనం అనుకొన్నట్టుగా వుండదు. దానికదిగా వుంటుంది. భౌతిక ప్రపంచాన్ని మొత్తంగా చెప్పాలంటే తాత్త్విక భాషలో 'పదార్థం' అంటాం. ఒక యూనిట్‌గా చెప్పాలంటే 'వస్తువు' అంటాం.

విశ్వంలో ఏ వస్తువు విడిగా లేదు. పరస్పర సంబంధం కలిగి వున్నాయి. ఒక వస్తువు నుండి మరో వస్తువు వస్తుంది. పదార్థం లేదా వస్తువు ప్రధానం. దానినుండి గ్రహించే భావం ద్వితీయం.

ఇందుకు విరుద్ధంగా భావవాదం భావం ప్రధానం, వస్తువు ద్వితీయం అంటుంది. కొందరు భావవాదులు అసలు వస్తువు ఉనికినే గుర్తించరు. జగత్తు మిథ్య అంటారు.

జ్ఞానం ఎలా వస్తుంది? తత్త్వశాస్త్రంలో మరో ముఖ్య ప్రశ్న. ఇక్కడ కూడా భావ, భౌతికవాదాల దారులు వేరయ్యాయి. భావమే జ్ఞానం అనేది భావజ్ఞానం. వస్తువే జ్ఞానం అనేది భౌతిక జ్ఞానం. భావవాదులు భౌతిక జ్ఞానాన్ని గుర్తించరు. గుర్తించినా భౌతికతకు మూలం బ్రహ్మ, అఖండ భావం గనుక భావ జ్ఞానమే అసలైన జ్ఞానం అంటారు.

ఇందుకు విరుద్ధంగా గతితార్కిక భౌతికవాదం జ్ఞాన సిద్ధాంతం ఇలా చెబుతుంది.

భౌతిక ప్రపంచమంతా పదార్థమే. పదార్థం మినహా మరొకటి లేదు. దానిని తెలుసుకోవటమే భౌతిక జ్ఞానం. అది మనిషికి మాత్రమే సొంతం.. అతడు పంచేంద్రియాలతో వస్తువును తెలుసుకుంటాడు.

అది మెదడులో ప్రతిబింబిస్తుంది. అనుభవ జ్ఞానంతో దానిని గ్రహిస్తాడు. హేతుబద్ధంగా ఆలోచిస్తాడు. ఆచరణలో నేర్చుకున్నజ్ఞానాన్ని ఆచరణలో రుజువుచేసుకుంటాడు. శ్రమ జీవితంలోనే జ్ఞానం పుడుతుంది, వికసిస్తుంది..

ఇంత స్పష్టంగా వున్న తాత్త్విక, జ్ఞాన సిద్ధాంతాన్ని మాక్ ఎలా వక్రీకరించాడో చూడండి.

పంచేంద్రియాలద్వారా మనం గ్రహించేది వస్తువులను కాదు, వాటి అనుభూతుల(Sensations)ను మాత్రమే. ఫిజిక్స్ సూత్రాలు కనుగొనేది వస్తువుల మధ్య సంబంధాలను కాదు. అనుభూతులమధ్య సంబంధాల్ని మాత్రమే.

1883లో 'మెకానిక్స్' పుస్తకంలో ఇలా రాశాడు. **"అనుభూతులు 'వస్తువులకు సంకేతాలు' (Symbols) కావు. ఇంకా చెప్పాలంటే వస్తువులే సాపేక్షికంగా స్థిరపడిన అనుభూతుల సమ్మేళనాని (Complex of Sensations)కి మానసిక సంకేతాలుగా వున్నాయి. రంగులు, ధ్వనులు, ఒత్తిడి, స్థలం, కాలం లాంటి అనుభూతులు మాత్రమే ప్రాపంచిక మూలకాలు."**

అనుభూతుల సమ్మేళనాలే అసలైనవని, అవి వస్తువుల సంకేతాలు కాదని మాక్ తేల్చి చెప్పాడు.

ఇది ఎంగెల్స్ భౌతికవాదానికి విరుద్ధం. వస్తువు గురించిన అనుభూతిని పంచేంద్రియాలు అందిస్తాయి. అది మెదడులో ప్రతిబింబిస్తుంది. వస్తువును వాస్తవంగా గ్రహిస్తాం. వస్తువులను, వాటి మధ్య సంబంధాలనే ఫిజిక్స్ సూత్రాలు కనుగొంటాయి.

మాక్ వస్తువును, దాని అనుభూతిని వేరు చేశాడు. అనుభూతులను వస్తులకతీతమైనవిగా, స్వతంత్రమైనవిగా, ప్రధానమైనవిగా భావించాడు. అందువల్ల అనుభూతుల సమ్మేళనంలేదా భావజాలం ప్రధానమని, వస్తువు ద్వితీయమని భావించాడు

వస్తువులు → అనుభూతులు → ఆలోచనలు = భౌతికవాదం

ఆలోచనలు → అనుభూతులు → వస్తువులు = ఇది మాక్ భావవాదం.

మాకిజాన్ని. దానిని అనుసరించే వారిని 'అనుభవైక విమర్శకులు' అన్నాడు లెనిన్. వారు అనుభవవాదాన్ని వక్రీకరించారు. అనుభవవాదం వస్తువుకు సంబంధంలేనిదిగా, మనస్సుకు మాత్రమే చెందినదిగా భావించారు.

మాకిజం కొత్తది కాదు. హ్యూం, బర్క్లీ తాత్త్విక రచనలల్లోనే దాని మూలాలు వున్నాయి.

హ్యూం బ్రిటిష్ తత్త్వవేత్త. పదార్థంలేదు. మనస్సు లేదు. దేవుడు కూడా లేదు. మనకుండేది మానసిక స్థితులు. అవి అనుభూతులు. వాటికీ మూలం మనకు తెలియదు. అందువల్ల జ్ఞానాన్ని ఎన్నటికి తెలుకోలేము అన్నాడు. మాక్ హ్యూం అనుభూతులను సర్వస్వం చేశాడు.

17వ శతాబ్దం ప్రముఖ ఐరిష్ తత్త్వవేత్త బర్క్లీ. భావమే అన్నిటికి మూలం. భావం వల్లనే వస్తువు ఉనికిలో ఉంది. రంగు, రుచి, వాసన, ఆకృతి, గట్టితనం వల్లనే యాపిల్‌ను యాపిల్ అనగలుగుతున్నాం. అవి 'భావాల కలయిక'. మన మనస్సుకు చెందిన ఊహలు, జ్ఞాపకాలు. బర్క్లీ వస్తువును, భౌతిక జ్ఞానాన్ని పక్కనపెట్టిన స్వీయాత్మక భావజ్ఞానాన్ని స్వీకరించాడు. అంతిమంగా అంతా దేవుడే అన్నాడు.

బర్క్లీ 'భావాల కలయిక'ను మాక్ 'అనుభూతుల సమ్మేళనం' అన్నాడు. అంతే తేడా.

మరో పుస్తకంలో (Knowledge and Error) మరీ నగ్నంగా మాక్ తన భావవాదాన్ని బయటపెట్టుకున్నాడు. అనుభూతులకి 'ప్రాపంచిక మూలకాలు' (World Elements) అని కొత్త పదం కనిపెట్టాడు. ఇవి రెండు రకాలు. 1. భౌతికమైనవి. 2. మానసికమైనవి. మానసికమైనవి మనిషి శరీరం, మెదడుపై అధారపడి వుంటాయి.. భౌతికమైనవి ఆధారపడవు. అయితే అవి రెండూ వేరుగా వుండవు. జంటగా కలిసివుంటాయి. ఈ కొత్త సిద్ధాంతం ద్వారా తాను భావ, భౌతికవాదాల పాక్షికతకు అతీతంగా వ్యవహరించానన్నాడు.

మరో తాత్త్విక రివిజనిస్టు ఎవినారియాస్ భావ, భౌతికవాదాల మధ్య అనివార్యమైన సమన్వయము ఉందన్నాడు. ఆ రెండు వాదాలని అధిగమించి వాటి కతీతంగా ముందుకెళ్ళామని కూడ ప్రకటించాడు. పదార్థానికి, చైతన్యానికి మధ్య వైరుధ్యాన్ని తొలగించామన్నాడు. 'నేను' (Self) వున్నాను. వస్తువు (Non-Self) వుంది. రెండూ వాస్తవం. విడదీయరానివి. అయితే 'నేను' లేనిదే 'వస్తువు' ఎక్కడి దంటాడు.

ఇప్పుడో ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది. ఎవినారియాస్ యే స్వయంగా ఆ ప్రశ్న లేవనెత్తాడు.

'నేను' లేనిదే 'వస్తువు' లేదు కదా! మనిషికి ముందే ప్రకృతివుందా? ప్రకృతి నిర్జీవం. మనిషి చైతన్యయుతుడు. ఈ రెండిటికి మధ్య వున్న సంబంధాన్ని నిర్వచించటం ఎలా?

తొలిలో భూమి మాత్రమే ఉన్నది. అంతా నిర్జీవమే. అనుభూతులు, భావాలు లేవు. కాలక్రమంలో నిర్జీవ పదార్థం జీవపదార్థంగా పరిణమించింది. జీవం మనిషిగా అభివృద్ధి చెందింది. అప్పటినుండి మాత్రమే అనుభూతులు, భావాలు, ఆలోచనలు పుట్టాయి. పదార్థం పరిణామంలోనే చైతన్యం పుట్టింది. పదార్థం లేకపోతే చైతన్యం లేదు. ఈ విషయాన్ని ప్రకృతిశాస్త్రాలు స్పష్టంగా చెప్పాయి. భౌతికవాదంలో ఇది కీలక అంశంగా వుంది.

ప్రకృతి శాస్త్రాల పాఠాలు ఎవినారియాస్‌కి మింగుడుపడలేదు. కఠినమైన వాస్తవాన్ని జీర్ణించుకోవడం కష్టమైంది. అడ్డగోలు వాదనలకి దిగాడు. పిండం మనిషిగా ఎదుగుతుంది.. అందుకు తగిన వాతావరణం వుండాలి. అలాగే జీవపదార్థానికి, చైతన్యానికి మధ్య 'పొటెన్షియల్' అనే ఒక రకం శక్తి వుంది. ఆశక్తి ఎల్లప్పుడూ కనీస స్థాయిలో వుంటుంది. సున్నాగా వుండదు. అది జీవపదార్థాన్ని, చైతన్యాన్ని సమన్వయము చేస్తుంది. నిస్సహాయుడైన ఎవినారియాస్ ఈ పిరికి సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. కాని ధైర్యంగా కొనసాగించలేకపోయాడు. పాకుడురాళ్ళపై అడుగేస్తే ఎక్కడికి జారతామో తెలియదు.

## 'మనిషి మెదడుతోనే ఆలోచిస్తాడా?'

'మానవుడి ప్రాపంచిక భావన' అనే పుస్తకంలో ఎవివారియాస్ జారుడు జవాబే చెప్పాడు. "ఆలోచనలకి మెదడు నివాసం కాదు.స్థలం కాదు. సృష్టికర్త కాదు. సాధనం కాదు. సహకారి కాదు." "మెదడు ఆలోచించే అంగం కాదు. ఆలోచించటం మెదడు పని కాదు." అని కూడా సందేహానికి తావులేకుండా చెప్పాడు.

"తన 'అనుభూతుల విశ్లేషణ' పుస్తకంలో మాక్ చెప్పింది కూడా ఇదే.' మెదడు ఆలోచనలకు కమాండర్ కాదు. సాధారణ శారీరక పనులను నిర్వర్తించే అంగం కాదు' అన్నాడు.

ఇందుకు విరుద్ధంగా భౌతిక భావనతో ఎంగెల్స్ ఇలా చెప్పాడు. "ఆలోచన, చైతన్యం మానవ మెదడు ఫలితం". యాంటి డూరింగ్, ఫ్యూయర్ బా పుస్తకాలలో ఆయన ఇంకా ఇలా చెప్పాడు." ఇంద్రియానుభవ పాదార్థిక ప్రపంచం ఒక వాస్తవం. మనం కూడా అందులో ఒక భాగం .....మన ఆలోచన, చైతన్యం ఇంద్రియానుభవాన్ని మించినట్లు ఎంతగా కనపడినా, అవి మన శరీరంలో భాగం అయిన మెదడు నుండి వచ్చినవే. మనస్సు నుండి పదార్థం పుట్టలేదు. పదార్థ పరిణామ ఫలితమే మనస్సు."

ఏంగెల్స్ భావనను ఎవినారియస్ వ్యతిరేకించాడు. ఆలోచించే మనిషి మెదడు' ప్రకృతి శాస్త్రానికి చెందిన మంత్ర తంత్ర శక్తుల పెట్టె'గా భావించాడు.

మాకిస్టులు అనుభూతులన్నా, ప్రాపంచిక మూలకాలన్నా, భావ, భౌతికవాదాల సమన్వయమన్నా అది solipsism (స్వీయాత్మక భావధోరణి) అవుతుంది. అది మనస్సు, మనస్సు మాత్రమే అన్నిటికి మూలమంటుంది.

## వస్తువు గురించిన జ్ఞానాన్ని తెలుసుకోగలమా?

తెలుసుకోగలము. ఇప్పటికిప్పుడు తెలియకపోవచ్చు. కాని ఎప్పటికైనా తెలుసుకోగలం. ఇంద్రియానుభవమే అందుకు మార్గం అంటుంది భౌతికవాదం. అనుభవము, జ్ఞానము మనస్సుకు మాత్రమే చెందినది. వాటికి వెలుపల వస్తువు వుంది. కనుక తెలుసుకోలేము అంటుంది భావవాదం.

ఈ విషయంలో మన మాకిస్టులు కాంట్ వెనుక దాక్కున్నారు.

19వ శతాబ్దపు జర్మన్ తత్వవేత్త కాంట్. ఇంద్రియానుభవం మనకు తెలిసిన భౌతిక వస్తువులకే పరిమితం అన్నాడు. మనం గ్రహించేది వస్తువును కాదు, దాని గుణాన్ని మాత్రమే. ఉప్పు అంటే ఉప్పు గురించి కాదు, దాని గుణం ఉప్పన వలనే తెలుసుకోగలుగుతున్నాం. అందువల్ల ఏ బాహ్య వస్తువు గురించి తెలుసుకోవాలన్నా మనస్సే ప్రధానం.

వస్తువులు రెండురకాలు. **ఒకటి :** ఇంద్రియ గోచరమైనవి (Phenominon). **రెండు :** అగోచరమైనవి లేదా అంతు బట్టనివి. ఇవి యదార్ధ వస్తువులు (Thing in itself). కాంట్ పరిభాషలో 'నూమినా' అంటారు. ఇంద్రియానుభూతి గల వస్తువులనే తెలుసుకోగలం. వస్తువు అంటే దాని గుణం. మనస్సు ద్వారానే గుణాన్ని గ్రహించగలం. వస్తువుకు స్థల కాలాలు లేవు. మన మనస్సే వస్తువులను స్థల, కాలాలలో చూస్తుంది. యదార్ధ వస్తువులు వున్నాయి అవి ఎన్నటికి తెలియవు. ఇంద్రియానుభూతికి అందవు. వాటికి స్థలకాలాలు లేవు .

కాంట్ భావ, భౌతికవాదాలను సమన్వయం చేయటానికి ప్రయత్నించాడు. రెండిటి మధ్య ఊగిసలాడిచివరికి అజ్ఞేయవాది అయ్యాడు. పాపం, కాంట్ భావ భౌతికవాదులిద్దరి విమర్శకు గురయ్యాడు. తెలియని యదార్ధ వస్తువు వుంది అన్నందుకు భావవాదులు, దానిని గురించి ఎప్పటికి తెలుసుకోలేము అన్నందుకు భౌతికవాదులు ఇద్దరూ కాంట్‌ను విమర్శించారు. కాంట్ 'యదార్ధ వస్తువు' కేవలం మానసిక మైనదని, ఆలోచనలోనే అస్తిత్వంలో వున్నదని, వాస్తవమైనదికాదని' ఫ్యుయర్ బా విమర్శిస్తాడు.

కాంట్ చెప్పిన అగోచర వస్తువులను ఎంగెల్స్ అంగీకరించాడంటారు మాకిస్టులు. అది సరికాదు. వస్తువులో తెలిసినది వుంటుంది. తెలియనిది వుంటుంది. అది ఎన్నటికి తెలియదు అనుకోవడం తప్పు అంటూ ఒక ఉదాహరణ కూడా ఎంగెల్స్ చెబుతాడు. ఆర్గానిక్ కెమిస్ట్రీ అభివృద్ధి అయ్యే వరకు కోల్ టార్‌లో ఆలిజారిన్ (బట్టలకు వేసే యెర్ర రంగు అద్దకం) ఉందని మనకు తెలియదు. ఇప్పుడు తెలిసింది. ఇలాంటివి మిలియన్ల సంఖ్యలో వున్నాయి. తెలియని వాటిని తెలుసుకోగలం. ఉపయోగించుకోగలం. 'వస్తువులు వస్తువు కోసం' (Thing in itself) కాదు, 'మనకోసం' (Thing for ourself) అని కూడా ఎంగెల్స్ అన్నాడు.

అందువల్ల వస్తువులు మనకు, మన అనుభూతులకు, చైతన్యానికి వెలుపల స్వతంత్రంగా ఉనికిలో ఉంటాయి. ఇంద్రియగోచర వస్తువుకు, అగోచర వస్తువుకు మధ్య సూత్ర రీత్యా ఎలాంటి తేడా లేదు. విషయమల్లా, మనకు తెలిసినది, తెలియనిది, అంతే.

గతితార్కిక ఆలోచన ప్రకారం జ్ఞానమనేది రెడీమేడ్‌గా వడ్డించిన విస్తరిలా వుండదు. మార్పు చెందనిది కాదు. అది అసంపూర్ణం నుండి పరిపూర్ణ జ్ఞానానికి. సందిగ్ధిత నుండి ఖచ్చితత్వానికి దారి చూపుతుంది. ఇప్పుడు మరో అంశానికొద్దాం. **సత్యం భౌతికమా? స్వీయాత్మకమా?**

వస్తువును ఇంద్రియానుభవంతో గ్రహిస్తాం. మనిషి మనిషికి అనుభూతులు, అనుభవాలు భిన్నంగా వుండొచ్చు. అనుభవం రెండు రకాలు. ఒకటి : ప్రత్యక్షానుభవం. ప్రత్యక్షానుభవం అంటే స్వీయానుభవం. రెండు : పరోక్ష అనుభవం. ఇతరులు గడించిన అనుభవం నుండి స్వీకరించినది. అనుభవైక విమర్శకులు ప్రత్యక్ష అనుభవాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు.

అలాంటప్పుడు **ప్రత్యక్షానుభవానికతీతంగా భౌతిక సత్యమనేది ఒకటి వుంటుందా?** దానిని మనం భావంలో వ్యక్తం చేయగలమా?

సత్యం అనేది సిద్ధాంతమేననుకుంటే, కేవలం మానవానుభవమే ననుకొంటే, అది మనిషి మనస్సుకు మాత్రమే పరిమితమవుతుంది. వస్తువుతో సంబంధం వుండదు. కనుక మాకిస్టులు భౌతిక సత్యం అంటూ ఏదీ లేదంటారు.

రష్యన్ మాకిస్టు బాగ్దనోవ్ సత్యమనేది 'అనుభవం యొక్క నిర్మాణాత్మక రూపం' అన్నాడు. అందువల్ల భౌతిక సత్యం వుందని ఒప్పుకోడు.

ప్రత్యక్ష అనుభవమే సత్యమా? ఒక ఉదాహరణ చూద్దాం. మనిషి పుట్టక ముందే భూమి వుంది. అది వాస్తవం. మన ప్రత్యక్ష అనుభవంలోకి రాకపోయినా కాదనలేని భౌతిక సత్యం. ఆ సత్యాన్ని నిరాకరించిన బాగ్దనోవ్‌ది స్వీయాత్మక భావవాదం, అజ్ఞేయవాదం.

జ్ఞానం ఇంద్రియానుభవం నుండి వస్తుంది. ఇందులో భౌతికవాదులకు, భావవాదులకు ఎలాంటి పేచీలేదు. అది భౌతికమైనదా? స్వీయాత్మికమైనదా? మూలం వస్తువా? మనస్సా? అనేదే అసలు ప్రశ్న. భౌతికవాదం వస్తువు అంటుంది. మాకిజం అనుభూతుల సమ్మేళనం అంటుంది. అందువల్ల మనస్సే అన్నిటికి మూలమనే ఆనాటి కాంట్‌ను, ఈనాటి మాక్, ఎవినారియాస్‌లను అజ్ఞేయవాదులంటున్నాం. భావవాదులంటున్నాం.

## సత్యం సాపేక్షమా (Relative)? సంపూర్ణమా (Absolute)?

మాకిస్టులు అంతా సాపేక్షమేనంటారు. తమకు తాము సాపేక్ష వాదులమని పిలుచుకుంటారు. పరిపూర్ణ సత్యమనేది లేదంటారు. వారు భౌతిక సత్యాన్ని ఒప్పుకోక పోవటమే అసలు కారణం. యాంటి డూరింగ్ గ్రంథంలోఎంగెల్స్ యిచ్చిన రెండు ఉదాహరణలను లెనిన్ పేర్కొంటాడు. 'నెపోలియన్ మే 5, 1821లొ చనిపోయాడు'. 'పారిస్ ఫ్రాన్సులో వుంది.' వీటిని కూడ పరమ సత్యాలని మాకిస్టులు ఒప్పుకోరు. ఇవి వాస్తవిక సత్యాలు. ఎలాంటి వివాదం లేదు. మన పంచేంద్రియాను భవంతో గ్రహించి తెలుసుకున్నాం. వాటిని సాధారణంగా చూడాలిగాని పిడివాదంగా చూడగూడదు. గతితర్కంలో సాపేక్షవాదం వుంది. కాని గతితర్కాన్ని సాపేక్షవాదానికి కుదించగూడదు. సాపేక్ష సత్యానికి, పరిపూర్ణ సత్యానికిగల గతి తార్కిక సంబంధాన్ని పరిశీలించాలి.

సైన్సు సూత్రాలను మనం సాపేక్ష సత్యాలుగానే చూస్తాం. ఇప్పుడు ఒప్పు అన్నది రేపు తప్పు కావచ్చు. నిన్న తప్పు నేడు ఒప్పు కావచ్చు. అలా అని సాపేక్షమంటే అసలు సత్యాన్ని తెలుసుకోలేమనికాదు. 'భూమి గుండ్రంగా వున్నది, తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడు చుట్టూ తిరుగుతుంది'. ఇది భౌతిక సత్యం. మన ఇష్టాయిష్టాలపై ఆధారపడి వుండదు. భౌతిక సత్యం అంతిమ పరిశీలనలో పరమ సత్యమే. సాపేక్ష సత్యాల మొత్తం పరమసత్యానికి దారిచూపుతుంది.

అందువల్ల లెనిన్ సాపేక్ష, పరమ సత్యాలను గుడ్డిగా అవగాహన చేసుకోగూడదన్నాడు. రెండిటి మధ్య చెరగని గీత లేదు. జ్ఞానం ఎల్లప్పుడు సాపేక్షమే. అయితే దానికి పరిమితిలేదు. విశ్వం అనంతం. మార్పు అనంతం. మార్పును తెలుసుకోవడమే జ్ఞానం. జ్ఞానం అనంతం.

## ఆచరణ జ్ఞానానికి గీటురాయా?

ప్రకృతిని పరిశీలించేటప్పుడు 'భ్రమ', 'వాస్తవం' రెండూ ఎదురవుతాయి. అప్పుడు సత్యాన్ని తెలుసుకోవడం ఎలా అనే ప్రశ్న ఎదురవుతుంది. వాస్తవం ఒక భౌతిక సత్యం. అది ఒక వ్యక్తి మానసిక ఆలోచన కనుగుణంగా వుండదు. మనస్సుకు వెలుపల తనకు తానుగా వుంటుంది. దానిని శాస్త్రీయ దృష్టితో చూడాలి. ఆచరణలో రుజువు చేయాలి. అందరికి ఆమోదయోగ్యం కావాలి.

ఆచరణలోనే భౌతిక సత్యాన్ని కనుగొనగలమని మార్క్స్ చెప్పాడు. "ఆచరణతో సంబంధం లేకుండా మన ఆలోచనలోని వాస్తవికత, అవాస్తవికత మధ్య వివాదాన్ని పరిష్కరించాలనుకొంటే అది పాండిత్య ప్రకర్ష అవుతుంది". "ప్రకృతి నుండి గ్రహించిన దానిని ఆచరణలో రుజువు చేసుకోవడం ద్వారానే మన అవగాహనను పెంపొందించుకోగలం" (మార్క్స్).

ఇందుకు విరుద్ధంగా మాకిజం 'భ్రమ', 'వాస్తవా'న్ని కేవలం మానసిక ఆలోచనకు సంబంధించినదిగా చూస్తుంది. ఆచరణ రీత్యా వాటికి ప్రాముఖ్యత ఉంటుందేమో గాని శాస్త్రీయంగా లేదంటుంది. అలాగే ఈ ప్రపంచం నిజమా, కలా అనే ప్రశ్న కూడా శాస్త్రీయం కాదంటుంది.

లెనిన్ గ్రంథంలో 6 అధ్యాయాలున్నాయి. మొదటి మూడు అధ్యాయాలులో జ్ఞాన సిద్ధాంతాన్ని వివరిస్తాడు. అనుభవవాదాన్ని మాకిజం వక్రీకరించడాన్ని విమర్శిస్తాడు. తదుపరి అధ్యాయాల్ని ఇపుడు చూద్దాం.

పదార్థం అంటే ఏమిటి?

ముందుగా మాకిస్టుల వాదనలు చూద్దాం.

ఎవినారియస్ భౌతికపదార్థాన్ని మాటవరసకి ఒప్పుకున్నా మనస్సుకు వెలుపల పదార్థం స్వతంత్రంగా లేదంటాడు. మనస్సు, పదార్థం మధ్య అనివార్యమైన సంబంధం వుంటుంది. ఒక 'శక్తి' (Potential) ఆ రెండిటిని అనుసంధానిస్తుంది.

మాక్ అనుభూతుల (మూలకాల) సమ్మేళనమే పదార్థం అంటాడు.

మాకిస్టులంతా అనుభూతులకు మూలమయిన బాహ్య ప్రకృతిని తిరస్కరించారు. తాత్త్వికంగా భావవాదులయ్యారు. ఇందుకు విరుద్ధంగా భౌతికవాదం ఇంద్రియానుభూతి కలిగినదంతా పదార్థమే. పదార్థం ఒక భౌతిక వాస్తవికత అంటుంది.

పదార్థాన్ని భౌతిక వాస్తవికతగా చూడ నిరాకరించిన మాకిస్టులు అనుభవవాదం అర్థంచేసుకోవడంలోను విఫలమయ్యారు.

'ఇది నా అనుభవం', అంటాం. 'నేను' (Self), 'పరిసరాలు' (Environment) లేకుండా అనుభవం కలగదు. రెండిటి మధ్య అనివార్యమైన బంధంతోనే అనుభవం ఉనికిలోకి వస్తుంది. అయితే 'నేను' అంటే మనస్సు అంటాడు ఎవినారియాస్. అనుభూతుల సమ్మేళనం అంటాడు మాక్. ఇద్దరు భౌతిక సత్యాన్ని ఒప్పుకోరు. ఇందుకు విరుద్ధంగా భౌతికవాదులు అనుభవానికి మూలం మన మనస్సుకు వెలుపల బాహ్య ప్రకృతిలో జరిగే మార్పులు అంటారు. అనుభవానికి మూలం వస్తువు అంటారు. అనుభవవాద విషయంలో భావ, భౌతికవాదాలు విడిపోయాయి.

## కార్యానికి కారణం వుంటుందా?

ప్రకృతిలో మార్పులను ఎలా అర్థం చేసుకోవాలి?

'ప్రకృతి నుండి ప్రకృతి పుడుతుంది. ఇందులో మానవ ప్రమేయం లేదు. తర్కం లేదు. గణితంలేదు. ఏ శక్తి లేదు. ప్రకృతి మార్పులను మనం భావంగా వ్యక్తీకరిస్తాం. పేర్లు పెడతాం. ప్రకృతి సూత్రాలను బహిర్గతం చేస్తాం' (లెనిన్)

ప్రకృతి తనంత తాను పుడుతూ మార్పు చెందుతుంది అంటే ప్రకృతి ఒక క్రమ పద్ధతిలో పరిణామం చెందటం లేదా? రుతువులు ఒకదానివెంట ఒకటి రావటంలేదా? ఊపిరితిత్తులు-గాలి, కళ్ళు-కాంతి, చెవులు-ధ్వని మధ్య సమన్వయం లేదా? భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడు చుట్టూ గాక అడ్డదిడ్డంగా తిరుగుతోందా? లేదు. ప్రకృతి మార్పుకోపద్ధతి వుంది.

ఇది ప్రకృతికి చెందినది, ఇది మనిషికి చెందినది అంటూ విశ్వంలో ఏదీ విడిగా లేదు. ప్రకృతిని, మనిషిని, మనిషి ఆలోచనను వేరు చేయగూడదు. ప్రకృతిలో వున్నదానినే మనిషి తన భావంలో, భాషలో వ్యక్తీకరిస్తున్నాడు.

ఎంగెల్స్ కార్యానికి, కారణానికి గల గతితార్కిక సంబంధాన్ని 'యాంటి డూరింగ్' గ్రంథంలో వివరిస్తాడు. కార్య కారణాలు ప్రత్యేకంగా విడివిడి ఘటనలుగా వుంటాయి. అదే సమయంలో మొత్తం ప్రపంచంతో సార్వత్రిక సంబంధం కలిగి వుంటాయి. కార్య కారణలు పరస్పరం

మారవచ్చు. ఒకో సందర్భంలో కార్యం కారణంమవుతుంది., కారణం కార్యమవుతుంది.

ప్రపంచమంతా పరస్పర సంబంధం కలిగివుంది. ప్రకృతి పరిణామంలోనే మనిషి మెదడు పుట్టింది. మెదడు చైతన్యాన్ని ఇస్తుంది. కార్యానికి కారణాన్ని తెలియజేస్తుంది. అందువల్లే ప్రకృతి సూత్రాలతో మన ఆలోచనలు సరితూగుతాయి.

కార్యకారణసంబంధాన్ని మాకిజం ఒప్పుకోదు.

ఎవినారియాస్ బలాన్ని (force) చలనాన్ని (motion) ఉదాహరణగా తీసుకుంటాడు. "బలం వలన చలనం కలగటం మన అనుభవంలోకి రాదు. అవి ఒకదానిని మరొకటి అనుసరిసరించుతాయని మాత్రమే మనకు అర్ధమవుతుంది." ఒక చలనం మరొక చలనానికి కారణమవుతుందనే గతితర్కాన్ని అతడు వ్యతిరేకిస్తాడు..

మాక్ "ప్రకృతిలో కార్యం లేదు. కారణం లేదు." "కార్యకారణ సూత్రీకరణ స్వీయాత్మకమైనదని నేను చాల సార్లు నిరూపించాను. ఆ సూత్రాలకనుగుణంగా ప్రకృతి వుండాలని లేదు". (మెకానిక్స్ పుస్తకం).

రష్యన్ బాగ్దనోవ్ కూడా కార్యకారణ సూత్రం ప్రకృతిలో లేదంటాడు. అది మానవ జ్ఞాన ఫలితం, మన ఆలోచనల సృష్టి, అదే ప్రకృతిని నిర్దేశిస్తుందని కూడా అంటాడు.

స్థల, కాలాల (Space and Time) విషయంలోను మాకిజం కాంట్‌ను అనుసరించింది.

మనస్సుకు వెలుపల పదార్ధం వుంది. పదార్ధానికి చలనమేగాక స్థలము, కాలము కూడా వుంటుంది. నిరంతర చలనంలో వున్న పదార్ధం స్థలకాలాలలోనే అస్తిత్వంలో వుంటుంది. ఇది భౌతికవాద భావన.

ఇందుకు విరుద్ధంగా కాంట్ చెబుతాడు. 'స్థలకాలాలంటూ ఏవీ లేవు. అది మానసిక భావన. మన మనస్సే వస్తువులకు ఒక క్రమ పద్ధతిలో స్థల కాలాలను కల్పించింది'.

కాంట్ చెప్పిందే మాక్ వల్లించాడు. "స్థలము, కాలము అనుభూతుల పరంపర ఏర్పరిచిన ఒక క్రమ పద్ధతి." మనిషి తన అనుభూతులతో స్థలకాలాలల్లో లేదు. స్థలకాలాలు మనిషిలో వున్నాయి. మనిషిపై ఆధారపడి వున్నాయి. మనిషిచే సృష్టింపబడినాయి. అవి భౌతిక సత్యాలుకాదు, మానసికమైనవి" ఎంతగా భావవాదం ఊబిలోకి దిగజారిపోయారు! ఇపుడు మాకిజం చారిత్రక నేపథ్యాన్ని చూద్దాం.

కాంట్ స్ఫూర్తితో ఎదిగి బర్క్లీ, హ్యూంల దరికి జేరానని మాక్ స్వయంగా చెప్పుకున్నాడు. ఇప్పటికి వారి ప్రభావం తనపై ఉందన్నాడు. ఎవినారియాస్ తాను కాంట్ సిద్ధాంతాన్ని 'శుద్ధి' చేశానన్నాడు. 'అంతుతెలియని యదార్ధ వస్తువులు' వున్నాయనటం, కార్యకారణ సంబంధాన్ని గుర్తించటం కాంట్ చేసిన తప్పులుగా భావించానన్నాడు. ఇదే మార్గంలో మాక్ శిష్యులు పయనించారు.

బూర్జువ శకంగా చరిత్రలో నిలిచిపోయిన 19వ శతాబ్దం చివరలో మార్క్స్, ఎంగెల్స్‌ల భౌతికవాదాన్ని కాంట్ తాత్విక సిద్ధాంతంతో అణచివేయాలని 'మేధావులు' ప్రయత్నించారు. ఈ అభివృద్ధి నిరోధక ఉద్యమం జర్మనీలో ప్రారంభమైంది.

చివరికి మాకిజం చేరాల్సిన చోటికి జేరింది. మత విశ్వాసాలకు లోబడే ఫీడిజంలోకి దిగజారింది.

ఒక వ్యక్తిని అంచనా వేయాలంటే అతని మాటల్ని, ఆలోచనల్ని కాదు, అతని చేతల్ని అని మనకు తెలుసు. అలాగే తత్త్వవేత్తల చెప్పే పాజిటివిజం, శుద్ధ అనుభవం, ఏకత్వం లాంటి ప్రకటనలు చూసి కాదు, మౌలికమైన సైద్ధాంతిక విషయాల్ని వారు ఎలా చెప్పారు, ఎలా బోధించారు అనేది చూడాలి. మాక్ అనుచరుడు పాల్ కారస్ చికాగో నుండి వెలువడే 'The Monist' తాత్విక పత్రికలో రాసిన రాతలు చూడండి. "సైన్సు దివ్య వాణి". సైన్సు చర్చిని సంస్కరిస్తుంది. మతంలోని మంచిని, సత్యాన్ని నిలుపుతుంది. మాకిజం పతనాన్ని అర్థం చేసుకోవటానికి మరో సాక్ష్యం కావాలా?

మన రష్యన్ మేధావి బాగ్దనోవ్ 'అనుభవ ఏకతావాదం' (Empirio-Monism) సారాంశం కూడా ఇదే. మానవ అనుభవమే భౌతిక ప్రపంచం అంటాడు. అభివృద్ధి క్రమాన్ని ఒక గొలుసుతో పోల్చాడు. అనుభవాన్ని మానసిక. భౌతిక దశలుగా వర్గీకరణ చేశాడు. అనుభవం మనస్సుతో మొదలవుతుంది. భౌతిక అనుభవంగా ఉన్నత దశకి ఎదుగుతుంది.

మాక్ అనుభూతులు, మూలకాలనే బాగ్దనోవ్ నిచ్చెనగా వేశాడు. 1. ఊహాతీతమైన మూలకాలు 2. మానసిక అనుభవం 3. భౌతిక అనుభవం 4. జ్ఞానం. అందువల్ల ఈ నిచ్చెనలో మొదటి మెట్టు అనుభూతులు లేదా మూలకాలు. రెండవది మానసికం. ఆ తర్వాతే భౌతికమైన మనిషి. ఇంతకంటే చెత్త మరోటిలేదు. ఇదే ఒప్పుకుంటే హెగెల్ కూడా భౌతికవాదే. మొదట మానసిక అనుభవం (అఖండభావం), తర్వాత దానికంటే ఉన్నతమైన భౌతిక ప్రపంచం (ప్రకృతి), చివరికి మానవ జ్ఞానం ఏర్పడుతుందని, జ్ఞానంతో ప్రకృతి అఖండ భావాన్ని జేరుకుంటుందని హెగెల్ తత్త్వం చెబుతుంది.

## ఆధునిక సైన్సు ఆవిష్కరణలు-ఫిజిక్స్ సంక్షోభం :

20వ శతాబ్దం మొదట్లో సైన్సు ముఖ్యంగా ఫిజిక్స్‌లో గొప్ప ఆవిష్కరణలు జరిగాయి. ఎక్సరేలను కనుగొన్నారు. రేడియం హీలియంగా మారుతుందన్నారు. అణువు అవిభాజ్యంకాదని రుజువు చేశారు.. పాజిటివ్, నెగటివ్ చార్జి గల ఎలక్ట్రాన్‌లను కనుగొన్నారు. ఐన్‌స్టీన్ ప్రత్యేక, సాధారణ సిద్ధాంతాలు ప్రాపంచిక దృక్పథాన్ని మార్చివేసింది. స్థల, కాలాల సాపేక్షతను, పదార్ధము, శక్తి సంబంధాన్ని బహిర్గతం చేసింది.

పాత ఫిజిక్స్ గందరగోళంలో పడింది.

ఫిజిక్స్‌లో సంక్షోభం తలెత్తిందన్నారు. 'పదార్ధం, శక్తి, సృష్టింపబడదు, నాశనం గావింపబడదు' అనే సూత్రం ఇంకెంత మాత్రము చెల్లదని, పదార్ధం అంతమయిందని గగ్గోలుపెట్టారు. న్యూటన్ 'చర్యకు ప్రతిచర్య' లాంటి యాంత్రిక సూత్రాలు పనికిరావని, ఫిజిక్స్ సూత్రాలన్నీ అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. స్థలకాలాలు ప్రకృతిలో లేవు, మనం ఆపాదించినవే. ఆలోచన కానిదేదీ శుద్ధమైనది కాదు. సైన్సు సూత్రాలు మానవుడు చైతన్యానికి వెలుపలవి కావు, చైతన్యం వలన వెలువడినవే అంటూ తాత్వీకరించారు. ఫ్రెంచ్ శాస్త్రజ్ఞుడు పాయిన్ కేర్ పాతఫిజిక్స్ తిరగదోడాలన్నాడు. ఎబెల్ రే ఫిజిక్స్ వక్రీకరణలను భావవాదం వైపు మళ్ళించాడు. "ఫిజిక్స్ సంక్షోభం"తో సైన్స్‌పై సందేహాలను రేకెత్తించారు. 19వ శతాబ్దం వరకు యాంత్రిక

భౌతికవాద దృక్పధంతోనే ప్రకృతిని పరిశీలించారు. ఇదే అనుభవంపై ఆధారపడిన భౌతిక జ్ఞానంగా చెప్పబడింది. పిడివాదంగా మారింది. అయితే ఏబెల్ రేకి అధిభౌతికవాదానికి, గతితార్కిక భౌతికవాదానికి తేడా తెలియదు. సాపేక్ష సత్యం, పరమసత్యం గురించి అవగాహన లేదు. సైన్సు సూత్రాలను సింబల్స్‌గా కుదించారు. ఫిజిక్స్ విద్యావిలువలను కోల్పోయిందన్నారు. అది భౌతిక కోర్కెలను తీర్చటానికేగాని జ్ఞానానికి పనికిరాదన్నారు.

హౌల్లి విగ్ 'సైన్సు పరిణామాలు' పుస్తకంలో "పదార్థం ఉందా? అని ప్రశ్నించి పరమాణువు పదార్థం కాకుండా పోయింది" అన్నాడు. మాక్ అనుచరుడు వాలెంటినా "ప్రపంచానికి సైద్ధాంతిక పునాదిని భౌతికవాదం వేసిందని ప్రకటించడం కట్టుకథ" అన్నాడు.

అణువు, ఎలక్ట్రాన్ భౌతిక ప్రపంచానికి చెందినవి. అవి మన మనస్సుకు ఆవల స్వతంత్రగా వున్నవి. పదార్థం (అణువు) అదృశ్య మైనదంటే అంతకు ముందున్న భావన అదృశ్యమైంది. అణువు అనంతం. ఎలక్ట్రాన్ అనంతం అన్నాడు లెనిన్. (ఆ తర్వాత అణువులో ప్రోటాన్స్, ఎలెక్ట్రాన్స్, న్యూట్రాన్స్‌లేగాక 200 పదార్థ రేణువులను కనుగొన్నారు). అందుకే పదార్థ జ్ఞానం అనంతం అంటాం. పదార్థ చలనం గురించి గతితార్కికభావన లేకపోవటం వలన కొందరు శాస్త్రజ్ఞులు పొరబాటు అభిప్రాయాలకు వస్తున్నారు.

పదార్థం లేని భావం, మెదడు లేని ఆలోచన వుంటుందా? ప్రతిది అదృశ్యమవుతుంది.

## పదార్థం లేకుండా చలనం ఉంటుందా?

కొత్త ఫిజిక్స్ సైంటిస్ట్‌లు పదార్థం లేకుండానే చలనం ఉంటుందనే భావనకొచ్చి భావవాదం వైపు మొగ్గారు.. "పదార్థం లేకుండా చలనాన్ని ఊహించలేము" ఎంగెల్స్ ప్రకటనని వారు పరిగణనలోకి తీసుకోలేదు. డీడ్జిన్ కూడా వారిని విమర్శించాడు. "వాళ్ళు (భావవాదులు) ప్రత్యేకత లేకుండా సాధరణతను, పదార్థం లేకుండా భావనను, యంత్రం లేకుండా బలాన్ని, అనుభవం లేకుండా సైన్సును, సాపేక్షత లేకుండా పరిపూర్ణతను కోరుతున్నారు." పదార్థం నుండి చలనాన్ని, యంత్రం నుండి బలాన్ని వేరుచేయటం మెదడు నుండి ఆలోచనని విడదీయటం లాంటిదేనన్నాడు.

భావవాదులకి ప్రపంచమంటే అనుభూతులు, భావాలు, ఆలోచనలే. వాటిల్లోనే వాళ్ళు చలనాన్ని చూస్తారు. భౌతికవాదులకు ప్రపంచమంటే పదార్థం. అది భౌతిక వాస్తవికత. అనుభూతులు, భావాలు, ఆలోచనలు పదార్థానికి ప్రతిబింబాలు. పదార్థమే చలనం. పదార్థం నుండి చలనాన్ని వేరుచేయటం అంటే భౌతిక వాస్తవాన్నుండి ఆలోచనని వేరుచేయటమే.

'20వ శతాబ్దపు తత్త్వశాస్త్రం', 'ఇటీవలి సైన్సు తత్త్వ శాస్త్రం'గా చెప్పబడుతున్న మాకిజం, భావవాదం మినహా మరొకటికాదు. భౌతిక వాస్తవికతను మాకిస్టులు తిరస్కరిస్తారు. 'భౌతిక భావవాదం' (Physical Idealism) పేరుతో వీరందరు భౌతికవాదానికి దూరమయ్యారు. అందువల్లే 'భౌతిక భావవాదా'నికి, ఫిజిక్స్ సంక్షోభానికి మధ్య సంబంధం ఏర్పడింది.. న్యూటన్ సూత్రాలులాంటి కొత్త పరిశోధనలు వెలుగులోకి వచ్చినపుడు ఫిజిక్స్ మార్పు చెందటాన్ని మనం చూశాం. ఇప్పుడు 'ఫిజిక్స్ సంక్షోభం' కూడా అలాంటిదే. దీని వలన ఫిజిక్స్ మార్పు చెందుతుంది, అభివృద్ధి చెందుతుందేగాని, శాస్త్రీయ దృక్పధాన్ని మార్చదు. తాత్త్విక ఆలోచన ఎలా వున్నా సైంటిస్టులు తమ శాస్త్రాల అధ్యయన పరిధిలో భౌతికవాదంలోకి రావాల్సిందే.

## చారిత్రక భౌతికవాదంపై తాత్త్విక రివిజనిస్టుల దాడి :

మార్క్స్, ఏంగెల్స్ రాజకీయ శాస్త్రంపై 1895లో ఎవినారియాస్ శిష్యుడు యఫ్.బ్లి దాడిచేశాడు. మార్క్సిజంలో అధి భౌతికవాదం వుంది. మార్క్సిస్టు ఆర్థిక సూత్రాలలో వ్యక్తి పాత్ర శూన్యం, యాదృచ్చికం. మార్క్స్ సిద్ధాంతం జీవశాస్త్ర విరుద్ధమైనది. పాక్షికమైనది అంటూ ఆరోపణలను చేశాడు.

మాకిస్టులు తత్త్వశాస్త్రం, సాంఘిక శాస్త్రాలలో పక్షపాతము లేకుండా వ్యవహరిస్తామంటారు. వాళ్ళు సోషలిజం, ఉదారవాదం ఏదీ అక్కరలేదని, భౌతిక, భావ వాదాలను అధిగమించి ఎదిగామని చెప్పుకుంటారు. మార్క్స్ భౌతిక సత్యాన్ని అపహాస్యం చేస్తారు.

అద్దంలో వికృతముఖం కనపడినదంటే అది అద్దం తప్పుకాదు. మాకిజం అనుభవైక విమర్శన ఒక వికృతముఖం.

ఇపుడు బాగ్దనోవ్ 'మార్క్స్'ను సరిచేసి చారిత్రక భౌతికవాదాన్ని ఎలా 'అభివృద్ధి' చేశాడో చూద్దాం.

"సామాజిక జీవితం అంటే చైతన్యయుతమైన మానసిక జీవితమే. సమాజం, చైతన్యం, విడదీయరానివి. సామాజిక అస్తిత్వం, సామాజిక చైతన్యం సరైన అర్థంలో చెప్పాలంటే ఒక్కటే." బాగ్ద నోవ్ చెప్పింది సరికాదు.

మనుష్యులు మధ్య ఎలాంటి సామాజిక సంబంధాలు ఉండాలనేది వారి చైతన్యంపై ఆధారపడి వుండదు. ఉదాహరణకి ఒక రైతు తన ధాన్యాన్ని అమ్మేటప్పుడు ప్రపంచ మార్కెట్లో భాగస్వామి అవుతాడు. అది అతనికి తెలియకుండానే జరుగుతుంది. చైతన్యం స్థితిని ప్రతిబింబించటం సాధారణ భౌతిక సూత్రం. అనుభవైకవాదాన్ని మినహాయిస్తే బాగ్ద నోవ్ మార్క్సిస్ట్ అని మనం అనొచ్చు. కాని సామాజిక స్థితిని, సామాజిక చైతన్యాన్ని ఒకే గాట కట్టడం పూర్తిగా అర్థంలేని అభివృద్ధి నిరోధక సిద్ధాంతం.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రతి ఉత్పత్తిదారుడు తనదైన నైపుణ్యాన్ని ఉత్పత్తిరంగంలో ప్రవేశపెడతాడు. ప్రతి యజమాని కొన్ని ఉత్పత్తులను ఇతరుల కోసం మారకం చేస్తాడు. ఇలా చేయటం ద్వారా సామాజిక అస్తిత్వాన్ని మారుస్తున్నామనే సంగతి ఆ ఉత్పత్తిదారుడికి, ఆ యజమానికి తెలియదు. ఇవి సామాజిక మార్పులో కనుగొనబడిన భౌతిక సూత్రాలు. దీనివెనుక తర్కం వుంది. చారిత్రక అభివృద్ధి వుంది. అంతేగాని కొంతమంది చైతన్యవంతులవల్ల సామాజిక మార్పు రాదు.

మనుష్యుల సామాజిక చైతన్యానికి వెలుపల స్వతంత్రంగా సామాజిక స్థితి వుంటుంది. నీవు జీవిస్తావు. నీ పనులు నీవు చేస్తుంటావు.. పిల్లల్ని కంటావు. ఉత్పత్తి చేస్తావు. మారకం చేస్తావు. నీ చైతన్యం లేకుండానే ఘటనలు జరిగిపోతుంటాయి. అభివృద్ధి సాగిపోతుంటుంది. కాని అది నీవు పూర్తిగా గ్రహించలేవు.

మానవ చైతన్యానికి, అనుభూతికి, అనుభవానికి స్వతంత్రంగా పదార్థం అస్తిత్వంలో ఉంటుందని భౌతికవాదం చెబుతుంది. మానవుల సామాజిక చైతన్యానికి స్వతంత్రంగా సామాజిక స్థితి ఉంటుందని

చారిత్రక భౌతికవాదం చెబుతుంది. స్థితికి చైతన్యం ప్రతిబింబం మాత్రమే.

తత్వశాస్త్రంలో రెండు దారులున్నాయి. భావవాదం. భౌతికవాదం. ప్రకృతి, పదార్థం, భౌతికత, బాహ్య ప్రపంచమా? చైతన్యం, మనస్సు, అనుభూతి, అనుభవమా? ఏది ప్రధానం? ఏది ద్వితీయం? ఇదే మూల ప్రశ్న. తత్వవేత్తలు రెండు శిబిరాలుగా విడిపోయారు.. మార్క్స్, ఎంగెల్స్‌లు మొదటి నుండి చివర వరకు భావ, భౌతికవాదాల పోరాటంలో రాజీలేకుండా పక్షపాతంగానే వ్యవహరించారు.

భావ, భౌతికవాదాలలో మధ్యే మార్గాన్ని జె. డీడ్జిన్ విమర్శించాడు. "నేను భౌతికవాదిని. మనది భౌతిక తత్వశాస్త్రం. అన్ని పక్షాలలోకి మధ్యే మార్గం అసహ్యమైనది. రాజకీయ పార్టీలు రెండు శిబిరాలుగా విడిపోయినట్లుగా, సైన్సు కూడా అధిభౌతికవాదులుగా, భౌతికవాదులుగా విడిపోయింది. అధ్యాత్మికవాదులు, అనుభూతివాదులు, వాస్తవిక వాదులు మధ్యేమార్గంలో పయనిస్తున్నారు. సిద్ధాంత పరంగా మనం ఖచ్చితంగా, స్పష్టంగా వుండాలి.

తత్వశాస్త్రంలో రెండే రెండు ప్రత్యర్థులు. భావవాదం, భౌతికవాదం. మధ్యేమార్గం లేదు. మాకిజం వాటికి అతీతం కాదు. ఎన్ని ముసుగులు కప్పినా దాని భావవాదం దాగదు.

చివరికి అనుభవైక విమర్శనని నాలుగు అంశాలతో లెనిన్ ముగిస్తాడు.

1. అనుభవవాద తాత్వికతను గతితార్కిక భౌతికవాదంతో సరిపోల్చి చూడాలి.

2. అనుభవైక విమర్శకులు ఒక చిన్న తాత్విక గ్రూప్. ఇతర ఆధునిక తాత్విక విధానాలతో దాని సంబంధాన్ని నిర్ణయం చేయాలి. మాక్, ఎవినారియస్‌లు కాంట్‌తో ప్రారంభమై బర్క్లీ, హ్యూం వరకు దిగజారారు.

3. మాకిజంకి ఆధునిక సైన్సుతో గల సంబంధాన్ని మనస్సులో వుంచుకోవాలి. అత్యధిక సైంటిస్టులు భౌతికవాదం వైపు వున్నారు. ఫిజిక్స్‌లో ఇటీవలి కొత్తపరిణామాలతో భావవాదం వైపు మొగ్గారు. గతితర్కం తెలియకపోవడం, సాపేక్షతను అర్థం చేసుకోకపోవడం అందుకు కారణాలు.

4. అనుభవైక విమర్శ వెనుకవున్న జ్ఞాన సిద్ధాంతం తత్వశాస్త్రంలో భావ, భౌతికవాద పక్షాలమధ్య పోరాటంగానే చూడాలి. అంతిమ పరిశీలనలో అది ఆధునిక సమాజంలోని రెండు శతృత్వ వర్గాల సిద్ధాంత ధోరణుల మధ్య పోరాటాన్ని ప్రతిబింబిస్తుంది.

1905 విప్లవం విఫలమైన తర్వాత రివిజనిజం రష్యాలోనేగాక, ప్రపంచమంతటా వ్యాపించింది. అలాంటి సంక్షోభ సమయంలో ఒక విప్లవ నాయకుడు ఏం చేస్తాడో లెనిన్ అదే చేశాడు. పార్టీలోని మెన్షివిక్కులపై రాజీలేని పోరాటం చేశాడు. ఆ పోరాటాన్ని తాత్విక, సైన్సు రంగాలకు కూడా విస్తరించాడు. 1917 విప్లవాన్ని విజయవంతం చేశాడు. ✺

## పాలస్తీనాలో వెస్ట్ బ్యాంక్ రాజధాని రమెల్లాలో వున్న రమెల్లా ఫ్రెండ్స్ స్కూలు బాలలు, గాజాలో ఇజ్రేల్ బాంబుదాడుల్లో మరణిస్తున్న బాలల కోసం పాడిన విషాద బృందగీతం

**(వీడియో నుండి సేకరించినది)**

గాజా బాలల ఆక్రందనలు వినండి
గాజా బాలలు యుద్ధంలో అంతమౌతున్నారు
ప్రపంచమంతా ప్రక్కన నుంచుని చూస్తోంది
అది చూడగలదు కాని వినదలచుకోలేదు
కాదు కాదు వింటోంది కాని నోరు మెదపట్లేదు
న్యాయానికి హృదయం లేదిక్కడ
అదే మౌనం వహిస్తే
ఇక భయమనేదే లేని జగత్తును
ఎప్పటికి కల కనగలను?
తుపాకీల మోతలు లేని ప్రపంచాన్ని
బాంబులు బాధలేని జగాన్ని
ఎప్పటికి కల కనగలను?
మేము బాలలం!
బతకడానికి జన్మించాం – చావడానికి కాదు
చావడానికి కాదు – చావడానికి కాదు
గాజా మా బాలలను పిలుస్తోంది
మాకు ప్రేమ, జీవితం, న్యాయం కావాలి
ఏం జరిగినా సరే
అటువంటి ప్రపంచాన్ని మా చేతుల్తో సృష్టిస్తాం
ధ్వంసమైన మా దేశాన్ని మేం పునర్నిర్మిస్తాం!
ఇది మా దృఢ నిర్ణయం
గాజా బలీయమైనది –
ఏం జరిగినాసరే –
మేం నిర్ణయించుకున్నాం గట్టిగా
ఆకాశమా! మాకు రక్షణ, శాంతిని వర్షించు!

**అనువాదం : కొత్తపల్లి రవిబాబు** ✺

వ్యాసం

# లెనిన్ - సాహిత్యం

- జి.వి. భద్రం

**మహత్తరమైన** అక్టోబర్ విప్లవానికి నాయకత్వం వహించి, ఆ విప్లవాన్ని విజయవంతం చేసిన మహనీయుడు లెనిన్. విప్లవ విజయానంతరం రష్యా దేశంలో, కార్మికవర్గ నియంతృత్వాన దోపిడీ, అణచివేత, పేదరికం, ఆకలి, నిరుద్యోగం, అసమానతలు లేని శ్రామికవర్గ సామాజిక వ్యవస్థను స్థాపించి, అటువంటి రాజ్యాన్ని నిర్వహించటం అన్నది శ్రామికవర్గానికి సాధ్యమేనని ప్రపంచమంతటికీ నిరూపించిన మహానేత లెనిన్. మానవాళి చరిత్రలోనే ఒక నవశకాన్ని సృష్టించినవాడు లెనిన్. ఆ మహనీయుడు బోధించిన సిద్ధాంతాలూ, సూత్రాలూ, నాటి విప్లవ ఆచరణా నేటికీ అనుసరణీయమైన పరిష్కారమార్గంగా ప్రపంచం ముందు తిరుగులేని లక్ష్యంగా నిలచి వుంది.

లెనిన్ కేవలం రాజకీయ నాయకుడూ, సిద్ధాంతకర్త మాత్రమే కాదు. అన్ని విజ్ఞాన శాస్త్రాల్నీ మార్క్సిజం వెలుగులో ఆకళింపు చేసుకొన్న కార్మికవర్గ మేధావి. ఆయనకు రష్యన్ భాషతోపాటు జర్మన్, ఫ్రెంచి, ఇంగ్లీషు భాషలు క్షుణ్ణంగా తెలుసు. అందువల్ల ఆయన ప్రపంచమంతటి సమకాలీన సాహిత్యాన్నీ చదివి అర్థం చేసుకొన్నాడు. రష్యన్ భాషలోని ప్రాచీన కావ్యాలనూ, ఉత్తమ సాహిత్య గ్రంథాలను చదివాడు. కేవలం వాటిని చదివి అర్థం చేసుకోవటమే కాకుండా, ఆయా గ్రంథాల సామాజిక స్వభావాన్ని, విమర్శనాయుతంగా పరిశీలించి వాటిపట్ల విస్పష్టమైన అభిప్రాయాలను ఏర్పాటు చేసుకొన్నాడు. ఆయా సాహిత్య గ్రంథాలను సృష్టించటంలో, రచయితలకు గల రచనాశైలి, నేర్పరితనం కన్నా, వారు వ్యక్తం చేసిన సామాజిక ధోరణులను ఆయన నిశితంగా పరిశీలించాడు.

సాహిత్యం, ఆయా కాలాల నాటి సమాజాలకు దర్పణం అన్నది, ఆయన యొక్క నిశ్చితాభిప్రాయం. అలాగే రచయితలు ఆయా కాలాల నాటి సామాజిక పరిస్థితులను తమ రచనలలో ప్రతిబింబించారు, ప్రతిబింబిస్తారు కూడా అన్నది కూడా ఆయన అభిప్రాయం.

"పరిశుద్ధమైన కళ", "కళ కోసం కళ" లాంటి అసంబద్ధ వాదాలను ఆయన త్రోసిపుచ్చాడు. అదేవిధంగా ఆయన సాహిత్యం, కళలలో రూపవాదం కళావస్తువుకన్నా కళారూపానికే ఎక్కువ ప్రాధాన్యతను యిచ్చే సాంప్రదాయ సాహిత్య పద్ధతి కేవలం రసజ్ఞతత్వంలాంటి వాటిని తమ దేశపు ఉత్తమ సాహిత్య వారసత్వంగా అంగీకరించలేదు. వాటిని త్రోసి పుచ్చాడు. లెనిన్ కళ, సాహిత్యాలు ఒకసారి ప్రకటితమైన తర్వాత అవే ప్రజలవేనన్నాడు. వాటిని ప్రజలు స్వీకరించవచ్చు, విమర్శించవచ్చు, తిరస్కరించవచ్చు.

రష్యాలో 1905లో విప్లవం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో, లెనిన్ 'పార్టీ నిర్మాణం మరియు పార్టీ సాహిత్యం' అనే వ్యాసాన్ని వ్రాశాడు. ఆ వ్యాసంలో యీవిధంగా నొక్కి చెప్పారు :

శ్రామికవర్గ ప్రజాసాహిత్యం యొక్క ఉద్దేశ్యం (లక్ష్యం).... సాధారణంగా ఒక వ్యక్తి యొక్క వ్యక్తిగత వ్యవహారంగా కార్మికవర్గ ఆశయం (లక్ష్యంకు) నుండి విడివడిన ఒక స్వతంత్ర వ్యవహారంగా వుండలేదు. పార్టీ రహిత సాహితీవేత్తలను, సూపర్‌మెన్ సాహితీవేత్తలను సాహిత్యం యొక్క ఉద్దేశ్యం (లక్ష్యం), సాధారణ శ్రామికవర్గ ఆశయంలో ఒక భాగం చేయాలని కోరదాం. చలనంలో వున్న మన ఏకైక మహత్తర సోషల్ - డెమోక్రటిక్ యంత్రపు పళ్ళ చక్రంలోని పళ్ళు కావాలని ఆశిద్దాం.

సాహిత్యం గురించి లెనిన్ వెల్లడించిన యీ అభిప్రాయం, వివాదాస్పదంగా మారింది. దీనికి పలు రూపాలలో భాష్యం చెప్పబడింది. స్వేచ్ఛను బలంగా సమర్థించే కొందరు మేధావులు "సాహిత్య సృజన లాంటి సున్నితమైన వ్యక్తిగత విషయాన్ని సమష్టికి లోబరచటం అసాధ్యం" అంటూ లెనిన్ అభిప్రాయాన్ని వ్యతిరేకించారు.

ఆ సందర్భంగా లెనిన్ తాను యీ వ్యాసాన్ని కేవలం రాజకీయ సాహిత్యాన్ని గురించి, సోషలిస్టు, శ్రామికవర్గ ప్రజాసాహిత్య సాహిత్యకారుల గురించి మాత్రమే వ్రాశాననీ, యిది సాధారణ సాహితీవేత్తలను ఉద్దేశించి వ్రాసినది కాదనీ వివరించాడు.

ఆయన క్లారాజెట్కిన్‌తో పలు విషయాలపై మాట్లాడిన సందర్భంగా సాహిత్యాన్ని గురించిన తన అభిప్రాయాలను యిలా వివరించారు :

"వ్యక్తిగత ఆస్తిపై ఆధారపడ్డ సమాజంలో కళాకారుడు ఖాతాదారుల కవసరమైన మార్కెట్టు కోసం కళను, సాహిత్యాన్ని ఉత్పత్తి చేస్తాడు. విప్లవం మా కళాకారులను తీవ్రమైన వంచనాపూర్వకమైన పరిస్థితుల కాడినుండి విముక్తి చేసింది. నిజమే! ప్రతీ కళాకారుడికీ, తాము అటువంటివారిమని భావించే ప్రతి వ్యక్తికీ కళను, సాహిత్యాన్నీ స్వేచ్ఛగా సృజించే హక్కు, యితర విషయాలతో నిమిత్తం లేకుండా తన ఆశయాన్ని అనుసరించే హక్కు వుంది. కానీ మనం కమ్యూనిస్టులం మనం ఏం చేయకుండా చేతులు కట్టుకొని చూస్తూ, అస్తవ్యస్థత - గందరగోళాలు పెరిగిపోవటానికి కళ్ళెన్ని వదిలివేయకూడదు.

పార్టీకి భిన్నంగానే కాక, పార్టీపై దాడి చేసే వారి అభిప్రాయాలను ఖండించే బాధ్యత, స్వేచ్ఛ పార్టీకి వుంటుంది."

ఆయన పార్టీ సభ్యులకు యితర నైపుణ్యాల మాదిరిగానే, సాహిత్య సృజనా నైపుణ్యం వుంటే, వాళ్ళు తమ సేవలను, పార్టీకి విధిగా అంకితం చేయాలనీ వారు, పార్టీ దృక్పథానికి అనుగుణంగా వ్రాయాలనేవారు లెనిన్.

"కళను గురించిన మన అభిప్రాయం, లక్షలమంది జనాభాలో వున్న కొన్ని వందలమంది లేదా వెయ్యిమంది కళను గురించి ఏం అభిప్రాయపడుతున్నారన్నదానికన్నా కళ ప్రజలకు చెందినదన్నది ముఖ్యమైనది. దాని యొక్క వ్రేళ్ళను శ్రామిక జనావళిలోకి లోతుగా చొప్పించి పాదుకొనేట్లు చెయ్యాలి. కళను శ్రామిక జనావళి అర్థం చేసుకోవాలి, ప్రేమించాలి! అది వారిని ఐక్యం చేసి వారి యొక్క అనుభూతులను, ఆలోచనలను వారి యిష్టాన్నీ ఉన్నత స్థాయికి తీసుకెళ్ళాలి. అది వారి కార్యాచరణను కదిలించి, వారిలో వున్న కళాప్రవృత్తిని పెంపొందించాలి. ఇది మొత్తం కళ, సంస్కృతుల యొక్క రంగానికంతా వర్తిస్తుంది." అంటూ ఆయన క్లారా జట్కిన్‌తో కళ – సాహిత్యాలకు సంబంధించిన తన అభిప్రాయాలను వివరించారు.

కళ, కళ కోసం అని చెప్పటమంటే, సామాజిక సంఘర్షణ మార్గం నుండి తప్పించుకొని బయటపడి, చేతులు కడిగేసుకొని, అన్నిరకాల సామాజిక అన్యాయాలను విస్మరించి అణచివేతదారులకు మార్గాన్ని వదిలివేసి, మవునంగా, అణచివేయబడ్డవారిని నలిపివేయటానికి రహస్యంగా అంగీకరించటమే అవుతుంది అని లెనిన్ స్పష్టం చేశారు.

బూర్జువా రచయితలు తటస్థంగా వుండటం లేదా ఏ రాజకీయాలు లేకుండా ఉన్నామని చెప్పే అంశాన్ని గురించి లెనిన్ వివరిస్తూ, వాస్తవంగా వారు ఏ రాజకీయాలు లేకుండా వున్నవారు కారు. కాకపోతే వారు బూర్జువా పరిపాలనను కూలదోయాలని భావించటంలేదు. ఆ రచయితలు తమకు గల ప్రత్యేక హక్కులను, ప్రత్యేక అధికారాలను, సదుపాయాలను, సౌకర్యాలను – అవి పాదార్థికమైనవి కాకపోయినా, వాళ్ళ యొక్క గర్వం, ఆడంబరం, అహంకారాలను భట్రాజు పొగడ్తలతో పైకెత్తేవే కావచ్చు – ఎంతో జిత్తులమారి తనంతో ఆ రచయితలను తమ నియంత్రణలో నిలుపుకోవటం కోసం బూర్జువా పాలకులు యిచ్చిన యీ ప్రత్యేక హక్కులను, సదుపాయాలను సౌకర్యాలను కాపాడుకోవటం కోసమే ఆ బూర్జువా రచయితలు అలా తమకు ఏ రాజకీయాలు లేవని చెప్పుకొంటున్నారనీ" చెప్పారు.

బూర్జువా – వ్యక్తివాదులైన రచయితలు చెప్పే 'పరమ స్వేచ్ఛ' గురించి మాట్లాడుతూ, "మీరు 'పరమస్వేచ్ఛ' గురించి యిచ్చే ఉపన్యాసాలు కేవలం వంచన, బూటకం మాత్రమేనని మేము చూపించుతాము. డబ్బు యొక్క శక్తి – అధికారాలపై స్థాపించబడ్డ సమాజంలో శ్రామిక జన బాహుళ్యం, పేదరికం వాతపడి మ్రగ్గిపోతూంటే, కేవలం ఒక గుప్పెడుమంది మాత్రమే ఐశ్వర్యంతో పరాన్నభుక్కులుగా తులతూగుతున్న సమాజంలో వాస్తవికమైన, నిజమైన 'స్వేచ్ఛ' అన్నది వుండదు. అయ్యా రచయితగారూ, మీరు మీ బూర్జువా ప్రచురణకర్త నుండి స్వేచ్ఛగా, స్వతంత్రంగా వున్నారా? లేదా చిత్రాలలో బూతునూ, అశ్లీలాన్నీ లేదా పవిత్రమైన రమణీయమైన కళకు, పడుపువృత్తిని అదనంగా డిమాండు చేసే బూర్జువా ప్రజానీకం నుండి మీకు నిజమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్యా లున్నాయా? ఖచ్చితంగా యీ పరమ స్వేచ్ఛ అన్నది ఒక బూర్జువా లేక అరాచకవాద పదబంధం. ఒక సమాజంలో జీవిస్తూ, ఆ సమాజం నుండీ స్వేచ్ఛగా, స్వతంత్రంగా వుండటమన్నది అసాధ్యం. బూర్జువా రచయిత, కళాకారుడు, నటి మొదలగువారికున్న స్వేచ్ఛ కోసం కేవలం డబ్బు సంచిపైన, అవినీతిపైన ఆధారపడి వున్న దానికి తొడగబడిన వంచనాపూర్వకమైన ముసుగు మాత్రమే!" అని బూర్జువా కళాకారుల స్వేచ్ఛ యొక్క స్వభావపు గుట్టును విప్పి బట్టబయలు చేశాడు లెనిన్.

ప్రతీ విషయం వర్గ సంఘర్షణ యొక్క ప్రభావాలకు గురి కావల్సిందేననీ, అన్నిటికన్నా మించి అత్యంత ప్రభావవంతంగానూ, వివిధ రకాల పద్ధతుల ద్వారా బలవంతంగా తన అభిప్రాయాలను ఒప్పించే, ఒత్తిడి చేయటం ద్వారా నియంత్రణను సాగించే పాలకవర్గం యొక్క ప్రభావానికి సాహిత్యంతోసహా ప్రతి విషయం గురి అవుతుందని లెనిన్ తెలియజెప్పారు.

1908లో లెనిన్ తాను వ్రాసిన "రష్యన్ విప్లవానికి ఒక దర్పణంలా లియో టాల్‌స్టాయ్" అన్న వ్యాసంలో టాల్‌స్టాయ్ యొక్క అభిప్రాయాలలోని వైరుధ్యాలు, నాటి వైరుధ్యపూరిత పరిస్థితుల్లో, విప్లవంలో రైతాంగం పోషించవల్సిన విప్లవ పాత్రకు దర్పణమేననీ.... టాల్‌స్టాయ్ దృక్పథం మొత్తంగా తీసుకొంటే అవి రష్యన్ విప్లవపు నిర్దిష్ట లక్షణాలను వక్రీకరించాయనీ, ఆ విప్లవాన్ని ఒక రైతాంగ బూర్జువా విప్లవంగా వ్యక్తీకరించాయనీ, అయితే మరోవైపు లొంగిపొమ్మని చెప్పే ఒక తలతిక్కలోడి బోధనగా "దుర్మార్గాన్ని హింసతో ప్రతిఘటించకు" అని చెప్పే బోధనగా లియో టాల్‌స్టాయ్ అభిప్రాయం వుందని" లెనిన్ విమర్శిస్తాడు.

లెనిన్ అభిప్రాయంలో "భావవ్యక్తీకరణవాదం" (ఎక్స్‌ప్రెషనిజం) "భవిష్యవాదం" (ఫ్యూచరిజం), "రేఖాచిత్రకళావాదం" (క్యూబిజం) లేదా యితర ఆధునిక కళారీతులు, అత్యున్నతమైన అసాధారణమైన కళా ప్రతిభ యొక్క వ్యక్తీకరణలు కానే కావు.

ఆయన సెన్సార్‌షిప్ (ప్రచురణలపై నిషేధం) గురించి మాట్లాడుతూ, పెట్టుబడిదారీ సమాజం సాహిత్యం మీద రెండు రకాల నిషేధాన్ని ఉపయోగిస్తుంది. ఒకటి : బహిరంగంగా ప్రత్యక్షంగా – రాజద్రోహ, నిందాలేఖన చట్టాలు మరియు లైబ్రరీలపైన సెన్సార్‌షిప్, చర్చి సెన్సార్‌షిప్ రూపంలోనూ, రెండవది : మరింత నిగూఢమైన ప్రమాదకరమైన సెన్సార్‌షిప్ అంటే సమాజంలోని ప్రతీ జీవన దశ యొక్క అట్టడుగున వున్న వాణిజ్యపరమైన సంబంధాలు నిర్ణయించే సెన్సార్‌షిప్ అనీ ఆయన తెలియజేశారు. కార్మికవర్గం మాత్రమే యీ రెండు రకాల సెన్సార్‌షిప్‌ను బద్దలుకొడుతుందనీ, ఒక నిజమైన స్వేచ్ఛాయుతమైన పత్రికా (వార్తా) రంగాన్ని బోల్షివిక్‌లు సృష్టించదలచారనీ, ఆ స్వేచ్ఛా వార్తారంగం కేవలం, పోలీసుల సెన్సార్‌షిప్ నుండి అన్న అర్థంలోనే కాక, పెట్టుబడి నుండి స్వేచ్ఛ అన్న అర్థంలో, కెరీరిజం నుండి స్వేచ్ఛతో : అంతేకాదు : బూర్జువా – అరాచకవాద వ్యక్తిగతవాదం నుండి స్వేచ్ఛతో వుంటుందని లెనిన్ ప్రకటించారు.

రష్యా దేశపు మేధోపర జీవితాన్ని సంక్షేపిస్తూ లెనిన్, రష్యాదేశపు సాహిత్యాన్ని, రష్యాదేశం యొక్క విప్లవ అభివృద్ధి క్రమం నుండి విడదీసి అర్థం చేసుకోలేమని చెప్పారు. ఆయన హెర్జెన్‌ను గౌరవించటం గురించి వ్రాస్తూ, "రష్యన్ విప్లవంలో మూడు తరాలు, మూడు వర్గాలు పనిచేసా యన్నది స్పష్టంగా కన్పిస్తుందనీ, డిసెంబరిస్టులు హెర్జెన్‌కు స్ఫూర్తినిచ్చానీ, దానితో ఆయన విప్లవకర ఆందోళన ప్రారంభించారనీ, ఆ ఆందోళనను విప్లవకర మేధావుల వశం చేసుకొని దానిని విస్తృతపరిచి, బలపరచి, దృఢతరం చేశారనీ, పోరాటయోధుల సమూహం విస్తృతమై, ప్రజలతో సంబంధాలు మరింత దగ్గర అయ్యాయని లెనిన్ తెలిపారు.

అక్టోబర్ విప్లవం విజయవంతమయ్యేనాటికి (1917) రష్యాలో విప్లవానికి పూర్వం వున్న ప్రతిభ గల రచయితల్లో చాలామంది పశ్చిమ దేశాలకూ హార్బిన్, జపాన్‌లకూ పారిపోయారు. నాటి సాహిత్యరంగాన్ని, యితర సిద్ధాంతాలు లేదా ఉద్యమాలకు చెందిన నూతన భావాలు ఆక్రమించాయి. వీరందరూ సారాంశానికన్నా రూపానికే ప్రాధాన్యత నిచ్చారు. సాహిత్యం, పదబంధాల ప్రయోగం యొక్క విశిష్టతపైనే సాగుతోంది. సాహిత్యం యొక్క కళాత్మక విలువల విమర్శ అనేది వివిధరకాల వ్యక్తీకరణ పద్ధతులనే పట్టించుకొంది. సాహిత్యాన్ని గురించిన యీ అభిప్రాయాలతో సింబాలిష్టులు (ప్రతీకాత్మక రచయితలు), రిథమిష్టులు, ఫ్యూచరిస్టులు (భవిష్యత్వాదులు) ఏకాభిప్రాయం కల్గి వున్నారు. 1916లో ఒక ఉద్యమంగా సంఘటితపడిన ఫార్మలిష్టులు సాహిత్యంలో 'ప్రగతిశీల ఆలోచనలకు' ప్రతినిధులుగా చలామణీ అవుతున్నారు. మరోవైపు 1910లోనే గోర్కీ, లూనాచార్స్కీలను కలిపి బొగడనోవ్ అనే స్వతంత్ర బోల్షివిక్ కేప్రీలో ప్రొలెట్‌కల్ట్ అనే పార్టీ పాఠశాలను స్థాపించారు. సాహిత్య విషయాలలో ఒక 'క్రొత్త' శ్రామికవర్గ సంస్కృతిని బోధిస్తూ, 'కార్మికవర్గ శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందిస్తానని' వాదిస్తూ పనిచేసింది. లెనిన్ ఈ ధోరణులను ఖండించాడు. ఈ ప్రొలెట్‌కల్ట్ అనే సంస్థ, బొగడనోవ్ నాయకత్వంలో, తమది పూర్తిగా కేవలం శ్రామికవర్గం కోసం మాత్రమే ఏర్పాటు చేయబడిన సంస్థ అనీ, తమ సంస్థ ఒక రాజకీయ, ప్రచార సంస్థగా పార్టీకన్నా (బోల్షివిక్) కూడా పురోగమించిందనీ చెప్పుకుంటోంది. అంతేకాక శ్రామికవర్గ రచయితలను 'తక్షణ సోషలిస్టులు' అంటూ మార్క్సిస్టు విప్లవ సిద్ధాంత సూత్రాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. ఈ సిద్ధాంతాలు గతకాలపు సంస్కృతి యొక్క ప్రాముఖ్యతను నిరాకరించాయి. అంతేకాక ఒక నూతన సంస్కృతి నిర్మాణంలో రైతాంగం పాల్గొనటాన్ని నిరాకరించాయి.

ఈ ధోరణులను వ్యతిరేకిస్తూ లెనిన్ "శ్రామికవర్గ సంస్కృతి అన్నది తప్పనిసరిగా, "భూ యజమానుల, నిరంకుశాధికారుల, పెట్టుబడిదారుల సమాజం కాడిక్రింద నలుగుతూ ప్రోగుబడిన, నిల్వచేయబడిన మానవజాతి యొక్క జ్ఞానం యొక్క హేతుబద్ధమైన అభివృద్ధిగా వుండాలి" అని స్పష్టం చేశారు. అంతే తప్ప శ్రామికవర్గ సంస్కృతి అన్నది, ఎక్కడనుంచో తెలియని చోటు నుండి హఠాత్తుగా ఊడిపడేది కాదనీ, శ్రామికవర్గ సంస్కృతి నిపుణులుగా ఏర్పడినవారిచే కనుక్కోబడినది కాదు అని వివరించారు. ఆ రకంగా సాహిత్యం అన్నది గతం యొక్క కొనసాగింపు అన్న విషయాన్ని ఆయన స్పష్టపరిచారు. విప్లవ పూర్వక సాహిత్య విలువలకు, సాంప్రదాయాలకు అనుగుణమైన గుర్తింపునివ్వాలన్నది ఆయన అభిప్రాయం.

ఒక గొప్ప సాహిత్య విమర్శకుడిగా, లెనిన్ సాహిత్యం పట్ల విలువైన సూత్రీకరణలను అందించారు.

ప్రపంచమంతటినీ పెట్టుబడిదారీ పతన సంస్కృతీ, అభిప్రాయాలూ, సాహిత్యం ఆవరించిన నేటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో, అసలైన – అవసరమైన సాహిత్య సృజన గురించి లెనిన్ చేసిన సూత్రీకరణలు మరింతగా వర్తిస్తాయి.

కామ్రేడ్ లెనిన్ శతవర్ధంతి సందర్భంగా నివాళులర్పించే సాహితీవేత్తలూ, ప్రజాసాహిత్య సృజన కోసం కృషిచేస్తున్న రచయితలూ, ప్రజాసాహిత్యాన్ని కోరుతూ దాని అభివృద్ధిని కాంక్షించేవారూ, లెనిన్ సాహిత్యాన్ని గురించి వెల్లడించిన యీ అభిప్రాయాలను తెలుసుకొని, గుర్తు చేసుకొని, కార్యాచరణకు వాటిని మార్గదర్శకంగా పెట్టుకోవటం నేడు అత్యావశ్యకం.

పాట

## లెనిన్ - నీకు జోహారులు

– జీవన్

**లెనిన్** - నిన్ను తలచుకొంటె మరో జగతి ఓలలాడు
లెనిన్ - నిన్ను స్మరిస్తే చైతన్యం ఉప్పొంగును
మార్క్సును మహనీయుని - నిజమైన వారసుడా
చరిత్ర గమనాన్నీ - మార్చినట్టి యోధుడా

ప్రజల చుట్టు చరితను - తిప్పినట్టి ధీరుడా
మార్పు చెందు సమాజం - గుట్టు విప్పిన తాత్త్వికుడా
శ్రామికవర్గానికీ - పదునైన ఆయుధమా
ప్రజల విప్లవాలకు - నిర్వచనం నీవయా

ప్రపంచీకరణ నేడు - పెనుమాయగ మారెను
ఎల్ల దేశాలను - కొల్లగొట్టు నైజము
నీ బోధలు మాకెపుడూ దివిటీలుగ నిలిచీ
పరిష్కార మార్గాలను - చూపించి తీరును

అన్యాయం అణచివేత - ఉన్నంతకాలము
సదా నీవు నిలుస్తావు - మార్గదర్శివవుతావు
జోహారూ లెనిన్ నీకు - జోహారులయ్యా
అరుణారుణ జోహారూలర్పింతుము మేము

పుస్తక పరిచయం

# లెనిన్ జీవితాన్నీ, రష్యా విప్లవాన్నీ పరిచయం చేసిన 'మన లెనిన్'

- ప్రసన్న

*సామాజిక న్యాయ సాధన కోసం తన శక్తినంతా వెచ్చించిన, తనను తాను పూర్తిగా త్యాగం చేసుకున్న - వ్యక్తిగా లెనిన్‌ని నేను గౌరవిస్తాను. అతని పద్ధతులు ఆదర్శప్రాయమని నేను భావిస్తున్నప్పటికీ, ఒక విషయం మాత్రం స్పష్టం. అలాంటి మానవులే మానవత్వం యొక్క అంతస్సారానికి సంరక్షకులు.* **- ఆల్బర్ట్ ఐన్ స్టీన్**

**మానవ** సమాజం యొక్క సహజ పరిణామ క్రమాన్ని సిద్ధాంతీకరించి, మరిన్ని ముందడుగులు వడివడిగా వేయించేందుకు అవసరమైన వర్గపోరాట సిద్ధాంతాన్ని ఒక ఆయుధంగా మలచి ఆ ఆయుధంతో కార్మిక వర్గాన్ని సాయుధం చేసిన మహామహోపాధ్యాయులు మార్క్స్, ఎంగెల్స్‌లు. పారిస్ కమ్యూన్ నుండి పొందిన గుణపాఠాలతో ఆ సిద్ధాంతాన్ని మరింత ఉన్నతీకరించి, ఆచరణలో పెట్టి, ప్రపంచంలోనే తొట్టతొలి నిర్మాణాత్మక శ్రామికవర్గ రాజ్యాన్ని సాకారం చేసిన మరో మహామహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్. వారు ఆచరణలో పెట్టింది వర్గపోరాట సిద్ధాంతాన్నే అయినా, అది మొత్తం మానవాళి పురోగమనానికి మార్గం కాబట్టి మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోలను మొత్తం మానవజాతి స్వంతం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ పుస్తకానికి 'మన లెనిన్' అని పేరు పెట్టారు రూత్ షా.

'లెనిన్ ఫర్ చిల్డ్రన్' పేరుతో సోవియెట్ రష్యా ప్రచురించిన బొమ్మల పుస్తకాన్ని అమెరికన్ పిల్లల కోసం 'అవర్ లెనిన్' పేరుతో రూత్ షా అనువదించారు. లెనిన్ సోదరి జ్ఞాపకాల ద్వారా లెనిన్ బాల్యపు సంగతులు కొన్ని హ్యారీ అలాన్ పొటమ్కిన్ ఈ పుస్తకంలో చేర్చారు. తుమ్మల వెంకట్రామయ్య తెలుగులోకి అనువదించగా 07/1942, 11/1943లలో ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ పత్రిక 'ప్రజాశక్తి' రెండుసార్లు ముద్రించింది. తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ 02/2017లో తరిమెల నాగిరెడ్డి శతజయంతి ప్రచురణగా నేటి తరం కోసం మరోసారి ప్రచురించింది. ముందుమాటలో కామ్రేడ్ శ్రీహరి చెప్పినట్లు "వ్లాదిమిర్ క్రమంగా లెనిన్‌గానూ, రష్యా జాతిపితగానూ మారిన క్రమం రేఖా మాత్రంగా ఈ పుస్తకంలో కనిపిస్తుంది. లెనిన్ గురించి తెలుసుకోవడమంటే రష్యా విప్లవ చరిత్ర తెలుసుకోవడమే కాబట్టి లెనిన్ జీవితం గురించి ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవాల్సింది మిగిలే ఉంటుంది".

ఓల్గా నది ఒడ్డున ఉన్న సింబర్స్క్ (నేటి యుల్యనావస్క్) నగరంలో ఒక పాఠశాలల పర్యవేక్షకుని కుమారునిగా జీవితాన్ని ప్రారంభించిన వ్లాదిమిర్‌ను ఆనాటి సామాజిక పరిస్థితులు శ్రామిక వర్గ విప్లవకారుల అగ్రగామి నాయకుడైన లెనిన్‌గా ఎలా మలచాయో, ఆ పరిణామ క్రమాన్ని మన కళ్ళముందుంచుతుంది ఈ పుస్తకం. వ్లాదిమిర్ (లెనిన్)కి పదేళ్ళ వయస్సు ఉన్నప్పటి నుండి ఈ పుస్తకం ప్రారంభమౌతుంది.

మాస్కోకి తూర్పుగా 700 కి.మీ. దూరాన ఉన్న సింబర్స్క్‌లోని ఒక నేతమిల్లులో కార్మికులుగా వీరా(లెనిన్ చిన్ననాటి స్నేహితురాలు) తల్లిదండ్రులిద్దరూ పనిచేస్తుంటారు. ఎముకలు కొరికే చలి వాతావరణంలో తమ చిన్నారి కూతురు వీరాకి కనీసం చెప్పులూ, చలి కోటూ కూడా కొనివ్వలేనంత పేదరికంతో ఆ కుటుంబం బతుకులీడుస్తుంటుంది. అదే నగరంలో ఆ మిల్లు యజమానుల పిల్లలు సకల సౌకర్యాలతో విలాసవంతంగా బ్రతకడం కూడా చూశాడు చిన్నారి వ్లాదిమిర్. అంతేకాదు. యజమాని భార్యకి కొత్త ఫర్ కోటు కావాలంటే కార్మికులు మరో గంట అదనంగా పని చేయాలి. యజమాని కూతురికి కొత్త ఫ్రాక్ కావాలంటే కార్మికులు మరింత తక్కువ జీతాలతో సరిపుచ్చుకోవాలి. ఇలాగైతే తమ బిడ్డలకు కడుపునిండా తిండి కూడా పెట్టలేమని గ్రహించిన కార్మికులు జీతం పెంచమని కోరారు. యజమాని ఒప్పుకోకుంటే సమ్మె చేసి జైళ్ళ పాలయ్యారు.

కౌలురైతులైన ఇవాన్ (లెనిన్ స్నేహితుడు) కుటుంబం తినడానికి తమకే సరిగా ఆహారం లేకున్నా, తమకున్న ఒక్క గదిలోనే ఉంటూ తమతో పాటు ఎంతో ప్రేమగా పెంచుకున్న ఆవును, కౌలు బాకీ కింద భూస్వామి తోలుకెళ్ళడం, భూస్వామికి మాత్రం అనేక అందమైన భవనాలు ఉండటం చూశాడు. పంటలు పండని సంవత్సరాలలో తమ పిల్లలు పస్తులుంటుంటే, భూస్వామి గరిసెల్లో నిలవ ఉన్న, తమ నుండే గుంజుకుపోయిన ధాన్యాన్ని ఇవ్వమని అడిగినందుకు కొరడా దెబ్బలు, జైళ్ళు దక్కాయి రైతులకి.

ఇలా శ్రామికవర్గ ప్రజల జీవితాలను చిన్ననాటి నుండే అత్యంత దగ్గరగా గమనిస్తూ, వారి జీవితాలతో లెనిన్ ఉద్వేగానికి గురైన తీరును కళ్ళకు కట్టినట్టు చిత్రించారు రచయిత.

సమాజాన్ని మార్చాలని విప్లవమార్గం పట్టిన తన అన్న సాషా (అలెగ్జాండర్) వ్లాదిమిర్‌కి ఆదర్శం. అంతేకాదు, ఆయనతో కలిసి చదరంగం ఆడేవాడు. అక్కడి శ్రామికవర్గ ప్రతినిధులతో సమావేశాలలో

పాల్గొనేవాడు. అన్నంటే వ్లాదిమిర్‌కి ఆరాధన. వ్లాదిమిర్ పదహారేళ్ళ వయసులో అన్నతోపాటు తన తండ్రిని కోల్పోయాడు. పదిహేడేళ్ళ వయసులో తాను అమితంగా ఆరాధించే అన్నని పాలకులు ఉరి తీసారు. అక్క ప్రవాస శిక్షకి గురైంది. అలాంటి పరిస్థితుల్లో అమ్మకి అండగా వ్లాదిమిర్ నిలబడ్డాడు. మార్చ్ ఉత్సవం సందర్భంలో తన వల్ల చనిపోయిన పక్షిని చూసి మరెప్పుడూ పక్షులను బంధించకూడదని నిర్ణయం తీసుకున్నాడు.

కజాన్ విశ్వవిద్యాలయంలో చదువుతూ, విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించినందుకుగాను ప్రవాస శిక్షకు గురయ్యాడు. అలా తన అక్క, తన బాల్యమిత్రుడు ఇవాన్‌లతో కలిసి తన తాతగారి ఊరైన కొకుష్కినోలో మూడు సంవత్సరాల పాటు ఉండి రైతాంగంతో మమేక మయ్యాడు. ఒక మహోన్నత లక్ష్యం కోసం జీవితాన్ని త్యాగం చేసినప్పటికీ, తన అన్న ఎంచుకున్న మార్గం సరైనది కాదని అర్థం చేసుకున్నాడు. శ్రామికవర్గ విముక్తికి సరైన మార్గం కోసం తన వెతుకులాటలో భాగంగా పద్దెనిమిదేళ్ళ పసిప్రాయంలోనే మార్క్సిజాన్ని అధ్యయనం చేశాడు. ప్రవాస శిక్ష పూర్తయ్యాక సెయింట్ పీటర్స్ బర్గ్ వెళ్లి న్యాయశాస్త్రంలో పట్టా పొందాడు. కానీ ఆయన దృష్టి అంతా కార్మికుల కడగండ్ల మీదనే ఉంది. లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తూనే, కార్మికుల మధ్య పనిచేయడం మొదలుపెట్టాడు. ఇవాన్ ద్వారా రైతాంగ స్థితిగతులను తెలుసుకుంటూనే ఉన్నాడు. 23 సంవత్సరాల వయస్సులో తన తొలి రచన "రైతాంగ జీవితంలో నూతన ఆర్థిక పరిణామాలు" పూర్తి చేశాడు.

తాను పీటర్స్‌బర్గ్‌లో ఉంటూనే సింబర్స్క్ కార్మికులతో వీరా ద్వారా సజీవ సంబంధం నెరపాడు. పోలీసుల నుండి తప్పించుకోవడానికి కార్మికవర్గ కార్యకర్తలందరూ మారుపేర్లు పెట్టుకున్నారు. అలా వ్లాదిమిర్ పెట్టుకున్న పేరే ఎన్. లెనిన్. శత్రువుకు తమ సందేశాలు అర్థం కాకుండా సాంకేతిక పదాలు–రహస్య సిరా వాడేవారు. జైలులో యిచ్చే రొట్టెలనే సిరా బుడ్లుగా, పాలనే సిరాగా ఉపయోగించేవారు. పుస్తకాలలో ముద్రితమైన వరుసల మధ్య ఉన్న ఖాళీలో సందేశాలు, కరపత్రాలు వ్రాసి బయటకు పంపేవాడు. 1895 సమ్మె సందర్భంగా అరెస్టయి ఒక సంవత్సరం జైలు జీవితం తర్వాత సైబీరియా ప్రవాసానికి పంపబడ్డాడు.

లెనిన్ ప్రవాసంలోనే తనతో పాటు శిక్ష అనుభవిస్తున్న క్రుపస్కయాను వివాహం చేసుకున్నాడు. అక్కడ ఖాళీ సమయాల్లో స్కేటింగ్, చదరంగం ఆడేవాడు. దాదాపు మూడు వేల ఏడు వందల కిలో మీటర్ల దూరంలో ప్రవాసంలో ఉండి కూడా కార్మిక వర్గానికి సందేశాలు పంపాడు. గైడ్ చేసాడు. మూడేళ్ళ ప్రవాసం తర్వాత రష్యాకు వచ్చి రష్యాలో సోషల్ డెమొక్రటిక్ పార్టీని స్థాపించాడు. జారు గూఢచారుల వల్ల పని చేయడం కష్టంగా ఉండేది. దీంతో జర్మనీ వెళ్లి 'ఇస్క్రా' పత్రిక స్థాపించారు. అనేక మంది కార్మికులు జర్మనీ వెళ్లి లెనిన్‌ను కలిసి సలహాలు – సూచనలు తీసుకుని, వాటిని ఆచరణలో పెట్టేవారు.

చైనా రేవు పట్టణం మీద అదుపు కోసం రష్యా–జపాన్ యుద్ధం మొదలైన తర్వాత జనంలో యుద్ధోన్మాదాన్ని పెంచడానికి, పాలకుల లాభాల కోసం జరుగుతున్న యుద్ధంలో తమను తాము త్యాగం చేసుకునే విధంగా వారిని రెచ్చగొట్టడానికి శత్రు దేశం మీద పాలకులు పుట్టించే పుకార్లు, చేసే ప్రచారం చదువుతుంటే నేటి భారతదేశ పాలకవర్గపు ఎత్తుగడలు కొత్తవేమీ కాదని మనకు అర్థం అవుతుంది. ఎవరి కోసమో జరుగుతున్న యుద్ధం వల్ల శ్రామికవర్గం తమ కష్టార్జితంతో పాటు, ప్రాణాలు కూడా పోగొట్టుకోవడాన్ని సహించలేని కార్మికులు, రైతులు క్షామ నివారణ కోసం డిమాండ్ చేస్తూ జార్ వద్దకు చేరితే, వారికి ఎదురైన తూటాలు అప్పటివరకూ వారికి జార్ మీద అంతో ఇంతో ఉన్న భ్రమలను పటాపంచలు చేసాయి. ఎక్కడో జర్మనీలో ఉన్న లెనిన్ ఈ పరిస్థితుల్లో కార్మిక కర్షక వర్గాలెలా స్పందించాలో బోధించడం, అయన సూచనలు రష్యన్ శ్రామిక వర్గపు అంతఃచేతనను ప్రతిబింబించడం చూస్తుంటే, ఎంత దూరంలో ఉన్నా, ఆనాటికి సమాచార అవకాశాలు ఇప్పటిలా లేకున్నా తన శ్రేణులతో లెనిన్ ఎంత మమేకమై ఉన్నాడో అర్థం అవుతుంది.

కార్మికవర్గ పోరాటాలు పెరుగుతుంటే ఆ ధైర్యంతో, ఆ ప్రేరణతో రైతులు భూస్వాముల మీద ఎలా తిరగబడుతారో, రైతు పోరాటాలు నిర్బంధానికి గురైనప్పుడు వారు ఎలా సంఘటితమై పోరాటాన్ని కొనసాగిస్తారో చాలా స్పష్టంగా ఈ పుస్తకంలో తెలుసుకోవచ్చు. కార్మికవర్గం నిశ్చయాత్మక పోరాటానికి సిద్ధం కాగానే లెనిన్ రష్యా చేరుకొని ఆ పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఆ పోరాటం ఓడిపోయినా, రెట్టింపు విశ్వాసంతో తిరిగి వారిని లెనిన్ ఆర్గనైజ్ చేయటం, అందుకు తన జీవితాన్ని ఎంత ప్రమాదంలో పెట్టుకున్నాడో చదువుతుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. నిర్బంధం నుండి తప్పించుకుని కార్మికులను అర్గనైజ్ చెయ్యడానికి ఈసారి ఫిన్లాండ్, అక్కడినుండి స్విట్జర్లాండ్ వెళ్లి అక్కడ నుండి 9 సంవత్సరాల పాటు రష్యన్ కార్మికోద్యమానికి నాయకత్వం వహించాడు. అక్కడ ఒక రాజకీయ పాఠశాల పెట్టి రష్యా నుండి వచ్చిన కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి పంపేవాడు. అలా నిర్మితమైంది బోల్షివిక్ పార్టీ. ఈ నేపథ్యంలో లెనా బంగారు గని కార్మికులపై పేలిన తుపాకి రష్యన్ కార్మిక వర్గాన్ని మళ్ళీ సమ్మె బాట పట్టించింది.

కరెన్సీని సామ్రాజ్యవాదులకు ప్రతినిధులుగా వర్ణిస్తూ ఈ పుస్తకంలో చెప్పిన విధానం చాలా బాగుంది. బెర్లిన్‌లోని హెర్ మార్క్‌గారు, పారిస్‌లోని ఎం.ఫ్రాంక్‌గారు, లండన్‌లోని లార్డ్ పౌండ్‌గారు, యునైటెడ్ స్టేట్స్‌లోని మిస్టర్ డాలర్‌గారు చౌక కూలీల కోసం, మార్కెట్ కోసం, బంగారం కోసం పోటీ పడి ప్రారంభించిన యుద్ధంలో సైనికులుగా ఈడ్చుకు పోబడిన కార్మికులు–కర్షకులు యుద్ధ బీభత్స దృశ్యపు మధ్యలో నిలబడి తమను తాము ప్రశ్నించుకోసాగారు.. "ఎందుకోసం మనమంతా చనిపోతున్నాము?". తమ అంతరంగపు ఈ ప్రశ్నకి లెనిన్ జవాబిచ్చాడు.. "ధనికుల లాభాల కోసం మీరు చచ్చిపోతున్నారు". "అన్ని దేశాల కార్మికులందరూ ఏకమవ్వండి. ఈ యుద్ధాన్ని విప్లవంగా మార్చండి". ఈ సమాధానంతో మాతృభూమి కోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడు తున్నామనే వారి భ్రమలన్నీ పటాపంచలయ్యాయి. "సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి." అనే లెనిన్ పిలుపుని ఆచరణలో పెట్టి ఫిబ్రవరి విప్లవాన్ని విజయవంతం చేశారు. జార్ శకం ముగిసి నప్పటికీ రష్యన్ ధనికులే ఇంకా అధికారం చలాయిస్తున్నారు. వెంటనే స్విట్జర్లాండ్ నుండి బయలుదేరాడు లెనిన్. కార్మిక సాయుధ సోవియట్లు

అధికారం హస్తగతం చేసుకునేంత వరకు విప్లవం ఆపవద్దని పిలుపు నిచ్చాడు. కార్మికవర్గాన్ని ముందుకు నడిపాడు, సైన్యం కూడా కార్మిక వర్గంతో జతకలిసింది. ఎట్టకేలకు 1917 నవంబర్ 7న శ్రామిక రాజ్య స్వప్నాన్ని సాకారం చేశాడు లెనిన్. సోవియట్లను నాశనం చేయడానికి ప్రయత్నించిన మూడు తలల వైట్స్ రాక్షసిని రెడ్ ఆర్మీ అణగదొక్కింది. సోవియట్ రష్యా స్ఫూర్తితో అనేక దేశాలలో కమ్యూనిస్ట్ పార్టీలు ఏర్పడ్డాయి. ఈ పార్టీలన్నీ కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌గా ఒక్కటయ్యాయి.

రష్యా సంపదలు తమ చేతినుండి జారిపోవడం తట్టుకోలేని, శ్రామిక విప్లవం తమ దేశాలకు కూడా వ్యాపిస్తుందని భయపడ్డ హెర్ మార్క్, ఎంఫ్రాంక్, లార్డ్ పౌండ్, మిస్టర్ డాలర్లు లెనిన్‌నూ, రష్యానూ క్రూరులుగా, హింసావాదులుగా చిత్రిస్తూ ప్రచారం మొదలెట్టారు. లెనిన్‌పై తుపాకీ కాల్పులు జరిపించి, హత్యాయత్నం చేయించారు. సైబీరియా ప్రవాసపు ప్రభావం ఒకవైపు, తుపాకి గుండ్ల గాయాలు మరోవైపు వేధిస్తుండగానే వీటిని లెక్కచేయకుండా, తన ఆరోగ్యంపై శ్రేయోభిలాషుల హెచ్చరికలను ఖాతరు చేయకుండా శ్రామికవర్గ సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించాడు కామ్రేడ్ లెనిన్. ప్రపంచ శ్రామికవర్గ విముక్తి కోసం తన జీవితాంతం శ్రమించి తీవ్రంగా అలసిపోయిన కామ్రేడ్ లెనిన్ అనారోగ్యంతో 1924 జనవరి 21న, ఇప్పటికి సరిగ్గా వందేళ్ళ క్రితం "విప్లవం చిరస్థాయి అగుగాక" అనే తన నినాదాన్ని, శ్రామికవర్గ పతాకాన్నీ మనకందించి శాశ్వత విశ్రాంతిలోకి వెళ్ళిపోయారు.

లెనిన్ అమరత్వం నాటికి సోవియట్ రష్యా సాధించిన ప్రగతిని ఆయన చిన్న నాటి కాలంతోనూ, అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాల వర్తమానంతోనూ పోల్చి వ్రాసిన చివరి భాగం మొత్తం పుస్తకానికే తలమానికం. శ్రామికవర్గ పాలనను అంతం చెయ్యాలనే సామ్రాజ్యవాదుల కలలు ప్రస్తుతానికి నిజం అయ్యి ఉండవచ్చు. కానీ 1905 విప్లవ పరాజయం అనంతరం "అధైర్యపడవద్దు – ఈ అంధకారం వెళ్ళిపోతుంది. శ్రామిక వర్గ విప్లవం తిరిగి జయిస్తుంది." అన్న కామ్రేడ్ లెనిన్ భరోసా సాక్షిగా.. వారి ఈ విజయం తాత్కాలికం మాత్రమే అనే విశ్వాసాన్ని ఈ పుస్తకం ఖచ్చితంగా కల్గిస్తుంది. నేటికంటే రేపు ఉన్నతంగా ఉండాలనీ, రేపటి తరం సుఖసంతోషాలతో జీవితం గడపాలనీ కోరుకునేవారందరూ, అలాంటి సుందర భవిష్యత్తుకు మార్గం వెతుకుతున్నవారందరూ, రష్యా, చైనా విప్లవాలను అధ్యయనం చెయ్యాలి. రష్యా విప్లవాన్ని అధ్యయనం చేయదలచుకున్న ప్రతి ఒక్కరూ ఈ చిన్న పుస్తకంతో వారి అధ్యయనాన్ని ప్రారంభించవచ్చు.

యువ భారతానికి సదా ఆదర్శప్రాయుడైన భగత్‌సింగ్ తన చివరి ఘడియల్లో క్లారా జట్కిన్ వ్రాసిన 'లెనిన్ స్మృతులు' చదువుతూ, ఉరి తీయబోయే ముందు తన చివరి కోరికగా ఆ పుస్తకాన్ని పూర్తి చేయడానికి అవకాశం కోరడం మనందరికీ తెలిసిందే. ఈనాటి విద్యార్థి యువతరం లెనిన్ జీవితాన్ని తప్పక అధ్యయనం చేయాల్సి ఉంది. అందుకు ఈ చిన్న పుస్తకం తప్పక ఉపయోగపడుతుంది.

**మన లెనిన్**

ప్రచురణ : **తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు**

**1/8 డెమ్మీలో 56 పుటలు. వెల : రూ. 25/-**

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్,**

**అరండల్‌పేట, కారల్‌మార్క్సరోడ్డు, విజయవాడ – 520002.**

కవిత

# చిరంజీవి లెనిన్

–పెనుగొండ లక్ష్మీనారాయణ

**లెనిన్** నినదిస్తే
లెనిన్ ఉద్యమిస్తే
సింహలా గర్జిస్తే
దుఃఖాశ్రు వర్షిత రష్యా
హర్ష పులకిత వజ్ర గాత్రి!
లెనిన్ కదం త్రొక్కితే
లెనిన్ జనం కదిలితే
జనశక్తి విప్లవ గీతంగా లెనిన్
క్రోధాగ్ని కంపిత రష్యా
విస్ఫారిత భీకర రుద్రనేత్ర!
లెనిన్ – సమస్త శ్రామిక శక్తి మూర్తి
లెనిన్ – దారిద్ర్య బంధనాల లవిత్రం
జారుల కైజారుల విరిచే కుఠారం లెనిన్
కడతేరని పోరాటంలో కదిలెను రష్యా....
కార్మిక స్వర్గం వెలయించిన సృష్టికర్త రష్యా!
లెనిన్ – మానవులందరి విశ్వాసం
లెనిన్ – ప్రపంచ ప్రజల ఉచ్ఛ్వాస నిశ్వాసం
అందరి విజయోత్సాహం లెనిన్
సందీప్త సందేశమై జ్వలిస్తే రష్యా –
ప్రపంచ కార్మికవర్గం పొంగిన హర్ష సముద్రం
సుప్రభా ప్రభాతమూర్తి లెనిన్!
అజేయ హృదయ దీప్తి లెనిన్!
అమర మహానేత లెనిన్ –
మానవాళి చిరతర స్మృతి
మానవాళి శుభకరాకృతి
క్రాంతిమూర్తి లెనిన్ స్ఫూర్తి
లెనిన్ సృజన నవచేతన....
నవ మానవ సమధర్మం
అమృతమయ సూనృతం!
ప్రతి పిడికిలి లెనిన్ కాంతి
నడయాడే అభయముద్ర
క్షణ క్షణం దరహాసం
చిరంజీవి లెనిన్ లెనిన్

**(లెనిన్ జయంతి సందర్భంగా 'విశాలాంధ్ర' 22-4-1973)**

పుస్తక పరిచయం

# తెలుగు కవితలలో లెనిన్

- పులుపుల వెంకట శివయ్య

**మహత్తర** అక్టోబర్ విప్లవ విజయాన్ని తెలుగునాట ఆనాటి కాంగ్రెస్ నాయకులు, రష్యన్ ప్రజలు దేశీయ, విదేశ సామ్రాజ్యవాదంపై సాధించిన ఘన విజయంగా ప్రస్తుతించి అభినందించారు.

సామ్రాజ్యవాదంపై జైత్రయాత్రకు తన ప్రజలను నడిపించిన మహానాయకుడని వారు లెనిన్‌ను వర్ణించారు.

"మహా పురుషుడు లెనిన్". ఆయన జీవితం, కృషి, శ్రామిక ప్రజారాజ్యస్థాపన, వర్గరహిత సోషలిస్టు సమాజ నిర్మాణం గురించిన ఒక పరిపుష్టమైన తొలి రచన 1992లో వెలువడింది. ఆ గ్రంథాన్ని జి.వి. కృష్ణారావుగారు రాసారు. ఆయన కాంగ్రెస్‌వాది, బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు.

రష్యన్ శ్రామికవర్గం, లెనిన్ సాధించిన విజయాల ప్రేరణతో ఈ శతాబ్దపు రెండు మూడు దశకాలలో భారతీయ శ్రామికవర్గ కార్మికోద్యమమూ, భారత కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాణమైనాయి. కాంగ్రెసు వాదులలో అత్యధిక సంఖ్యాకులు, ముఖ్యంగా రెండవ తరానికి చెందినవారు సోషలిజం వైపుకు మొగ్గి, దానిని మీటగా చేసుకొని జాతీయ పోరాటాన్ని తీవ్రం చేస్తూ వచ్చారు. అప్పటి బట్టీ భారతీయ మధ్య తరగతులకు చెందిన ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు సోషలిస్ట్ భావనతో ఉత్తేజితులై ఆ దిశకు మళ్ళసాగారు. ఇంతలో 1930-1940 ఆదిలో కర్షకోద్యమం వ్యాప్తికొచ్చి, ఆంధ్ర కిసాన్ సభ ఆధ్వర్యంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు కొనసాగాయి.

ఈ పోరాటాల వెనక ఒక భావ విప్లవం రూపు తొడుగుతూ రావడంతో తెలుగు రచయితలు, ముఖ్యంగా ఆ ఉద్యమాలలో పాల్గొంటూ వచ్చినవారు, అక్టోబర్ విప్లవం ఆ విప్లవ సిద్ధాంతాచరణల గురించీ; ప్రపంచ ప్రప్రథమ శ్రామికరాజ్య విజయాలు, కమ్యూనిస్టు మహా నాయకులు, యోచనాపరులు, దార్శనికులు మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్ జీవితం, బోధనల గురించిన గ్రంథాలను రచించడం, ఆ విషయాలకు సంబంధించిన ఉద్గ్రంథాలను అనువదించడం మొదలైంది.

అయినప్పటికీ ఈ శతాబ్దపు నాల్గవ దశకారంభం వరకూ తెలుగులో లెనిన్ గురించి కావ్యమేదీ రాలేదు. హిట్లర్ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా కొనసాగించిన దేశభక్తి ప్రపూరిత మహా యుద్ధ ప్రేరణతో తెలుగులో లెనిన్ గురించిన కవితలు అవతరించాయి. విప్లవం, దేశభక్తి ప్రపూరిత మహా యుద్ధం గురించిన కవితలు, గీతాలను బ్రహ్మాండమైన సభలలో చదువుతూ వచ్చారు. ఆ పఠనాలు, పాటలూ ప్రజలను ఉర్రూతలూపాయి. సోషలిస్టు వ్యవస్థ స్థాపకుడు, దాని విజయాలకు సారధి అయిన లెనిన్, ఆచరణలో సోషలిజానికి సంబంధించిన ప్రతి ఒక్కదానికీ ప్రతీక అయినాడు. తెలుగు భావనలో సోషలిజం ఒక భాగమైంది. అది తెలుగు కవితలలో వ్యక్తమై విద్యుత్తును ప్రసరించింది.

లెనిన్ గురించిన మొట్టమొదటి ఉత్తమ కవిత, యుగకర్త, మహాకవి శ్రీశ్రీ కలం నుంచే వెలువడ్డది. అది మయకోవ్‌స్కీ లెనిన్‌కు స్వతంత్రానుకరణ. అభావశబలత, పదప్రయోగం, లయ అనుభూతి దానికొక మౌలికతను సిద్ధింపజేశాయి. ఆ మహాకవి పలుకులో, మయకోవ్‌స్కీ భావాలు తెలుగు నుడికారాన్ని సంతరించుకొని పాఠకులతో ఏకమైనాయి.

తెలుగు కవులు ఎంతోమంది లెనిన్ గురించి రాసారు. వాటిలో తుమ్మల వెంకట్రామయ్య, కె.వి. రమణారెడ్డి, సోమసుందర్, రాంభట్ల కృష్ణమూర్తి, నార్ల చిరంజీవి, శ్రీకాంత్‌లు ముఖ్యులు. సుప్రసిద్ధ ఆంధ్ర ప్రజాకవి సుంకర సత్యనారాయణ లెనిన్ జీవితాన్ని 'బుర్రకథ'గా రచించారు. ఆంధ్ర ప్రజానాట్యమండలి దళాలు దానిని దేశమంతటా పాడి, సామాన్య ప్రజానీకాన్ని కదిలించాయి.

'పీడితుల గెలుపు లెనిన్‌గారి పిలుపు' అన్న శ్రీ కె.వి. రమణారెడ్డి

"నమో, తమశ్చమూహంత!
నమో, భానుమంత!
.... .... .... ....
నమో భువన భవనదీప్తి!
బుద్ధి వృద్ధ మూర్తి!
.... .... .... ....
నమో స్రష్ట! సామ్యనిష్ఠ!
నమో దూర ద్రష్ట!" అని లెనిన్‌ను అభినుతించి;
"ఏడిరా నీ లెనిన్
ఎక్కడున్నాడు?" అని ప్రశ్నించి,
దానికి సమాధానం
.... .... .... ....
"వర్గాల వైరాల కడపటి పరీక్ష
.... .... .... ....
ఈ గోడలపై ప్రచార పత్రమ్ము
ఈ పుస్తకమ్ము
సమ్మె పేరున్నూ సభల రూపున్నూ
హర్తాళులున్నూ

తమ శక్తి గుర్తెరిగి వ్యక్తులై ప్రజలు
సమష్టి ప్రజలు
చేయు ప్రతియొక స్వల్ప ముక్తి కార్యమ్ము
అన్నియు నీతదే!"

అని ఆ భావి వర చారిత్రనిర్ణేత, లెనిన్ చేతి శక్తిని చూపుతారు.

ప్రముఖ అభ్యుదయ కవి సోమసుందర్ లెనిన్‌ను 'ధ్రువతార'గా ప్రతి రూపించి ఇట్లా అన్నారు :

"ఓ లెనిన్!.... మా లెనిన్!!
నిరాశానలమ్మున పడి
నీ వచస్సుధాలహరిన్
ముంచిన మహనీయ లెనిన్!
.... .... .... ....
నీ నామమె సమజగతీ
నిర్మాణోత్సవ మాయెను
నీ మాటయె వర్గరహిత
స్వరానికి బాటాయెను.
.... .... .... ....
పరపీడన పరాయణుల
ఎదలో నాటిన బాకై
నర హంతక ధరాధిపుల
బ్రతుకులకే స్మశానమై
నీ వెత్తిన జండా
అరుణారుణమై వెలుగుతోంది!
నీ పవిత్ర దేశం – ఈ
భువిలో నిర్మిత స్వర్గం
నరజాతికి విముక్తిగా
పరమావధి ధ్రువతారగ
వెలుగుతోంది చిరకాలం!
నవ శక్తి విధాతా
సమ జగతీ నేతా!

'నవోషస్సు' అన్న విప్లవాన్ని గూర్చిన కవితలో రాంభట్ల కృష్ణమూర్తి లెనిన్‌ను ప్రస్తావిస్తూ :

"వెలుగిమ్మని వేడిమ్మని
వేడుకున్న ఉషస్సు....
ఏబది ఆమనుల ముందు
ఒక సుందర ప్రభాతాన
మహానేత, మహాద్రష్ట
మహా లెనిన్ ఊహలోంచి
వికసించిన ఉషస్సు....
ఐదు దశాబ్దాలుగ ఆమని
ఇటనే నిల్చి ఉన్నది...." అని.
.... .... .... ....
"మరొక మారు రుగ్గళాన
విరుతించెద వినుతించెద
మనన్ దనుప లెనిన్ పనుప
పర తెంచిన మహోషస్సు"

అంటూ ఆవేశంతో ఉప్పొంగిపోతారు.

అభ్యుదయ కవిగా సినీ రచయితగా ప్రసిద్ధికెక్కిన నార్ల చిరంజీవి; "నిజంగా చిరంజీవి లెనిన్" అని మనస్సుకు హత్తుకొనిపోయే యీ గీతాన్ని రచించారు;

కష్టజీవి సైదోడై
కామ్రేడ్ లెనిన్ గెలిచెన్
దుష్టవైరి ముగుదాడై
కామ్రేడ్ లెనిన్ నిలచెన్
సృజనాత్మక ధీశాలుడు,
ప్రజాబంధు వతడు లెనిన్.
స్వయంప్రభారుణ తరుణుడు
దయాసింధు వతడు లెనిన్.
ధన మెక్కడ పోగువడుట
భూదేవికి బరువు కదా!
మనిషి బానిసయై త్రెళ్ళు
మనుగడ అవినీతి కదా!
భూభారము తీర్చువాడు
మనిషిని మేల్కొలుపుతాడు
సంభవామి యుగే యుగే
లెనిన్ చరిత అదే అదే!
బంజరులో పసిడి పంట
ఎడారిలో జలాశయం
పేదవాని పిడికిటిలో
వొదిగిలపడు భూగోళం.
ప్రాజక్టులు, పంచవర్ష
ప్రణాళికలు, ట్రాక్టర్లు,
కూడు గుడ్డ నీడ చదువు
ఇవే లెనిన్ మారుపేరు.
దిక్చక్రము నొరసి తాకు
దూరదృష్టి ఎవరిదయా?
అధికారం ప్రజాళిదని
అభయమిచ్చిన దెవరయా!
శాంతివాణి ఎవరిదయా?
చక్రపాణి ఎవరయా?
లెనిన్ కనులు, లెనిన్ పనులు
లెనిన్ వాణి, లెనిన్ పాణి.
.... .... .... ....
రాగల రేపటి స్వప్నం
రగిలించును లెనిన్ కదా!
.... .... .... ....
పసిపాల నవ్వులలో
ప్రతిఫలించు నతడెవ్వరు.

నీ వెరుగుదు నే నెరుగుదు
నిజం చిరంజీవి లెనిన్!"

"ఓ లెనిన్! మా లెనిన్!" అన్న గీతంలో తుమ్మల వెంకట్రామయ్య

"ఓ లెనిన్! ఓహో లెనిన్!! మా లెనిన్!!"
నీ కృషి ఫలియించెను
సుప్రభాత మరుదెంచెను....
యుగ యుగాల దాస్యశృంఖ
లా లవె సడలెను....
తాడిత జన పీడిత గణ
వదనమ్ముల హాసము లొలికెన్!
పొలము దున్ను బడుగు రైతు
ఫ్యాక్టరీల బక్క కూలి,
మా తాతలు ముత్తాతలు
ఏ కాలపు బీదజనులు
ఊహించిన స్వర్ణభూమి
ఆశించిన స్వర్గభూమి
నిజమేనని ఇదిగోనని
మీదేనని, శాశ్వతమని
మేలుకొల్పి, ధైర్యమిచ్చి
మహాపథము చూపెట్టిన
మాదు నేత ఓ లెనిన్!!
నవంబరేడు నాడు నాటిన నీ అంకురమ్మె
దిన దినప్రవర్ధమై దివ్య మహావృక్షమై
నవ విప్లవ వీరయోధ శ్రామికాళి సేదదీర్చ"
.... సర్వత్రా చల్లని నీడలను పరుస్తున్న దంటారు.

లెనిన్ గురించిన తెలుగు పాటలు కవితలలో సుంకర 'బుర్రకథ'కున్న స్థానం విశిష్టమైనది. లెనిన్ బహుముఖ జీవితాన్ని చిత్రిస్తున్న ఈ రచన, ప్రజలతో ఆయనకున్న సజీవమైన సంబంధాన్ని కళ్ళకు బొమ్మ కట్టినట్టు చూపుతున్నది. దీనిలో లెనిన్ పై వైట్‌గార్డుల భృత్యురాలు గుండు పేల్చిన ఆ ఘట్టం – హృదయాన్ని ద్రవింపజేసి కంట తడిబెట్టిస్తుంది. లెనిన్ స్మృత్యర్థం 'ప్రతిజ్ఞ' చెయ్యడం కథను పతాక స్థాయికి తీసుకొని పోతుంది.

ఈ కవితలు, పాటలలో చాలవరకు లెనిన్ గురించి "మా లెనిన్" అనే సంబోధించబడటం, ఆ నాయకుడు, శ్రమజీవనులైన భారత ప్రజలకు, భారత విప్లవానికీ ఎంత దగ్గరివారో ప్రస్ఫుటం చేస్తున్నది.

**(మార్చి 1970)** ✺

## పురస్కారాన్ని తిరస్కరించిన ఆదివాసీ కవయిత్రి, సామాజిక కార్యకర్త
## జసింత కెర్కెట్టా! (Jacinta Kerketta)

**స్వయంకృషితో** విజయాలు సాధించిన వనితలకు ఇండియా టుడే గ్రూపువారు 'ఆజ్‌తక్ సాహిత్య జాగృతి ఉద్యమ ప్రతిభా సమ్మాన్'ను ప్రదానం చేస్తారు. ఈ ఏడాది ఈ పురస్కారానికి ఓరాన్ ఆదివాసీ తెగకు చెందిన 38 ఏళ్ళ కవయిత్రి, సామాజిక కార్యకర్త జసింత కెర్కెట్టాను ఆ సంస్థ ఎన్నిక చేసింది.

జసింత జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాకు చెందిన వనిత. రాంచీలో సెయింట్ క్జేవియర్ కళాశాలలో మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ, యం.ఏ. చదివారు. ప్రాథమిక విద్య ఉన్నత విద్య తన మనోహర్‌పూర్ గ్రామంలో మిషనరీ బోర్డింగ్ స్కూలులో చదివారు.

కొంతకాలం హిందీ జాతీయ పత్రికలు 'దైనిక్ జాగరణ్', 'ప్రభాత్ ఖబర్'లలో విలేకరిగా పనిచేసి, ప్రస్తుతం స్వతంత్ర పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఆమెకు సంతాలి, సద్రి, హిందీ, భాషలు వచ్చు. హో, ముండారి, ఖరియా, ఇంగ్లీషు భాషలు అర్థం చేసుకోగలరు. ఆదివాసీలపట్ల పాలకుల ఉదాసీనత, అణచివేత, యువతలో నిరుద్యోగం, స్త్రీలపట్ల కుటుంబంలోనూ, సమాజంలోనూ కొనసాగుతున్న హింస, ఆకలి మొదలైన సమస్యలపై కృషిచేస్తూ – ఆయా విషయాలపై హిందీలో కవితలు రాశారు. ఓరాన్ తెగవారి ఖాద్‌పోష్ గ్రామం 2010 వరకు మావోయిస్టుల విముక్తి ప్రాంతంగా వుంది. ప్రస్తుతం అక్కడి ఖనిజ సంపదలను కొల్లగొట్టే ప్రయత్నాలను ఆదివాసులు ప్రతిఘటిస్తున్నారు. నాలుగు డామ్‌లున్న సిందేగౌ ప్రాంతంలోని గ్రామాలకు నీటిపారుదల సౌకర్యం లేదు. డ్యాముల నిర్మాణం వల్ల భూములు త్యాగంచేసిన ఆ గ్రామ ఆదివాసీలు రిక్షావాలాలుగా బతుకుతున్నారు. భూములు వున్నవారు కూడా వరదలు, తుపాన్ల వల్ల వ్యవసాయంలో నష్టపోవడం జరుగుతూ వుంది. ఆదివాసీ జీవితాలను, ఆదివాసీ పిల్లల పరిస్థితులను, ఆదివాసీ చరిత్రను, సంస్కృతిని, ఆదివాసీ స్త్రీల పోరాటాలను గమనించిన జసింత ఆయా సమస్యలపై రాసిన హిందీ కవితలను "ఈశ్వర్ ఔర్ బజార్" అనే పేరుతో ఒక సంపుటిగా ప్రచురించారు. దీనికే పురస్కారం లభించింది.

కాని మణిపూర్‌లో ఆదివాసీల పట్ల పాలకులు వ్యవహరిస్తున్న తీరునూ, వారిపట్ల చూపుతున్న నిరాదరణకు నిరసన తెలియచేస్తూ జసింత ఆ పురస్కారాన్ని తిరస్కరించారు. అంతేగాక దేశంలోని ప్రధాన సమాచార సంస్థలు (మీడియా) మణిపూర్ ఆదివాసీల పరిస్థితిపై మౌనం వహించటాన్ని కూడా ఆమె నిశితంగా విమర్శించారు. ఆదివాసీల సమస్యలు వస్తువుగా రాసిన కవితల సంపుటికి ప్రాధాన్యత ఇస్తున్నారు కాని ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడాన్ని తప్పు పట్టారు.

ఒక అంకిత భావంతో నిజాయితీగా చిత్తశుద్ధితో అణచబడుతున్న ప్రజలపక్షాన నిలబడ్డ జసింతను అభినందిద్దాం. ✺

డాక్యుమెంటరీ పరిచయం

# లెనిన్ గురించి మూడు గేయాలు

## (Three Songs about Lenin)

## "ప్రపంచ అణగారిన ప్రజల నాయకుడు"

- కొత్తపల్లి రవిబాబు

**ఇది** రష్యన్ టైటిల్స్, ఇంగ్లీషు టైటిల్స్ వున్న డాక్యుమెంటరీ. ఇంగ్లీషు టైటిల్స్ ఆధారంగా దీనిని పరిచయం చేస్తున్నా. 1934లో నిర్మించిన 59 నిముషాల ఈ శబ్ద చిత్రం దర్శకుడు నిర్మాత జీగా వెర్టోవ్ (Dziga Vertov). ఈయన యుక్రెనియన్. దీనిని 1969లోనూ, మరల కొన్ని మార్పులతో 1970లో లెనిన్ శతజయంతి సందర్భంగానూ విడుదల చేశారు.

ఈ చిత్రం ప్రత్యేకత ఏమిటంటే, తూర్పు సోవియట్ ప్రాంతంలో లెనిన్‌పై బహుళ ప్రచారంలో వున్న మూడు పాటల సమాహారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ పాటల రచయిత ఎవరో తెలియదు. ఇవి లెనిన్ చేసిన కృషిని ప్రశంసిస్తుంటాయి. ఆయా పాదాలలోని భావాలు దృశ్యరూపంలో తెరపై ప్రత్యక్షమౌతాయి. లెనిన్ సారధ్యంలో విజయవంతమైన ప్రజావిప్లవం. ఆ తర్వాత అంతర్యుద్ధం; లెనిన్ రూపొందించిన ఆర్థిక విధానాల ఫలితాలు; వ్యవసాయరంగంలో సాధించిన ఫలితాలు; ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి, సరఫరాల ద్వారా పారిశ్రామికరంగ పురోగతీ; ట్రాక్టర్, టాంకు డ్రైవర్లుగా మహిళలు; రచయితలుగా, సైంటిస్టులుగా ఎదిగిన ప్రజలు... ఇలా లెనిన్ పాలన కాలంలో జరిగిన అనేక విధాలైన అభివృద్ధిని ప్రేక్షకులకు ఈ డాక్యుమెంటరీ పరిచయం చేస్తోంది. దీని వీక్షణం ఒక అపూర్వమైన అనుభూతిని కల్గిస్తుంది. నెట్‌లో చిత్రం పేరు 'Three Songs about Lenin' అనే పేరుతో దిగుమతి చేసుకొని చూడవచ్చు.

చిత్రం ప్రారంభంలో అసలు శీర్షికతోపాటు దాని క్రింద ఉపశీర్షిక "ప్రపంచ అణగారిన ప్రజల నాయకుడు" అని చూస్తాం. లెనిన్‌ను తన గుండెల్లో నింపుకున్న ఈ చిత్ర నిర్మాత దర్శకుడు వెర్టోవ్, తన ఇతర చలనచిత్రాలను కూడా లెనిన్‌కే అంకితమిచ్చారు. ఇది సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌లో మాస్కోలో వున్న సెంట్రల్ డాక్యుమెంటరీ ఫిల్మ్ స్టూడియో వారి సమర్పణ.

ఇక, ఈ చిత్రంలోని ఇంగ్లీషు సబ్‌టైటిల్స్ అనువాదం చూడండి :

"అణచివేతకు గురౌతున్న ప్రజానీకానికి మిత్రుడూ, వారి విముక్తి ప్రదాత అయిన లెనిన్‌పై యూరప్‌లో, అమెరికాలో, ఆఫ్రికాలో, ఆర్కిటిక్ ప్రాంతం అవతల కూడా ప్రజలు పాటలు పాడుకుంటున్నారు. ఈ పాటల రచయితలెవరో తెలియదు. కాని పాటలు మాత్రం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికీ, ఒక గ్రామం నుండి మరో గ్రామానికీ ప్రాకిపోయాయి.

తన సంప్రదాయపు ముసుగును తొలగించిన స్త్రీ పాడుతున్న పాటలివి.

పల్లెలకు కాంతి తెచ్చిన విద్యుచ్ఛక్తి గురించీ,<br>
నిరక్షరాస్యుల్ని అక్షరాస్యులుగా మార్చడం గురించీ<br>
ఇలా ఎన్నో, అన్నిటిలో లెనిన్ గురించి....

ఈ పాటలు అక్టోబర్ విప్లవం గురించీ<br>
ఆ విప్లవంలో ఒకడైన లెనిన్ గురించీ<br>
ఒక నూతన, ఆనందదాయకమైన జీవితం కోసం<br>
ఆ పోరాటంలో మిళితమైన లెనిన్ గురించీ.....

**మొదటి పాట :**

ఒక చీకటి జైలులో వున్నా<br>
ఒక గుడ్డి జీవితం గడిపా<br>
అజ్ఞానం, అంధకారంలో<br>
సంకెళ్ళు లేని బానిసను నేను<br>
లెనిన్ ప్రవచించిన జ్ఞానంతో<br>
ఒక జ్ఞాన కిరణం ప్రవేశించింది నాలో....

(ఇక్కడ 'టర్కిక్ విమెన్స్ క్లబ్' అని టైటిల్ వేసి అక్కడ మహిళలు. వివిధ రకాల పనుల్లో లీనంగావడం - అధ్యయనం, గానం, వాయిద్యాలు, నృత్యం, వ్యవసాయం ఇలా ఎన్నెన్నో దృశ్యాలు చూపించారు).

మేం ఆయన్నెన్నడూ చూడలేదు<br>
ఆయన గొంతెన్నడూ వినలేదు<br>
కాని<br>
ఆయన మాకు పితృసమానుడు<br>
కాదు కాదు అంతకంటే ఎంతో ఎక్కువ<br>
లెనిన్ మాకు చేసినంతగా<br>
ఏ తండ్రీ తన పిల్లలకు చేసి వుండడు.<br>
నా ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రం<br>
నా ప్రియమైన దేశం<br>
నా నేల<br>
అంధకారం నుంచి వెలుగు సృష్టించాడు<br>
ఎడారిలో ఉద్యానవనం పెంచాడు<br>
మృత్యువు స్థానంలో జీవితాన్ని తెచ్చాడు.

(ఇక్కడ 'వ్యవసాయ బోధనా సంస్థ' అనే టైటిల్ వేసి విద్యాలయాలు, కర్మాగారాలు, సామూహిక వ్యవసాయ క్షేత్రాలను చూపించారు)

నా విశ్వవిద్యాలయం<br>
నా కర్మాగారం<br>
నా సామూహిక వ్యవసాయ క్షేత్రం

కోట్లాది కోట్ల ఇసుక రేణువులే ఒక ఇసుక దిబ్బ అవుతుందనీ, లక్షలాది ధాన్యపు గింజలే ఒక బస్తా అవుతుందనీ, వేలాది బలహీనులే కలిస్తే ఒక శక్తి అవుతారనీ ఆయన పేదలను, బలహీనులనూ నమ్మించాడు!

నా కుటుంబం
నా చేతులు
ఉక్కు హస్తాలు
నా పార్టీ
అతని మేధస్సు, అతని రుధిరం,
అతని హృదయం
అతని వద్ద వున్నవన్నీ
మనందరికీ ఇచ్చేశాడు!

**రెండవ పాట :**

(ఇది లెనిన్ మరణాన్ని చిత్రించే భాగం. మరణించిన లెనిన్‌ను ఒకవైపు చూపిస్తూ, శోకాన్ని దిగమ్రింగుతూ, ఉబికే కన్నీళ్ళను ఆపుకుంటూ, ఉద్వేగాన్ని అణచుకుంటూ ఆయన శవాన్ని చూసే ప్రజలను క్లోజప్‌లో చూపిస్తూ, మనలను కూడా ఉద్వేగానికి గురిచేసే దృశ్యాలు వున్నాయి.)

మేము ఆయనను ప్రేమించాం
మా గడ్డి మైదానాలను ప్రేమించినంతగా ప్రేమించాం!
కాదు, కాదు ఇంకా ఎన్నో రెట్లు!
కావాలంటే మా గుడారాలు వదిలేస్తాం ఆనందంగా
జీవితాలనే త్యాగం చేస్తాం సంతోషంగా
ఆయనను బతికించగల్గితే!

మేమేకాదు, మా వారసులూ ఏనాడూ మరువరు ఆయన్ను
ఏటికేడాది నిర్మించాడు మన అజేయమైన పార్టీని
అవిరామంగా పోరాడి దానిని పెంచాడు – బలీయం చేసాడు
లెనిన్ మరణించాడు – కాని అతని పార్టీ సజీవం
అలసట లేకుండా శ్రమించాడు ఆయన
అతని చూపు తీక్షణం
ప్రజల్లో ఉత్తేజం నింపుతూ
స్నేహపూర్వక చిరునగవు చిందిస్తాడిక్కడ
ఉద్రేకంగా ఉపన్యసిస్తాడిక్కడ
కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ స్థాపకుడు
ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు
అంతర్జాతీయ శ్రామికవర్గపు గర్వం, వైభవం
అణచబడ్డ తూర్పు దేశాల నాయకుడు
రష్యాలో శ్రామిక నియంతృత్వానికి నాయకుడు
కపటత్వం, కుచ్ఛితత్వం లేనివాడు
రష్యాలో అతన్ని కేవలం 'ఇల్యిచ్' అంటారు
1917లో రజ్లీవ్‌లో ఒక గుడారంలో గడిపాడు
ప్రపంచ శ్రామికవర్గనేత
బూర్జువాలు విధించే శిక్షను తప్పించుకొని
దాక్కున్నాడు ఒక గుడారంలో!
అక్టోబర్‌లో యుద్ధానికి నాయకుడై
సోవియట్లకే సర్వాధికారాలు అంటూ
మనల్ని ముందుకు నడిపించాడు
ముందుకు సాగారు, వినాశనాన్ని లెక్కచేయకుండా
గడ్డ కట్టించే చలిలో సాగారు ముందుకు
కరువు తట్టుకుంటూ ముందుకే, మునుముందుకే
నిప్పులు కురిసినా వేసారు అడుగు ముందుకే
వ్లాడిమర్ ఇల్యీచ్ లెనిన్ వారి నాయకుడు మరి!
దృఢంగా వుండండి! ఐక్యంగా వుండండి!
శత్రువును ఎదుర్కోండి ధైర్యంగా!
భూస్వాములను, పెట్టుబడిదారులను ఓడించి
మనం ఘన విజయం సాధిస్తాం – రష్యాలో
ప్రపంచవ్యాప్తంగా కూడా వారిని ఓడిస్తాం ఒకనాడు!
లెనిన్! అతడిపుడు అచేతనుడు!
లెనిన్! ఇప్పుడతడు మౌనముని!
ప్రజలు కదులుతున్నారు మౌనంగా
'విప్లవం కొనసాగుతుంది!
మిత్రమా! వీడ్కోలు' అన్నాడు మాక్సిమ్ గోర్కీ
నీ ఆదేశాలను పాటిస్తాం
నీ లక్ష్యం కోసం కృషిచేస్తాం
మన అమరత్వం లెనిన్
ఈ రెడ్‌స్క్వేర్‌లో ఎన్నిసార్లు చూడలేదు
మనం లెనిన్‌ను!
ఇల్యీచ్! నీవు ప్రారంభించినదాన్ని మేం పూర్తిచేస్తాం!

**మూడవ గేయం :**

ఒక పెద్ద నగరంలోని గుడారంలో
వున్నాడు లెనిన్ పడుకొని
దుఃఖంలో మునిగి వున్నావా
రా! వచ్చి చూడు లెనిన్‌ని!
నీ దుఃఖం కరిగిపోతుంది
కాలువలో కొట్టుకుపోయే ఆకుల్లా
నీ దుఃఖం ఎగిరిపోతుంది
లెనిన్ మార్గంలో వున్నాం గనుక
మన జీవితాలు అర్థవంతంగా, ఆనందంగా వున్నాయి
శ్రామికరంగంలో ప్రతి దశలోనూ
మనదేశాన్ని సోషలిజం వైపు నడిపిస్తున్నాం
మన దేశాన్నిప్పుడు లెనిన్ చూడగల్గితే – బాగుండు!
నాకిప్పుడు అరవై మూడేళ్ళు
పనిచేస్తే నాకు 14.5 టన్నుల గోధుమ
నా వాటాగా వచ్చింది –
నన్ను అభినందిస్తూ ప్రత్యేకంగా సభ జరిగింది
అన్ని సమిష్టి క్షేత్రాలలో ఇలా జరిగితే
అందరూ బాగుంటారు!
సమిష్టి క్షేత్రాలలో స్త్రీలు ఒక మహాశక్తి
మమ్మల్ని వెనక్కి నెట్టలేరు

లెనిన్ సమిష్టి వ్యవసాయ క్షేత్రానికి నేను ఛైర్మన్‌ను
మా వ్యవసాయ సంస్థలో ముగ్గురు మహిళలున్నాం
మాలో మేం ఎవరిపట్లా కనికరం చూపం పని విషయంలో
నా స్థానం ఏమిటో నాకు తెలుసు
మన నాయకులు చెప్పే విలువైన విషయాలు తెలుసు
వాటిని రాసుకొని, జ్ఞాపకం చేసుకుంటూ వుంటాను
ఇంటికి వెళ్ళిన తర్వాత, వాటిని ఇతరులకు చెప్పగల్గుతాను!
మన సమష్టి క్షేత్రంలో అంతా సవ్యంగా చేయాలనుకుంటున్నా!
కష్టమా! బోలెడంత – అయితే అదంతా గతంలో –
ముందుకు పోవాలి మనం అంటున్నారు బోల్షివిక్కులు
కాని ఏది సరైన మార్గం?
చేయాల్సినది ఇంకా ఎంతో వుంది
సరైన మార్గం కనుగొనాల్సి వుంది
అదే ప్రధాన సమస్య
లెనిన్ ఇప్పుడు మన దేశాన్ని చూడగల్గితే – బాగుండు!
మన చమురు సంపద
మన బొగ్గు
మన ఉక్కు
ఇప్పుడు లెనిన్ మన దేశాన్ని చూడగల్గితే – బాగుండు!
మన పారిశ్రామిక నగరం మాగ్నిటో గోర్స్క్!
ఓడలు నడిచే మన వైట్ సీ కాలువ నిర్మాణం!
మాస్కో – ఓల్గా కాలువ ప్రారంభం!
మనదేశాన్నిప్పుడు లెనిన్ చూడగల్గితే బాగుండు
మన కుటుంబాన్ని లెనిన్ ఇప్పుడు చూడగల్గితే – బాగుండు
దృఢంగా నిలబడండి! ఐక్యంగా వుండండి!
శత్రువును ఎదుర్కోడానికి ధైర్యంగా ముందుకు సాగు!
మనం విజయం సాధిస్తాం!
రష్యాలో భూస్వాములు, పెట్టుబడిదార్లను ఓడించాం
ప్రపంచవ్యాప్తంగా కూడా వారు ఓడిపోతారు!

అక్టోబర్

శతాబ్దాలు గడుస్తాయి
ఆనాటి ప్రజలు తమ పూర్వీకులు గడిపిన
దేశాల పేర్లు మరచిపోతారు
కాని వారు 'లెనిన్' పేరు మరువరుగాక మరువరు
వ్లాదిమర్ ఇల్యీచ్ లెనిన్ పేరు అజరామరం! ✺

## కవి, ప్రజానుకూల రెవిన్యూ అధికారి

# సోమేపల్లి వెంకటసుబ్బయ్య మరణానికి సంతాపం



**వచన** కవితలు, నానీలు మొదలైన రచనలు చేసిన ప్రభుత్వ రెవిన్యూ అధికారి సోమేపల్లి వెంకటసుబ్బయ్య తన 65వ ఏట 14–12–2023న గుంటూరులో మరణించారు. ఆయన ప్రకాశంజిల్లా యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో 1–5–1958న జన్మించారు.

పూనూరు, చిలకలూరిపేటలలో విద్యాభ్యాసం చేసి ఆంధ్ర విశ్వ కళాపరిషత్తులో ఎం.కాం. చదివారు. కొంతకాలం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఉపసంపాదకులుగా పనిచేసి, 1989లో గ్రూపు 2 పరీక్షల్లో మండల రెవిన్యూ అధికారిగా ఎన్నికయ్యారు. పెంటపాడు, తాడేపల్లిగూడెం, గణపవరం, తణుకులో ఎం.ఆర్.వోగాచేశారు. 2003లో పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలక్టర్‌గానూ, 2006 నుంచీ గుంటూరు, నర్సాపురం, గుడివాడలో ఆర్.డి.వోగానూ, ఆ తర్వాత గుంటూరు జిల్లా పరిషత్ ముఖ్య పాలనాధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు.

రెవిన్యూ అధికారిగా ప్రజలకు చేరువగా వుండి, మంచిపేరు సంపాదించుకున్న సోమేపల్లి సాహిత్యరంగంలో ప్రవేశించి కవితలు రాశారు. 'చల్లకవ్వం' (2002); 'తదేకగీతం' (2006); 'మట్టిపొరల్లోంచి' (2010) అనే వచన కవితాసంపుటులు ప్రచురించారు. 'లోయలో నుండి' (1997); 'తొలకరి చినుకులు' (2001); 'రెప్పల చప్పుడు' (2004); 'పచ్చని వెన్నెల' (2007); 'చేను చెక్కిన శిల్పాలు' (2019) మొదలైన నానీ కవితా సంపుటులను ప్రచురించారు.

2007లో గుంటూరుజిల్లా రచయితల సంఘం స్థాపించి దానికి అధ్యక్షులుగా వున్నారు. 2015 సెప్టెంబర్ 13న అవతరించిన ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘ అధ్యక్షునిగా కూడా వున్నారు.

'ప్రజాసాహితి'కి ఆర్థికంగా, హార్థికంగా సహాయ సహకారాలందించేవారు. 2018లో గుంటూరులోని వెంకటేశ్వరా విజ్ఞానమందిరంలో సౌవిక్ సాంస్కృతిక చక్ర సంస్థవారితో జనసాహితి మాక్సిం గోర్కీ 'అమ్మ'ను నాటకంగా ప్రదర్శించినపుడు సోమేపల్లి చాలా సహకరించారు.

యువరచయితలను ప్రోత్సహిస్తూ బహుమతులు ఇస్తూ, సాహిత్య కృషి కొనసాగించిన సోమేపల్లి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి కుటుంబసభ్యులకు సహానుభూతి తెలియచేస్తోంది. ✺

వ్యాసం

## "మా భూములను ఆక్రమించగలరేమో....
## కాని, మా హృదయాలను ఎప్పటికీ గెలవలేరు".

# లెనిన్ ఇష్టపడిన సాహిత్యం, నాటకాలు

మూలం : కృపస్కాయా (లెనిన్ భార్య) – ఓ.వి.వి.యస్

**ఇల్యీచ్‌తో** నా మొదటి పరిచయమప్పటి మాట. అతనిని నాకు పరిచయం చేసిన కామ్రేడు ఇల్యీచ్ గురించి చెబుతూ, అతనికి శాస్త్రీయ విషయాలంటే ఆసక్తి మెండు అని, శాస్త్ర గ్రంథాలే చదువుతాడని, కవిత్వమూ, నవలలు వంటివేవీ సరిపడవని చెప్పాడు. అప్పటికే నాకు లెర్మంటావ్ సాహిత్యం మొత్తం కంఠతా వచ్చు. చెర్నిషెవ్‌స్కీ, టాల్‌స్టాయ్, ఉస్పెన్‌స్కీలు అప్పటికే నా జీవితంలో భాగం. వారెవరి సాహిత్యంతోనూ కనీసాసక్తి లేని వ్యక్తా 'యితను'?!.. అని మొదట నేను ఆశ్చర్యపోయేదానిని. క్రమంగా ఇల్యీచ్ ఏమిటో అర్థం కావడం మొదలయ్యింది. అతను మానవ స్వభావాలను ఎలా అర్థం చేసుకుంటున్నాడో, జీవితాలను ఎలా చదవగలుగుతున్నాడో స్పష్టమవుతుండడంతో అతనికి సాహిత్యం పట్టదనే భావన క్రమంగా తెరమరుగై, సాహిత్యంలోంచి జీవితాలను నిశితంగా పరిశీలించే ఇల్యీచ్ నా మేథో ఫలకంపై స్థిరపడసాగాడు.

ఆనాటి కఠినమైన జీవితం మా మధ్య ఈ సాహిత్య విషయాలను కనీస ప్రస్తావనకైనా రానిచ్చేది కాదు. కానీ సైబీరియా ప్రవాస కాలంలో లెనిన్ సాహిత్య పిపాస నాకు అర్థం కావడం మొదలయ్యింది. నాలాగే ఇల్యీచ్ కూడా అనేక క్లాసిక్స్‌ను చదివాడని, తుర్గెనీవ్ వంటివాళ్ళని మళ్ళీ మళ్ళీ చదివాడని తెలిసింది. ప్రవాసానికి నాతో తీసుకెళ్ళిన పుష్కిన్, లెర్మంటావ్, నెక్రసోవ్‌ల సాహిత్యాన్ని ఇల్యీచ్ తన పడక ప్రక్కనే హెగెల్ పుస్తకాల సరసన సర్దుకున్నాడు. అనేక సాయంత్రాలు వాటిని పదేపదే చదువుతుండేవాడు. పుష్కిన్ అతని అభిమాన రచయిత. అతనిని ఆకర్షించేది కేవలం శైలి మాత్రమే కాదు. ఎంత ప్రాథమికమూ, అమాయకమైన శైలి ఉన్నాగాని, అతనిలోని చదువరిని ఆకర్షించేది వస్తువే. చెర్నిషెవ్‌స్కీ 'వాటీజ్ టు బి డన్' – నవల అంటే వల్లమాలిన యిష్టం. ఆ పుస్తకాన్ని నిశితంగా చదువుతూ ముఖ్యమైన పాయింట్లు నోట్ చేసుకుంటూ ఉండడాన్ని చూసి నేను ఆశ్చర్యపోయేదానిని. ఇల్యీచ్ సైబీరియన్ ఆల్బమ్‌లో చెర్నిషెవ్‌స్కీవి రెండు ఫోటోగ్రాపులున్నాయి. ఒక దానిపై ఆ రచయిత జయంతి, వర్ధంతులు సైతం రాసి ఇల్యీచ్ భద్రపరిచాడు. ఇంకా ఆ ఆల్బమ్‌లో ఫ్రెంచి రచయిత ఎమిలీ జోలా, రష్యన్ రచయితలు హెర్జన్ మరియు పిసరెవ్‌ల ఫోటోలు కూడా ఉండేవి. ఆ సమయంలో పిసరెవ్ రచనలు ఇల్యీచ్ ఎక్కువగా చదివేవాడు. సైబీరియా ప్రవాసంలో జర్మన్ రచయితలైన గోథే రాసిన 'ఫాస్ట్', హీనీ రాసిన కవిత్వపు పుస్తకాలూ ఉండేవి. ప్రవాసం నుండి మాస్కో వచ్చేటప్పుడు థియేటర్లో 'డెర్ కుషర్ హాంషెల్' నాటకం చూశానని, తర్వాత ఎంతో ఆనందించానని చెప్పాడు. మ్యూనిచ్‌లో ఉండగా ఇల్యీచ్ ఇష్టంగా చదివినవి జర్మన్ రచయిత గెహార్డ్ రచించిన 'చెయ్ మామా..' (అమ్మతో) ఇంకా విల్ హిల్మ్ వాన్ పోలెండ్ రాసిన 'బట్నెర్‌బార్..' మొదలైనవి.

విక్టర్ హ్యూగో మూడవ నెపోలియన్‌పై దాడి చేస్తూ రాసిన వ్యంగ్య కవితా సంపుటి 'శిక్షలు' ('Chatiments')ని రెండవ ప్రవాస కాలంలో ఫ్రాన్స్‌లో వున్నపుడు ఇల్యీచ్ ఇష్టంగా చదివాడు. ఆ పుస్తకం కూడా హ్యూగో ప్రవాసంలో ఉన్నప్పుడు చేసిన రచనే. దాని కాపీలు ఫ్రాన్సులోకి రహస్యంగా చేరవేసేవారు. ఆయన రచనల్లో పదాడంబరం ఉన్నా గానీ విప్లవ శ్వాస ఉందనేవాడు ఇల్యీచ్. ఆ సమయంలో శ్రమజీవులు ఎక్కువగా నివసించే బస్తీల్లోని థియేటర్లకు, కేఫ్‌లకు విప్లవ గీతాలను వినడానికి ఇల్యీచ్ తరచుగా వెళ్తుండేవాడు. విప్లవోద్రేకులైన రైతులు బాటసారి ఐన ఓ ఆందోళనకారుడిని ఛాంబర్ ఆఫ్ డెప్యుటీస్‌కు తమ ప్రతినిధిగా ఎన్నుకున్న వైనం.. ఇంకా బాలలను తీర్చిదిద్దడం, ప్రజల ఉపాధి సమస్య.... వంటి అనేక ప్రజల సమస్యలను గీతాలుగా ఆలపించడాన్ని, చర్చలు జరగడాన్ని ఎంతో యిష్టపడేవాడు. ప్రత్యేకించి మాంటెగ్యు (Montegus) అంటే ఇల్యీచ్‌కి ఎంతో యిష్టం. పారిస్ కమ్యూనార్డు – కొడుకైన ఈ గాయకుడిని ప్రజలెంతగానో అభిమానించేవారు. అతని గీతాలలో జీవితం తొణికిసలాడుతుందని, ప్రత్యేకించి ఒక భావజాలమంటూ ప్రస్తావించకుండా తన గీతాలను ఆకర్షణీయంగా మలుస్తాడని ఇల్యీచ్ చెప్పాడు. ఫ్రెంచి విప్లవ కాలంలో సమ్మె చేసే సామాన్యులను కాల్చేందుకు నిరాకరించిన 17వ రెజిమెంటును ఉద్దేశించి "శాల్యూట్.. శాల్యూట్ సైనికులారా!.." అంటూ మాంటెగ్యు పాడే పాటను ఇల్యీచ్ తరచు మననం చేసేవాడు. కొంతకాలం తర్వాత రష్యాలో ఒకనాటి సాయంత్రపు సమావేశంలో ఇల్యీచ్, మాంటెగ్యులు సంభాషించుకున్నారు. భిన్న అభిప్రాయాలతో ప్రపంచ విప్లవం గురించి కలలుకనే వీరిద్దరి సమావేశం ఒక ఆశ్చర్యకరమైనది. యుద్ధ సమయంలో మాంటిగ్యు జాతి దురభిమానుల పక్షం వహించాడు.

కాని ఇటువంటి సంఘటనలు జరుగుతుంటాయి. ఎవరో నీకు తెలియనివారిని రైల్లో కలుసుకుంటారు. రైలు చక్రాలు చేసే హోరులో మీరిద్దరూ గొంతెత్తి గట్టిగా మాట్లాడుకుంటారు. మరలా నీవు చెప్పలేని విషయాలు చెప్తావు. ఇద్దరూ విడిపోతారు. మరల కలుసుకోరు. అలాగే ఇక్కడ జరిగింది. అదీగాక వీరు ఆ సమావేశంలో ఫ్రెంచి భాషలో మాట్లాడుకున్నారు. తమ సొంత భాష కంటే విదేశీ భాషలో కలలు గనడం తేలిక.

కఠినతరమైన ఆనాటి ఫ్రెంచి ప్రవాసకాలంలో రోజుకో రెండు గంటలు పనిచేసేందుకు ఒక ఫ్రెంచి మహిళను ఏర్పాటుచేసుకున్నారు. ఓసారి ఆమె పనిచేస్తూ పాడుకుంటున్న పాటను ఇల్యిచ్ విన్నాడు. దానిని పదేపదే పాడించుకుని తాను నేర్చుకుని తరచు పాడేవాడు. జర్మన్ల చేతిలో ఫ్రెంచివారు కోల్పోయిన ఆల్సాస్ పట్టణాన్ని ప్రస్తావిస్తూ పాడే ఆ పాట ఈ క్రింది పాదాలతో ముగిసేది.

మీరు అల్సాస్, లొరైన్‌లను కబళించినా
మేము ఎప్పటికీ ఫ్రెంచివారమే
మీరు మా మైదానాలను జర్మనైజ్ చేసినా,
మా హృదయాలను ఎన్నటికీ గెలవలేరు....

అది 1909వ సంవత్సరం. విప్లవ ప్రతీఘాతకులు పెచ్చరిల్లి పోయిన కాలం, పార్టీ ఓటమికి గురైన కాలం. ఐనా పార్టీ తన విప్లవ చేవను కోల్పోలేదు. ఆనాటి ఫ్రెంచి మహిళ పాడిన పాటలోని "మా హృదయాలను ఎన్నటికీ గెలవలేరన్న" చివరి పంక్తిని పదే పదే నెమరువేస్తూ ఉండేవాడు. కఠినమైన ఆ ప్రవాసకాలపు జీవిత విషాదం రష్యా తిరిగి వచ్చినాక సైతం వెంటాడేది. దానికి విరుగుడా.. అన్నట్టు మాంటిగ్యు రాసిన "శాల్యూట్.. శాల్యూట్ సైనికుడా.." పాటను, ఫ్రెంచి మహిళ పాడిన మా హృదయాలను ఎన్నటికీ గెలవలేరు.. పాటను మననం చేస్తూ ఉండేవాడు. నిద్రలేని రాత్రులలో బెల్జియం కవి ఎమిలీ వెర్‌హెరెన్ కవిత్వాన్ని చదివేవాడు. యుద్ధకాలంలో ఫ్రెంచి నవలా రచయిత హెన్రీ బార్బీస్ మొదటి ప్రపంచయుద్ధంపై రాసిన Le Feu (అగ్నిలో) నవలను తన భావాలకు దగ్గరగా ఉన్న యుద్ధవ్యతిరేక నవలగా ఇల్యిచ్ భావించాడు.

మేము అరుదుగా నాటకం చూడడానికి వెళ్ళేవాళ్ళం. విషయపు స్థాయి తక్కువగా ఉన్నా, నటీనటుల అభినయం అసహజంగా ఉన్నా ఇల్యిచ్‌కు కోపం వచ్చేసేది. థియేటర్లలో ప్రదర్శించే అనేక నాటకాలలో మేము మొదటి అంకం పూర్తికాగానే బయటకు వచ్చేసేవాళ్ళం. "మరి అటువంటప్పుడు రావడమెందుకు? డబ్బు వృధా చేయడమెందుకు?!.." అంటూ మిగిలిన కామ్రేడ్లు నవ్వేవారు. 1915లో అనుకుంటాను బెర్న్‌లో, టాల్‌స్టాయ్ రాసిన "బతికి ఉన్న శవం" (The Living Corpse) నాటకమంతా చూశాం. నాటకం జర్మన్ భాషలోనే ప్రదర్శించబడినా, యువరాజు పాత్ర పోషించింది మాత్రం ఒక రష్యన్ నటుడు. అతడు టాల్‌స్టాయ్ భావాన్ని అద్భుతంగా పలికించగలిగాడు. ఉద్విగ్నతకు లోనై, ఉత్సాహభరితుడైన ఇల్యిచ్, నాటకంలో ప్రతి అంశాన్ని నిశితంగా గమనించాడు. ఆ రోజుల్లో ఇల్యిచ్‌కు ఎందుకో ఆనాటి నూతన రష్యన్ కళారంగం పరాయిదిగా, అసమగ్రమైనదిగా తోచేది. ఓరోజు రెడార్మీ కోసం ఏర్పాటుచేసిన కచేరీలో పాల్గొనమని ఆహ్వానమందింది. ముందు వరుసలోనే ఇల్యిచ్‌కు సీటు యిచ్చారు. మయకోవస్కీ కవితాపంక్తులను నటి జోవ్‌స్కాయా ఆలపించడం మొదలెట్టింది. కానీ అభినయ వేగానికి అవాక్కయిన ఇల్యిచ్, ఆమె ఆలాపనలోని అంశాన్ని ఏ కొంచెమూ గ్రహించలేకపోయాడు. చెకోవ్ రాసిన 'Evil-Doer'ను వెంటనే మరో గాయని ఆలపించడంతో కొంచెం తేరుకున్నాడు.

ఒక సాయంత్రం ఇల్యిచ్, యువజనులు కమ్యూన్లలో ఎలా ఉంటున్నారో చూద్దామనుకున్నాడు. ఆర్ట్ స్కూలు స్టూడెంట్స్ ఉండే కమ్యూన్‌లో యువమిత్రుడు వార్యా ఆర్మండ్‌ను చూసేందుకు వెళ్ళాలని నిర్ణయించాము. క్రోపోట్కిన్‌ను సమాధి చేసిన రోజునే, అంటే 1921లో మేమీ సందర్శన చేసినట్టు గుర్తు. అవి భరించలేని ఆకలి రోజులు. ఐనా ఆ యువకులంతా ఉత్సాహంగా ఉన్నారు. నేలపై పరచిన ఏ ఆచ్ఛాదనా లేని చెక్కలపైనే వారు నిద్రిస్తున్నారు. ఆహారం గురించి యిక చెప్పనవసరంలేదు. రొట్టె లేదు. కనీసం ఉప్పు కూడా లేదు. కానీ వాళ్ళెంతో ఉత్సాహంగా "మాకు ఆహారధాన్యాలున్నాయి...." అంటున్నారు. వాళ్ళ దగ్గరున్న ధాన్యంతో గంజి తయారుచేసి ఇల్యిచ్‌కు అందించారు. మెరిసే ఆ యువకుల వదనాలను ఇల్యిచ్ ఎంతో ప్రేమగా చూశాడు. ఆ యువతీ యువకుల మోముల్లోని వెలుగంతా, తన ముఖంలోనే ప్రతిబింబిస్తుందా?!.... అన్నట్లు ఇల్యిచ్ ముఖం వెలిగిపోయింది. వాళ్ళంతా ఇల్యిచ్‌కు తాము గీచిన చిత్రాలను చూపుతూ, అర్థం వివరిస్తూనే ప్రశ్నల వర్షం కురిపించసాగారు. వాటికి నవ్వుతూ ఓవైపు సమాధానమిస్తూనే, తను కూడా వారిని ప్రశ్నలు వేస్తూ ఇల్యిచ్ తప్పించుకోసాగాడు". మీరు ఏమేమి చదివారు?.. పుష్కిన్‌ను చదివారా?!.." ఇల్యిచ్ అడిగాడు. "ఓహ్.. లేదు. అతను బూర్జువా. మేము మయకోవస్కీని చదివాము". వారిలో ఎవరో సమాధాన మిచ్చారు. "పుష్కిన్‌ను చదవడం కూడా మంచిదనుకుంటాను".... ఇల్యిచ్ అన్నాడు. అప్పటినుండి మయకోవస్కీ అంటే ఇల్యిచ్‌కు అభిమానం పెరిగిందని చెప్పాలి. తర్వాత కాలంలో ఎప్పుడు మయకోవస్కీ ప్రస్తావన వచ్చినా, ఆనందం తొణికిసలాడే, సోవియట్ జీవన విధానం కోసం ప్రాణత్యాగానికైనా వెనుదీయని ఆనాటి యువ ఆర్ట్ స్టూడెంట్‌ను ఇల్యిచ్ గుర్తుచేసుకునేవాడు. ఆనాటి సమాజంలో తమను తాము వ్యక్తీకరించుకునేందుకు భాష చాలని మయకోవస్కీ నిగూఢ పద్యాలలో యువకులు సమాధానం వెదుకుతున్నారని ఇల్యిచ్ భావించాడు. సోవియట్ రెడ్‌టేపిజాన్ని, ఎగతాళి చేసిన మయకోవస్కీ కవిత్వాన్ని ఎంతగానో మెచ్చుకున్నాడు. నాటి సాహిత్యంలో ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రాసిన నవల "యూనో" గొప్ప నవల అని భావించాడు.

ఆర్ట్ థియేటర్లకు అనేకసార్లు వెళ్ళేవాళ్ళం. ఓసారి The Deluge (వరద) చూశాం. దీనిని ఇల్యిచ్ ఎంతగానో మెచ్చుకున్నాడు. ఆ తర్వాతిరోజే గోర్కీ Lower Depths చూశాం. ఇల్యిచ్ గోర్కీని ఎంతో యిష్టపడేవాడు. లండన్ పార్టీ కాంగ్రెస్ సమయంలో వాళ్ళ సాన్నిహిత్యం ఎంతో బలపడింది. గోర్కీ ఎంతటి విషయాన్నైనా తక్షణమే గ్రహిస్తాడనేవాడు. అతనితో స్పష్టంగా నిక్కచ్చిగా మాట్లాడేవాడు. అంటే గోర్కీ నాటకాలకు ఉన్నత స్థానం ఇచ్చేవాడని వేరే చెప్పనక్కర్లేదు. అతిగా నటించడం లెనిన్‌కు చికాకు పరిచేది. Lower Depths చూసిన చాలాకాలంపాటు మేము థియేటర్లకే వెళ్ళలేదు. ఒకసారి మేమిద్దరం కలిసి చెకోవ్ "అంకుల్ వాన్యా" చూశాము. ఆ నాటకం ఆయనకు ఎంతో ఇష్టం. చివరిసారి మేము కలిసి థియేటర్‌కు వెళ్ళింది 1922లో చార్లెస్ డికెన్స్ రాసిన "Cricket on The Hearth" నాటకీకరణను చూడటానికి. మొదటి అంకం నీరసంగా వుందని లెనిన్ భావించాడు. దానిలోని అతి భావుకత

ఆయనకు అసహనం కల్గించింది. నాటకంలో ఆటబొమ్మలు తయారుచేసే వృద్ధుడికీ, అతని గ్రుడ్డి కూతురికీ సంభాషణ మొదలయ్యేసరికి ఇక ఎంతమాత్రమూ భరించలేక బయటకు వచ్చేశాము.

ఇల్యిచ్ జీవితపు చివరి నెలలో సాయంత్రపు పూట అతని కోరికపై కథలు చదివి వినిపించేదానిని. షెడ్రిన్ కలం పేరు గల మిఖాయిల్ యెవ్‌గ్రఫోవిచ్ సల్టికోవ్ రచనలూ, ఇంకా గోర్కీ "నా విశ్వవిద్యాలయాలు" చదివేదానిని. అతనప్పుడు కవిత్వం వినడానికి కూడా యిష్టపడేవాడు. ప్రత్యేకంగా డెమ్యాన్ బెడ్నీ వీరోచిత పద్యాల నుండి వ్యంగ్యం వరకూ. కవిత్వాన్ని వింటూ కొన్నిసార్లు సాలోచనగా తలపంకిస్తూ కిటికీలోంచి అస్తమించే సూర్యుడిని చూస్తుండేవాడు. "కమ్యూనిస్టులు ఎప్పటికీ బానిసలు కారు" అనే కవితాపంక్తులు నాకు గుర్తున్నాయి. అలా చదివే సమయంలో "ఏ ఒక్క విప్లవ ఫలితాన్నీ ఏనాటికీ కోల్పోము" అంటూ నేను ఇల్యిచ్‌కి మరోసారి ప్రతిజ్ఞ చేసి చెప్పినట్టు అనిపించేది. ఇల్యిచ్ చనిపోవడానికి రెండురోజులు ముందు అతని టేబిల్‌మీదున్న జాక్ లండన్ పుస్తకంలోని కథ చదివి వినిపించాను. మొదటి కథ 'బతుకు తీపి' ఇది ఎంతో మంచి కథ. మానవుడు కాలుసైతం మోపలేని ఓ మంచు ఖండంలో ఆకలి, అనారోగ్యాలతో బాధపడుతూ ఓ మానవుడు నడుస్తున్నాడు. శక్తులుడిగిపోతున్నా, నడవలేకపోతున్నా అతను పాకుతూ పోతున్నాడు తప్ప గమనాన్ని ఆపలేదు. కానీ ఆకలితో అలమటిస్తున్న ఓ తోడేలు అతనిని వెంబడించసాగింది. మనిషికీ జంతువుకూ మధ్య జరిగిన పోరులో చివరికతడే గెలిచాడు. తన గమ్యాన్ని చేరుకున్నాడు. ఈ కథను విన్న ఇల్యిచ్ తీవ్రంగా కదిలిపోయాడు. రెండవనాడు చదివి వినిపించిన కథ మొదటి కథకు పూర్తిగా భిన్నమైనది. బూర్జువా నీతిని ప్రబోధించేది. ఓడలోని సరుకంతా మంచి ధరకు అమ్ముతానని ఓడ కెప్టెన్ యజమానికి మాటిస్తాడు. యిచ్చిన మాట నిలుపుకొనే క్రమంలో ఆ కెప్టెన్ తన ప్రాణాలే త్యాగం చేస్తాడు. ఈ కథ విన్న ఇల్యిచ్ నవ్వుతూ చేయి ఊపాడు. అదే నేనతనికి చదివి వినిపించిన చివరి సందర్భం.

**('లెనిన్ బంధువుల లెనిన్ జ్ఞాపకాలు' మాస్కో 1956 సౌజన్యంతో)** ✺

కవిత

# లెనిన్ కోసం ఇప్పుడు....!

– జనజ్వాల

**అక్కడ**
మట్టి మౌనంగా రోదిస్తుంది
దుఃఖం గాలిలా వ్యాపించి
అనంతమౌతుంది -

హిట్లరు చరిత నుండి
తొంగి చూస్తున్నప్పుడల్లా
యుద్ధం మనిషి లోపల
రక్తస్పర్శ అవుతుంది -

దుఃఖం కూడా యుద్ధానికి
కాలం రాసుకుంటున్న ముందుమాట -

మాట్లాడవలసినవాళ్ళు
మౌనంగా ఉన్నప్పుడు
మరి కాళ్ల క్రింద మట్టి రోదించదా!

తమకు తాము తలల్ని కొయ్య మబ్బులకు
వ్రేలాడదీసుకుంటు వుంటే
పొద్దుటినడక దారి తప్పదా!

పాము పడగమీద అరచేయి పెట్టి నిమిరినవాడు
చీకటి మీద నేత్రం కడిగి దీపం వెలిగించినవాడు
మట్టికి.... మనిషికి....
జాతికీ....,
దుఃఖం వరదలు
రక్తపు నదులు
నా జాతి జెండాకు
చికిత్స వికటించిన క్యాన్సర్
చివరి శ్వాస
ఇదీ -
ఇప్పుడైనా
శవ శరీరాలను వదిలించుకుని
తలుపులు తెర్చుకుంటే....,
నడవవలసిన రాస్తాకు
ఊరేగింపు అయితే....,
అతడు మళ్ళీ వస్తాడు!
భయానికి వణుకు పుట్టించి
చరితకు త్యాగం నేర్పిన
ధీరుడు
మళ్ళీ.... ....మళ్ళీ
వాక్యమై
కాలాన్ని గెలిపిస్తాడు -
జారిపోని కలంతోనే
కవి స్వప్నించాలి
ఇప్పుడు -
లోపల ఒక అగ్గిపుల్ల గీసుకోవాలి
లెనిన్ కోసం
ఇప్పుడు....!

✺

బుర్రకథ

# లెనిన్

- సుంకర సత్యనారాయణ

**వంత :** వినరా లెనిన్ మహాశయ జీవత – విప్లవ కథ నేడు
అనుపమాన మేధావి పీడితుల ఆశాజ్యోతి సుమా!
శ్రీ రష్యా దేశంబును పూర్వము – జారు యేలుచుండె
క్రూర నిరంకుశ పరిపాలకుడా – జారు చక్రవర్తి
దండి దేశమది సహజసంపదకు – తరుగులేదుగాని
ఉండుటకిల్లూ, పండమంచమూ – తిండి లేదు ప్రజకు
జమిందార్లు, భూస్వాములు, ధనికులు – చక్రవర్తి సఖులు
శ్రమపడి పనిచేసే జనులందరు – శత్రువులాతనికి
లంచగొండు లతి ధూర్తులు నీచులు – వంచకు లధికార్లు
మంచికి స్థానం బెట్లుండును, దు–ర్మార్గుల పెత్తనము

వ : అట్టి రష్యా దేశంలో సింబిర్స్కు ఒక పట్టణం. ఈ పట్టణ నివాసియైన ఇల్యా నికోలయేవిచ్ ఉల్యనోవ్ స్కూళ్ళ యిన్స్పెక్టరు. నిగర్వి, ప్రజాసేవకుడు. మరియా అలగ్జాండ్రోవ్నా యితని భార్య. ఈ పుణ్య దంపతులకు 1870 ఏప్రియల్ 22వ తేదీన మూడవ సంతానంగా లెనిన్ జన్మించాడు.

**పాట :**

అరుణారుణ కాంతులతో తూర్పున
అదుగో భాస్కరు డుదయించె
మంచుతెరలు విడిపోయి, జగానికి
మార్గం చక్కగ కనుపించె ॥ అరుణా ॥
పీడితులంతా లేవండీయని
విప్లవ గీతం వినిపించె
అన్నార్తుల శ్రమజీవుల వాడిన
ఆశాలతలే చిగురించె ॥ అరుణా ॥

వ : లెనిన్‌కు అన్నాయనే అక్కయ్య; అలెగ్జాండరను అన్నయ్యా; ఇద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లి కూడ ఉన్నారు.

తలిదండ్రులు నోచిన నోముల ఫలి–తంబు లెనిన్‌బాబు
కళలీనెడు యా కుటుంబమునకే – కంటిపాప సుమ్ము
అన్న, యలగ్జాండరున కితనిపై – నమితమైన ప్రేమ
'అన్నా', సోదరి క్రింద దింపదీ – యనుజుని తానెపుడు

వ : ఇట్లు అల్లారుముద్దుగా పెరుగుతున్న లెనిన్‌ను బడికి పంపారు.

బాలుడు లెనినూ పాఠశాలకేగి ॥ తందాన ॥
చాల శ్రద్ధగా చదువుచున్నాడు ॥ తందాన ॥
మహారచయితల ప్రసిద్ధ రచనలను ॥ తందాన ॥
చదివి సారమును చక్కగ గ్రహియించి ॥ తందాన ॥
రాజకీయ సిద్ధాంత గ్రంథములను ॥ తందాన ॥
రయమున పఠించి రాటులేలినాడు ॥ తందాన ॥

వ : ఈ కాలంలో పీటర్సుబర్గ్‌లో కొందరు యువకులు చక్రవర్తిని చంపాలని ప్రయత్నించి విఫలులయ్యారు. ఈ కుట్రలో పాల్గొన్నారనే నెపమారోపించి లెనిన్ అన్నగారైన అలెగ్జాండరునూ, అక్కగారైన అన్నాను ప్రభుత్వం అరెస్టు చేసింది. అప్పటికి లెనిన్ తండ్రి చనిపోయి సంవత్సరం అయింది. విచారణ తతంగమొకటి జరిపి, ప్రభుత్వం అలెగ్జాండరును ఉరితీసింది. అన్నాను కొకూష్కినో యను గ్రామంలో నిర్బంధ నివాసం (ఇంటర్న్‌మెంటు)లో ఉంచింది. అప్పటికి లెనిన్ 17 సంవత్సరాలవాడు.

ఈ వార్త విన్న లెనిన్ –
అన్నను చంపిన వార్తను సై
విన్న లెనిన్ గంభీరుడై సై
కన్నుల నిప్పులు గురిసెను సై
కందిపోయె ముఖమంతయు సై
అన్నా! యని చింతిస్తాడు సై
ఎన్నో యోచనలు చేస్తాడు సై
ఆత్మార్పణ గావించిన సై
అన్న వీరుడె, శూరుడె సై
అధమునొకని బడగూల్చిన సై
అందువలన ఫలమేమిటి? సై
ఒక్క జారు వెళ్ళిపోయిన–వే సై
రొక్కడు వస్తూ వుంటాడు ॥ భళా ॥
వ్యక్తి హింసతో నిజముగ సై
ముక్తి రాదు దేశానికి సై
ప్రజావిప్లవం వల్లనే సై
ఫలితము గల్గును కావున సై
ప్రజలను సమీకరించాలి
ప్రభుత్వాన్ని పడగూల్చాలి ॥ భళా ॥
అని కృతనిశ్చయుడై లెనిన్ సై
అక్కను నిర్బంధించిన సై
కొకూష్కినోలో వెంటనే సై
కుటుంబమును తా చేర్చెను సై

కాజాన్ విద్యాలయమున సై
కాలుబెట్టినాడా ఘనుడు ॥ భళా ॥
విద్యార్థుల యుద్యమమున సై
వీరుడు రయమున పాల్గొని సై
విప్లవాగ్ని రగుల్గొల్పెను సై
విషయమెరింగి ప్రభుత్వము సై
కక్షబూని యీ ధీరుని
కాజాన్ బైటికి తరిమింది ॥ భళా ॥

వ : అంతేగాదు, లెనిన్ను కూడ కొకూష్కినో గ్రామంలో ప్రభుత్వం యింటర్న్ చేసింది. ఈ రీతిగా వచ్చిన కుమారుని చూచి తల్లి మరియా అంటుంది. నాయనా!

మీ యన్నయ్యను పాడు ప్రభుత్వం - మింగెను నిర్దయగ
మీ యక్కయ్యను యిచటనుంచె మన - మీద కక్షబూని
నిన్ను కూడ నేటికి యిచ్చటనే - నిర్బంధించారు
ఎన్ని కష్టములు వచ్చిపడెనురా - కన్నతండ్రి మనకు
నన్నివియన్నియు చూడమనుచు మీ - నాన్న వెళ్ళిపోయె
ఇన్నిటికీ యీ సర్వనాశనం - బెట్లోర్తును కొడుక

వ : అని దుఃఖిస్తున్న తల్లిని చూచి లెనిన్ అంటాడు గదా?

రాక్షస పాలన యిది మనబోంట్లకు - రక్షణ లేదమ్మ
ఏ క్షణమున కేయాపద వచ్చునో - యెరుగజాలమమ్మ
ఎందరు తల్లులు నీ వలె నిచ్చట - కుందుచున్నారో!
ఎందరన్నవలె యురికంబముపై - కెక్కుచున్నారో!
ఎన్ని కుటుంబాలన్న మన్నమని - యేడ్చుచున్నాయో!
అన్నియు నీవును చూచుచునుంటివి - కన్నులార తల్లి
కొందరి సౌఖ్యంబునకై పేదల - నందరి హింసించు
క్రింది మీదుగానని జారుల తల - క్రింద చేయువరకు
శాంతి లేదు నీ సుతునికింక వి - శ్రాంతి లేదు తల్లి
కాంతిరేఖ లగుపించుటలేదా? - కన్నతల్లి నీకు

వ : అని యీ రీతిగా అనేక విషయాలు తల్లికి నచ్చజెప్పి, ఆమె నోదార్చాడు. కొంతకాలం యిట్లా గడిచింది. తరువాత -

చదువులపైకడు శ్రద్ధయున్న లెనిను ॥ తందాన ॥
చాల పెద్ద యా రష్యాలోనున్న ॥ తందాన ॥
సకల విశ్వవిద్యాలయములలోన ॥ తందాన ॥
స్థలముయున్న చోటెచటనైన సరియే ॥ తందాన ॥
చదువుట కనుమతి యిమ్మని కోరాడు ॥ తందాన ॥
ససేమిరా పొమ్మన్నారధికార్లు ॥ తందాన ॥
విదేశాలకు వెళ్ళియైన సరియే ॥ తందాన ॥
విద్య నభ్యసించాలని తలచాడు ॥ తందాన ॥
విద్యామంత్రికి విన్నవించినాడు ॥ తందాన ॥
విఫలమైనదా ప్రయత్నంబు కూడ ॥ తందాన ॥

వ : చివరికెలాగో పీటర్సుబర్గు యూనివర్శిటీలో పరీక్షకు కూర్చోవడానికి మాత్రం అనుమతి దొరికింది. పట్టుదలతో చదివి లెనిన్ ఆనర్సు కూడ ప్యాసయ్యాడు. తరువాత వీరి కుటుంబమంతా మాస్కోకు వచ్చింది. అక్కడ లెనిన్ తన తమ్ముడైన డిమిత్రీని మాస్కో యూనివర్శిటీలో చేర్పించాడు. ఆ కాలంలో పీటర్సుబర్గు విప్లవానికి, కార్మిక ఉద్యమానికి కేంద్రంగా ఉంది. లెనిన్ తన కుటుంబాన్ని మాస్కోలో వదలి, తాను యిచటకొచ్చి పనిచేయ ప్రారంభించాడు. అప్పటికి లెనిన్ వయస్సు 23 సంవత్సరాలు.

పీటర్సుబర్గుకే వెళ్లినాడుర
వెళ్ళి పీఠమే పెట్టినాడుర
పెట్టి కేడరును పెంచినాడుర
పెంచి రంగమున దించినాడుర
లెండిక వీరులు లెమ్మన్నాడు
రండోయ్ ముందుకు రమ్మన్నాడు ॥ లెనిన్ ॥
గూఢచారుల పీడ విరగడకు
ఇంజనీరు గారింట విందుర
విందు కందరూ వెళ్ళినారుర
వెళ్ళి చర్చ సాగించినారుర
లెనినూ అచటికి వచ్చాడు
పనులన్నియును పంచాడు ॥ లెనిన్ ॥
పట్టుదలగ బహు కట్టుదిట్టముగ ॥ తందాన ॥
పగలు రేలు తన పార్టీ సభ్యుల ॥ తందాన ॥
విజ్ఞానము నభివృద్ధి పరచుచు ॥ తందాన ॥
మెలుకువతో నట వివిధ రంగముల ॥ తందాన ॥
పని చేయించెను సభ్యులతో నా
ప్రజ్ఞానిధి లెనిను ॥ తందాన ॥
ఫ్యాక్టరీలలో చాకచక్యముగ ॥ తందాన ॥
పంచినారు కరపత్రాల్విరివిగ ॥ తందాన ॥
కార్మికులిదిగని కన్నులు తెరచి ॥ తందాన ॥
సమ్మెలు చేసిరి జయప్రదముగ ॥ తందాన ॥
గుండెలదిరి యిది చూచి ప్రభుత్వపు
గూఢచారులపుడు ॥ తందాన ॥

వ : ఏమనుకుంటున్నారు -

వచ్చాడంటోయ్ - వచ్చాడు
వోల్గా ప్రాంతం - వాడొకడు ॥ వచ్చా ॥
ఆర్తుల నిరుపేదల మేల్కొలిపే
అద్భుతమగు మేధావియట ॥ వచ్చా ॥
అసలీ సంచలనాని కంతకు
అతడే కారకుడంట
బహు మెలకువ కలవాడంట
రైతుల - తలలో నాలుక యంట
పట్టాలంటే పత్తా దొరకని
దిట్టమైన మార్క్సిష్టంటా ॥ వచ్చా ॥

వ : ఆ రోజుల్లో సెంటు పీటర్సుబర్గ్ (లెనిన్ గ్రాడు)లో సుమారు యిరవై మార్క్సిస్టు సమితులుండేవి. వాటన్నిటినీ యేకం చేసి లెనిన్, "కార్మికవర్గ విమోచనా పోరాట సంఘం"గా మార్చాడు. ఇక్కడే యీయనకు కృపస్కయాతో ప్రథమ పరిచయం ఏర్పడింది. తర్వాత లెనిన్ ఆమెను వివాహమాడాడు. చివరకు ఎలాగో పోలీసులు లెనిన్‌ను 1895 డిసెంబరు 20వ తేదీ రాత్రి అరెస్టు చేశారు. లెనిన్ జైల్లో ఉండి కూడ –

విప్లవ కార్యకలాపము లాయన – విడచిపెట్టలేదు
విప్లవమే పోరాట సంఘమున – కనుదిన మెట్లెట్లో
తన సలహా లందించుచు చక్కని – దారి చూపుచుండె
పైకగుపించని పాల సిరాతో – వైద్య గ్రంథమందు
ఆ కసాయి ఘాతుక ప్రభుత్వ కృ–త్యములను చిత్రించి
కారాగారం బైటికి పంపుచు – కష్టంబులకోర్చి
పోరాటము సాగించెను దీక్షగ – పూజ్యుండా లెనిను.

వ : పదునాలుగు మాసాల అనంతరం ప్రభుత్వం లెనిన్‌కు మూడు సంవత్సరాలు ప్రవాసశిక్ష విధించింది. సైబీరియాలో షూషన్‌స్కోయి ఒక గ్రామం. ఇది యెక్కడున్నదో కూడ యెవ్వరికి తెలియదు. ప్రభుత్వం లెనిన్‌ను యిక్కడ వుంచింది. ఆయనతోపాటు కృపస్కయా కూడ వుంది. అక్కడ మాత్రం లెనిన్ వూరుకున్నాడా!....

ఆ పరిసర ప్రాంతంబులగల ప్రజల – లందరి తత్వమును
ఆ ప్రాజ్ఞుం డధ్యయనము చేయుట – కారంభించాడు
అపారమగు నా మంచు ప్రదేశము – నందు బీద ప్రజల
విపరీతంబగు బాధల గని తా – వికలుండైనాడు
పాడు చలికి వన మృగములు సహితము – బ్రతుకలేవు అచట
కూడూ, గుడ్డా, నివశించుటకొక – గూడు కూడలేని
మనుజుల జీవిత మెట్లుండునొ యిక – మనకు చెప్పవలెన?
ధనికులందు రొక రిద్ద రూరునకు – జనుల దోచుకొనుచు
ధనికుల దాసులు మహాభయంకర – దానవు లధికార్లు
లెనినా దీనుల కాపాడుటకై – పనిచేయగసాగె.

వ : షూషెన్ స్కోయిలో ఒకచోట లెనిన్ కుటీరం వుంది. ఈ గ్రామం చుట్టు వున్న అరణ్యమంతా ప్రభుత్వానిదే. ఒకనాడు అరణ్యం కొంతభాగం తగలబడింది. ఫారెస్టరు కంగారుపడ్డాడు. ఉద్యోగం నిలవాలంటే ఎవరిమీదనో ఒకరిమీద నేరం ఆరోపించాలి. అందుకని డిమిత్రీ దానిలోవిచ్ అను రైతు మూలాన అడవి కాలిపోయిందని పైకి రిపోర్టు వ్రాశాడు. డిమిత్రీ కొంపా, గోడూ అమ్మి నష్టాన్ని రాబట్ట మన్నది ప్రభుత్వం. ఈ విషయం తెలిసిన డిమిత్రీ విచారగ్రస్తుడై వాకిట్లో కూర్చున్నాడు. ఆ దారిన వెళుతున్న లెనిన్ ఆ రైతును చూచి అంటాడూ..

ఎంతో దిగులుగ నుంటివి నీ విపు – డెందుకు తాతయ్యా
అంత ప్రమాదం బేమి జరిగినది – యింతకు చెపుమయ్య

వ : అది విని రైతు యేమంటున్నాడు –

అగ్గిపడి మొన మొన్న – అడవి కాలింది – ॥ తందాన ॥
భగ్గుమన్నపుడెకద – మనము జూచింది ॥ తందాన ॥
పాపిష్టి యధికార్లు – పగబూనినారు – ॥ తందాన ॥
నాపైన యీ నింద – మోపినారయ్య – ॥ తందాన ॥
నేనంట అడవికీ – నిప్పు పెట్టింది – ॥ తందాన ॥
కాన ఆ నష్టాన్ని – కట్టవలెనంట – ॥ తందాన ॥
కాదంటె ననుబట్టి – ఖైదు చేస్తారు – ॥ తందాన ॥
లేదంటె నా కొంప – లేపివేస్తారు – ॥ తందాన ॥
పిల్లలూ పెండ్లాము – తల్లడిలిపోవు – ॥ తందాన ॥
ఇల్లు వాకిలి వాళ్ళు – కొల్లగొడతారు – ॥ తందాన ॥
దుష్టాత్ము లగువారి – దొరలుగాజేసి – ॥ తందాన ॥
కష్టాలు మా కొరకు – సృష్టించి జగతి – ॥ తందాన ॥
దేవుడిటు చేశాడు – దేనికో మమ్ము – ॥ తందాన ॥
చావు మేలీ పాడు – జీవితముకంటే – ॥ తందాన ॥

రాలు కరుగ నీ రీతిగ చింతిలు – రైతు నాలకించి
బేలతనము విడనాడ మనుచు నా – పేద వెన్ను చరిచి
పలికెను లెనిన్ మహాశయుడాతని – భయము తీరనిటుల
కలకాలము కాపురముండవు యీ – కష్టము లిటు వినుము
నేనొక మహజరు వ్రాసి యిచ్చెదను – నిర్భయముగ నీవు
దానిని ఫారెస్టరున కొసంగుము – తక్షణమే పోయి

వ : అని పలికి లెనిన్ మహజరు వ్రాసి డిమిట్రీకి యిచ్చి, తన దారిన వెళ్ళాడు. కాని ఆ రైతు ఆ పని చేయలేదు. అధికారి ఎదుటకు వెళ్ళడానికి భయపడ్డాడు.

మరునాడు యీ విషయం తెలిసిన లెనిన్ చాల బాధపడ్డాడు. కడకు తానే వెళ్ళి అధికారి కా మహజరు యిచ్చి వచ్చాడు. దానితో అధికార్లు డిమిటీ యింటి వైపు కూడ తిరిగి చూడలేదు. ఇట్లు తన ప్రవాసకాలంలో లెనిన్ అచ్చటి ప్రజలకు తోడ్పడ్డాడు. కనుక ఆయన్ని వారు తమ ప్రాణతుల్యంగా భావించారు.

1900 సంవత్సరంలో లెనిన్ తన సైబీరియా ప్రవాసం నుండి బైటికొచ్చాడు. అప్పటికీ పార్టీలో వివిధ ధోరణులు ఏర్పడి, పార్టీ ఛిన్నాభిన్నమై వుంది. వీరందరినీ నిర్మాణయుతంగా నడపాలంటే రహస్య వార్తాపత్రిక నడపటం అత్యవసరమని లెనిన్ నిశ్చయించాడు. ఆ రోజుల్లో రష్యాలో రహస్య పత్రిక నడపటం చాలా కష్టం. అందువల్ల లెనిన్ విదేశాలలో వుండి "ఇస్క్రా" అనే పత్రిక నడపసాగాడు.

విజయవంతముగ ఇస్క్రా వెలువడె – విదేశాల నుండి
గజిబిజిగానున్నట్టి సమస్యల – కడు నేర్పుగ తడివి
ఖచ్చితమగు మార్క్సిస్టు దృక్పథము – కలిగి నిరంతరము
చచ్చు వాదనలనన్నిటినీ ని–ష్కర్షగ ఖండించి
రాజీలేని మహోన్నత విప్లవ – రథసారథి లెనిను
బూజుపట్టిన యిజాలను చేసెను – భూస్థాపితమచట.

వ : ఇంతలో రష్యా–జపాన్ యుద్ధం వచ్చింది. విప్లవాన్ని అణచడానికి, తన రాజకీయాలను బలపర్చుకోవటానికి యుద్ధం తోడ్పడుతుందని పాపం జారు ప్రభుత్వం తలచింది. కాని దాని ఆశ ఫలించలేదు. యుద్ధం మూలాన యిది వరకు యెన్నడూ లేనంతగా జారు ప్రభుత్వపు పునాదులు కదిలిపోయాయి.

దేశం నలుమూలలా దరిద్రం తాండవమాడుతూంది. ఇటు ప్రజల్లోను, అటు సైనికుల్లోను, అసంతృప్తి ప్రబలింది. దాని ఫలితంగా సెంటుపీటర్సు బర్గులో సమ్మె ప్రారంభమైంది. మతాధిపతి గేపన్ ఒక విద్రోహి. ఆ కుటిలుని పథకం ప్రకారం పదిహేను వేలమంది కార్మికులు జారు చిత్రపటాలను ధరించి, రాజభక్తి గేయాలు పాడుతూ, తమ కష్టాలను చెప్పుకోడానికి రాజభవనం ముందుకు వెళ్లారు. గాని ఆ నిరంకుశ జారు చక్రవర్తి వాళ్ళను తుపాకులతో కాల్పించాడు. ఆ కాల్పుల్లో వేయిమంది కార్మికులు చనిపోయారు. రెండువేలమందికి పైగా గాయపడ్డారు. దాంతో రష్యాలో –

ఫ్యాక్టరీలలో – పల్లెసీమలో
గనిలో వనిలో – కడలి మధ్యలో
విద్యార్థులలో – విజ్ఞానులలో
సైన్యంబులలో – సర్వజనులలో
విప్లవ జ్వాలలు లేచాయి
వినువీధుల కెగబ్రాకాయి ॥ భళా ॥
రైళ్ళురావు, హోటళ్ళు బందుర
పవరుహౌసు పనివాళ్ళు రారుర
ప్రతి కూడలిలో బారికేడ్లుర
హోరాహోరీ పోరాటముర
జారు ప్రభుత్వం జూచింది
ఠారుబుట్టి తల దించింది. ॥ భళా ॥

వ : లొంగి వచ్చిన జారు 1905 అక్టోబరు 5వ తేదీన ఒక ప్రణాళిక ప్రకటించాడు. అందులో వ్యక్తి స్వాతంత్ర్యం, ప్రార్థనా స్వాతంత్ర్యం, వాక్సభా సమావేశ స్వాతంత్ర్యం వాగ్దానం చేశాడు. మరొక "డ్యూమా" (శాసనసభ)ను సమావేశపర్చటానికీ, ప్రజల్లో అన్ని తరగతులవారికి ఓటింగు హక్కును విస్తరింపచేయటానికి అంగీకరించాడు. జారు ప్రభుత్వం వాగ్దానం చేసిందిగాని ఆచరణలో మాత్రం శూన్యం. తర్వాత యిది గ్రహించిన ప్రజలు యేమంటున్నారు –

**కీర్తన :**

జారు మోసగాడు
కంగారుబుట్టి వాడు
ప్రకటించాడు నాడు
బలే ప్రణాళిక చూడు ॥ జారు ॥
చనిపోతే స్వాతంత్ర్యం
బ్రతికుంటే బందిఖాన
పదవిగాళ్ళ కొక దాణా
పడవేశాడీ విధాన ॥ జారు ॥
కాగితాలపై రాతలు
కమ్మని కూతలు, బూతులు
ప్రభువులు పన్నిన ఉచ్చులు
ప్రజలను దించే గోతులు – ॥ జారు ॥

వ : ప్రజల్ని, ప్రజానాయకుల్ని మోసగించి, విప్లవాన్ని ఆపగలిగానని జారు ప్రభుత్వం పొంగిపోయింది. కాని లెనిన్ చేసిన అవిరామ కృషి ఫలితంగా పార్టీ కాలూని నిలిచింది. ప్రజలూ తట్టుకున్నారు –

ఇంతలో మొదటి ప్రపంచయుద్ధం వచ్చింది. జారు ప్రభుత్వం గ్రేటు బ్రిటన్ పక్షం అవలంబించటం చూచి జర్మనీ 1914 జులై 19వ తేదీన రష్యాపై యుద్ధం ప్రకటించింది. యుద్ధకాలంలో విపరీత లాభాలు సంపాదించవచ్చునని, కొత్త మార్కెట్లు పట్టవచ్చునని, రష్యా పెట్టుబడిదారీ వర్గం భావించి యుద్ధానికి తలపడింది. పెటీబూర్జువా పార్టీలైన సోషలిస్టు రివల్యూషనరీలు, మెన్షివిక్కులు, సోషలిస్టు జండాను ముసుగుగా వినియోగించుకొని, యుద్ధానికి తోడ్పడ్డారు. –

యుద్ధంవల్ల రష్యా ఆర్థికంగా సర్వనాశనమైంది. ఒక కోటి, నలభై లక్షల మంది యువకులను సైన్యంలో చేర్చారు. అందువల్ల మిల్లులూ, ఫ్యాక్టరీలు ఆగిపోయాయి. చేసేవాళ్ళు లేక వ్యవసాయం పాడుపడింది.

యుద్ధరంగంలోని సైన్యాలకు తిండిలేదు. కాళ్ళకు బూట్లు లేవు. చివరకు ఆయుధాల సరఫరా కూడ లేదు. దేశంలో ఆకలి మంటలతో మలమల మాడిపోతున్న ప్రజలు తిరుగుబాటు చేశారు. సైనికులు ప్రజలపై తుపాకులు కాల్చడానికి నిరాకరించారు. ఉదయం తిరుగుబాటులో చేరిన సైనికుల సంఖ్య పదివేలైతే, సాయంత్రానికి అరవై వేలకు దాటిపోయింది.

తిరుగుబాటుదారులైన సైనికులు, కార్మికులు జారు మంత్రులను, సైన్యాధిపతులను అరెస్టు చేశారు. జైళ్ళలోని విప్లవకారులను విడుదల చేశారు. 1917 ఫిబ్రవరిలో బోల్షివిక్కులు చొరవ తీసుకొని కార్మిక, సైనిక, సోవియట్లను యేర్పరుస్తున్నారు. రాజీ బేరగాళ్ళయిన మెన్షివిక్కులు, సోషలిస్టు రివల్యూషనరీలు, సోవియట్లలోని పదవులాక్రమించి, మెజారిటీ సంపాదించారు. తత్ఫలితంగా నూతన ప్రభుత్వం వాళ్ళ చేతుల్లోకి పోయింది.

ఏప్రియల్ మూడవ తేదీ రాత్రి పరదేశంలో నున్న లెనిన్ పెట్రోగ్రాడ్ నగరానికి వచ్చాడు. ఆయనకు స్వాగతం యివ్వడానికి లక్షలాది కార్మికులు, సైనికులు, నావికులు వచ్చారు. లెనిన్ రైలు నుండి దిగినప్పటి వారి ఉత్సాహం వర్ణనాతీతం. ఆయనను భుజాలపై నెత్తుకొని, స్టేషన్‌లోని ముఖ్యమైన విశ్రాంతి భవనానికి తీసుకువెళ్ళారు. పెట్రోగ్రాడ్ సోవియట్ తరపున ఆయనకు స్వాగతం యివ్వడానికి వచ్చిన మెన్షివిక్కులగు కీడ్జి, స్కోబిలోవ్‌లు, లెనినూ, తామూ, ఒకే భాష మాట్లాడగలమనే ఆశను వెలిబుచ్చారు. లెనిన్ యీ ఊకదంపుడు కబుర్లు వింటూ కూర్చోలేదు. వారిని ప్రక్కకు నెట్టి, అచటనున్న మహా జనసమూహం వద్దకు వెళ్ళి ఒక మోటారు ట్రక్కు పైనెక్కి –

అనఘుడమ్మహాజనులవైపు య – త్యాదరముగ చూచి
తన దక్షిణ హస్తంబునెత్తి యి–ట్లని యుపన్యసించె
సోదర కార్మిక కర్షక సైనిక – శూరాగ్రణులార
ఓ దయానిధుల్లార రష్యా – యోధులార వినుడు
పోరాటంబున కూల్చివైచి యా – జారు ప్రభుత్వమును
కోరి తెచ్చుకొంటిరిగద మీరీ – క్రొత్త ప్రభుత్వమును
కూడుగుడ్డలు ప్రశాంత జీవితము – కోరినారు మీరు
చూడదు మీ ముఖ్యమైన ప్రభుత్వము – మూడు నెలల నుండి

మీ యాందోళన కార్యక్రమమే – మిము కాపాడాలి
వేయండింకొక యడుగు ముందునకు – విజయంబది మీదె
ధరణి విప్లవము వర్ధిల్లాలది – తథ్యమనుచు పలికి
విరమించెను తన యుపన్యాసమును – విప్లవ నాయకుడు

వ : లెనిన్ ఉపన్యాసంతో ప్రజలు మేల్కొన్నారు. ఏ రోజుకారోజు కమ్యూనిస్టులు, వారి పత్రికలు, కరెన్స్కీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను బయట పెడుతున్నారు. ఉద్రేకపూరితులైన ప్రజల్ని చూచిన కరెన్స్కీ ప్రభుత్వం భయపడింది. దీనికంతకూ కారకుడైన లెనిన్‌ను ఉరితీసి కసి తీర్చుకోదలచింది. తిరిగి లెనిన్ రహస్య జీవితం గడుపవలసి వచ్చింది. పెట్రోగ్రాడ్‌కు కొద్ది దూరంలో వున్న రజ్‌లీవ్ సరోవరంలోని ఒక గడ్డివామిలో లెనిన్ మకాం యేర్పాటు చేశారు.

ఇంతలో వర్షాకాలం వచ్చింది. అంచేత రజ్‌లీవ్ నుండి లెనిన్ మకాం యెత్తివేయవలసి వచ్చింది.

రాత్రివేళ రహస్యంగా కొద్దిదూరంలో నున్న ఉధెల్నయా అనే రైల్వే స్టేషనుకు చేరాడు. చీకట్లో స్టేషన్‌కు కొంచెం దూరంలో 71 నెం. రైలు ఇంజను ఆగివుంది. డ్రైవరు లెనిన్ కొరకు ఎదురుచూస్తున్నాడు. మారువేషంలో నున్న లెనిన్ యింజన్‌లోకి ఎక్కాడు. బండి కదిలింది. ఫైర్‌మన్ వేషంలో నున్న లెనిన్ చావలి తీసుకొని బొగ్గు, కట్టెలు వేయడానికి ప్రారంభించాడు. అసిస్టెంటు హుషారుగా పాట మొదలుపెట్టాడు –

**పాట :**

ఏలే – యాలా – ఏలే – యాలా హైలేసా – ఓహో
ఏడానుంటివో – లెనిన్‌బాబ – రావయ్యా ॥ ఏలే ॥
చేతులు నాకేవాడు పోతే – బాబయ్య
మూతులునాకే వాడొచ్చాడు – రావయ్యా ॥ ఏలే ॥
పేదలపాలిటి పెన్నిధివయ్యా – బాబయ్యా
ఏదో దారి చూడాలయ్య – రావయ్యా ॥ ఏలే ॥

వ : మార్గమధ్యంలో సంభవించిన అనేక ప్రమాదాల నుండి తప్పించి యింజన్ డ్రైవరు తమ ప్రియతమ నాయకుని ఫిన్లాండు చేర్చాడు.

ఇక నిక్కడ రష్యాలో లెనిన్ అనుచరులైన బోల్షివిక్‌ల అవిరామ కృషి ఫలితంగా ప్రజావిప్లవం పరిపక్వ దశకు వచ్చింది. తిరుగుబాటుకు తేదీ నిర్ణయించారు. అక్టోబరు 24 రాత్రి లెనిన్ స్మోల్నీ ప్రవేశించి తిరుగుబాటుకు తానే స్వయంగా నాయకత్వం వహించాడు. విప్లవ సైన్యాలు వింటరు భవనాన్ని ముట్టడించాయి.

కత్తులు, కర్రలు, బల్లెము లీటెలు – సుత్తులు గొడ్డళ్ళు
అత్తరి తమతమ చేతికి దొరికిన – ఆయుధాలు బట్టి
స్త్రీలూ, పురుషులు, బాలురు, వృద్ధులు – సింహంబుల పగిది
కాలరుద్రులై మహావేశమున – కదనభూమి కురికి
జయధ్వానములు చేయుచు శాత్రవ – సైన్యముపై దూకి
రయమున వారలజీల్చుచు కూల్చి, ప–రాక్రమించి వారు
ధీరతతో నా రైల్వే రేడియో – స్టేషనులనుబట్టి
వారట ప్రభుత్వ కార్యాలయమును – బ్యాంకు లాక్రమించి
తుంటరులందరు దునిమి దారి, ని–ష్కంటకంబు చేసి
వింటరు భవనము జొచ్చి మంత్రులను – విడువక బంధించి
సమ్ముదమున విజయధ్వానమ్ములు – సల్పి రద్భుతముగ
అమ్మహాధ్వనికి ఘూర్ణిల్లెను బ్ర–హ్మాండం బావేళ

వ : ప్రభుత్వం బోల్షివిక్కుల చేతుల్లోకి వచ్చింది. దానికి లెనిన్ ప్రెసిడెంటు. ప్రభుత్వం చేతిలోకి రాగానే బోల్షివిక్కులు భూస్వాములకు భూమిపై గల హక్కును రద్దు చేస్తూ ఒక చట్టం చేశారు. దాని ప్రకారం–

జారు కుటుంబపు భూములను భూ–స్వాముల భూములను
వేరుగ చెప్పేదేమిటి? దోపిడి – దారుల కమతాలు
భూమిపైన కష్టించే వారికి – భుక్తపరచినారు
ఈ మాదిరి భూములు నలుబది కో–ట్లెకరమ్ములు సుమ్ము

వ : ఇంతేకాదు రైతులు భూస్వాములకు ఏటేటా చెల్లించే యాభై కోట్ల బంగారు రూబుల్సు విలువచేసే మగతా రద్దు చేశారు.

నగములు, వనములు, ఖనిజ సంపదలు – నదులు, తటాకములు
అగణిత ప్రకృతి సంపదలా ప్రజ – లందరివైనాయి.

వ : సామ్రాజ్యవాద యుద్ధంలో నుండి రష్యా తప్పుకుంది. అంతేగాదు. జర్మనీ కోరిన విషమ షరతులన్నింటికీ అంగీకరించి దానితో రాజీపడింది. ఇది చూచి మిత్రమండలి దేశాలకు గంగవెర్రులెత్తాయి.

రానేవచ్చెను పేదల రాజ్యం – రష్యాలో ననుచు
మానివేసి తమ పోరాటం సా – మ్రాజ్యవాదులంత
దుర్మార్గముగ రష్యాపైబడి – దోచుకొనుచు దాని
నిర్మానుష్యము చేయసాగిరతి – నిర్దయగా దాని

వ : ఈ ఘోర దురాక్రమణను చూచి లెనిన్ మహాశయుడు ప్రపంచ ప్రజలనుద్దేశించి అంటాడు –

పరమ పూజ్యులగు ప్రపంచ పీడిత – ప్రజలారా వినుడు
వెరపులేని యీ దోపిడి దొంగల – దురాగతము కనుడు
ఒకగా నొక పేదల రాజ్యంబిట – నుద్భవించగానే
ఒకటై పదునాలుగు రాజ్యంబులు – మెకములవలె దూకి
మందవేసి ప్రజలను జంపుచు గ్రా–మాలు దోచుకొనుచు
ముందున కరుదెంచుచున్నారీ – ముష్కరులీనాడు
ఆయుధబల మధికము వారికి మా – దంత ప్రజాబలము
సాయపడండీ అందచేసి మీ – సానుభూతి మాకు
ప్రజాబలానికి సరితూగవు యీ – పశుబలాలు జగతి
కుజనులు వీరికి కట్టెద మిచటనె – గోరీలని పలికె.

వ : ప్రపంచంలో అనేకచోట్ల కార్మికులు లెనిన్ పిలుపునందు కొన్నారు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సమ్మెలు ప్రారంభించారు. తమ ప్రభుత్వాన్ని రక్షించుకోడానికి లక్షల సంఖ్యలో కార్మికులు, కర్షకులు రెడార్మీలో చేరి శత్రువుల నెదిరించి హోరాహోరీగా పోరాడుతున్నారు.

ఈ స్థితిలో 1918 ఆగస్టు 30వ తేదీన లెనిన్ గ్రెనేడ్ ఫ్యాక్టరీ కార్మికుల ఆహ్వానాన్నందుకొని అక్కడ వుపన్యసించుట కెళ్ళాడు. కమ్యూనిస్టు నాయకులను హత్య చేయటం, రైట్ సోషలిస్టు రివల్యూషనరీల కార్యక్రమం. వీరొక స్త్రీని లెనిన్‌ను చంపడానికి పంపించారు. ఆమె

వచ్చి ఫ్యాక్టరీ ప్రాంగణంలో లెనిన్ కారు నిలిచియున్నచోట తారాడుతూ వుంది. లోపల అనేక విషయాలుపన్యసించి తుదిమాట చెబుతున్నాడు. ఏమని –

కార్మిక యోధాగ్రేసరులారా – కష్టజీవులార
కార్మిక కర్షక నియంతృత్వమును – కాపాడాలిపుడు
ధీరులార మన చావు బ్రతుకు యీ – పోరాటములోన
వీరస్వర్గమో, విజయమో, రెండే – దారులు అన్నాడు.

వ : ఈ రీతిగ తన ఉపన్యాసమును ముగించి లెనిన్ మహాశయుడు బయటకు బయలుదేరాడు. కార్మికులాయన్ను సాగనంపుతున్నారు –

భళా భళానోయ్ తమ్ముడా – సై
భాయి భళానోయ్ దాదాన
సాగనంపు సహచరులతో – సై
సంభాషిస్తూ వచ్చెడి – సై
అనఘుని లెనిన్ మహాశయు – సై
నటనడయాడుచు నుండిన – సై
కామిని కన్నుల చూచింది – సై
కారు వెనకకే వచ్చింది – ॥ భళా ॥
కరుణామయుడా లెనినదే – సై
కార్మికులందరి కనుగొని – సై
కడు యుత్సాహము తోడను – సై
ఘనుడిదె రెడ్‌శాల్యూటనీ – సై
ద్వారం తెరచి యుండిన – తన
కారు ఎక్కబోతున్నాడు – ॥ భళా ॥

వ : ఇంతలో :

మ్రోగె రివాల్వరు ధనధన ధనధన మూడుసారులపుడు
త్యాగధనుండగు లెనిన్ కందులో – తగిలె రెండు గుండ్లు
తగిలిన గుండ్లను సరకు గొనకనా – తరుణంబున లెనిను
పగతురు భీతిల్లగ కారెక్కెను – బాధకోర్చి యటులే.
ఇంతలోనే రివాల్వరు కాల్చిన – హంతకురాలైన
కాంతను పెనుభూతంబున బట్టిరి – కార్మికులట్లట్లె

వ : ఆ పిశాచి కాల్చిన ఒక బులెట్ లెనిన్ మహాశయుని ఊపరితిత్తిని, రెండవ బులెట్ ఆయన చేతిని గాయపర్చాయి. మూడవది ఆ మహనీయుని కోటును దూసుకుపోయింది.

వెంటనే ఆయన్ని కారులో యింటికి చేర్చారు. డాక్టర్లు చికిత్స ప్రారంభించారు. పిడుగులాంటి యీ వార్త క్షణంలో రష్యా అంతటా వ్యాపించింది. వినగానే –

కొదమసింగముల రీతిగ ప్రజలా – క్రోశించుచు లేచి
మదోన్మత్తులగు విప్లవ ద్రోహుల – గదిమి కూల్చినారు
దుర్జయులై శాత్రవ వ్యూహంబుల – తుత్తునియలు చేసి
గర్జించుచు క్రోధమున రెడార్మీ – కదనభూమి దూకి
పదునాలుగు దేశాల బలాలను – పడగూల్చుచు భువికి
పదపడి సింబిర్స్క్ నగరంబును – పట్టివేసినారు.

వ : సింబిర్స్క్ పట్టుకొన్న శుభవార్తను రెడార్మీ అప్పటికి ఏడురోజుల క్రితం గాయపడిన లెనిన్ మహాశయునకు తెలియచేసింది. ఇది విన్న లెనిన్ మహానందభరితుడై డాక్టర్లు వద్దని చెప్పినా, వినకుండ, గాయపడి వున్న చేత్తో కలం అందుకొని రెడార్మీకి లేఖ వ్రాశాడు –

"ప్రియమైన కామ్రేడ్స్ – మీరు నా జన్మస్థానమైన సింబిర్స్క్ పట్టణాన్ని విముక్తి చేశారు. అది మీరు నా గాయానికి వేసిన పట్టీ. ఇవిగో నా విప్లవాభివందనాలు అందుకొనండి" అని అందులో వుంది.

ఈ ఊపుతో రెడార్మీ పద్నాలుగు సామ్రాజ్యవాద దేశాలను రష్యా సరిహద్దులకు దాటగొట్టింది. లెనిన్ మరల కార్యరంగంలోకి ప్రవేశించి, ఒక పంచవర్ష ప్రణాళికను ప్రకటించి, దానిని జయప్రదం చేయమని ప్రజలకు పిలుపునిచ్చాడు. ఆ పిలుపనందుకొన్న కార్మికులు, కర్షకులు ప్రణాళికను దిగ్విజయంగా నిర్వహించారు. దేశంలో పంటలు పరిశ్రమలు నెలకొన్నాయి. ఈ స్థితిలో 1924 జనవరి 21వ తేదీన గోర్కీ అను గ్రామంలో –

అనుపమాన మేధావి పూజ్యుడు – అస్తమించినాడు
విని యీ దారుణ వార్త ప్రపంచమె – విడచెను కన్నీరు.

**పాట :**

వెళ్ళిపోయావా – బాబా
విడచిమమ్మెల్లరనూ యెచటికొ ॥ వెళ్ళి ॥
కారుచీకటి లోనబడి, ఏ
దారితోచక పరితపించే
ఆర్తులందరి నుద్ధరించుట
కవతరించిన త్యాగమూర్తి ॥ వెళ్ళి ॥
దోచుకొని పేదలను, బ్రతికే
నీచులగు సామ్రాజ్యవాదుల
పీచమణచి జగాన, ఆశా
జ్యోతి నిటవెలిగించి తండ్రీ ॥ వెళ్ళి ॥

వ : ప్రపంచ కార్మికవర్గమంతా, అన్ని రంగాలలోను, పనులన్నీ మానివేసి మౌనముద్ర వహించింది. లెనిన్ మహాశయుడు తమకు గురువనీ, సంరక్షకుడనీ, పలు విధాలుగా ప్రశంసించారు.

ఈ స్థితిలో కామ్రేడ్ స్టాలిన్, లెనిన్ మహాశయు నుద్దేశించి పార్టీ మహాసభలో అంటాడూ –

అన్నా! లెనిన్ మహాశయ, మరువదు – నిన్నీ లోకంబు
నిన్న నేడు రేపేమిటి యీ జగ – మున్న యన్ని నాళ్ళు
నీవు శాశ్వతముగా ధృవతారగ – నిలచియుందువన్న
ధీవిశాల నీ యడుగు జాడలను – దీక్షగ మేమంత
పయనించుచు నీ యాజ్ఞలన్నిటిని – పాటించుచు మేము
జయభేరిని మ్రోగించెదమిదె మా – శపథంబన్నాడు

వ : తర్వాత లెనిన్ మహాశయుని జ్ఞాపక చిహ్నంగా రెండు లక్షల నలుబది వేలమంది బోల్షివిక్ పార్టీలో సభ్యత్వం తీసుకొన్నారు.

**(సుంకర రచనలు–4 నుండి)** ✺

కవిత

# లెనిన్! లెనిన్!!

- సుగమ్‌బాబు

**సోవియెట్ల** రెండవ మహాసభ
ప్రారంభమైంది!
స్మోల్నీలోని వైట్‌హాల్
ప్రతినిధులతో క్రిక్కిరిసింది!
రెడ్‌గార్డులు
నౌకా సైనికులు
ఇంకా ఆయుధాలు ధరించే వున్నారు
యుద్ధ వాతావరణంలోంచి
వాళ్ళు అప్పుడే బయటపడుతున్నారు
వింటర్ ప్యాలెస్ చుట్టూ
కేడెట్లు కట్టిన బారికేడ్లు
దగ్ధమై
బూడిద కుప్పలౌతున్నాయి
నిన్న, మొన్న దట్టంగా లేచిన పొగలు
పలచబడుతున్నాయి!
గంభీరమైన నిశ్శబ్దం
పీటర్స్‌బర్గ్ నగరాన్ని అలముకొంది!
ప్రతినిధులంతా
ఎర్ర రిబ్బన్ బేడ్జీలు ధరించారు
అంతటా ఎర్రరంగు
శోభాయమానంగా వెలుగుతోంది
ఎర్రజెండాలు
స్తంభాలకు అలంకరించారు
వైట్‌హాల్ గోడలమీది
జార్ చిత్రపటాలు తొలగించబడ్డాయి!
ఖాళీ గిల్టు చట్రాలు
కొత్త లోకాలను ఆహ్వానిస్తున్నాయి!
"ధనికులు నశించాలి"
"సోవియట్లు వర్ధిల్లాలి"
జనం నినాదాలు చేస్తున్నారు!
గతంలోని,
భవిష్యత్తులో రాగల మార్పుల
ముచ్చట్లతో
వైట్‌హాల్ ప్రతిధ్వనిస్తోంది!
అడుగడుగునా
దిగ్విజయ సంరంభం
అణువణువునా
ఆత్మీయతా సుగంధం!
అధ్యక్షవర్గ సభ్యులొచ్చేశారు
ఓ పొడవాటి టేబుల్ ముందు
వాళ్ళంతా కూర్చున్నారు!
ఇక అంతా ఒకే వ్యక్తికోసం
ఎదురుచూస్తున్నారు!
"లెనిన్".... "లెనిన్"....
అందరినోటా ఆ పేరు
ఒక్కసారిగా విన్పించింది!
లెనిన్‌ని కళ్ళారా చూడ్డంకోసం
అందరూ లేచి
మునేళ్ళపై నుంచున్నారు!
లెనిన్ దృఢకాయుడని
పొడగరి అని
ఊహించుకున్న కొందరు ప్రతినిధులు
కాదని తెలుసుకున్నారు
అయస్కాంతాల్లాంటి ఆయన కన్నుల్లో
ఎంత వెలుగు!
చూపులు సరాసరి అంతరాత్మలోకి చూస్తున్నట్టు
ఎంత పదును!
"లెనిన్ వర్ధిల్లాలి"
"లెనిన్ వర్ధిల్లాలి"
హాలు దద్దరిల్లేట్లు
నినాదాలు ప్రారంభమైనాయ్
లెనిన్ ఒక్క అంగలో
వేదికమీది కెక్కాడు!
ఆనందాతిశయాలతో
ప్రతినిధులు వివశులైనారు
ప్రేమగా చేయి ఊపుతూ
లెనిన్
నిశ్శబ్దంగా వుండమని సైగ చేశాడు
తన దేశస్థుల నవ్వుముఖాలు
లెనిన్‌కెంతో తృప్తినిచ్చాయ్!
'కామ్రేడ్స్'
లెనిన్ సంబోధించాడు!
మళ్ళీ చప్పట్లు
మళ్ళీ నినాదాలు
మళ్ళీ కేరింతలు
ఉవ్వెత్తున సాగే సముద్రతరంగాల్లా!
హృదయాలను పరవశింపజేసే
వాసంత సమీరాల్లా!!

లెనిన్ నవ్వుతూ
ఆప్యాయంగా చూస్తుండిపోయాడు!
అదో అద్భుతమైన కలయిక
తరతరాల బానిసత్వం నుండి
జాతికి
విముక్తి ప్రసాదించిన నాయకుడు
దేశం కన్నీటిని
శాశ్వతంగా తుడిచేసిన మహామానవుడు
విప్లవానికి పుత్రుడు
విప్లవానికి జనకుడు
స్వాతంత్ర్య సమరయోధుడు
కన్నవారికంటె అధికుడు
తోబుట్టువులకంటే ఉత్తముడు
చూపులతోనే కౌగిలించుకుంటూ
వెన్ను తట్టినవాడు
ధైర్యాన్నిచ్చినవాడు
ప్రబోధించినవాడు
చైతన్యవంతుల్ని జేసి
ఆయుధం పట్టించినవాడు
పోరాటానికి నడిపించినవాడు
విజయాన్ని పూమాలగా
ప్రతి ఒక్కరి మెడల్లో వేసినవాడు
.... .... .... .... ....
ఎదురుగా నిల్చున్నాడు!
- సంబాళించుకోడం కష్టమే!
క్రమంగా సద్దుమణిగింది -
లెనిన్
శాంతి గురించి మాట్లాడాడు!
సోవియట్ రాజ్యం
ఇక యుద్ధం చేయాల్సిన అవసరం
లేదన్నాడు!
యుద్ధం -
ఆకలినీ, దారిద్ర్యాన్ని తప్ప
మరేమీ ఇవ్వలేదని తేల్చి చెప్పాడు!
యుద్ధాన్ని అంతమొందించాలని
శాంతిని గురించిన శాసనం
ముసాయిదాను చదివి విన్పించాడు!
ఆ తర్వాత -
గతరాత్రి తాను రాసిన
భూమి శాసనం చదివాడు!
రైతులు తరతరాలుగా
కంటున్న కలను
లెనిన్ నిజం చేశాడు!
భూస్వాములకు
చర్చీలకు
మఠాలకు
ధనవంతులకు చెందియున్న భూమిని
రైతులకు పంచమన్నాడు!
దున్నేవాడికే
భూమి స్వంతమౌతుందని ప్రకటించాడు!
చెలరేగిన హర్షధ్వానాల మధ్య
లెనిన్ తన ప్రసంగం ముగించాడు!!
అదేరాత్రి
మొట్టమొదటి సోవియట్ ప్రభుత్వం
ఏర్పడింది!
మహాసభ
లెనిన్‌ను
అధ్యక్షుడిగా ఎన్నుకొంది!!

(సుగమ్‌బాబు రాసిన "లెనిన్! లెనిన్!!" కావ్యంలోని ఒక భాగం)

# రిత్విక్ ఘటక్ లఘుచిత్రం 'అమర్ లెనిన్'

**1970లో** లెనిన్ శతజయంతి సందర్భంగా ప్రసిద్ధ బెంగాలీ దర్శకుడు రూపొందించిన ఈ లఘుచిత్రం (18 నిముషాల నిడివి) చాలకాలం ప్రేక్షకులకు అందుబాటులో లేకుండా పోయింది. 2020 ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఆర్కైవ్స్ నుంచి బ్రిటీష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ బయటకు తీసి మరల విడుదల చేసింది.

దీనిలో ప్రత్యేకత ఏమిటంటే, బెంగాలీ జానపద ప్రజాకళారూపమైన 'జాత్రా'ను ఉపయోగించుకోవడం. ఈ రూపం ద్వారా ఒక రైతుకూలీకి లెనిన్, మార్క్స్ బోధనలను వివరిస్తారు. జాత్రాలో లాగానే దీనిలో కూడా హిందూ దేవతల వేషాలతో వుండే పాత్రలు గాక, మేధావులు, రాజకీయ నాయకులు విదేశీ దుస్తుల ఆహార్యంతో బెంగాలీలో మాట్లాడుతుంటారు. వీరందరూ వలయాకారంగా వుండి నటిస్తుంటారు. ఈ రైతుకూలీ పాత్ర, లెనిన్, మార్క్స్‌ల గురించి తెలుసుకొని కలకత్తాలో రాజకీయ సభలకు, ఊరేగింపులకు వెళ్తాడు. కార్మికుల హక్కుల గురించి ప్రచారం చేస్తాడు. గ్రామ్సీ చెప్పిన 'ఆర్గానిక్ మేధావి'గా ఎదుగుతాడు.

బెంగాలీలో అంతర్జాతీయ శ్రామిక గీతం ఆలాపనతో చిత్రం ముగుస్తుంది. మొత్తం చిత్రం జాత్రా రూపంలో వుంటుంది. దానికనుగుణమైన వాయిద్యాలను ప్రతిభావంతంగా వుపయోగించుకున్నారు.

బెర్టోల్ట్ బ్రెఖ్ట్ రాసిన

# లెనిన్ మరణించిన రోజుపై ఒక బృందగీతం

1. లెనిన్ మరణించిన రోజున
ఆ మరణాన్ని చూసిన సైనికుడిలా చెప్పాడట!
"ఆ వార్త నేను నమ్మదలచలేదు,
ఇంటి లోపలికి పోయాను
లెనిన్ చెవిలో "ఇల్యీచ్! దోపిడీదారులు వస్తున్నారు,
దారిలో వున్నారు" అని అరిచాను
అయినా అతనిలో కదలిక లేదు
అప్పుడు నమ్మాను - అతను మనకిక లేడని"

2. వెళిపోదామని నిర్ణయించుకున్న
మంచి మనిషిని మనం ఎలా ఆపగలం!
అతడెంత అవసరమో చెబితే ఆగుతాడా?

3. వెళిపోకుండా లెనిన్‌ని ఆపగల్గేది ఏది?

4. సైనికుడొకడు ఆలోచించాడు
దోపిడీదార్లు వస్తున్నారని వింటే
ఎంత జబ్బులో వున్నా, ఆయన లేచి వస్తాడు
బహుశ చంక కింద కర్రల సాయంతోనైనా వస్తాడు
లేదా తనను మోసుకెళ్లమంటాడు
మొత్తం మీద వస్తాడు
దోపిడీదారులను ఎదుర్కోటానికి!

5. సైనికునికి తెలుసు
జీవితాంతం లెనిన్
దోపిడీదార్లపై అవిశ్రాంతంగా పోరాడాడని!

6. వింటర్ పాలెస్ పై దాడిలో పాల్గొని
ఇంటికి తిరిగి వెళ్ళాలనుకున్నాడు
అక్కడ ఎస్టేట్ భూములను పంచుతున్నారట
అప్పుడు లెనిన్ అన్నాడు
'వెళ్ళకు', ఇక్కడే వుండు
దోపిడీదార్లు ఇంకా వున్నారు
దోపిడీ వున్నంతకాలం పోరాడాల్సిందే దానితో
నీవు బతికి వున్నంతకాలం
యుద్ధం చేయాల్సిందే దానితో

7. బలహీనులు పోరాడలేరు
కొంచెం బలమున్నవారు
బహుశా ఒక గంటసేపు ప్రతిఘటిస్తారు
మరింత బలమున్నవాడు
కొన్ని ఏళ్ళ తరబడి పోరాడతాడు
అందరికంటే బలిష్టులు
కొనసాగిస్తారు పోరాటం జీవితాంతం!
ఈ పోరాటాలు తప్పనిసరి!

8. విప్లవకారుని ప్రశంసిస్తూ
దోపిడీ పెరిగిపోతుంటే
పలువురు డీలా పడిపోతారు
కాని అతని ధైర్యం ఇనుమడిస్తుంది
కూలి డబ్బుల కోసం, ఒక కప్పు టీ కోసం
అధికారాన్ని కైవసం చేసుకోవడం కోసం
అతను పోరాటాన్ని నడుపుతాడు!

ఆస్తిని ఇలా ప్రశ్నిస్తాడు :
నీ మూలం ఏమిటి?
విభిన్న దృక్పథాలను ప్రశ్నిస్తాడు ఇలా :
మీరు ఎవరికి సేవ చేస్తారు?

మౌనం రాజ్యమేలేటప్పుడు
అతను నోరు విప్పుతాడు
దోపిడి వున్న ప్రతిచోటా
విధి, ఖర్మ అనుకునే ప్రతిచోటా
వాటిని సరైన అర్థంలో వివరిస్తాడు
ఎక్కడ భోజనం బల్లపై కూర్చున్నా
అక్కడ అసంతృప్తి రాజ్యమేలుతుంటుంది
అక్కడి ఆహారం దుర్భరం
గదేమో మరీ ఇరుకు

అతన్ని ఎక్కడికి తరిమినా
ఆందోళన వెన్నంటి వస్తుంది
వేటాడుతున్న స్థలంలో అశాంతి కొనసాగుతుంది

9. లెనిన్ మరణించినపుడు
లెనిన్ మనకు లేకుండా పోయినపుడు
విజయం సాధించాం - కాని దేశం వట్టిబోయింది
ప్రజలు బయలుదేరారు - కాని మార్గం అంధకార బంధురం
లెనిన్ వెళిపోతున్నపుడు
ఫుట్‌పాత్‌లపై వున్న సైనికులు విలపించారు
కార్మికులు యంత్రాలను నడిపించలేదు
కాని వారు తమ పిడికిళ్ళు బిగించారు

10. లెనిన్ వెళ్ళిపోవడమంటే....
ఒక వృక్షం తన ఆకులతో పోతున్నానని చెప్పడమే....!

11. అప్పట్నుంచి పదిహేను ఏళ్లు గడిచాయి
భూగోళంలో ఆరోవంతు
దోపిడీ నుండి విముక్తి పొందింది
దోపిడీదారులు వస్తున్నారు
అనే పిలుపు చెవులకు సోకగానే
ప్రజలు ఎప్పటిలాగానే
సరికొత్తగా పోరాడటానికి సంసిద్ధులై నిటారుగా నిలబడతారు.

12. విస్తృత కార్మికవర్గపు హృదయాలలో
ఆరాధింపబడుతున్నాడు లెనిన్!
ఆయన మా ఉపాధ్యాయుడు
మాతోపాటు పోరాటంలో పాల్గొన్నవాడు
ఆరాధింపబడుతున్నాడు లెనిన్
విస్తృత కార్మికవర్గపు గుండెలలో!

ఇంగ్లీషు నుండి తెలుగు అనువాదం : **అరుణరేఖ**

వ్యాసం

# లెనిన్ గ్రంథాలయ విధానం

- తమ్మినేని అక్కిరాజు

**డా॥ వెలగా** వెంకటప్పయ్యగారు గ్రంథాలయోద్యమంతో అవినాభావ సంబంధం పెట్టుకుని, గ్రంథాలయాల ఆధునికీకరణకు కృషి చేసినవారు. సోషలిస్టు సమాజ నిర్మాత అయిన లెనిన్ సోవియట్ రష్యాలో సర్వ సమగ్రమైన గ్రంథాలయ విధానాన్ని ఏర్పాటు చేయటంలో ఎంత తపన పడ్డారో ఈ చిన్న పుస్తకం 'లెనిన్ గ్రంథాలయ విధానం'లో వివరించారు.

లెనిన్ మాటల్లో –

'దేశ వ్యాప్తంగా అక్షరాస్యత లేనిదే, తగినంత నైపుణ్యం లేనిదే జనాభాకు తగినరీతిలో చదివే అలవాటు నేర్పకపోతే, పంటలలేమి, కరువు కాటకాలకు తట్టుకునే వనరులు సమకూర్చకపోతే, మనం అనుకున్న ఆశయాలు సాధించలేము'

లెనిన్ తెచ్చిన డిక్రీలు, ఉత్తర్వులు, ఉపన్యాసాలు ఆధారంగా ఈ రచన సాగిందని రచయిత వెలగా వెంకటప్పయ్యగారు తెలియజేస్తూ గ్రంథాలయాభిమానులకు పుస్తకాలయందు ప్రజాసమస్యల యందూ ఆసక్తిగలవారికి ఈ రచన ప్రయోజనకరమని తెలిపారు.

విప్లవభావాలతో పరిప్లావితుడైన లెనిన్ గ్రంథాలయపరంగా ఇంత కృషి చేశారంటే ఈ తరం వారే కాదు. ముందు తరాలవారు కూడా నమ్మడం కష్టమే! 'గ్రంథాలయసేవకు లెనిన్‌ను సంప్రదించండి' అని చెప్పుకునే సూక్తి చివరకు 'లెనిన్ అంటే గ్రంథాలయము' అనే కొత్త సూక్తిగా రూపుదిద్దుకుంది.

సోవియట్ గ్రంథాలయ నిపుణులతో గ్రంథసూచీ కర్తలలో ఎన్.ఎ. రుచికిన్; మాస్కో గుబెర్నియా జిల్లాలోని కేంద్ర కార్మిక పఠన మందిరానికి అధిపతి మరియు లెనిన్ సహచరుడు వి.వి. మెడోస్టోన్, అక్టోబరు విప్లవానంతరం విద్యావిషయాలలో లెనిన్‌కు సలహాదారుగా పనిచేసిన ఎ.వి. లూనాచరస్కీ... మొదలైనవారు లెనిన్ గ్రంథాలయ విధానాన్ని అనితరసాధ్యంగా మెచ్చుకున్నారు.

గ్రంథాలయాల విషయం ప్రస్తావిస్తూ లెనిన్ తనతో ఏమన్నాడో లూనాచరస్కీ మాటల్లో–'నేను గ్రంథాలయాలకు అధిక ప్రాధాన్యతనిస్తాను. ఆ రంగంలో మీరు కృషిచేయాలి. గ్రంథాలయ నిపుణులను సంప్రదించండి. చదువరులకు పెద్ద పఠన మందిరాలు, పెద్ద సంఖ్యలో గ్రంథాలు అందించాలి. పుస్తకాలు చదువరుల వద్దకు వెళ్ళాలి. అందుకు రవాణా వసతులు కల్పించాలి. మనం తొలి విజయం సాధించాం. ఇంకా ఎంతో సాధించకుంటే పరిస్థితులు దుస్థితిలోనే ఉంటాయి. వాస్తవానికి పోరాటం అంతం కాలేదు. ప్రారంభమైంది. గ్రామాలలో యోగ్యుడైన గ్రంథ పాలకుడు అవసరం. పఠనమందిరాలు సామాన్య పాఠకులకు రాజకీయ విద్యను అందించగల మంచి సంస్థలు' అని స్పష్టం చేశారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు లెనిన్ కృషి అమోఘం. 'నిరక్షరాస్యత నిర్మూలించండి' అంటూ, జాతీయస్థాయి సంఘం 1923లో ఏర్పడింది. అది ఒక్క అక్షరాస్యుడు కూడా లేని వెనకబడిన ప్రాంతాలకు అధిక ప్రాధాన్యత నిచ్చింది. కార్యకర్తలకు బోధనావిషయాలపై శిక్షణాతరగతులు నిర్వహించింది. ఒక పత్రికను ప్రారంభించి – భూగోళ విజ్ఞానం, రాజకీయ విజ్ఞానం, జాతీయ ఆర్థిక సమస్యలు, కొత్తగా చదివేవారికి సలహాలు.... ఈ పత్రికలో ప్రచురించారు కఠిన పదాలకు అర్థాలు, వివరణ సచిత్రంగా అందించారు. అనేకకోణాలలో తీవ్రంగా ప్రయత్నాలు జరిపి 1928–33 నాటికే కొన్ని రాష్ట్రాలలో సంపూర్ణ అక్షరాస్యత సాధించారు.

కేవలం అక్షరాస్యత చాలదని – సామాన్య ప్రజలు ప్రయోజకులు కావాలని, వారి వృత్తులకు, వ్యాపకాలకు, సాంఘిక స్పృహ పెంపుదలకు కనీస విజ్ఞానం అందించేందుకు ఏడేళ్ళ కోర్సులు, పదేళ్ళ కోర్సులు ప్రారంభించారు. ఈ కోర్సులు చదివినవారికి వ్యవసాయక్షేత్రాల్లో కీలక పదవులు నిర్వహించే అవకాశాలిచ్చారు. వారు సాంఘిక, రాజకీయ, ఆర్థిక కార్యక్రమాలలో భాగస్వాములయ్యారు.

మారుమూల ప్రాంతాలకు సంచార గ్రంథాలయాల ద్వారా పుస్తకాలను అందించటంలోనూ, దేశాల్లో నివసించేవాళ్ళను, సంచార జాతులను కూడా వదలకుండా సోవియట్ ప్రభుత్వం కృషి చేసింది. కొత్తగా అక్షరాస్యులైనవారు వృత్తి వ్యాపకాల్లో శిక్షణ పొందారు. తగిన మెలకువలు తెలుసుకొని దేశ సౌభాగ్యానికి తోడ్పడ్డారు. లెనిన్ వయోజనులలో విద్యాసౌకర్యాలు కలుగజేయడానికి ఉద్దేశించడంలో ప్రధాన లక్ష్యం ఇదే! ఈ లక్ష్యాన్ని లెనిన్ తన జీవితకాలంలోనే చాలావరకు చూడగలిగారు.

ప్రపంచ ప్రఖ్యాత శ్రామిక ప్రజల నాయకుడిగా, ఉపదేశకుడిగా, మార్క్స్, ఏంగెల్సు ప్రభృతుల విప్లవ సిద్ధాంతాల ఆచరణశీలిగా, సోవియట్ కమ్యూనిస్టుపార్టీ నిర్మాతగా, సోవియట్ విప్లవ మేథావిగా, మృదుహృదయుడిగా, నిగర్విగా – లెనిన్‌కు పుస్తకాలయందు విశేషమైన అభిమానం, గ్రంథాలయ సేవలయందు, నిర్వహణయందు ఆసక్తి ఉండటం ఒక అపూర్వ విషయం.

లెనిన్ చదివిన పఠన గ్రంథాలయాలను కొన్నిటిని మనం చూద్దాం – 1) పిట్స్‌బర్గ్ పౌర గ్రంథాలయం – పిట్స్‌బర్గ్. 2) రూమ్‌యాంత్సేన్ మ్యూజియం గ్రంథాలయం – మాస్కో. 3) బ్రిటిష్ మ్యూజియం – లండన్ 1902. 4) ఫ్రెంచ్ జాతీయ గ్రంథాలయం – పారిస్ 1909. 5) రాయల్ గ్రంథాలయం – స్టాక్ హోమ్ 1915. 6) జెనీవా పౌర గ్రంథాలయం – జెనీవా 1916.

లెనిన్ క్షణం తీరికలేని జీవితంలో కూడా పుస్తకాలు బాగా చదివేవాడు. గ్రంథాలయాల అభివృద్ధిని కోరేవాడు పౌర గ్రంథాలయాల ద్వారా, చదివే అలవాటు, ప్రజల్లో సామ్యవాదాన్ని పెంచి దేశపు సాంఘిక, సాంస్కృతిక, ఆర్థికస్థాయిని పెంచగలమని లెనిన్ బలంగా నమ్మాడు. ఆ బాటలోనే పయనించి సఫలీకృతుడయ్యాడు.

లెనిన్ భార్య, సహచరురాలు 'క్రూప్స్కయా'కు కూడా గ్రంథాలయాలంటే అపారమైన అభిమానం. చదువరుల సౌకర్యాలు, గ్రంథాలయ శిక్షణ, బాలల గ్రంథాలయాలు... మొదలైన అంశాలపై ఆమె చక్కని కృషి చేసింది. ముఖ్యంగా లెనిన్ గ్రంథాలయ కార్యక్రమాలన్నింటికీ ఆమె ఎంతో చేదోడువాడోడుగా పనిచేసింది.

లెనిన్ – క్రూప్స్కయా సంబంధం ఒక విచిత్రమైన పరిస్థితుల్లో జరిగింది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్నప్పుడు లెనిన్ యువకులను చేరదీసి మార్క్సిస్టు కేంద్రం నడిపేవాడు. క్రూప్స్కయా మార్క్సిస్ట్ అవగాహనతో ప్రజల సమస్యల యెడల అవగాహనగల వ్యక్తి. 1894లో వీరు సెయింట్ పీటర్స్‌బర్గులో మార్క్సిస్టు సమావేశంలో కలిసాడు. ఆ తరవాత అనేక సందర్భాలలో వాళ్ళిద్దరూ కలిసారు. ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. వారి పరిచయం క్రమంగా ప్రేమగా మారింది.

లెనిన్ నడిపిన ఉద్యమాలన్నిటిలో క్రూప్స్కయా సహాయకురాలు, సలహాదారు. విద్యావిధానంపై, శిక్షణా పద్ధతులపై ఆమె రష్యన్ భాషలో అనేక రచనలు చేసింది. గ్రంథాలయాల విషయంలో మంచి కృషి చేసింది. సోవియట్‌లో గ్రంథాలయాల ప్రగతికి లెనిన్ ఎంత కారణమో, క్రూప్స్కయా కూడా అంతే కారణం అని చెప్పటంలో అతిశయోక్తి లేదు.

అక్టోబరు విప్లవానంతరం క్రూప్స్కయా 1918 నవంబరులోనే గ్రంథాలయ సదస్సు నిర్వహించింది. 'చదువరుల సేవలు, వారి మనోభావాలు, సాంఘిక బాధ్యతలు' అనే అంశంపై ఆమె బాగా కృషి చేసింది. ఆ విదుషీమణి సేవలకు గుర్తింపుగా – లెనిన్‌గ్రాడ్‌లో గ్రంథాలయ శాస్త్ర శిక్షణ యిచ్చే సంస్థను 'క్రూప్స్కయా స్టేట్ ఇన్‌స్టిట్యూట్' అనే పేరుపెట్టి ఆమె యెడల గల తమ గౌరవ ప్రపత్తులను ప్రదర్శించారు.

లెనిన్‌కు చిన్నతనం నుండే గ్రంథాలపట్ల, గ్రంథ పఠనం పట్ల ఆసక్తికి కారణం. లెనిన్ తండ్రి ఇల్యా ఈయన తన 17 సంవత్సరాల ఉద్యోగకాలంలో 450 పాఠశాలలు ఏర్పాటుచేసి ఆ ప్రాంత ప్రజలకు అపారమైన విద్యాసేవ చేసాడు. స్కూళ్ళ ఇన్‌స్పెక్టరుగా, పబ్లిక్ స్కూళ్ళ డైరెక్టరుగా పనిచేసాడు. లెనిన్ తల్లి మరియా ప్రజాతంత్ర భావాలు గల వ్యక్తి. ఇలాంటి సంస్కారవంతమైన కుటుంబంలో పుట్టిన వ్యక్తి లెనిన్. ఈయన చిన్నతనంలోనే తమ ఇంట్లో ఉన్న గ్రంథాలను చదవటంతోనే జీవితం ప్రారంభమైంది. ప్రపంచ సాహిత్యంలోని ప్రసిద్ధ గ్రంథాలు. ప్రకృతి శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు, విద్యావిధానం మొదలైన అంశాలపై గల అనేక గ్రంథాలను లెనిన్ చదివాడు.

1870 ఏప్రిల్ 22న రష్యా దేశంలో వోల్గానది ఒడ్డునగల సిమ్‌బిర్స్క్ అనే పట్టణంలో సంస్కృతీ విలువలు తెలిసిన ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. తన తండ్రి ఇల్యా 1886లో హఠాత్తుగా మరణించటం, తన అన్న అలక్సాండ్ర్‌ను 1887 మే 8వ తేదీన ఉరి తీయటం లెనిన్‌ను దిగ్భ్రాంతికి గురిచేసిన అంశాలు. అన్న ఉరితీతతో లెనిన్ మరింత దృఢచిత్తుడిగా మారి విప్లవ పోరాటమార్గాల గురించి తీవ్రంగా ఆలోచించాడు. లెనిన్ అక్కగారు ఎలిజరోవా తన స్మృతులలో ఇలా రాసారు. "అలెగ్జాండ్ర్ ఉల్యనోవ్ వీరమరణం చెందాడు. ఆయన విప్లవ వీరమరణం తేజోమయం. తమ్ముడు వ్లదిమిర్ (లెనిన్) మార్గానికి వెలుగు చూపింది" ఈ మార్గాన్నే లెనిన్ పయనించారు.

గ్రంథపఠనంతో ఆయన చిన్నతనం సాగింది. జార్ ప్రభుత్వంలో గ్రంథాలయాల దుస్థితిని లెనిన్ బాగా గ్రహించాడు. 1817 అక్టోబరు విప్లవానికి పూర్వం రష్యాలో గ్రంథాలయాలు, అందులోని పుస్తకాలు – విద్యావంతులు, సామాన్య పౌరులు చదువుకోవటానికి ఏ మాత్రము సరిపోలేదు. 46 కోట్ల పుస్తకాలు అచ్చు అయితే 90 లక్షల పుస్తకాలే లభ్యమయ్యేవి. చాలా పుస్తకాలను నిషేధించింది. అభ్యుదయ రచయిత పుస్తకాలను చించేసేది. పౌరగ్రంథాలయాల నిర్వహణలో అనేక అవరోధాలు కల్పించారు. విప్లవానంతరం లెనిన్ ఇలా చెప్పారు "యు.యస్.యస్.ఆర్ లోని పౌరులందరికి సాంస్కృతిక ప్రయోజనాలను అనుభవించే హక్కు ఉన్నది. దేశంలోనూ, ప్రపంచంలోనూ, ప్రభుత్వ పరంగా, పౌరసంస్థల పరంగా భద్రపరచబడిన కళాసంపదను స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం కల్పించటం ద్వారా, పుస్తకాలు, వార్తా పత్రికలు, ఉచిత గ్రంథాలయ సేవలు నలుమూలల విస్తరించడం ద్వారా, ఇతర దేశాలలో సాంస్కృతిక సంబంధాల పెంపుదల ద్వారా, పై హక్కులకు, అమలుకు భద్రత కల్పిస్తుంది" రాజ్యాంగ అధికరణానికి అనుగుణంగా లెనిన్ సోవియట్ యూనియన్‌లో గ్రంథాలయాల అభివృద్ధిలో చక్కని పథకం తయారు చేసి అమలు పరచారు.

సామ్యవాద సమసమాజ నిర్మాణానికి వీలుగా గ్రంథాలయాలు ఉపయోగపడాలని భావించి పెట్రోగ్రాడ్ పౌర గ్రంథాలయ నిర్వహణలో ఈ క్రింది విధంగా మార్పులు చేయాలని లెనిన్ ఉత్తర్వులు జారీ చేసాడు.

1. ఈ పౌరగ్రంథాలయం పెట్రోగ్రాడ్‌లోను, ఇతర రాష్ట్రాలలోను, ఫిన్‌లాండ్ స్వీడన్ వంటి ఇతర దేశాల పౌరగ్రంథాలయాలతోను పుస్తకాల మార్పిడి (Books Exchange) ప్రారంభించాలి.
2. ఒక గ్రంథాలయం నుంచి మరో గ్రంథాలయానికి పుస్తకాలు పంపే సందర్భంలో పోస్టు ఖర్చులు లేకుండా చట్టం చేయాలి.
3. ప్రయివేటు గ్రంథాలయాలవలె ధనవంతమైన, నాగరికమైన దేశాల వలె ఈ గ్రంథాలయ పఠనమందిరం ఉదయం 8 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు రోజూ తెరచి ఉంచాలి.
4. పురుషుల అవసరం సైన్యానికి ఉందిగనుక, అవసరమైనంత స్త్రీలను పని తక్కువగానున్న విద్యాశాఖ కార్యాలయాల నుంచి ఈ గ్రంథాలయానికి బదిలీ చెయ్యాలి.

ఈ ఉత్తర్వులు పెట్రోగ్రాడ్ గ్రంథాలయంలో అమలుపరుచబడ్డాయి. 1895లో యువ విప్లవకారుడైన లెనిన్ ఈ గ్రంథాలయాన్ని బాగా వినియోగించుకున్నాడు.

లెనిన్ గ్రంథాలయాభిమానం, ఆయన చూసిన గ్రంథాలయాలు, వీటి అభివృద్ధికి లెనిన్ కృషి, గ్రంథాలయ సంస్కరణలు, గ్రంథాలయాల, గ్రంథాల భద్రత, నిర్వహణ.... యింకా అనేక విషయాలను తెలుసుకోవాలంటే, లెనిన్‌ను గురించి ఎంతో సమాచారం గ్రహించాలంటే వెలగా వెంకటప్పయ్యగారు వ్రాసిన ఈ చిన్న పొత్తము తప్పక చదవవలసి యున్నది. దీనిని జూలై 1985లో 'విశాలాంధ్ర' దినపత్రికలో ప్రచురించారు. పుస్తకంగా జూన్ 1986లో ప్రథమంగా ముద్రించారు.

**('ప్రజాసాహితి' ఏప్రియల్ 2015 నుండి)** ✺

వ్యాసం

# లెనినిజం చూపుతున్న దారి

- డా॥ బి. అరుణ

**లెనిన్** మరణించి వంద సంవత్సరాలు.

1924 జనవరి 21న లెనిన్ మరణించినపుడు రష్యాదేశపు ప్రజానీకం తమ తండ్రిని, పెద్దదిక్కును, పెన్నిధిని కోల్పోయిన దుఃఖాన్ని దిగమింగుకుంటూ, కంటినీటిని ఒత్తుకుంటూ ఎర్రజెండానెత్తిపట్టారు. లెనినిజం ఇచ్చిన శ్రామికవర్గ రాజ్య పరిపాలనను కొనసాగించటానికి లక్షలమంది కార్మికులు, రైతులు, చేతివృత్తుల పనివారు..... ముసలివారు, యువకులు, మహిళలు, అన్ని జాతుల, అన్నిరంగాల ప్రజానీకం లెనిన్ సంతాపసభలో బోల్షివిక్ పార్టీ సభ్యులుగా చేరారు. లెనినిజం చిరస్థాయిగా వర్ధిల్లాలని నినదించారు. అంతిమ విజయం ఎప్పటికీ ప్రజలదేనని ప్రకటించారు.

మార్క్సిజం, సర్వశక్తి సంపన్నమైనది. అదే సత్యం అని లెనిన్ నమ్మాడు. ఆయన నిరంతర అధ్యయనశీలి, తత్త్వవేత్త, సిద్ధాంతకర్త, ఆచరణశీలి, సాహిత్యకారుడు. అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలబడి అసమానతలు లేని సమాజం కోసం అలుపెరగని కృషిచేసిన ప్రజానాయకుడు. ప్రపంచంలోని పీడిత ప్రజలందరి విముక్తి కోసం మార్క్సిజం వెలుగులో లెనినిజాన్ని సృజించాడు. మార్క్సిజం పిడివాదం కాదని, మారిన పరిస్థితులను నిర్దిష్టంగా పరిశీలించి దానికి తగిన కార్యక్రమాన్ని నిర్ణయించుకోవటమే మార్క్సిజం యొక్క జీవ లక్షణమని చాటాడు. శ్రామికరాజ్యాన్ని ఒక దేశంలో ఐనా సాధించటం సాధ్యమేనని రష్యా విప్లవాన్ని విజయవంతం చేసాడు. శ్రామిక జన శక్తియుక్తులను, మేధస్సును వెలికి తీసాడు, పదునుపెట్టాడు, వారిని ఐక్యం చేసాడు. ప్రపంచ వినువీధుల్లో శ్రామిక జెండానెగరేసాడు. మానవాళి చరిత్రలోనే నూతన శకాన్ని ఆవిష్కరించాడు. లెనిన్‌గా మరణించి లెనినిజమై నిలిచాడు.

ఈనాటి సమాజం ఎదుర్కొంటున్న, ఆనాటి సమాజం ఎదుర్కొన్న దోపిడీ, పీడనలు, అణచివేతలకు కారణం ఈ వ్యవస్థ నిర్మాణంలోనే వున్నదన్న మార్క్స్ - ఎంగెల్సుల భావనలను లెనిన్ అంగీకరించాడు. సమాజం ఎల్లప్పుడూ మార్పు చెందుతూనే ఉంటుందని, ఆదిమ కమ్యూనిస్టు సమాజం నుండి బానిస సమాజం, దాని నుండి ఫ్యూడల్ సమాజం, ఆ తర్వాత పెట్టుబడిదారీ సమాజంగా మార్పు చెందిందనీ, సామ్రాజ్యవాదం - పెట్టుబడిదారీ సమాజం యొక్క అత్యున్నత దశ అని నేటి సామ్రాజ్యవాద యుగ పరిస్థితిని సూత్రీకరించాడు.

సమాజంలోని ఉత్పత్తిశక్తులూ, ఉత్పత్తి సంబంధాలు కలసి సమాజం యొక్క ఆర్థిక పునాదిగా ఉంటాయనీ, ఆ పునాదిపై ఆధారపడే ఉపరితల అంశాలైన సామాజిక రాజకీయ, తాత్త్విక, మేధోపర భావనలుంటాయనీ; మానవుల సామాజిక ఉనికే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుందనీ; వ్యక్తుల ఆలోచనలతో, అతీత శక్తులతో సమాజంలో మార్పులు రావని, అభివృద్ధి క్రమంలో అడ్డంకిగా వున్న ఉత్పత్తి సంబంధాలను ఛేదించుకున్న ఉత్పత్తిశక్తులు నూతన సమాజ దశకు చేరుకుంటాయని, సమాజ అభివృద్ధి ముందుకే సాగుతుందని చెప్పిన మార్క్సిజంలోని సామాజిక - ఆర్థిక శాస్త్ర సారాంశాలను, లెనిన్ నూతన పరిస్థితులకు అన్వయించి, సృజనాత్మకంగా అభివృద్ధిపరిచాడు. 'సామ్రాజ్యవాదము, శ్రామికవర్గ విప్లవాల యుగంలోని మార్క్సిజమే లెనినిజం' అన్నాడు స్టాలిన్.

ఆనాటి రష్యాలో జారు ప్రభువుల పరిపాలనలో కార్మిక, కర్షక వర్గాలపై దోపిడీ చాలా దారుణమైన పద్ధతుల్లో అమలయ్యేది. భూమి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై, ఎక్కువమంది రైతాంగం కౌలు రైతులుగా, కూలీలుగా కరువు కాటకాలతో విలవిల్లాడేవారు. కార్మికుల వేతనాలు అతితక్కువ. రోజుకు 12, 14 నుండి 16 గంటలు పనిచేయవలసి వచ్చేది. లక్షలమంది కార్మికులు నిరుద్యోగులయ్యారు. పని ప్రదేశాలలోని పరిస్థితులూ, నివసించే పరిస్థితులూ నికృష్టంగా ఉండేవి. అతివాద పోకడలతో నడిచిన నరోద్నిక్‌ల ఉద్యమాల వంటి ఉద్యమాలు ఆచరణలో అంతిమంగా పాలకులకు అనుకూలంగా మారిపోయాయి.

ఈ సమయంలోనే లెనిన్ మార్క్సిజం అనే సైద్ధాంతిక ఆయుధాన్ని చేతబట్టి, సామ్రాజ్యవాద యుగానికి సంబంధించిన శాస్త్రీయ విశ్లేషణపై ఆధారపడి సామ్రాజ్యవాద గొలుసులో బలహీనమైన లింకు వద్ద మొదటి శ్రామికవర్గ విప్లవం బ్రద్ధలవుతుందని సూత్రీకరించాడు. ఆనాటికే పెట్టుబడిదారీ దేశాలైన బ్రిటన్, ఫ్రాన్సు లాంటి దేశాల్లో కాకుండా రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేశాడు. ముందుగా రష్యాలో విడివిడిగా వున్న మార్క్సిస్టు అధ్యయన కేంద్రాలను సమైక్యపరచి ఒక రాజకీయ నిర్మాణాన్ని ఏర్పర్చాడు. ఉత్పత్తి సామాజికంగా జరుగుతూ వుండటానికి దాన్ని కొద్దిమందే ఎక్కువెక్కువగా అనుభవించడానికి మధ్య గల వైరుధ్యాలను పరిష్కరించగలిగేది శ్రామికవర్గమేనన్న మార్క్స్ సిద్ధాంతానికి ఆచరణరూపం ఇచ్చాడు. కార్మికవర్గ నాయకత్వాన రైతాంగాన్ని కలుపుకొని రాగలిగిన విప్లవమే రష్యా ప్రభుత్వాన్ని కూలదోయగలుగుతుందని లెనిన్ నిరూపించాడు. కార్మికవర్గ పోరాటాలు, అధ్యయన బృందాలకే పరిమితం కాకుండా సామాన్య ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోవాలన్నాడు. లెనిన్ రష్యన్ ప్రజల విముక్తి కోసం ఆర్థిక, రాజకీయ, తాత్త్వికరంగాలకు గతితార్కిక భౌతికవాదాన్ని

అన్వయించి, ప్రతి అననుకూల ధోరణినీ ఎదుర్కోవటానికి సైద్ధాంతిక సాహిత్యాన్ని సృజించాడు. పారిస్ కమ్యూన్ నుండి తీసుకున్న గుణపాఠాలు, జర్మనీ, బ్రిటన్, యూరప్ దేశాలలో వస్తూన్న అనేక ప్రజానుకూల సైద్ధాంతిక అంశాలు, ప్రజావ్యతిరేక ధోరణులను శాస్త్రీయంగా విశ్లేషిస్తూ సరైన మార్గాన్ని నిర్మించాడు. అందుకోసం అనేక వ్యాసాలను, గ్రంథాలను రచించాడు.

రష్యా పోరాట కాలంలో తలెత్తిన, ఈనాటికీ వర్గపోరాట సిద్ధాంతాలను వెంటాడుతున్న పలు ధోరణులపై సైద్ధాంతికంగానూ, భావజాలరంగంలోనూ పోరాటం చేశాడు. వేతనాలు పెంచటం, పనిగంటలను తగ్గించటం వంటి ఆర్థిక డిమాండ్ల కోసమే పోరాడాలి తప్ప రాజకీయ పోరాటాలు అవసరంలేదని చెప్తున్న ఆర్థికవాదుల (లెనిన్ పెట్టిన పేరు) మార్క్సిష్టేతర భావాలను చీల్చి చెండాడాడు. సమాజ పరిణామ క్రమంలో సోషలిజం అనివార్యంగా వస్తుంది గనుక కార్మికవర్గంలో ఆర్థిక పోరాటాలు వాటంతటవే ప్రారంభమవుతాయనీ, ఆ వచ్చిన పోరాటాలకు నాయకత్వం వహిస్తే సరిపోతుందని, ప్రజలకి రాజకీయాలను ప్రచారం చేసి సోషలిజంవైపుకు నడిపించటానికి ప్రయత్నం చేయటం తప్పని ఆర్థికవాదులు 'యాదృచ్ఛికత' అనే సిద్ధాంతాన్ని రూపొందించారు. దానితోపాటుగా సామాజికాభివృద్ధిలో మానవుల చైతన్యం పాత్ర చాలా తక్కువనీ, ప్రణాళికబద్ధమైన మానవ చర్యలు చరిత్రను పురోగమింపచేయకపోగా కొన్నిసార్లు నష్టం కూడా కల్గిస్తాయని కొందరు వాదించారు. అంతేగాక మార్క్సిజం పిడివాదంగా తయారయిందనీ, దానిని 'విమర్శించే స్వేచ్ఛ' కావాలనే పేరుతో మార్క్సిజం యొక్క మౌలిక సూత్రాలైన వర్గపోరాటం శ్రామికవర్గ విప్లవం, శ్రామికవర్గ నియంతృత్వం అనే వాటిని తొలగించాలని అలాంటివారే ప్రయత్నం చేశారు. వారు మార్క్సిజం యొక్క విప్లవ స్ఫూర్తిని నిర్వీర్యం చేయబూనారు.

శ్రామికవర్గం యొక్క విప్లవకర పాత్రను చూడ నిరాకరించిన వీరి భావజాలాన్ని లెనిన్ 'ఏం చెయ్యాలి' అంటూ పథ నిర్దేశం చేశాడు. ఆర్థికవాదులు విమర్శనా స్వేచ్ఛను డిమాండ్ చేస్తున్నది మార్క్స్ శాస్త్రీయ భావనల స్థానంలో బూర్జువా భావనలు ప్రవేశపెట్టటానికేనని ఆ పుస్తకంలో విశ్లేషించాడు. కార్మికవర్గానికి సరైన సిద్ధాంతం ఉండాలని ప్రకటించాడు. 'యాదృచ్ఛికత' (Spontaneity) సిద్ధాంతాన్ని ఖండిస్తూ సామాజికాభివృద్ధి దానిలో సహజంగా అంతర్గతంగా ఉండే నిర్దిష్టమైన నియమాల ప్రకారమే జరుగుతుందనీ, ఈ క్రమంలో మానవ చైతన్యానికి కూడా కీలకమైన పాత్ర వుందన్నాడు. భౌతిక నియమాలకూ, మానవ చైతన్యానికీ మధ్య గల గతితార్కిక సంబంధం వల్ల మానవులు సామాజికాభివృద్ధిని ఎలా ప్రభావితం చేయగలరో, ఏవిధంగా మార్పులను వేగవంతం చేయగలరో లెనిన్ చర్చించాడు. సోషలిస్టు భావజాలం కార్మికవర్గంలో యాదృచ్ఛికంగా దానంతటదే సహజంగా రాదని, సమాజంలో వుండే వైరుధ్యాలలోని విభిన్న అంశాల మధ్య నిత్యమూ జరుగుతూ వుండే ఘర్షణ ఫలితంగానే అభివృద్ధి జరుగుతుందని తెలియచేశాడు. యాదృచ్ఛికంగా సమాజం మారుతుంది అని చెప్పటం అంటే కార్మికవర్గానికి ద్రోహం చేయటమేననీ బూర్జువా వర్గానికి సేవ చేసినట్లే అని లెనిన్ సూటిగా స్పష్టంగా తెలియపర్చాడు.

సామ్రాజ్యవాద యుగంలో పెట్టుబడిదారీ విధానం అవసాన దశలో మరణశయ్యపై ఉందనీ, సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ శక్తులు అభివృద్ధి నిరోధకులైన ఫ్యూడల్ విధానాలతో జతకడతాయని రష్యాలో జారు నిరంకుశ పాలనతో కలగలసిన రష్యన్ సామ్రాజ్యవాదాన్ని ఉదాహరణగా చూపాడు. ఫ్యూడల్ వ్యతిరేక ప్రజాస్వామిక విప్లవాలకు బూర్జువావర్గం నాయకత్వం వహించదనీ, శ్రామికవర్గమే నాయకత్వం వహిస్తుందని, ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను పరిపూర్తి చేస్తుందని లెనిన్ సూత్రీకరించాడు. జాతుల సమాహారంగా ఉండే రష్యాలో జాతుల సమస్య, ఆనాటి సామ్రాజ్యవాద అనివార్య యుద్ధాల గురించి మార్క్సిస్టుల వైఖరిని లెనిన్ స్పష్టంగా తెలియచేశాడు.

జాతులతో సంబంధం లేకుండా పౌరులందరికీ సమాన హక్కు లుండాలని, అన్ని జాతులకూ స్వయం నిర్ణయాధికార హక్కును గుర్తించాలనీ, వర్గ సంస్థలన్నిటిలోనూ అన్ని జాతులకు చెందిన కార్మికు లందరినీ ఐక్యం చెయ్యాలని లెనిన్ మహాసభలలోనూ, సంస్థలతో చేసిన చర్చలలోనూ ప్రతిపాదించాడు. జారు చక్రవర్తి కుయుక్తులతో చేసిన జాతుల అణచివేతను వ్యతిరేకించాడు. ఇతర జాతులను అణిచే ఏ జాతీ స్వతంత్రంగా ఉండలేదనీ, తమ జాతి లేక భాష గొప్పదనే బూర్జువా భావాలకు కార్మికవర్గం వ్యతిరేకమని ప్రకటించాడు. ఒకే ప్రాంతంలో ఉండి, ఒకే భాషను మాట్లాడుతూ, ఒకే సంస్కృతి, సంప్రదాయాలు కలగలసిన ప్రజలందరితో జాతీయ ప్రభుత్వాలను ఏర్పాటు చేయటం కోసం బూర్జువా వర్గం నాయకత్వం వహించటం దాని ఒకనాటి కర్తవ్యమని, కానీ నేటి యుగంలో బూర్జువావర్గం సంకుచితంగా మారిందని అందుకు కార్మికవర్గం గురికావొద్దని లెనిన్ పిలుపునిచ్చాడు.

సామ్రాజ్యవాద దేశాలు తమ పెట్టుబడుల పోటీ కోసం ప్రపంచంలోని దేశాలను పంచుకుంటాయి. పెట్టుబడుల పోటీవల్ల కాలక్రమేణా సామ్రాజ్యవాద శక్తుల బలాబలాల్లో మార్పులువచ్చి, కొత్తగా అభివృద్ధి చెందిన దేశాలు తమకు తగినట్లుగా ప్రపంచ దేశాలను తిరిగి విభజించాలని డిమాండ్ చేస్తాయి. తమ పరిశ్రమలకు నూతన వనరులు సమకూర్చుకునేందుకు ఘర్షణలు, యుద్ధాలు చేస్తాయి. ఆవిధంగా సామ్రాజ్యవాదులు తమ ప్రయోజనాల కోసం యుద్ధాలను ప్రజలపై రుద్దుతారు. ఇటువంటి అధర్మయుద్ధాలే కాకుండా ధర్మ యుద్ధాలూ ఉంటాయి. బానిస యజమానులకు వ్యతిరేకంగా బానిసలు, ఫ్యూడల్ ప్రభువులకు వ్యతిరేకంగా రైతాంగం, బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా శ్రామికవర్గం వలసాధిపత్యానికి వ్యతిరేకంగా దేశభక్తియుత శక్తులు జరిపే యుద్ధాలను సోషలిస్టులు బలపరుస్తారని, యుద్ధాల యొక్క స్వభావాలను లెనిన్ వివరించాడు.

రష్యాలో 1905 విప్లవం విఫలమైన తర్వాత మేధావులు, తత్త్వవేత్తలు మార్క్సిజంకి కాలం చెల్లిందని, కొత్తగా భౌతిక శాస్త్రంలో వచ్చిన నూతన ఆవిష్కరణల వెలుగులో మార్క్సిజాన్ని మెరుగు

పరుస్తున్నామని, సరిచేస్తున్నామని గతితార్కిక భౌతికవాదంపై దాడి మొదలుపెట్టారు. ఆస్ట్రియా దేశపు శాస్త్రవేత్త ఎర్నెస్ట్‌మక్ తత్త్వశాస్త్రంలో భావవాద దృక్పథాన్ని పునరుద్ధరణ పేరుతో చేర్చి భౌతికవాదంతో మతాన్ని ముడివేయచూశాడు. మక్, ఈ ప్రపంచం వాస్తవికమైనది కాదు, జ్ఞానేంద్రియాలు కలిగించే అనుభూతులు మాత్రమే వాస్తవం అంటాడు. మన మనసుల్లో జ్ఞానేంద్రియాలు కలిగించే అనుభూతులు తప్ప వేరే వస్తువేమీ లేదంటాడు బర్కిలీ అనే తత్త్వవేత్త. వీరు ప్రచారం చేసిన భావాలను అనుభవవాద విమర్శ అనేవారు. ఇది స్వీయాత్మక భావవాదం. మన దేశంలోని శంకరుని అద్వైతం లాంటిది. ఈ భావజాలంలోని అశాస్త్రీయతను తెలియపరుస్తూ 'భౌతికవాదం, అనుభవైకవిమర్శన' అనే గ్రంథాన్ని లెనిన్ రచించాడు.

లెనిన్‌కున్న కుటుంబ నేపథ్యంతో రష్యా భాషతోపాటు ఫ్రెంచ్, జర్మన్, ఇంగ్లీషు భాషలలో ప్రావీణ్యం ఉన్నది. ఆయా భాషలలో ఎప్పటికప్పుడు వచ్చే సాహిత్యాన్ని అధ్యయనం చేసేవాడు. కళలు, సాహిత్యం ప్రజా జీవితాన్ని ఆవిష్కరించాలని, ప్రజాప్రయోజన దృష్టి ఉండాలని రచయితలను కోరాడు. నిరంతరం సైద్ధాంతిక విషయాలతో విప్లవ నిర్మాణాలతో గడిపే లెనిన్‌కు సాహిత్యం, కళలు అంటవేమోనని అనుకునేవారు. కానీ రష్యన్ రచయితలు సృజిస్తున్న సాహిత్యాన్ని గమనిస్తూ, వాటిని విశ్లేషిస్తూ ఆ సాహిత్య ధోరణులను రచయితలకు ఎరుకలోకి తెచ్చాడు. కళ కోసం కళ అంటూ రూపానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే ఫార్మలిజాన్ని, భావవ్యక్తీకరణ వాదాన్ని (ఎక్స్‌ప్రెషనిజం), భవిష్యవాదం (ఫ్యూచరిజాన్ని), రేఖాచిత్ర కళావాదం (కూబిజం)ల ప్రయోజనాలు సాహిత్య ప్రయోజనాలను పరిపూర్తి చేయలేవని అభిప్రాయపడ్డారు. పుష్కిన్, గోర్కీ, టాల్‌స్టాయ్, మయకోవస్కీ, విక్టర్ హ్యూగో, హెర్జన్, పిసరెవ్ మొదలైన రచయితల సాహిత్యాన్ని చదివేవాడు. ప్రదర్శించే నాటకాలకు హాజరయ్యేవాడు. సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం భావజాల రంగంలో తీసుకువస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సాహిత్యం, కళలు మన సంస్కృతిని ప్రతిబింబించాలని, పరాయివిగా ఉండకూడదని అభిప్రాయపడ్డాడు.

దేశంలో ఆర్థిక, రాజకీయ సంక్షోభం తీవ్రమై శ్రామిక ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంగా దిగజారిపోయి, ఇక ఏ మాత్రమూ ఆ పరిస్థితులలో జీవించలేనపుడు, పై వర్గాల ప్రజలు కూడా ఈ సంక్షోభ పరిస్థితులపట్ల అసంతృప్తితో ఉన్నపుడు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజా పోరాటాలు నడుస్తున్నప్పుడు, ఆ పోరాటాలు ఆర్థిక డిమాండ్ల సాధన కోసమే గాకుండా రాజకీయ డిమాండ్లను కూడా ఎజెండాగా చేసుకున్నపుడు, ప్రభుత్వ వర్గాలు పాత పద్ధతుల్లో పరిపాలన సాగించలేని స్థితిలో ఉన్నపుడు విప్లవానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లేనని లెనిన్ ఉద్ఘాటించాడు.

లెనిన్ మరణించి వందేళ్ళు.

పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాద యుగంగా చెలామణిలోకి వచ్చి దాదాపు 120 సం॥లు అయ్యింది. సామ్రాజ్యవాద పీచమణచి శ్రామికవర్గ రాజ్యాన్ని స్థాపించి వందేళ్ళు అయిపోయింది. దోపిడీ పీడనలు లేని సమాజాన్ని సాధించుకుని, అది ప్రపంచానికి దిక్సూచిలా నిలిచి, కొనసాగి, అంతర్థానమయిన నేటి పరిస్థితుల్లో లెనిన్‌నూ లెనినిజాన్ని గుర్తుచేసుకుంటున్నాం.

లెనినిజం రూపొందిన కాలంకన్నా నేడు సామ్రాజ్యవాదం మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోకి చొచ్చుకువచ్చి తను మరణ శయ్యపై లేనని విర్రవీగుతోంది. ఆనాటికన్నా నేడు సామ్రాజ్యవాద దేశాల మధ్య సంక్షోభం మరింతగా పెరిగింది. పెట్టుబడులు కేంద్రీకృతమవుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలను ఏర్పాటుచేసి మూడవ ప్రపంచదేశాలను అప్పుల ఊబిలోకి లాగుతున్నారు. సామ్రాజ్యవాద దేశాలలోని గుత్తసంస్థలు బహుళజాతి సంస్థలుగా ఏర్పడి ప్రజల శ్రమను, దేశ సంపదలను దోచుకుంటున్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ కార్పొరేటీకరణలు రాజ్యమేలుతున్నాయి. ప్రజలను సమీకృతులను కానివ్వకుండా పోరాటాలకు దూరం చేయటానికి కావల్సినంత సాంస్కృతిక విచ్ఛిన్నం సాగిపోతూ వుంది. ఆనాడు ఆర్థికవాదుల రూపంలో మొదలుపెట్టిన శ్రామికవర్గ వ్యతిరేక పెడధోరణులు నేటికీ రకరకాల రూపాలలో దాడి చేస్తూనే ఉన్నాయి. ప్రజానుకూలంగా కన్పిస్తూనే ప్రజల్ని ఐక్యం కానివ్వని, వర్గ స్పృహ నుండి దూరంచేసే సాహిత్యము విరివిగా ప్రచారంలో ఉంది.

సరిగ్గా ఈ సమయంలోనే వందేళ్ళక్రితం చనిపోయిన లెనిన్‌ని స్మరించుకుంటున్నాం. అర్ధవలస, అర్ధఫ్యూడల్ దేశాలకు లెనినిజం చూపిన సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక ప్రజాసంస్కృతికై సాహిత్య, కళారంగాలలో కృషిని ముమ్మరం చేద్దాం. ✷



## కృతజ్ఞతలు

**31-01-2023న మరణించిన**

**కొత్తపల్లి (తుమ్మల) సుధాబాల మొదటి వర్ధంతి సందర్భంగా**

**వారి కుటుంబసభ్యులు కొత్తపల్లి రవిబాబు, సృజన్‌కుమార్, శిశిర్‌కుమార్**

**ఈ సంచిక ముద్రణకై ఆర్థిక సహాయం అందించారు.**

**వారికి కృతజ్ఞతలు.**

**- సం॥**

వ్యాసం

# ఉర్దూ సాహిత్యంలో లెనిన్

(లెనిన్ 150వ జయంతి సందర్భంగా రాసిన వ్యాసం)

- రజా నయీమ్ 'ది వైర్' 22-4-2020 అనువాదం : భానుతేజ

**సోవియట్** యూనియన్ స్థాపకుడైన లెనిన్‌పై అల్లామీ మహమ్మద్ ఇక్బల్ రాసిన 'దేవుని ముందు లెనిన్' అన్న కవిత ప్రసిద్ధమైనది. విప్లవం విజయవంతమైన వెంటనే, కాల్పనిక సంభాషణారూపంలో వున్న ఈ కవిత 1929లో మయకోవస్కీ రాసిన "కామ్రేడ్ లెనిన్‌తో సంభాషణ" అన్న కవితకు ధీటుగా వుంది.

ప్రపంచంలో మొదటి సోషలిస్టు విప్లవంతో ప్రభావితులైన ఉర్దూ రచయితలలో ఇక్బాల్ మొదటివాడు. మాస్కోని బోల్షెవిక్కులు తమ అధీనంలోకి తెచ్చుకున్నప్పటికి ఇక్బాల్‌కి 40 ఏళ్ళు. తన కవితాసంపుటి 'గేబ్రియల్స్ వింగ్'లో ఆయన రాసిన 'కవిత్వత్రయం' (trilogy)లో 'దేవుని ముందు లెనిన్' మొదటిది. దానిలో లెనిన్, దేవుడితో జరుగుతున్న అన్యాయాల గురించి ఫిర్యాదు చేస్తాడు. ఈ కవితలో వున్న ఒక పాదం, ఒక సూక్తిలా ప్రసిద్ధి చెందింది. "నీ ప్రపంచంలో శ్రామికుడి పనిగంటలు చాల క్లిష్టమైనవి' అనేదే ఆ పాదం.

ఇక రెండో కవిత (దేవతల గీతం)లో లెనిన్ ఫిర్యాదులో చెప్పిన వాటిని దేవతలు భూలోకంలో కళ్ళారా చూసి అత్యంత లయబద్ధంగా గానం చేస్తారు.

దేవుడు అసమర్థుడని లెనిన్ తన వాదనకే కట్టుబడి వుండగా, లెనిన్ తెంపరితనంతో ఏమీ బాధపడక, మూడవ కవితలో (దేవతలకు దేవుని ఆదేశం)లో ప్రపంచంలో కొన్ని మార్పులు చేయమని దేవతలను ఆదేశిస్తాడు....

"వెళ్ళండి! భూమిపైనున్న బాధితులకు చెప్పండి
శిష్టవర్గాల రాజభవనాలు పునాదులతో కదలించమని
విశ్వాసమనే బాధతో బానిసల రక్తాన్ని మరిగించండి
పిచ్చుకలు సవాలు చేయాలి గ్రద్దలను - పొరపాటు చేయకండి
ప్రజాస్వామ్యం అతి చేరువలో వుంది
పాత సమాజపు అవశేషాలను బ్రద్దలు కొట్టండి
రైతు నోటికి అందని
ప్రతి గోధుమ గింజని కాల్చివేయండి
దేవుడికీ మానవుడికీ మధ్య దూరం వ్యర్థం
గుడుల్లో పూజారులను తొలగించండి - వారందరూ నకిలీలు
నాకొక చిన్న ఇల్లు కట్టండి
పాలరాతి భవనాలను ద్వేషిస్తాను
కొత్త ప్రపంచం పెళుసుగా వుండే గాజు భవనం
ఓ తూర్పు దేశానికి చెందిన కవీ!
వ్యామోహాన్నీ, హృదయ వేదననీ అర్థం చేసుకో!

1950లలో యుక్తవయసులో వున్న ఆనాటి తరమంతా పై కవితను కంఠస్థం బట్టి పాడుకునేవారు.

ఇస్లామిక్ సోషలిస్టు, భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులలో ఒకరు, ఇక్బాల్ సమకాలికుడైన మౌలానా హస్రత్ మోహానీ, ఇక్బాల్ లాగానే ఆశ్చర్యం వెలిబుచ్చుతూ

గాంధీ రాట్నంతో ఎందుకు సమయం వృథా
లెనిన్ లాగ ఉత్సాహంతో విప్లవాన్ని తేలేరా?

అన్నాడు.

1936లో భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడే నాటికే, లెనిన్ మరణానంతరం సోవియట్ యూనియన్లో కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికలు ప్రారంభమయ్యాయి. స్టాలిన్ నాయకునిగా నిలదొక్కుకున్నాడు. సోవియట్ యూనియన్ నుండి ట్రాట్స్కీ బహిష్కరింపబడ్డాడు. 1960లలో ఇండియాలో కమ్యూనిస్టు పార్టీ సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం)గా చీలిపోయింది. కాని కవుల గుండెల్లో లెనిన్ మాత్రం స్థిరంగా వున్నాడు. లెనిన్ పట్ల కవులకు గల గౌరవభావాన్ని ఆలీ సర్దార్ జాఫ్రీ 1949లో ప్రచురించిన తన కవితాసంపుటి 'ఖూన్ కీ లాకీర్' (రక్తరేఖ)లో వున్న 'లెనిన్' అనే కవితలో చూడవచ్చు. లెనిన్‌ను "ఎరుపు సత్రం" నిర్వాహకునిగా వర్ణించిన ఈ కవిత జాఫ్రీ రాసిన ఉత్తమ కవితల స్థానంలో లేదు.

"దేశ దేశాల ఆకాంక్షలను పరిపూర్తి చేసిన
ఆ ఎరుపు సత్రం నిర్వాహకుడైన లెనిన్!" అన్నాడు.

మరోచోట, జాఫ్రీ తన కవిత 'మేరే ఖ్వాబ్' (నా కలలు)లో యువత కలలను గుర్తు చేస్తూ, కార్మికులు లెనిన్ రాసిన పుస్తకాలను చదువు తున్నారని ఇలా రాశాడు :

"ఒక ఫ్యాక్టరీలో
కొందరు యువకులు
ఒక సంఘంగా ఏర్పడి
ఏకాగ్రతతో
లెనిన్ రాసిన పుస్తకాన్ని చదివారు"

నియాజ్ హైదర్, అత్యంత గౌరవనీయుడైన కమ్యూనిస్టు కవి. ఆయన 1967లో బోల్షెవిక్ విప్లవ 50వ వార్షికోత్సవ సందర్భంగా "లెనిన్.... ఈ యుగపు సంతోషకరమైన సమాచారం" అనే కవితా సంపుటి ప్రచురించారు. ఆ సంపుటిలో 1958 ఏప్రిల్‌లో రాసిన "లెనిన్ సమక్షంలో" అనే కవితలో లెనిన్‌ను బైజాంటియన్ దైవదూతగా మార్చి లెనిన్‌కు ద్రోహం చేశాడు.

"అతడే దేవుళ్ళను కూడా అపహాస్యం చేసినవాడు.
వాళ్ళని ఆర్థాంతరంగా వదిలేసినవాడు
ఆయన చర్చిలో కనబడనివాడు. ఆయనే దైవదూత"

లెనిన్‌ను ప్రశంసిస్తూ కైఫీ అజ్మీ ఒక విభిన్నమైన గౌరవాన్ని ప్రదర్శించాడు. లెనిన్ వారసులలోని లోపాలను ప్రస్తావించాడు. లెనిన్ సలహాలను అభ్యర్థించాడు. 1974లో ఆయన ప్రచురించిన "దేశ దిమ్మరి ప్రణామాలు" చాలా కష్టపడి రచించారు. దానిలో ఇండియాతో సహా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన చీలికల గురించి లెనిన్‌కు చెబుతూ ఇలా అంటారు.

"ఒకే ఒక గట్టి రాతితో మీరు గోడని కట్టారు
కాని అది పగుళ్ళు ఇస్తున్న ప్రమాదం పొంచి వుంది"

ఆ తర్వాత పేరాలో, ఇప్పటి సమస్యలకు పరిష్కారం సూచిస్తూ మరో పవిత్ర గ్రంథం రాయమని కోరతాడు.

"ఇది ఎంతో క్లిష్టకాలం
ఈనాడు ఎదుర్కొంటున్న సమస్యలకు
పరిష్కారం చూపిస్తూ; మరో ఉద్గ్రంథం రాయమని ప్రార్థిస్తున్నా"

ఈ కవిత అంతా, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఏకత్రాటిపై ఐక్యంగా నడిపిన మహోన్నత నాయకుడు లెనిన్ జ్ఞాపకాలతో నిండి వుంది.

పాకిస్తాన్ అభ్యుదయవాదుల ప్రముఖుడు ఫైజ్ అహ్మద్ ఫైజ్ లెనిన్‌పై ప్రత్యేకంగా ఏ కవితా రాయకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. అయితే ఆయన సంకలిత సంపుటి "కుల్లియాత్"లో లెనిన్ గ్రాడ్ యుద్ధంలో మరణించిన అమరులను స్మరిస్తాడు. 1962లో ఆయన లెనిన్ శాంతి బహుమతినందుకుంటూ ఉర్దూలో కవితాత్మకంగా శాంతి ఉద్యమాన్ని సమర్థిస్తూ చేసిన ప్రసంగంలో లెనిన్ పేరును ప్రస్తావించాడు. ఇలా "శాంతి బహుమతి గౌరవనీయుడైన, పవిత్రుడైన లెనిన్ పేరుతో వుండటమే ఆ బహుమతి యొక్క గొప్పతనం వుంది. వర్తమాన కాలంలో మానవ స్వేచ్ఛకు లెనిన్ గొప్ప దీపధారి". కైఫీ, సాహిర్‌లలాగా కాకుండా ఫైజ్ సోవియట్ వ్యవస్థలో వచ్చిన నెర్రెల గురించి మరిచిపోయాడో లేక ఆతిథ్యమిచ్చిన వారిపట్ల మర్యాద చూపాడో తెలియదు.

సాహిర్ లూధ్వియానీ లెనిన్‌పై రెండు కవితలు రాశారు. దానిలో ఒకటి 1917 విప్లవ విజయానికి కారకుడైన లెనిన్‌పై బృందగీతం కాగా, రెండోది 1970 ఏప్రిల్ 24న. లెనిన్ జయంతికి రాసిన కవిత 50 ఏళ్ళ క్రితం రాసిన ఈ కవితలో కమ్యూనిస్టు ప్రపంచంలో నెలకొన్న అస్థిరత, అనైక్యతను కవిత మొదట్లో ప్రస్తావించారు.

"ఎక్కడికి పోతోంది మీ సంఘం,
ఎలా తెలుసుకోవాలి మేం
నాయకుల సంఖ్య మాత్రం పెరుగుతూ వుంది"

స్టాలిన్ మరణానంతరం మాస్కోలో జరిగిన సంఘటనలను సాహిర్ ప్రస్తావించాడు. ఒకనాటి కామ్రేడ్స్ ఈనాడు 'శత్రువులు'గా రివిజనిస్టులుగా మారడాన్ని విమర్శించాడు కవిత ముగింపులో. ఈ చీలికకు కారణం ముఠాలు కాకుండా వర్గంపై ఆధారపడి వుంటే బాగుండేది అన్నారు.

"ముఠాలు కాక, వర్గాలుగా చీలమని వేడుకుంటున్నా
బానిస ప్రజావళికి ఈ అదృష్టం కలుగదా?"

పాకిస్తానీ ప్రతిఘటన కవి హబీబ్ జాలిబ్ "లెనిన్ – జవాబ్ ఇస్కా పైదా కరే కైనాల్" అనే కవిత ఆయన 1975లో ప్రచురించిన కవితాసంపుటి "శిక్షించే యుగం" (The Age of Punishment) లోనిది. ఇది ఒక విశిష్టమైన దృక్పథాన్నీ, రచయితలను బోల్షెవిక్ నాయకుడు ఎలా ఉత్తేజపరుస్తాడో చెబుతుంది.

"ఆయన రచయితలకు ఊహలనందించాడు
ఆయన ప్రతి పదమూ పద్యమే"

ఉర్దూ కవిత్వంలో లెనిన్ గురించి ప్రస్తావనలు విరివిగా వున్నా, ఉర్దూ కాల్పనిక సాహిత్యంలో (కథ, నవల) ఈ ప్రస్తావనలు అంత ఎక్కువగా నాకు కనబడలేదు. పాకిస్తాన్‌లో వున్న నేటి ప్రసిద్ధ నవలా రచయిత ముస్తాన్సార్ హుసేన్ తరార్, ఆరవ ప్రపంచ యువజన ఉత్సవానికి మాస్కోకి 18 ఏళ్ళ పాకిస్తానీ ప్రతినిధిగా మొట్టమొదటిసారి వెళ్ళినపుడు లెనిన్ స్మారక మందిరం (మ్యూజోలియజం) సందర్శించిన విషయం తన నవల 'ది డౌ' (The Dove)లో వివరించారు.

"....లెనిన్ తన సంప్రదాయక దుస్తుల్లో, వెస్ట్‌కోటు, విశాలమైన టై, దానికి అస్తవ్యస్తంగా వేసిన ముడి, ఇప్పటివరకు మిలియన్ల చిత్రాలలోను, శిల్పాలలోను వున్నట్లు స్పష్టంగా – విశాలమైన నుదురు – దువ్వుకున్న జుట్టూ.... లెనిన్ సోషలిస్టు వ్యవస్థ ప్రపంచంలో సగానికి పైగా వ్యాపించింది. చరిత్రలో మొదటిసారిగా కార్మికులు, రైతులు మాత్రమే సింహాసనం అధిష్టించడానికి అర్హులు అని చెప్పిన లెనిన్...."

ఈ నవలా రచయిత తరార్ అర్ధ శతాబ్దం తర్వాత ఆ సోషలిస్టు వ్యవస్థ కూలిపోవడాన్నీ, మాస్కోని భౌతికంగా గానీ, వారి స్వప్నాలలో గానీ తమ మాతృభూమిగానూ, సామాజిక న్యాయాన్నీ, స్వేచ్ఛనూ ప్రసాదించేదానిగానూ తలచిన ఒక తరం పాకిస్తానీయుల జీవితాన్ని తన నవల 'ఏ ఘజాల్ ఎషాబ్'లో చిత్రించాడు. ఈ నవల ఇటీవలే ఇంగ్లీషులోకి 'లెనిన్ ఫర్ సేల్' (అమ్మకానికి లెనిన్) అనే పేరుతో అనువాదమయింది. ఈ అమ్మకమనేది నూతన రష్యా సైద్ధాంతికంగా అతని భావాలను అమ్మడం అనే అర్థంలో వాడారు. ఇపుడు ఈ నూతన రష్యాలో ఒకనాటి కమ్యూనిస్టులు పెద్ద వ్యాపారుల్లాగా మారారు. ఈ అమ్మకమనేది భౌతికంగా కొత్త ప్రభుత్వం తిరస్కరించిన లెనిన్ విగ్రహాలకు కూడా వర్తిస్తుంది. అవి రష్యా నుండి అమెరికాకు తరలి వెళ్ళడాన్ని తరార్ అత్యంత దయారహితంగా చిత్రించాడు.

"లెనిన్ విగ్రహాలు ఎన్నో అమ్ముడుపోయాయి. అమెరికన్ యాత్రికులు వాటిపట్ల ఎంతో ఇష్టాన్ని చూపారు. డాలర్లలో వాటి ధర చెల్లించారు. పెద్దపెద్ద పెట్టెలలో వాటిని తరలించారు. లెనిన్ జీవిత కాలంలో లెనిన్ చెప్పిన సిద్ధాంతం ఏ దేశపు దరిదాపుల్లోకి రాలేక పోయిందో, ఆయన మరణించిన తర్వాత ఎటువంటి పాస్‌పోర్టు, వీసా పత్రాలు లేకుండా ఆ పసుపుపచ్చ రాక్షసుని దేశంలోకి కామ్రేడ్ లెనిన్ ప్రవేశించాడు. టెక్సాస్‌లోని కోటీశ్వరుడొకడు తన ప్రవేశద్వారం బయట ఆ విగ్రహాన్ని పెట్టి, ఆ విగ్రహం మెడలో "కుక్కలకూ, కమ్యూనిస్టులకూ ప్రవేశం లేదు. ఇది లెనిన్ ఆజ్ఞ" అనే అట్ట వేలాడదీశాడు..... తాను ఏ వ్యవస్థనైతే ధ్వంసం చేయాలనుకున్నాడో, ఆ వ్యవస్థలో తన విగ్రహం ఒక హాస్యాస్పదమైన అలంకరణగా మారింది. ఈ నాగరిక పెట్టుబడిదారీ

ప్రపంచంలో ఇప్పటికే ఆయన తన టై ముడిని సరిగా బిగించలేని స్థితిలో వున్నాడు. అది ఇంకా వదులుగా, వికారంగా అలాగే వుంది".

మాస్కోలో కూలిపోయిన మార్క్సిస్టు లెనినిస్టు రాజ్యపు ప్రభావాన్ని తరార్ ఒక్కడే ఇప్పటివరకు ఉర్దూ సాహిత్యంలో చిత్రించారు. దాని గురించి వివరంగా మరో సందర్భంలో చూద్దాం.

మీర్జా గాలిబ్ కవితా పంక్తులకు పారడీగా ఢిల్లీకి చెందిన హాస్య రచయిత నజర్ బార్నీ రాసిన "ఎందుకీ భాష?" (Why this Language?) అనే కవితలో లెనిన్ ఒక చిన్న పాత్రగా వుండి చేసిన ఈ వ్యాఖ్యతో ఈ వ్యాసం ముగిస్తాను.

"లెనిన్ అమెరికాలో స్థిరపడ్డాడు. అతడంటాడు గదా
నా టీచరు అజ్ఞాని – నేను పరీక్ష రాయడానికి
ఎందుకు ఇబ్బంది పడాలి?"

దక్షిణ ఆసియాలో అపఖ్యాతిపాలైన గురు–శిష్య సంబంధంపైనే గాక, లెనిన్ సర్వవ్యాప్తి అని వాదించే పిడివాద లెనినిస్టులపై పై రెండు కవితా పాదాలు వ్యాఖ్యానంగా తలచవచ్చు.

**(ఈ వ్యాస రచయిత రజా నయీమ్ పాకిస్తాన్‌కు చెందిన సామాజిక శాస్త్రవేత్త, విమర్శకుడు. ఎన్నో బహుమతులు అందుకున్న అనువాదకుడు. లాహోర్‌లో వుంటారు. అక్కడ అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడు. ఆయన ఈ–మెయిల్: rajanaeem@gmail.com)** ✺

# 2023లో సుప్రీంకోర్టు ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం! 1989లోనే జైపూర్‌లో హైకోర్టు ఆవరణలో మనువు విగ్రహం!

**భారత** రాజ్యాంగం అమలులోకి వచ్చిన నవంబరు 26న 2023లో 9 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సుప్రీంకోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. ఈ విగ్రహం పెట్టడానికి 75 ఏళ్ళు పట్టింది మన పాలకులకు. కాని 1989లోనే జైపూర్‌లో రాజస్థాన్ బెంచ్ హైకోర్టు ముందు 11 అడుగుల మనువు విగ్రహాన్ని పెట్టారు.

పార్లమెంట్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం పెట్టాలని దాదాసాహెబ్ గయక్వాడ్ ప్రయత్నాలు 1970లలో ప్రారంభించారు. ఆయన అంబేద్కర్ అనుచరుడు. ఆయన కోరిక ఇప్పుడు 56 ఏళ్ళ తర్వాత సఫలమైంది. అయితే మనువు విగ్రహం పెట్టడానికి 23 రోజులు మాత్రమే పట్టింది. 1989 ఫిబ్రవరి 10న రాజస్థాన్ హైకోర్టు అధికారుల సంఘ అధ్యక్షుడు పద్మకుమార్ జైన్, కోర్టు ఆవరణ 'సుందరీకరణ'లో భాగంగా మనువు విగ్రహాన్ని పెట్టాలని ప్రతిపాదించారు. మార్చి 3, 1989లో ఈ ప్రతిపాదనకు అంగీకారం లభించింది. అప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చరణ్‌మాథుర్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇ.ఎస్. వెంకట్రామయ్య. భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను వ్యతిరేకించే 'ధర్మా'లను చెప్పిన మనువు విగ్రహం ఒక న్యాయస్థాన ఆవరణలో పెట్టడానికి ఎవరికీ అభ్యంతరకరమనిపించలేదు.

కాని ప్రజల నిరసన వల్ల జులై 28, 1989లో విగ్రహాన్ని తొలగించాలని రాజస్థాన్ హైకోర్టు ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ విశ్వహిందూ పరిషత్తుకు చెందిన ఆచార్య నరేంద్ర పిల్ వేయగా, హైకోర్టు ఆగస్టులో స్టే ఇచ్చింది. ఈ కేసు విచారణలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచిలో తప్పనిసరిగా వుండాలని చెప్పింది. సుదీర్ఘకాలం తేలకుండా వున్న పిల్ ఇది. 2015లో విచారణకు తీసుకున్నపుడు, ఆ విచారణ సమయంలో 300 మంది బ్రాహ్మణ అగ్రవర్ణ లాయర్లు వివిధ కోర్టుల నుండి హాజరయ్యారు. దళితుల లాయర్ ఎ.కె. జైన్ మనుధర్మంలో వున్న దళిత వ్యతిరేకత, స్త్రీల పట్ల వివక్ష మొదలైన ప్రజావ్యతిరేక భావాలను వివరిస్తుండగా, ఆరోజు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 300 మంది లాయర్లు కోర్టు ఆవరణలో అల్లరి చేయగా న్యాయమూర్తి కేసును వాయిదా వేశారు. ఇప్పటివరకు మరల ఆ కేసు విచారణ చేపట్టలేదు.

ఈ మధ్య దళిత సంఘాలవారు, బహుజన సమాజ్‌పార్టీవారు మనువు విగ్రహం తొలగించాలని ఆందోళన ప్రారంభించారు. 2018 అక్టోబర్ 8న మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన ఇద్దరు మహిళా కార్యకర్తలు శీలాబాయి పవార్, కాంతారమేశ్ అహిరి మనువు విగ్రహానికి తారు పూసి అరెస్టయ్యారు.

మనువు విగ్రహం ఈనాటికీ అలాగే వుంది. రాజస్థాన్‌లో కాంగ్రెసు, బిజెపి ఒకరి తర్వాత మరొకరు అధికారంలోకి వస్తున్నారు. కాంగ్రెసు అధికారంలో వున్నపుడు ఈ సమస్యను పట్టించుకోలేదు. దీనికి కాంగ్రెసు మానిఫెస్టో కమిటీ నాయకుడు విభూతి భూషణ శర్మ ఒక వివరణ ఇస్తూ "వ్రాతపూర్వకమైన చట్ట వ్యవస్థకు మనువు శ్రీకారం చుట్టాడు. ఆయన చెప్పినదానిలో మార్పులు కావాలంటే, మనం రాజ్యాంగానికి సవరణలు చేసుకున్నట్లే చేసుకోవచ్చు. మనువు విగ్రహానికీ, కులానికీ ముడిపెట్టవద్దు" అన్నారు. ఇదే వాదన పిల్ వేసిన ఆచార్య ధర్మేంద్ర కూడా చేశాడు.

ఈ పిల్‌ను తేల్చమని సుప్రీంకోర్టులో దళితులు మరొక పిల్ వేశారు. అయితే ఈ పిల్‌ను 24 ఫిబ్రవరి 2023న సంజీవ్ ఖన్నా, సుందరేశ్‌లతో కూడిన డివిజన్ బెంచ్, "ఇది ఆర్టికల్ 32 క్రింద పిల్‌కి అర్హమైనదానిగా భావించడంలేదు" అంటూ కొట్టేసింది. ✺

# చారిత్రాత్మక నాటకం "క్రెమ్లిన్ గంటలు"!

- దివికుమార్

**1970లో** కొండేపూడి లక్ష్మీనారాయణ తెలుగులోకి అనువాదం చేసిన 11 రంగాల క్రెమ్లిన్ గంటలు నాటక మూల రచయిత నికొలాయ్ పొగొదిన్. తెలుగులో 108 పేజీలున్న ఈ నాటకాన్ని 1940లో ఆయన రష్యన్ భాషలో రాశారు. ఈ నాటకం జరిగిన కాలం 1920. అప్పటికి ఆరేళ్లుగా రష్యా దేశం యుద్ధ జ్వాలలలో చిక్కుకొని ఉంది.

ఆనాటి చారిత్రక నేపథ్యాన్నీ, నాటకంలోని కథా గమనాన్ని మొదట తెలుసుకుంటే ఆ తర్వాత సులువుగా, నాటకం అర్ధమవుతుంది.

1914లో ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధంలో ఫ్రాన్స్ ఇంగ్లాండ్‌లతో జారు చక్రవర్తులు కూటమిగట్టి లక్షల రష్యన్ సైనిక బలగాలను యుద్ధరంగానికి తరలించారు. వారిలో అత్యధికులు గ్రామీణ రైతు కుటుంబాలు, పట్టణ కార్మిక పేదల నుండి సమీకరించబడిన వారే. యుద్ధ ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన రెండవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 1912లోనే ఒక దేశపు కార్మిక వర్గం మరొక దేశపు కార్మిక వర్గంతో పోరాటానికి దిగరాదని, పెట్టుబడిదారీ శక్తుల యుద్ధ ప్రయత్నాలను తిప్పి కొట్టమని పిలుపునిచ్చింది. అయితే వాస్తవంగా యుద్ధం ప్రారంభమైన తర్వాత, సామ్రాజ్యవాద ప్రయోజనాలకై జరుగుతున్న ఆ యుద్ధాన్ని తమ రష్యా దేశంలో వ్యతిరేకిస్తున్నట్లే, ప్రపంచంలోని ప్రతి దేశపు కార్మిక వర్గం ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, తమ తమ దేశాలలోని దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అంతర్యుద్ధాలను సృష్టించమంటూ లెనిన్ నాయకత్వాన ఇచ్చిన పిలుపుని రష్యన్ బోల్షివిక్ పార్టీ ఒక్కటే అమలులో పెట్టింది. ఫలితంగా గ్రీసు జర్మనీ లాంటి దేశాలలో విప్లవం విజయవంతం కాలేకపోయింది. రష్యాలో జారు (Czar) చక్రవర్తుల పరిపాలన 1917 ఫిబ్రవరిలో అంతం కాగా అధికారంలోకి వచ్చిన బూర్జువా శక్తులు కూడా యుద్ధాన్ని కొనసాగించాయి. బోల్షివిక్ పార్టీ అంతర్యుద్ధాన్ని అనగా విప్లవాన్ని నడిపించినందువల్ల కార్మిక కర్షక వర్గ సంఘటన రాజ్యాధికారాన్ని చేపట్ట గలిగింది. ఆ విప్లవ ప్రభుత్వాన్ని మొగ్గలోనే తుంచి వేయాలని 14 పశ్చిమ ఐరోపా దేశాలు రష్యా పైకి దండెత్తాయి. అధికారం నుండి కూలదోయబడిన బూర్జువా భూస్వామ్య శక్తులు కూడా అంతర్యుద్ధం సృష్టించాయి. వారందరినీ ఎదుర్కొని, తట్టుకొని కార్మిక-కర్షక విప్లవ ప్రభుత్వం నిలదొక్కుకుంది. అతి దారుణమైన వినాశకర విధ్వంసం నుండి దేశాన్ని పునర్నిర్మాణం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నాటకంలో లెనిన్ కొందరు కార్మికులతో (5వ రంగంలో) ఇలా అంటాడు "సోషలిజాన్ని నిర్మించడం కంటే క్యాపిటలిజాన్ని నాశనం చేయడం చాలా తేలిక!"

క్రెమ్లిన్ గంటలు నాటకం అంతర్యుద్ధ పరిస్థితుల విధ్వంసం నుండి తేరుకుని తిరిగి నిర్మించుకునే ప్రయత్నానికి ఒక ఉదాహరణగా, పునర్నిర్మాణ నేతగా లెనిన్ నిర్వహించిన నాయకత్వ పాత్రను ఈ నాటకం ద్వారా దృశ్యీకరించారు.

నాటకంలో ఒక సందర్భంగా లెనినే అన్నట్లు పరిపాలన అనుభవం లేని తనతో సహా శ్రామిక వర్గంపై నమ్మకంతో వారి ఆధారంగా ఒక నాయకునిగా మొదలిడిన పునర్నిర్మాణ కృషి ఏ పరిస్థితులలో ఎలా మొదలైందో తెలుసుకోవడానికి ఈ నాటకం ఒక మచ్చుగా నిలుస్తుంది. పై రంగంలోనే ఒక బిచ్చగత్తె లెనిన్‌తో ఇలా అంటుంది. విప్లవానికి ముందు "నాకంతా మంచి కాతాదార్లుండేవోళ్ళు. పెద్ద పెద్ద వర్తకులు. ఇప్పుడంతా పోయింది. దమ్మిడీ ఇచ్చే వాళ్ళు లేరు. లెనిన్ రష్యానంతటిని నాశనం చేసి పారేశాడు. ఆయన పనీ అట్లాగే వుందంటలే! క్రెమ్లిన్‌లో ఒక పూటే తింటున్నాడంట. ఆయన బాగుపడ లేదు. ఇతరులని బాగుపడ నివ్వలేదు." ఆనాటి పరిస్థితికి ఇదొక చిన్న ఉదాహరణ.

మాస్కో నగరంలోని క్రెమ్లిన్ అనేది 700 గదుల సముదాయమంత ఒకే పెద్ద భవనం. దాన్ని 15వ శతాబ్దం నాటి రష్యా పరిపాలకులు నిర్మించారు. 1917 అక్టోబర్ 25 (కొత్త క్యాలెండర్ ప్రకారం నవంబర్ 7) తర్వాత రష్యా దేశపు రాజకీయ అధికార కేంద్రంగా, కమ్యూనిస్టులు అధికారానికి వచ్చిన తరువాత కూడా అదే కొనసాగింది. అయితే కమ్యూనిస్టులు అధికారం చేపట్టే నాటికి రష్యా దేశం బాగా అలసి పోయినట్లున్న పరిస్థితి ఈ నాటకం ద్వారా ప్రేక్షకులకు తెలుస్తూ ఉంటుంది.

ఈ నాటకం మొదటి రంగంలోనే 1920 నాటి జీవన పరిస్థితి ఎలా ఉండేదో తెలిసేటట్లు మాస్కో నగరంలో బజారు దృశ్య చిత్రీకరణ ఉంటుంది. జబెలిన్ అనే ఇంజనీరు సల్ఫర్ అగ్గిపెట్టెలు కొంటారా అని ఇటూ అటూ తిరుగుతూ అడుగుతుంటాడు.

అతనిలోని నిరాశా ధోరణి ఆనాటి పరిస్థితికి అద్దం పడుతుంది. ఆ పాత్ర ద్వారానే తరువాత కథ నడుస్తుంది.

వందల సంవత్సరాలుగా మోగుతున్న క్రెమ్లిన్ గంటలు ఆగిపోవడం మన దేశ పతనానికి చిహ్నం అని జబెలిన్ ఇతరులకు తెలిసేటట్లు వ్యాఖ్యానిస్తాడు. తన పరిస్థితి బజారు తుంటరి పిల్లగాళ్ళకంటే గొప్పగా ఏం లేదని అనుకుంటూ ఉంటాడు.

సామ్రాజ్యవాద యుద్ధంలోనూ అంతర్యుద్ధంలోను పోరాడిన ఒక సైనికుని ద్వారా రష్యా దేశం ఎదుర్కొన్న రాజకీయ స్థితిని ఈ మొదటి రంగంలోనే ప్రేక్షకుల దృష్టికి వచ్చేట్లు చేస్తారు.

జబెలిన్ భార్య పాత్ర కూడా ఈ రంగంలోనే పరిచయం అవుతుంది. తన బ్రతుకును సోవియట్ ప్రభుత్వమే బజారుపాలు చేసిందన్నట్లు జబెలిన్ మాట్లాడుతాడు. తన కూతురు ఎవరితోనో కలిసి మెట్రో పాల్ హోటల్‌కి వెళ్లిందని భార్యకు చెబుతూ, ఇకనుండి ఆడపిల్లలు అడ్డమైన వాళ్లతో షికార్లు కొట్టి బజారు మనుషులవుతారనే తన లోపలి దురభిప్రాయం కూడా జబెలిన్ వ్యక్త పరుస్తాడు. నిజానికి ఆ హోటల్ ప్రస్తుతం సోవియట్ ప్రభుత్వ కార్యాలయం.

తరువాత రంగాల్లో జబెలిన్ ఇంటికి సోవియట్ పోలీసులు, మాస్కో నగర మేయరు వస్తారు. తనను అరెస్టు చేయడానికే వారు వచ్చారని జబెలిన్, అతని కుటుంబ మిత్రులు కూడా భావిస్తారు! తీరా అతడిని క్రెమ్లిన్ లో సోవియట్ ప్రభుత్వ కార్యాలయానికి లెనిన్ ఉన్న చోటుకి తీసుకువెళ్తారు. జబెలిన్ ఊహకు భిన్నంగా లెనిన్ రష్యా దేశంలో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి గల అవకాశాలు అతనితో చర్చిస్తాడు. రష్యా దేశ అభివృద్ధికి పునర్నిర్మాణానికి విద్యుత్తు చాలా అత్యవసరమని లెనిన్ సంభాషణలలో మనకు అర్థం అవుతుంది. అప్పటివరకు నిపుణులు అనుకునేవారు విద్యుత్ ఉత్పత్తి అవకాశాలే లేవు అనే దురభిప్రాయాన్ని వ్యాప్తి చేసి ఉంటారు. వారికి భిన్నంగా జబెలిన్ ఎక్కడెక్కడ నుండి విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చునో లెనిన్‌కు చెబుతాడు. లెనిన్ అతనిని అభినందిస్తూ సాధ్యమైనంత త్వరలో ఒక నివేదికలాగా సోవియట్ ప్రభుత్వానికి అందించవలసిందిగా జబెలిన్ ను కోరుతాడు. తనను జైలులో బంధిస్తారనే భావనతో బట్టలు సర్దుకుని బయలుదేరిన జబెలిన్ సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉండగా సైనికుల కారులో ఇంటి వద్దకు వస్తాడు. ఈరోజు తాను ఒక గొప్ప మనిషిని చూశానని అత్యుత్సాహంగా ఇంట్లో వాళ్లకు చెబుతాడు.

తన కూతురు ప్రేమించింది కూడా లెనిన్కు అంగరక్షకుడయిన ఒక బోల్షివిక్ సైనికుడని, జబెలిన్ తెలుసుకుంటాడు. తన కార్యాలయంలో సహాయకునిగా అతడినే నియమిస్తారు.

క్రెమ్లిన్ గంటలు రెండు రకాలైనవి ఉన్నాయి. మన దేవాలయాలు, చర్చీలలో ఉండే కంచు గంటలు ఒక రకమైతే, గడియారపు గంటలు మరొకటి.

కంచు గంటలు (Czar Bells) 18వ శతాబ్దపు జారు చక్రవర్తుల కాలంలో ఏర్పడినవి. 202 టన్నుల బరువు, సుమారు 20 అడుగుల ఎత్తు, 21 అడుగుల చుట్టుకొలత కలిగి ఉండేవి.

మన నాటక సందర్భంలోవి 20 మీటర్ల వ్యాసం కలిగిన గడియారపు గంటలు. అవి క్రెమ్లిన్ భవన గోపురానికి నాలుగు వైపులా ఉంటాయి. ఒక్కొక్క అంకె రెండు అడుగుల పైన ఉంటాయి. గంటల ముల్లు పది అడుగులకు తక్కువగాను, నిమిషాల ముల్లు మరొక అడుగు ఎక్కువగాను ఉంటాయి. గంట గంటకు మోగటమే కాక సూర్యోదయానికి సూర్యాస్తమయానికి కూడా ఇవి మోగుతూ ఉంటాయి. ఈ గడియారం పాడయిపోవటం ఒక క్షీణదాయక స్థితిని సూచించేది. దాన్ని బాగు చేయించడానికి మెకానిక్ కోసం లెనిన్ కబురు పంపుతాడు. కంటే సింహాన్ని కనాలి అన్నట్లు చేస్తే గుర్తుండిపోయే నైపుణ్యం గల పని చేయాలి అనే భావమున్న క్లాక్ మేకర్ ఒకతను వస్తాడు.

అతను పూర్వం టాల్ స్టాయ్ గడియారం బాగు చేశాడట. తన సామాన్ల పెట్టె తెరిచి భూతద్దం సరి చేస్తూ ఉంటాడు. లెనిన్ ఈ పనికి పెద్ద రెంచి కావాల్సి ఉంటుంది అంటాడు. లెనిన్ సహాయకుడు అది కొన్ని వందల పౌన్లు బరువైన వస్తువుతో వ్యవహారం అని చెబుతాడు. ఇప్పుడు దానికి ఇంటర్నేషనల్ వాయించేట్లు చేయాలంటాడు లెనిన్. తన మీద నమ్మకంతో ఈ పని అప్పచెప్పినందుకు కృతజ్ఞతలు చెబుతూ అతను వెంటనే పనిలోకి దిగుతాడు.

నాటకంలో ఇంజనీర్ జబెలిన్ కూతురు మాషాకు, నావికుడు, కరుకు బోల్షివిక్ రైబకోవ్‌కు నడుమ ప్రేమ వ్యవహారం కూడా ఉంటుంది. అంటే పరస్పరం అర్థం చేసుకునీ... చేసుకోక, కొంత అపార్థం కూడా ఏర్పడి, అవి తొలగిపోయి ప్రేమ సుఖాంతం అవుతుంది. ఆ సమయంలో జబెలిన్ ఇలా అంటాడు "ఓ జీవితమా నీలో ఒక చమత్కారమైన రుచి ఉంది నువ్వు కారంగా ఉంటావు చేదుగా ఉంటావు ఆ సమయం వస్తే మనుషులు వాటిని మింగక తప్పదు.."

నాటకం చివరిరంగంలో ఒక బ్రిటిష్ రచయిత లెనిన్‌ను కలవడానికి తాను వచ్చినట్లు చెప్పమంటాడు. తెలుగు నాటకంలో పేరు పెట్టలేదు కానీ, దానిని సినీ నటుడు కాకరాల దర్శకత్వంలో మదరాసులో ప్రదర్శించినప్పుడు ఆ పాత్రకు H.G. వెల్స్ పేరు పెట్టారు. సరిగా 1920లో ఆయన గోర్కీ సహాయంతో లెనిన్‌ను కలిశారు. "రష్యా ఇన్ ది షాడోస్" అనే పుస్తకం మరుసటి సంవత్సరం ఆయన రాశాడు. కనుక ఆ పాత్రను వెల్స్ అనుకోవడం సరైనదే! ఆయన ఆ పుస్తకంలో లెనిన్ మాటను ఇలా చెబుతాడు. "రష్యా విప్లవం అనేది పరిమితి లేని ప్రయోగాల ఆవిష్కరణకు మించినది!"

అయితే వారిరువురి నడుమ జరిగిన సంభాషణలో వెల్స్ "మీ భావాలు తప్పు" అని ఇంకా ఏమంటాడంటే... "ధనికుల్లోనూ పేదవాళ్లలోనూ కూడా మంచివాళ్లున్నారు. వాళ్ళిద్దరిలోనూ ఉన్న నిజాయితీపరులంతా ఏకం కావాలి. రేషనల్ సోషలిజాన్ని నిర్మించాలి." రష్యాలో మీరు ఏం చూసారో చెప్పండి అని లెనిన్ అడిగితే... ఆర్థిక దురవస్థను పట్టించే కొన్ని అంశాలను చెప్పి...

"రష్యాను అంధకారం ఆవరిస్తోంది భయంకరమైన అంధకారం. దాని అంతాన్ని తెలిపే అంధకారం. విపత్తు! నాశనం!! సర్వనాశనం!!! ఇవే కనిపిస్తున్నాయి."

మాటల మధ్యలో "గోర్కీకి ఒక సూటే ఉందట" అని చెబుతూ, తనకు "అందరు పెద్దమనుషులలాగే 12 సూట్లు" ఉన్నట్లు వెల్స్ అంటాడు.

పరమ వినాశకరమైన పరిస్థితుల నడుమ అంత ధైర్యంగా ఎలా ఉండగలుగుతున్నారో వెల్సుకు ఆశ్చర్యం కలిగిస్తుంది. లెనిన్ "మరొక

పది సంవత్సరాల తర్వాత తప్పక తిరిగి రండి" అని రెండు మూడు సార్లు చెబుతాడు. ఆయన వెళ్లిపోయిన తర్వాత బిగ్గరగా "పండితమ్మన్యుడు! మహా పండితమ్మన్యుడు!" అని వ్యాఖ్యానిస్తాడు.

చివరగా జబెలిన్‌ని పిలిపించి విద్యుత్ ఉత్పత్తికి అతను రూపొందించిన నివేదిక బాగానే ఉందనీ, అందులోనే కొన్ని సూచనలు చేసినట్లు లెనిన్ చెబుతాడు. ఒక మార్క్సిస్టు సిద్ధాంత వేత్త తన పక్కన ఉంటే ఇంకా మంచిదేమో అంటాడు జబెలిన్.

"మీకు మార్క్సిజం పాఠాలు బోధించడానికి మేము మీ దగ్గరకు రాలేదు. మీరు పని చేయాలి. ఒక మంచి కోసం పనిచేయాలి. కష్టపడి పనిచేయాలి. అదే ఉత్తమమైన మార్క్సిజం మీకూ మాకూ కూడా!!" అంటాడు లెనిన్.

కాసేపట్లో క్రెమ్లిన్ గంటలు కొట్టుకుంటున్నట్లు వినిపిస్తుంది ఇంటర్నేషనల్‌తో సహా! ఆ గంటల శబ్దం నూతన శుభోదయానికి సూచికగా ప్రకటిస్తూ నాటకం ముగుస్తుంది.

ప్రజలలో అంతర్గర్భితంగా ఉండే వివిధ సాహసోపేతమైన శక్తుల, వారి సృజనాత్మక నైపుణ్యాల పట్ల నమ్మకం, అడ్డంకుల మయమైన పరిస్థితులను ఎదుర్కోగలిగేట్లు చేయగల నిర్మాణ దక్షతగల లెనిన్ లాంటి నాయకులు ఉండబట్టే సోవియట్ యూనియన్‌లో నూతన సామాజిక నిర్మాణం సాధ్యపడింది.

అంతో ఇంతో భావుకత లేనిది కవిత్వం ఎలా కాదో, నాటకీయత లేకుంటే నాటకం కూడా అలా కాదు. ఒక పుస్తకంగా చదువుకునే వారికి నాటకం సులువుగానే అర్థమవుతుంది కానీ, తెలుగు ప్రేక్షకులలో రాజకీయ నేపథ్యపు అవగాహన ఉన్నవారికి మాత్రమే ఒక మేరకు ప్రదర్శనాత్మక నాటకం బాగా ఆసక్తిదాయకంగా ఉండగలదు. అయితే సోవియట్ ప్రజలకు, వారి చరిత్రలో అంతర్భాగం కనుక, వారికి బాగానే అర్థమై ఉంటుంది.

దాదాపు 40కి పైగా నాటకాలు రాసిన పోగొదిన్ అనేకం ఫిల్ము కథలు, ఒక నవల కూడా రాశారట. మొత్తం నాటకాలలో బాగా పేరు పొందినవి లెనిన్ కేంద్రంగా రూపొందిన త్రయాలజీ (మూడు నాటకాలలో) ఇది నడిమధ్యది. 1900వ సంవత్సరంలో జన్మించిన పోగొదిన్ 1962 సెప్టెంబర్ 19న మాస్కో నగరంలో మరణించారు. ✺

## క్రెమ్లిన్ గంటలు : పొట్టి లెనిన్ పాత్రలో పొడవాటి కాకరాల

**కాకరాల** రంగస్థల జీవితంలో క్రెమ్లిన్ గంటలు ఆయనకొక ఒక మరపురాని మధురానుభూతి. ఈ నాటకంలో కాకరాల లెనిన్ పాత్ర వేశారు. కాకరాల పొడగరి. కానీ, లెనిన్ పొట్టిగా ఉంటాడు. దాంతో పొడుగు లెనిన్ అని కాకరాలకు పేరొచ్చింది. నటననే నమ్ముకున్న కళాకారుడు కాకరాల. ఆయన నట జీవితం ఆయన మాటల్లోనే.

"డాక్టర్ రాజారావు ఆర్ట్స్ మెమోరియల్ అకాడమీ (డ్రామా)ని 1970 నుంచి 1979 దాకా నడిపాము. కొన్ని నాటకాలకు నేను దర్శకత్వం వహించాను.

1972లో ప్రదర్శించిన క్రెమ్లిన్ గంటలు నాటకానికి కూడా నేనే దర్శకత్వ బాధ్యతలు చేపట్టాను. చలనం కోల్పోయిన సోవియట్ సమాజాన్ని లెనిన్ ఎలా పునర్నిర్మించాడో ఈ నాటకం సారాంశం. దీనిలో హెచ్ జీ వెల్స్, లెనిన్ రెండు ప్రధాన పాత్రలు.

ఇద్దరి సంభాషణలతో నాటకం పూర్తవుతుంది. లెనిన్ పొట్టివాడు కనుక వల్లం నరసింహారావును లెనిన్ వేషం వేయమన్నాను. నేను హెచ్ జీ వెల్స్ వేషం వేస్తానన్నాను. ఆయన ఒప్పుకోలేదు. తానే హెచ్ జీ వెల్స్ వేషం వేస్తానన్నాడు. దాంతో నాకు లెనిన్ వేషం వేయక తప్పలేదు.

కుమార్ నాకు ప్రత్యేకంగా మేకప్ చేశాడు. ఆ మేకప్‌కు 3 గంటలు పట్టింది. నాటకాన్ని రెండున్నర గంటలకు ఎడిట్ చేశాం. ఇప్పటి హీరో సాయికుమార్ రైతు కుమారుడిగా, ఎనిమిదేళ్ళ మా కూతురు రైతు కుమార్తెగా వేశారు. మా రమణ జెర్జిన్స్కీ వేషం వేశాడు. అందరికీ పోర్షన్స్ చెపుతూ నేను వేషం వేయాలి.

ఫైనల్ రిహార్సల్స్ చూసిన రమణమూర్తి "నువ్వు తప్ప, అంతా బాగుంది" అన్నారు. దాంతో నా సహచరి సూర్యకాంతం సహకారంతో రాత్రంతా కూర్చుని లెనిన్ పోర్షన్ వచ్చేదాకా సాధన చేశాను. ఎందుకంటే లెనిన్ పొట్టివాడు. పొడవుగా ఉండే నేను లెనిన్ పాత్ర వేయాల్సి వచ్చింది.

నాటకం వేస్తున్నప్పుడు శ్రీశ్రీ వచ్చి కూర్చున్నాడు. నాటకం అయిపోయాక గ్రీన్ రూంలోకి వచ్చి "నాటకం చాలా బాగా వచ్చింది. కాకపోతే పొడవు లెనిన్" అన్నారు శ్రీశ్రీ.

మంచి స్పందన వచ్చింది. పత్రికలు కూడా బాగా రాశాయి. నా జీవిత చరిత్రలో క్రెమ్లిన్ గంటలు ప్రదర్శనలు మైలురాళ్ళుగా నిలిచిపోయాయి.

**కాకరాల జీవనయానం – 3 రాఘవశర్మ ముఖాముఖి నుండి** ✺

# లెనిన్ సంతాప సభ

- నికొలాయ్ ఓస్త్రొవిస్కీ

**ప్రజలు** వందల సంఖ్యలలో రైల్వే యార్డులలో గుమికూడేరు. తలుపులు తోసుకొని ఆ పెద్ద భవనంలో జొరబడ్డారు. హాలులు, వరండాలు, గదులు జనంతో నిండిపోయేయి.

అందరూ నిశ్శబ్దంగా వున్నారు. స్మారకసభ ప్రారంభమయింది. షెపెటోవ్కా ప్రాంతీయ కమిటీ కార్యదర్శి షరాబ్రిన్ వుపన్యాసం ప్రారంభించేడు.

“కామ్రేడ్స్! ప్రపంచ శ్రామికవర్గనాయకుడు లెనిన్ ఇకలేడు. బోల్షివిక్ పార్టీని నిర్మించి, శత్రుదుర్భేద్యం చేసిన ఆ మహావ్యక్తి మరణించడంతో పార్టీకి తీరనిలోటు కలిగింది..... మన పార్టీ నాయకుడూ, మన వర్గనాయకుడూ మరణించటంతో కార్మికవర్గంలో సుసమర్థులయిన యోధులంతా పార్టీలోకి వచ్చి చేరాలి.....”

బ్యాండుమీద చరమగీతం ఆలపించబడింది. సభలో వారంతా టోపీలు తీసేసేరు. పదిహేనేళ్ళ ఈ మధ్యకాలంలో ఏడ్చిఎరగని అర్టెమ్ వెక్కివెక్కి ఏడ్చేడు.

★ ★ ★ ★

రైల్వేపనివారి క్లబ్బులో సభ ప్రారంభమయింది. ఇసకవేస్తే రాలకుండా వున్నారు జనం. చోటుచాలక క్లబ్బు బయట, చలిలో వొణికిపోతూ ఎందరో నిలబడి వున్నారు. క్లబ్బు గుమ్మంలో వున్న ఫర్ చెట్ల కొమ్మలనుంచి మంచుముక్కలు లస్తరులా వ్రేలాడుతున్నాయి. గదిలో ఉక్కకి ఊపిరాడడంలేదు.

అంత సభలో ఒక్కరు కూడా మాట్లాడటంలేదు. దుఃఖంతో అందరిగొంతులూ నిండివచ్చేయి. ఏదన్నా మాట్లాడినా గుసగుసలతోనే సంభాషణ సాగిపోతూంది. తుపానులో సరంగును పోగొట్టుకొన్న ఓడలోని జనంలాగ వారంతా విచారవదనాలతో వున్నారు.

బ్యూరో సభ్యులు నిశ్శబ్దంగా వచ్చి తమ స్థానాలలో కూర్చున్నారు. సిరోటెంకో నెమ్మదిగా గంటనెత్తి అందుబాటులో పెట్టుకొన్నాడు. నెమ్మదిగా వాయించి మళ్ళీ బల్లమీద పెట్టేసేడు. అంతా నిశ్శబ్దం.

★ ★ ★ ★

ప్రధానోపన్యాసం అయిపోయేక పార్టీ కార్యదర్శి సిరోటెంకో మాట్లాడడానికి లేచేడు. స్మారకసభల్లో సాధారణంగా అటువంటి ప్రకటన వినబడదు. అయినా ఆనాడు అతడు చేసిన ప్రకటన ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు.

“తమరిని పార్టీలో చేర్చుకోవలసిందిగా కోరుతూ చాలమంది పనివారు దరఖాస్తు పంపించేరు. ఈ దరఖాస్తుమీద ముప్ఫయ్యేడుమంది సంతకాలు పెట్టేరు. వారి దరఖాస్తు ఇది.

“దక్షిణ – పశ్చిమ రైల్వేలోని షెపెటోవ్కా స్టేషన్ బోల్షివిక్ పార్టీకి –

మన పార్టీ నాయకుని మరణం బోల్షివిక్ పార్టీలోకి నూతన సభ్యులను ఆహ్వానిస్తూంది. లెనిన్ పార్టీలో చేరే అర్హత మాకున్నదేమో విచారించవలసిందిగా ఈ సభవారిని కోరుతున్నాము”.

దాని క్రింద రెండు వరుసలలో సంతకాలున్నాయి.

సిరోటెంకో ఒక్కొక్క పేరునే ఆచిఆచి చదివేడు.

“స్టానిస్లావ్ జిగ్మండోవిచ్ పోలెన్‌టోవ్‌స్కీ – ఇంజన్ డ్రైవరు – ముప్పయ్యారేళ్ళ పని అనుభవం....”

సభలో అంగీకార సూచకమైన కలకలం వినబడింది.

“ఆర్టెమ్ ఆండ్రెయేవిచ్ కోర్చాగిన్ – మెకానిక్ – పదిహేడేళ్ళ పని అనుభవం –”

“జఖార్ ఫిలిప్పోవిచ్ బ్రూజక్ – ఇంజను డ్రైవర్ – ఇరవైయ్యొక్క ఏళ్ళ పని అనుభవం–”

రైల్వేపనివారిలోకల్లా జెట్టీలనదగిన ‘వారిపేర్లు ఒక్కొక్కటే చదువుతున్న కొలదీ సభలో సమ్మతి సూచకమైన ధ్వనులు అంతకంత కెక్కువయ్యేయి.

పేర్లన్నీ చదవడం పూర్తి అయ్యేక మొట్టమొదటి పేరువాడు – పోలెన్‌టోవ్‌స్కీ – మాట్లాడడానికి లేచేడు. మరల సభ నిశ్శబ్దం అయింది.

“.....నే చెప్పేటందుకేముంది? వెనకటిరోజుల్లో పనివాడి బ్రతుకు ఎల్లా వుండేదో మీరందరూ ఎరుగుదురు. జీవితకాలం అంతా బానిసలా నానాచాకిరీ చేసేను. ముసలితనం వచ్చేసరికి ముష్టివారిస్థితిలో వున్నాను. విప్లవం వచ్చేసరికి సంసారభావం, పెద్దతనంతో పార్టీలోకి రాలేకనే పోయేను. శత్రుపక్షాన ఎన్నడూ చేరకపోయినా పోరాటాలలో ఎన్నడూ పాల్గొలేదనే చెప్పాలి. 1905లో వార్సా కార్‌షాపుల్లో సమ్మె వచ్చినప్పుడు సమ్మె కమిటీ సభ్యుడుగా వుండేవాడిని. బోల్షివిక్కుల్నే బలపరుస్తూ వచ్చేను. ఆ రోజుల్లో నేను మంచి పడుచుతనంలో వుండేవాడిని. మాటవస్తే దూసుకోమనే రోజులు. అయితేనేం, గతన్ని చెప్పుకొని ప్రయోజనం ఏంవుందిలెండి. ఇలిచ్ మరణంతో నా కడుపు తరుక్కు పోయింది. మన మిత్రుడు, మన బంధువు, మన రక్షకుడు పోయేడు. ఇంక ఈ వేళతోసరి. ముసలివాడనై పోయేననేమాట ఇంక నానోట

రానివ్వను. నా మనస్సులో వున్నది ఎల్లాగ చెప్పాలో అర్థంకావడంలేదు. నేను పెద్దమాటకారిని కాదు. ఈ ఒక్కమాటే చెప్తా – నాదీ బోల్షివిక్కులదీ ఒకటే దారి. అంతే....."

అతడు నెరిసిన జుట్టుగుండా చేతివ్రేళ్ళు పోనిస్తూ ఏం చెప్తారన్నట్లు సభకేసి చూసేడు.

ఆయన విజ్ఞప్తికి సభలో ఒక్కరు కూడా వ్యతిరేకత తెలుపలేదు. పార్టీసభ్యులు కానివారు కూడా తమ అభిప్రాయం తెలపాలని ఆహ్వానించేరు. కాని ఎవ్వరూ పోలెన్‌టోవ్‌కు వ్యతిరేకం చెప్పలేదు.

అతనిని కమ్యూనిస్టుపార్టీలోకి తీసుకొన్నారు.

ఏదో గొప్ప విషయం తమకళ్ళముందు జరిగిపోతున్నట్లు ప్రతివారికీ అనిపించింది. పోలెన్‌టోవ్స్కీ వేదిక దిగి వచ్చేడు. ఆర్టెమ్ ఆ స్థానంలో నిలబడ్డాడు. అతనికి తన చేతుల్ని ఎక్కడపెట్టుకోవాలో తెలియలేదు. నెత్తినున్న టోపీతీసి రెండు చేతులతో నలిపేస్తున్నాడు. బాగా నలిగి పాతబడిపోయిన గొర్రె చర్మపు కోటుకు బొత్తాలు తగిలించకుండా వదిలివేసేడు. లోపల వేసిన సైనిక చొక్కా మెడపట్టీకున్న ఇత్తడి బొత్తాలు రెండూ తగిలించి వున్నాయి. మొత్తం వేషం అంతా చూస్తే మనిషి విలాసంగా, ఖాళీగా తిరుగుతున్నవాడల్లే కనిపిస్తున్నాడు.

ఆర్టెమ్ సభనంతనూ ఒక్కమారు కలయచూసేడు. ఒకప్రక్కన పరిచితమైన స్త్రీ ముఖం కనబడింది. తమ యింటిపొరుగున వుండిన తాపీమేస్త్రీ కూతురు గాలినా. తనతోపాటు కుట్టుదుకాణంలో పనిచేస్తున్న పడుచులతో కలసి ఆమె సభకు వచ్చింది. ఆమె చిరునవ్వు తననను క్షమిస్తున్నట్లూ, తాను చేస్తున్నపనికి అంగీకారం తెలుపుతున్నట్లూ అనిపించింది.

"ఆర్టెమ్! నీ విషయం చెప్పు" – అన్నాడు సిరోటెంకో.

కాని తన విషయం చెప్పుకోవడం అంటే ఆర్టెమ్‌కు అంత సులభం కాదు. అంతమందిముందు నిలబడి మాట్లాడడం అలవాటొకటిలేదు. తన మనస్సులో పేరుకుని వున్న భావాలనన్నింటినీ ఏలా బయటపెట్టాలో అతనికి అర్థంకాలేదు; సాధ్యమూ అనిపించలేదు. మాటలకోసం తడబడ్డాడు. కంగారుపుట్టింది. మరి నోటమాట రావడమే కష్టమయింది. అలాంటి చిక్కు పరిస్థితి అతనికెన్నడూ కలగలేదు. తన జీవితంలోకల్లా అతిప్రధానమైన చర్య తీసుకోబోతున్నాననీ, ఆ చర్య తన కష్టమయ జీవితంలో నూతనానందాన్ని కలిగించగలదనీ అతడెరుగును.

ఎట్టకేలకు అతడు ప్రారంభించేడు.

"మేము నలుగురం వుండేవారం".

హాలు అంతా నిశ్శబ్దంగా వింటూంది. ఆరువందలమంది అతడేం చెప్తాడోయని అత్యాతురతగా వింటున్నారు.

"డబ్బున్నవాళ్ళ యిళ్ళల్లో మాయమ్మ వంటపుట్టిగా పనిచేసేది. మా నాన్న ఎలా వుండేవాడో నాకు ఇంచుమించు జ్ఞాపకం లేదనే చెప్పాలి. ఆయనకూ మాయమ్మకూ ఎప్పుడూ సరిపడేదికాదు. మహాతాగేవాడు. అందుచేత మమ్మల్నందర్నీ మా అమ్మే సాకేది. అంతమందిని పోషించడం అంటే మాటలుకాదు. మహాకష్టపడేది. నెలరోజులూ తెల్లవారింది మొదలు రాత్రి ప్రొద్దుపోయేవరకూ నానాచాకిరీ చేస్తే తిండి పెట్టి నాలుగురూబుళ్ళు ఇచ్చేవారు. రెండేళ్ళపాటు స్కూల్లో చదివే అదృష్టం నాకు దొరికింది. అక్కడికి అదే గొప్ప. అక్కడ చదవడం, వ్రాయడం మాత్రం నేర్పేరు. నాకు తొమ్మిదేళ్ళప్పుడు అమ్మ నన్ను మెషీన్‌షాపులో పని నేర్చుకొనేటందుకు వప్పజెప్పింది. ఆమె చేయగలది మాత్రం ఏం వుంది? మూడేళ్ళపాటు అక్కడున్నా, ఆ మూడేళ్ళూ నాకింత గంజి పోయడమే నాకిచ్చిన జీతం.... ఆ షాపు యజమాని ఒక జర్మనీవాడు. పేరు ఫాయెర్‌స్టర్. మరీకుర్రవాడినని మొదట నన్ను పెట్టుకోనన్నాడు. కాని, మంచి కండపుష్టి వున్నవాడిని. మా అమ్మ కూడా మరో రెండేళ్ళు వేసింది. ఆ జర్మనువాడి దగ్గర మూడేళ్ళు వున్నానన్నాకదూ. అక్కడ నాకేమీ నేర్పలేదు. ఇంటిపనులు చేయించేడు. ఆ యజమాని శుద్ధ తాగుబోతు. వానికి వోడ్కా అందించలేక నా చేతులు నొప్పులు పుట్టేవి.... వోడ్కా ఒక్కటేనా? బొగ్గులు తెమ్మనీ, ఇనుము తెమ్మనీ పంపేవాడు.... ఇంక ఆయన భార్య వుండేది నాచేత నానాచాకిరీ చేయించేది. కూరలు తరగాలి. అంట్లు తోమాలి. చెయ్యి దురదగా వుండేదో యేమో, ఓ కారణం అని లేకుండా అస్తమానం మొదుతూండేది. గూబలు సాగతీసేది.... మొగుడు తాగుతున్నాడని ఆయనతో పోట్లాడేది. పోట్లాడి నన్ను బాదేది. ఆ దెబ్బలు తప్పించు కొనేటందుకు వీధిలోకి పరుగెత్తేవాడిని. అంతకంటె వెళ్ళడం ఎక్కడికి? మా అమ్మ వుంటున్నచోటు అక్కడికి నలభైమైళ్లుంది. తీరా వెడితే మాత్రం నన్ను పోషించగలదా?.... పోనీ షాపులో మాత్రం అంతకన్న బాగుందా అంటే అదీలేదు. అక్కడి పెత్తనం అంతా యజమాని తమ్ముడిది. వాడో పాడుపీనుగ. నన్ను ఏడిపించడం అంటే వాడికో సరదా. పిలిచి 'ఒరేయి, ఆ వాషరు పట్రా' – అనేవాడు. తీరా పరుగెత్తివెళ్ళి తీసుకు రావడానికి పట్టుకొనేసరికి చేతులు అంటుకుపోయేవి. అప్పుడే దాన్ని కొలిమిలోంచి తీసివుంటారు. మామూలుగా, నల్లగానేవున్నా ముట్టుకొనే సరికి చేతులు చుర్రుమనిపోయేవి. నేను గొల్లున మంటకు ఏడుస్తూంటే, వాడు నవ్వలేక దొర్లిపోయేవాడు. ఈ బాధలు పడలేకపోయెను. చెప్పకుండా ఇంటికి పారిపోయెను. నన్నేం చెయ్యమనాలో అమ్మకేమీ తెలియలేదు. మళ్ళీ ఆ జర్మనీవాడి దగ్గరకే తీసుకెళ్ళింది. దారిపొడుగునా ఆమె యేడ్చిన యేడ్పు నాకిప్పటికీ గుర్తు. మూడో ఏడాదిలో వాళ్లు నాకు పనినేర్పడం ప్రారంభించేరు. కొట్టడం, తిట్టడం మామూలే. నేను మళ్ళీ పారిపోయేను. ఈ మారు స్తారోస్టాంటినోవ్‌కు పారిపోయెను. అక్కడ వొక రొట్టెల దుకాణంలో పనికి కుదిరేను. ఏణ్ణర్థంపాటు గిన్నెలూ, కప్పులూ కడగడంలో వ్యర్థం చేసుకున్నా. ఇంతలో యజమాని జూదమాడి ఫ్యాక్టరీ అమ్మేసుకున్నాడు. నాలుగు నెలలపాటు మాకొక్క కోపెక్కు కూడా జీతం ఇవ్వలేదు. చివరకు కనబడకుండా పారిపోయేడు. అక్కడినుంచి జర్మింకా వెళ్ళి పనిచూసుకొందామని రైలు ఎక్కేను. అక్కడ ఒక రైల్వే పనివాడు నన్ను చూసి, నాకథంతా విని జాలిపడ్డాడు. నాకేదో కొద్దిగా పనిచేతనవునని చెప్పేను. అతడు నన్ను తమ పైఅధికారి వద్దకు తీసుకెళ్ళేడు. నేను తన మేనల్లుణ్ణని చెప్పి, ఏదన్నా పని ఇప్పించ

మన్నాడు. నా ఆకారం చూసి వాళ్ళంతా నాకు పదిహేడు ఏళ్ళన్నా వుంటాయనుకొన్నారు. అక్కడే మెకానిక్‌కు సహాయం కోసం తీసుకున్నారు. ఇంక ఈనాడు నేను చేస్తున్న పనిలోనంటారా! ఇందులో ఎనిమిదేళ్ళ నుంచి వున్నాను. ఇంతకన్నా నా గత చరిత్రను గురించి చెప్పడానికి ఏముంది? ప్రస్తుత చరిత్ర మీ అందరికీ తెలిసిందే".

చేతిలోని టోపీతో నుదుటనున్న చెమట వొత్తుకొని ఆర్టెమ్ ఒక్క నిట్టూర్పు విడిచేడు. అతడు అసలు చెప్పవలసిందేదో చెప్పనేలేదు. చెప్పడం కష్టంకూడా. అయినా తప్పదు. ఎవరో ఒకరు అడిగితీరుతారు, అతడు ముఖం చిట్లించేడు. మరల ప్రారంభించేడు.

"విప్లవకాలంలోనే నేను పార్టీలో ఎందుకు చేరలేదు? మీలో ఎవ్వరయినా ఆ ప్రశ్న అడగవలసిందే. కాని ఏంచెప్పేది? ఇప్పటికేనా మించిపోయిందేమీలేదు. వయస్సు మీరిపోలేదు. కాని, పార్టీలో చేరాలనే ధోరణి ఈనాటివరకు ఎందుకు కలగలేదు? చెప్తాను. దాచవలసిందేమీ లేదు. ఆనాడు గుర్తించలేకపోయేం. జర్మనీవాళ్ళమీద తిరగబడిననాడే 1918లో పార్టీలో చేరి వుండవలసి వుంది. సరంగు జకరయ్ ఎన్నోమాట్లు చెప్పేడు. 1920 దాకా నేను రైఫిల్ పట్టుకోనేలేదు. గొడవలన్నీ అణిగి పోయేయి. తెల్లసేనల్ని నల్లసముద్రం ఆవలకంటా తరిమేసి ఇంటికొచ్చేం.... తర్వాత సంసార జంజాటంలో పడిపోయేను, పెళ్ళామూ, పిల్లలూ..... ఇప్పుడు తెలిసివచ్చింది. లెనిన్ చచ్చిపోయేడు. పార్టీ పిలుపునిచ్చింది. అది వినబడగానే ఒక్కమారు జీవితంవేపు తిరిగి చూసుకున్నా. అంతవరకూ లోటుగా బాధ కలిగిస్తున్నదేమిటో తెలిసింది. మన ప్రభుత్వాన్ని కాపాడుకొన్న మాత్రంతో చాలదు. లెనిన్ చనిపోయినాక మనమందరం ఒక కుటుంబంలాగ కలిసివుండాలి. వుంటేనే సోవియట్ రాజ్యం పర్వతంలాగ నిలబడగలుగుతుంది".

ఆవిధంగా ఎంతో అభిమానం ప్రదర్శిస్తూ మెకానిక్ తన వుపన్యాసం ముగించేడు. ఉపన్యాసం అలవాటు లేకపోయినా, అనర్గళంగా అతనినోట మాటలు దొర్లివచ్చేయి. ఆ నాలుగు మాటలూ చెప్పేసేక అతని మనస్సు ఎంతో తేలిక పడింది. నిట్టూర్పుగా, ప్రశ్నల కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు.

సభ అంతా నిశ్శబ్దంగా వుంది. సిరోటెంకో ప్రశ్నల కోసం పిలిచేడు.

"ప్రశ్నలు వేస్తారా?"

సభవారంతా ముఖాముఖాలు చూసుకున్నారు. మొదట ఎవ్వరూ ఏమి అడగలేదు. ఇంతలో రైలులో బొగ్గువేసే వాడొకడు లేచేడు. అతడప్పుడే సరాసరి పనిలోంచి వచ్చేడేమో నల్లగా బొగ్గుగా వున్నాడు.

"అడిగేందుకు ఏముంది? అతడి నెరగనివారెవరు? అతనిని చేర్చుకోండి. పనిచెప్పండి. అంతే".

కమ్మరం పనిచేసే గిల్యాకా లేచేడు. లోనున్న ఆవేశమూ, బయటనున్న వుక్కాతో అతనిముఖం కందివుంది.

"ఈ కామ్రేడ్ మంచివాడే. బురఖాలు మార్చే రకం కాదు. నమ్మవచ్చు. సిరోటెంకో! వోటుకి పెట్టవయ్యా!"

సభలో వెనకభాగంలో కామ్‌సోమాల్స్ కూర్చున్నచోటినుంచి ఒక కంఠం వినవచ్చింది.

"కామ్రేడ్ కోర్చాగిన్ వ్యవసాయం పెట్టేడు. రైతు జీవితానికీ, కార్మిక భావాలకీ సమన్వయం ఎలా చేస్తాడో చెప్తే బాగుంటుంది".

సభలో ఆ ప్రశ్నకు అయిష్టం తెలుపుతూ గుసగుసలు వినబడ్డాయి. ఎవరో అసమ్మతి తెలిపేరు.

"మాబోటి పామరుకి అర్థం అయ్యేలా చెప్పు, అదేమిటో. కబుర్లు చేతనవును గదాయని...."

కాని, ఆర్టెమ్ సమాధానం చెప్పుకోడానికి పూనుకొన్నాడు.

"అడగవలసిందే. నేను వ్యవసాయం పెట్టినమాట నిజమే. అయినా నాకున్న శ్రామికవర్గ చైతన్యాన్ని వదులుకోలేదు. సరే. గతంలో ఏమయిందో. ఈ రోజునుంచీ ఇంక అటుపోను. నా కుటుంబాన్ని రైల్వే యార్డులకి దగ్గర్లోకి తెచ్చేసుకుంటాను. ఇక్కడే సుఖం. ఆ దిక్కుమాలిన భూమి నా ప్రాణానికి వచ్చినట్లు తయారయింది".

సభ్యులంతా అతనిని పార్టీలో చేర్చుకొనేటందుకు సమ్మతిగా చేతులు ఎత్తేరు. ఆనందంతో ఆర్టెమ్ వేదిక దిగి తన స్థానం వేపు నడిచేడు. వెనుకవేపు నుంచి సిరోటెంకో కంఠం వినిపించింది.

"ఏకగ్రీవంగా....."

తర్వాత జఖార్ బ్రూజక్ వేదికమీదికి వచ్చేడు. ఇదివరలో ఈతడు పోలెన్ టోవ్‌స్కీకి సహాయంగా వుండేవాడు. కాని, ఈమధ్య అతడు స్వయంగానే ఇంజన్లు నడుపుతున్నాడు. శ్రామికుడుగా తాను గడిపిన జీవితాన్ని అతడు వివరించి ప్రస్తుత కాలానికి వచ్చేడు.

"నా బిడ్డలు ప్రారంభించిన పనిని కొనసాగించడం నా కర్తవ్యం. దుఃఖంతో మూలబడి వుండడం వాళ్ళకి ఇష్టంగా వుండదు. నేను మూలబడి వుండడానికి కాదు వాళ్ళు మరణించినది. వారి మరణం వలన ఏర్పడిన ఖాళీని భర్తీ చెయ్యాలనే ఆలోచనేనా ఇంతకాలం నాకు కలగలేదు. కాని, నాయకుడే మరణించడంతో నా కళ్ళు విడ్డాయి. గతం గురించి నన్నేమీ అడక్కండి. ఇకముందు నూతన జీవితాన్ని ప్రారంభిద్దాం."

అతని కంఠం మందగించినా స్పష్టంగా, అందరికీ వినిపించింది. బాధాకరమైన ఘటనలు జ్ఞాపకం వచ్చి అతని ముఖం మ్లానమయింది. సభికులంతా అతనిని పార్టీలో చేర్చుకొనేటందుకు ఆమోదం తెలుపుతూ చేతులెత్తేరు. దానిని చూసేసరికి ముఖం విడింది. తలవంచి అభివాదం చేసేడు.

కొత్తగా పార్టీలోకి సభ్యుల్ని చేర్చుకొనేటందుకై ప్రారంభమైన ఈ సభ చాలరాత్రి గడిచేవరకూ సాగింది. అందరూ ఎరిగిన వ్యక్తుల్నీ, ఉత్తములన్నవారినీ, జీవితంలో మచ్చ అనేది లేనివారినీ మాత్రమే చేర్చుకొన్నారు.

లెనిన్ మరణంతో లక్షలమంది కార్మికులు బోల్షివిక్కు పార్టీలో చేరేరు. నాయకుడు మరణించేడు. కాని, పార్టీ సభ్యులు నిరుత్సాహపడలేదు. నేలలో బాగా వేళ్ళు పాతుకున్న చెట్టు చివర కొమ్మలు నరికేసినంత మాత్రాన చచ్చిపోదు.

**(నికొలాయ్ ఓస్త్రోవిస్కీ రాసిన,**
**మహీధర రామమోహనరావు అనువాదం చేసిన**
**కాకలు తీరిన యోధులు నుండి)**

# ముప్పైఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## సంపుటి : 17 సంచిక : 5 డిశంబరు : 1993

**రావిశాస్త్రిగారి** మరణం తరువాత దాదాపు పదహారు రోజుల వ్యవధిలోనే ఆయనపై ప్రత్యేక సంచికను 'ప్రజాసాహితి' తీసుకువచ్చింది. ఈ సంచిక ముఖచిత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' సౌజన్యంతో ప్రచురించారు. రెండవ కవరు పేజి "ముఖం చాటేసిన మృత్యువు" (కవిత) ఎ. మురళీకృష్ణ, మూడవ కవరు పేజీ" 'దండాలండి బావు. ఛాత్రి బావుకు దండాలు (శబ్దచిత్రం)' – ఛాయరాజ్ రాయగా నాల్గవ కవరు పేజీలో "రావిశాస్త్రి"పై కవితను త్రిపురనేని శ్రీనివాస్ రాశారు. "కథలే మిగిల్చి కరిగిపోయిన రాచకొండకు కలాల నివాళి" అనే సంపాదకీయం వచ్చింది. "మహత్తర అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అనే వ్యాసం, పరచి "రాచకొండ రచన" సామాజిక స్పృహగాళ్ళట". "డొంకతిరుగుడు డంకెలోడి" ఎం.జి.యం. రాసారు. డిశంబరు 10 మానవ హక్కుల దినం సందర్భంగా "మానవ హక్కుల కమీషన్" – బజారా, "రాసినవాడు ఫల్గుణుడు" రావిశాస్త్రిపై కవితను చందు సుబ్బారావు. "సొమ్ములు పోనాయండిలో పాలనాయంత్రాంగం" వ్యాసాన్ని వల్లంపాటి వెంకటసుబ్బయ్య. "నా పానంలో సంగోరు ఇచ్చీనా? (గల్పిక) ఏ.బి. సుందరరావు. "బల్లచెక్క లోతు" గోపరాజు నారాయణరావు. "రావిశాస్త్రి మృతికి" సంతాపం. శోధన్ రాసిన "నిశ్శబ్ద నిషేధం" కవితను ప్రచురించారు. "రావిశాస్త్రి" లేఖలు, అప్పన్నగారి గోపాలరావు పాట 'గోచికన్నా దరిద్రమ్యాడిది?'ని ప్రచురించారు. డా॥ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు మరణానికి సంతాపం. అఖిలభారత విప్లవ సాంస్కృతిక సమితి (AILRC) దశాబ్ది ఉత్సవాల మహాసభకు జనసాహితి పంపిన సందేశం మరియు అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు దివికుమార్ సందేశాలను ప్రచురించారు. రావిశాస్త్రిగారి "అల్పజీవి, రాజు–మహిషి, రత్తాలు–రాంబాబు" మూడు నవలల పరిచయం, జె.పి.యల్. గ్విన్. "దేశభక్తి రైతాంగ వాలంటీరా!...." ఉదయ్ రాసిన పాటను అమరుడు సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి సందర్భంగా (డిశంబరు 22) "మేలుకొలుపు కథనం"ను నిశితాసి, 'దృష్టికర్త' – ఇమ్రాన్ కవితను, రా.వి.శాస్త్రి రచనలు జీవితం గురించి మరియు, పిల్లల ప్రపంచం శీర్షికలో "రావిశాస్త్రి" రచయిత ఎట్లి అయ్యకు – పి. చంద్రశేఖర్ అజాద్. మహారాష్ట్ర భూకంప బాధితులకు "అక్షర విరాళం" ప్రకటన, డిశంబరు 6, బాబ్రీ మసీదు కూల్చివేతకు నిరసనగా.... "మతోన్మాదులను తరిమికొడదాం" – రసూల్ రాసిన కవితను ప్రచురించారు. "రచయితలు, పాత్రికేయులపై మతతత్త్వవాదుల వీరంగం" – కె. రవిబాబు. "రా.వి.శాస్త్రి కథలలో స్త్రీ పాత్రల చిత్రణ" – కావూరి అనురాధ. "మతతత్త్వానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎలా పోరాడాలి?" ఏఐఎఫ్‌టియు నౌజవాన్ భారత సభల ఆధ్వర్యంలో "సామ్రాజ్యవాద వ్యతిరేక మతతత్త్వ వ్యతిరేక సదస్సులో" ఆమోదించబడిన తీర్మాన పాఠం. "ఆఖరి దశ" – రావిశాస్త్రి రాసిన కథను ప్రచురించారు. "భావాల లావాలు చిమ్మిన రాచకొండ" – వి.వి. రమణమూర్తి, చర్చ శీర్షికన – "స్త్రీవాద ప్రశ్నల్ని, పరిశీలనల్ని నిరాకరించడం సరైనది కాదు" కాత్యాయని, "తరతరాల రాయలసీమ" పుస్తకం పునః ప్రచురణ ప్రకటన. "రావిశాస్త్రీయం" అనే దివికుమార్ రచనను ప్రచురించారు. చైతనవ్యాహిని మరియు పాఠకుల స్పందన "ఉత్తరాలు" ప్రచురించారు.

1/8 డెమ్మీలో పుటలు : 108 వెల : రూ. 8/–

## సంపుటి : 17 సంచిక : 6 జనవరి : 1994

**ప్రపంచ** శ్రామికవర్గ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉండే మహోన్నత మానవుడు "మావో" శతజయంతి (26, డిశంబర్ 1893) సందర్భంగా ఆయన స్మరణతో ఆయన ముఖచిత్రంతో ఈ ప్రత్యేక సంచిక వెలువడింది. "ఆరని విప్లవాల, పోరాటాల జ్వాల" సంపాదకీయంను ప్రచురించారు. రెండవ కవర్‌పేజీలో మావో సే టుంగ్ రాసిన, శివసాగర్ అనువదించిన మూడవ కవర్‌పేజీలో – సంపత్ రాసిన "విప్లవ కరచాలనం" నాల్గవ కవర్‌పేజీ – "విప్లవ శిబిరం" కవితనూ – మావో అనుసృజన. నారాయణసామిలవి ప్రచురించారు. "మావో మావో మళ్లీ మావో" వ్యాసాన్ని ఛాయరాజ్, "మావో గురించి నేర్చుకుందాం" – చౌ ఎన్ లై, "భూస్వామ్య సంస్కృతిని, భార్యలపై భర్తల పెత్తనాన్ని తుదముట్టించండి" – మావో, "మరోసారి స్మరించాల్సిన మావో" పుస్తక పరిచయం చలసాని ప్రసాదరావు, "చైనా సినిమా చరిత్ర, దశలు" జయధీర్ తిరుమలరావు "లాంగ్‌మార్చ్"పై గీసిన రేఖాచిత్రాలను పరిచయం చేస్తూ రాసిన "బీ పెంగ్ హో"ల వ్యాసాలను ప్రచురించారు. "మహా మనీషి" – నగారా, "మట్టిని మాట్లాడించిన శక్తి" – నిఖిలేశ్వర్, "పెకింగ్‌లో మన ఛైర్మన్ మావో" – షుర్ జానపద గీతం – కవితలను ప్రచురించారు. స్వామి, ఎం.జి.యం. రాసిన "మావో మార్గం", "మావో సూక్తులు" – వెంపటాపు సత్యం, "మావో మనకు ఆదర్శం – అప్పన్నగారి గోపాల్‌రావుల పాటలు ప్రచురించారు. "కవిత్వం గురించి" – మావో "లేఖా సాహిత్యం" శీర్షికలో ప్రచురించారు. పిల్లల ప్రపంచం శీర్షికన 'మావో – నా బాల్యం'ను పి. చంద్రశేఖర్ అజాద్ పరియం చేసారు. ఇవే కాకుండా.... "ఇంటి నుండి ప్రపంచందాకా" (రావిశాస్త్రి 'ఇల్లు' నవల) పరిచయం పాపినేని శివశంకర్, చెరబండరాజు "చిరునామా"ను – ఛాయరాజ్‌లు సమీక్షించారు. హిందీలో చరిత్రను సృష్టించిన రావిశాస్త్రి కథ "సృష్టి" – డా॥ పోలి విజయ రాఘవరెడ్డి, ఎ.ఎన్. కవిత – "కరువు చిత్రణ" – రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగార్లు సమీక్షించారు. "అక్షరాల రండి – విక్టర్ దోపిడికెదురుగా" మిత్ర రాత్రిన ప్రచురించారు. చలసాని ప్రసాదరావు గల్పిక "గోవులు – గోపాలురు", చర్చ శీర్షికన డా॥ చల్లపల్లి విజయగారి "రాజకీయ కథలు" ప్రబోధించేది ఏ రాజకీయాల్ని?" ప్రచురించారు. విరసం 13వ రాష్ట్ర సభలకు జనసాహితి ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సందేశం, చాసో మరణానికి జనసాహితి సంతాపం "కథా నాయకుడు చాసో" ఛాయరాజ్ రచన స్మృత్యంజలిని "చైతన్యవాహిని"లను ప్రచురించారు.

1/8 డెమ్మీలో పుటలు : 112 వెల : రూ. 10/–

వ్యాసం

## లెనిన్ రాసిన

# నిర్బంధ అధికార భాష అవసరమా?

పరిచయం : గౌరీశంకర్

**1968లో** భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ త్రిభాషా సూత్రాన్ని అమలుచేసింది. దాని ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాలూ వారి మాతృభాషనూ, దేశ అధికార భాష హిందీని మరియు అంతర్జాతీయ భాష ఇంగ్లీషును తప్పక నేర్చుకోవాలి. రెండు పర భాషలను నేర్చుకోవడం విద్యార్థులకు భారంగా పరిణమిస్తుందని దీనిని వ్యతిరేకిస్తూ అప్పట్లో ఆంధ్రప్రదేశ్, కర్నాటక మరియు తమిళనాడుల్లో నిరసనలు, అల్లర్లు చోటుచేసుకున్నాయి. తమిళనాడు ఎట్టి పరిస్థితుల్లోనూ తాము హిందీ నేర్చుకోబోయేది లేదని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఇపుడు తమిళనాడు విద్యార్థులు హిందీ నేర్చుకోవడంలేదు.

ఘనత వహించిన మన దేశ కీలకనేత ఈ మధ్య "ఒకే దేశం – ఒకే ఎన్నిక" ఒకే నేత, ఒకే భాష" అంటూ కొత్త పల్లవిలో పాత పాటను ఎత్తుకున్నారు. అధికార భాష హిందీని బలవంతంగా రుద్దడానికి పూనుకుంటున్నారు అని తెలియగానే దేశవ్యాప్తంగా చర్చలు, నిరసనలు మొదలయ్యాయి.

ఇక నిత్య నూతన ప్రయోగాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యను పూర్తి అయోమయావస్థలోనికి నెట్టేసింది. ఇక్కడ కూడా "ఒకే ప్రజ – ఒకే భాష" అంటూ తెలుగు ప్రజల, తెలుగు విద్యార్థుల జీవితాల్లో నుండి తెలుగును పక్కకు నెట్టి, ఇంగ్లీషుతోనే మీ జీవితాలకు వెలుగు అంటూ ఏకపక్షంగా ఆంగ్లభాషను పసిపిల్లలపై బలవంతంగా రుద్దుతున్నారు. తెలుగు గ్రామీణ, పేద, బడుగు విద్యార్థులను అమాంతంగా అంతర్జాతీయ స్థాయికి తీసుకుపోతానంటూ తెలుగు పదాలనే సరిగా పలుకలేని మూడవ తరగతి విద్యార్థుల మెదళ్ళలోకి 'టోఫెల్' అనే పిశాచిని చొప్పిస్తున్నారు.

ఆంగ్లం నేర్చుకోవడమే 'సర్వరోగ నివారిణి' అన్న చందంగా ప్రభుత్వం అమాయక గ్రామీణులను తప్పు దోవ పట్టిస్తోంది. ఆంగ్లం నేర్చుకున్నవారికి ఉజ్వల భవిష్యత్తు అంటూ ఉపాధి కల్పించలేని తమ చాతకాని తనానికి ముసుగు వేస్తున్నారు. ఆంగ్ల విద్యాభ్యాసం పేరుతో గ్రామీణ, పేద, దళిత, ఆదివాసీ విద్యార్థులపై విపరీతంగా ఒత్తిడి పెంచుతున్నారు. ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాస్తున్న దేశ సగటు విద్యార్థులు 37 శాతంగా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 84 శాతం అని ప్రభుత్వం జబ్బలు చరుచుకుంటోంది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులు కనీసం ఒక్క వాక్యమైనా ఇంగ్లీషులో వ్యాకరణ దోషాలు లేకుండా రాయగలిగే స్థితిలో లేరన్న వాస్తవం ప్రభుత్వాధినేతలు కప్పిపెడుతున్నారు.

ఈ సందర్భంగా 'అధికార భాష'పై ప్రావ్దా పత్రికలో లెనిన్ రాసిన ఈ వ్యాసాన్ని ఒకసారి పరికిద్దాం!

విప్లవ ప్రతీఘాత శక్తులతో పోలిస్తే ఉదారవాదులు కనీసం ప్రాథమిక స్థాయిలో అయినా స్థానిక భాషలలోనే విద్యాబోధన జరగాలని వాదిస్తారు. అయితే అధికార భాష అనేది ఖచ్చితంగా ఉండాలనే విషయంలో మాత్రం ఇరువర్గాలదీ ఒకటే మాట.

'నిర్బంధ అధికార భాష' అంటే ఏమిటి? మైనారిటీలుగా వున్న గ్రేట్ రష్యన్ల భాషను దేశవ్యాప్తంగానున్న వివిధ జాతుల ప్రజలపై నిర్బంధంగా అమలు జరపడమన్నమాట. రష్యా వ్యాప్తంగా ప్రతి పాఠశాలలోనూ అధికార భాషకు బోధించాల్సిందే. ప్రభుత్వ పరంగా ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ అధికార భాషలోనే తప్ప స్థానిక భాషల్లో జరపడానికి వీలులేదు.

నిర్బంధ అధికారభాష ఉండాలని వాదిస్తున్నవారికి ఏ ప్రాతిపదిక ఆధారం? వారి వాదనను ఎలా సమర్థించుకుంటారు?

బ్లాక్ హండ్రెడిస్టుల (రష్యా జాతీయ వ్యతిరేక ఉద్యమకారులు) వాదనలు చాలా పరుషంగా ఉంటాయి. రష్యనేతరులను అదుపులో ఉంచాలంటే వారిపై కఠినమైన ఆంక్షలు విధించాలంటారు. రష్యా అవిభాజ్యం, ఇక్కడి ప్రజలంతా గ్రేట్ రష్యన్ ప్రభుత్వానికి విధేయులుగా ఉండాలి. ఎందుకంటే రష్యాను బలవత్తరమైన ఏకీకృత దేశంగా మలిచింది గ్రేట్ రష్యన్లే. అందువలన రష్యా పాలకుల భాషే దేశ అధికార భాష కావాలి. స్థానిక భాషలు నిషేధించబడడాన్ని వీరు పట్టించుకోరు. వాస్తవానికి రష్యా జనాభాలో 60 శాతం మంది స్థానిక భాషల్లోనే మాట్లాడుకుంటారు.

ఇక ఉదారవాదుల విషయానికొస్తే వీరు అతి పరిశుద్ధంగా, ఉన్నత సంస్కారవంతులుగా కనబడతారు. వీరు స్థానిక భాషల్ని కొన్ని పరిమితుల్లో ఉపయోగించడాన్ని అనుమతిస్తారు. ప్రాథమిక పాఠశాలల వరకూ అంగీకరిస్తారు. అదే సమయంలో ఏకీకృత, అవిభాజ్యమైన రష్యా సంస్కృతికి భంగం కలుగకుండా అధికార భాష తప్పనిసరిగా ఉండాలని వాదిస్తారు.

"రాజ్యాధికారం అనేది సాంస్కృతిక ఐక్యతకు నిదర్శనం. అధికార భాష ఆ దేశ సంస్కృతిలోని అతి ముఖ్యమైన భాగం. రాజ్యాధికారం దేశ అధికార సమగ్రతపై ఆధారపడి ఉంటుంది. అధికార భాష ఆ సమగ్రతను పరిరక్షించడంలో ప్రధానమైన సాధనంగా పనిచేస్తుంది.

రాజ్యం తన అధికారాన్ని చలాయించడంలో అధికార భాష తిరుగులేని శక్తిగా పనిచేస్తుంది.

"రష్యా ఎప్పటికీ అవిభాజ్యంగా, సమైక్యంగా ఉండాలంటే రాజకీయ ప్రయోజనాలు రీత్యా రష్యా సాహిత్య భాష ఎంత ఆవశ్యకమో నొక్కి చెప్పాలి".

ఉదారవాదుల దృష్టిలో రష్యన్ భాష చాలా గొప్పది. ఎక్కడో సరిహద్దు ప్రాంతాల్లో నివసించేవారు ఈ గొప్ప భాషను నేర్చుకోవాలని మీరు అనుకోవడంలేదా? రష్యన్ భాష రష్యనేతరుల సాహిత్యంపై మంచి ప్రభావాన్ని చూపిస్తుందని మీరు భావించడంలేదా? రష్యనేతరుల సంస్కృతిని రష్యన్ భాష ఉన్నతీకరిస్తుందని, మరింత శోభాయమానం చేస్తుందని మీరు ఊహించడంలేదా?

ఉదారవాదులు అడిగిన ఇటువంటి పలు ప్రశ్నలకు మనం అవుననే సమాధానమిస్తాం. తోల్‌స్తోయ్, తుర్గెనేవ్, చెన్నిషెవ్‌స్కీ, డొబ్రోలియనబోవ్ వంటి ప్రముఖ రచయితలు వారి సాహిత్య సృజనంతటినీ గొప్ప రష్యన్ భాషలోనే చేసారని మనకు బాగా తెలుసు. రష్యాలో నివసిస్తున్న అన్ని జాతుల, అణగారిన వర్గాల మధ్య ఎటువంటి వివక్షతకూ తావులేని సాహిత్యాన్ని, సోదర భావాన్నీ ఏర్పాటు చేయాలని మీకంటే మేము ఎక్కువగా కోరుకొంటున్నాం. అదే విధంగా ప్రతి రష్యన్‌వాసీ గొప్ప రష్యా భాషను నేర్చుకునే అవకాశాన్ని కల్పించడానికి మేము సిద్ధంగానే ఉన్నాం.

ఈ విషయంగా మేము ప్రధానంగా కోరుకునేది ఏమిటంటే అధికార భాషను నేర్చుకోవాలని ఏ ఒక్క రష్యన్‌ని కూడా బలవంత పెట్టకూడదు. బలవంతంగా ఎవరిపైనా రుద్దడానికి ప్రయత్నించకూడదు. 'సంస్కృతి' పేరుతో ఎన్ని అందమైన శబ్దాలంకారాలు వాడినా 'తప్పనిసరి (నిర్బంధ) అధికార భాష' అనడంలోనే ప్రజలపై బలవంతంగా రుద్దడం అని ధ్వనిస్తుంది. గొప్ప రష్యన్ భాషకు అధ్యయనం చేయడానికి ఎవరినీ నొప్పించకూడదన్నది మా అభిప్రాయం. రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడం, సాధారణ సామాజిక జన జీవన గతి అన్ని జాతులను మరింత దగ్గర చేసేందుకు ఉపయుక్తంగా ఉంటాయని మేము అంగీకరిస్తున్నాం. వేలాదిమంది వివిధ జాతుల ప్రజలు అనునిత్యం రష్యా నాలుగు చెరగులా ప్రయాణిస్తూ, ఒకరినొకరు సంభాషిస్తూ జీవన ప్రవంతిలో కలిసిపోతున్న కారణంగా జాతీయ సంప్రదాయవాదం, అతిశయవాదం కనుమరుగైపోతాయి. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు అవసరాల రీత్యా వాటంతటవే ప్రజలను రష్యన్ భాష నేర్చుకునేవైపుగా పురిగొల్పుతాయి. కానీ బలవంతపెట్టడం వలన ఒకే ఫలితం వస్తుంది. అది రష్యన్ భాషను ఇతర జాతులకు విస్తరించకుండా చేస్తుంది. అంతకంటే ముఖ్యంగా శతృత్వానికి మరింత పదును పెడుతుంది. పలు విధాలైన ఘర్షణలకు దారితీస్తుంది. ద్వేషం, అసంతృప్తిలను పెంచుతుంది. పరస్పర అవగాహనను దెబ్బతీస్తుంది.

**('ప్రావ్దా' 1914 జనవరి 18)** ✷

కవిత

# వ్లదీమిర్ ఇల్యీచ్ లెనిన్

- మయకోవ్‌స్కీయ్ రాసిన కావ్యం నుండి

అనువాదం : శ్రీశ్రీ

ఓహో
ఓ నా నౌకాదళమా
లంగరెత్తి కదులు!
జలాంతర్గాములారా
సముద్రం అడుగుకి పొండి
"సముద్రాల మీద, మహా
సముద్రాల మీద
సరదాగా సాగిపొండి నావికులారా!"
హేయ్, ఎవరక్కడ కర్మసాక్షీ
ఇలా వచ్చి వీక్షించు!
త్వర త్వరగా
విషాదాల ముడుతలు సరిదిద్దు.
తలి దండ్రులతో సరి సమానంగా
పిల్లలు కూడా అడుగులు వేస్తున్నారు
ట్రా-టా-టా-టా-ఆ-ఆ- అని
ఉదయాన వాళ్ల ఈలలు పాడుతాయి

"ఒకటి, రెండు, మూడు
మార్గ దర్శకులం మేం చూడు
ఫాసిస్టులంటే భయం లేదు
రమ్మను, చూపిస్తాం మా తడాఖా"
నిష్ఫలంగా ముసలి యూరప్
కుక్కలాగ గుర్రు మంటుంది
"తగ్గు" అని హెచ్చరిస్తాం
"బుద్ధి తెచ్చుకో" అంటాం
లెనిన్ మరణమే ప్రపంచమంతటా
కమ్యూనిజం వ్యాప్తికి తోడ్పడింది
లోకమంతటా
ఫ్యాక్టరీ గొట్టాల అరణ్యాలలో
బ్రహ్మాండమైన ఎర్ర చౌకు
పతాకంలా ఎగురుతుంది
లక్షలాది చేతులు జెండా కొయ్యగా మారి
మహోద్వేగంతో గాలిలో తేలుతుంది

ఆ పతాకంతో
అందులోని అన్ని మడతలతో
మరోసారి సవాల్ చేస్తూ
నడిపిస్తాడు లెనిన్;
కార్మికులారా!
అంతిమ యుద్ధానికి సన్నద్ధులు కండి
బానిసలారా!
బోరవిప్పి నిలవండి
వెన్ను విరిచి నడవండి
పీడితజన సేనా నివహమా
అఖండ శక్తితో లేచి రా!
విప్లవం వర్ధిల్లాలి
విజయం వేగం సాధించాలి
చరిత్రలో సాగిన అన్ని యుద్ధాల కన్నా
ఇదే గొప్ప యుద్ధం
ఇదే న్యాయమైన సమరం! ✷

# 29వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

– బాలాజీ (కోల్‌కతా)

**29వ** కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం 2023 డిసెంబర్ 5 నుండి 12 వరకు జరిగింది. 39 దేశాల నుండి 219 సినిమాలను 23 హాళ్లలో ప్రదర్శించారు. ఈ ఏడాది స్పెయిన్, ఆస్ట్రేలియా దేశాలను ఫోకస్ కంట్రీస్‌గా ఎంచుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత దర్శకులు మృణాల్ సేన్, రిచర్డ్ అటెన్‌బరో, ఔస్మేన్ సెంబీన్ (ఈ సెనెగల్ దర్శకుడ్ని ఆఫ్రికా ఖండపు సత్యజిత్ రే అంటారు), లిండ్సే అండెర్సన్, నటులు చార్ల్‌టన్ హెస్టెన్, దేవానంద్‌లకు ఈ ఉత్సవం శత జయంతి నివాళులర్పించింది. ఇటీవల హత్యకు గురైన ఇరాన్ దర్శకుడు దర్యుష్ మెహెర్జుయ్, స్పెయిన్ దర్శకుడు కార్లోస్ సౌరా, ఇటలీ నటి జినా లొల్లోబ్రిగిడా, సినిమాటోగ్రాఫర్ సౌమెందూ రాయ్ ('పొథేర్ పాంచాలీ' తదితర సినిమాల కెమేరామాన్) వంటి ప్రముఖులకు నివాళి అర్పించారు. కుర్దిష్ సినిమాలపై ఒక విభాగం, పర్యావరణంపై ఒక విభాగంలో కొన్ని మంచి సినిమాలు చూపించారు. లఘు చిత్రాలు, డాక్యుమెంటరీల విభాగాలు కూడా ఎప్పట్లానే వున్నాయి.

Kolkata International Film Festival
(Accredited by FIAPF)
5-12 December 2023

ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని సినిమాలను చూస్తున్నపుడు నేటి ప్రపంచంలోని వలసలు లేదా అక్రమ వలసలు (immigrations) ప్రధాన సమస్యగా ఉన్నాయని అర్థమౌతుంది. ఉపాధి అవకాశాల్లేక బ్రతుకు తెరువు కొసమో, తమ దేశంలో అంతర్గత కలహాల వలన ఏర్పడిన ప్రమాదకర పరిస్థితుల నుండి తప్పించుకోవడం కోసమో ప్రాణాలను అరచేత పట్టుకుని అక్రమంగానైనా దేశాల ముళ్ళకంచెలు దాటి, యూరోప్‌లో ఓ అందమైన భవిష్యత్తు కోసం వివిధ దేశాల ప్రజలు పయనమౌతున్నారు. కొందరు ఈ ప్రమాదకర ప్రయాణంలో ప్రాణాలు కోల్పోతుంటే, కష్టపడి అక్కడికి చేరిన వారికీ అదో ఎండమావి అని అర్థమయ్యే సందర్భాలు కూడా ఉన్నాయి. ఇటలీ సినిమా 'Me Captain', వెనిజులా సినిమా 'One Way', పోలాండ్ సినిమా 'Green Borders', రొమానియా సినిమా 'Clara' – ఇలా చాలా సినిమాలు ఈ అంశాన్నే చర్చిస్తాయి. తండ్రి అమెరికాకు వలస పోయాక ఒక మెక్సికో కుటుంబంలోని తల్లీ కొడుకుల పరస్పర సంబంధాలు ఎలాంటి మార్పులకూ, సంఘర్షణలకూ లోనయ్యాయో తెలిపే మెక్సికో సినిమా 'Broken Borders' కూడా పరోక్షంగా ఈ సమస్యనే తడిమింది. ఇలా వలసల సమస్యపైనే చాలా సినిమాలు దృష్టి పెట్టాయి. ఈ టాపిక్‌పై వచ్చిన కొన్ని గొప్ప సినిమాల గురించి ముందుగా తెలుసుకుందాం.

**Me Captain (నేనే కెప్టెన్‌ని) (ఇటలీ) (2023) :**

సెయిదూ, మౌస్సా సెనెగల్ (ఆఫ్రికా ఖండం) డాకర్ నగరంలోని పేదింటి పిల్లలు. ఇద్దరూ కజిన్ బ్రదర్లు. చదువులతో పాటు కాయకష్టం చేయాల్సిన స్థితి. తమ వూరిలో భవిష్యత్తు అగమ్యమని వారికి గట్టి నమ్మకం. 16 ఏళ్ల సెయిదూ తమ ప్రాంతంలో చిన్నపాటి రాప్ సింగర్. తమ గాన కళతో యూరప్‌ను జయించవచ్చని ఆ అన్నదమ్ముల ఊహ. దొంగతనంగా యూరప్‌కు వెళ్లడానికి దారి ఖర్చుల కోసం, దొంగ పాస్‌పోర్టుల కోసం తమ కష్టార్జితం నుండి డబ్బు ఆదా చేస్తుంటారు. సెయిదూ తల్లి అటువంటి ఆలోచనలకు ఉగ్రురాలౌతుంది. ఆఫ్రికా దేశాల ఎడారుల గుండా ప్రయాణం చాలా ప్రమాదకరమనీ, దారి పొడుగునా శవాల గుట్టలు కనిపిస్తాయనీ ఒక పెద్ద మనిషి వారికి హెచ్చరిస్తాడు. కానీ మనసు కఠినం చేసుకుని తమ కలను సార్థకం చేసుకోడానికి ఓ రాత్రి దొంగతనంగా బయల్దేరుతారు ఆ ఇద్దరూ.

బయల్దేరిన రెండు రోజుల్లోనే తామో భయంకరమైన సాహసకృత్యం చేయబోతున్నామని వారికి అర్థమైపోతుంది. దారి పొడుగునా వారు దాచుకున్న డబ్బును దోచుకునే బ్రోకర్లు కాచుకుని కూర్చుని ఉన్నారని తెలియడానికి ఎంతో కాలం పట్టదు. సెనెగల్ బోర్డర్ దాటి మాలి దేశపు నకిలీ పాస్‌పోర్ట్‌లు తయారుచేయించడానికే చాలా నగదు ఖర్చయిపోతుంది. ఆ తర్వాత దారి దోపిడీగాళ్ళను తప్పించుకుంటూ సహారా ఎడారిలో అతి వేగంతో పోతున్న కిక్కిరిసిన వాహనం ఇసుక దిబ్బల మధ్యలోనే వారిని వదిలేస్తుంది. అక్కడనుంచి ఒక నమ్మదగని గైడ్ సంరక్షణలో కాలినడకన లిబియా వరకు వెళ్ళాలి. తాగునీరు కూడా తగినంత లేకుండా భయంకరమైన వేడిని భరిస్తూ వెళ్ళడం అందరికీ సాధ్యపడదు. వీలుకాక అక్కడే కూలబడ్డ స్త్రీ పురుషులు ఆ ఎడారిలో అనామక శవాలుగా కుళ్ళిపోవాల్సిందే. లిబియా గార్డులు వళ్ళంతా తనిఖీ చేసి డబ్బు దోచేసుకుంటారు. కనుక డబ్బును ప్లాస్టిక్‌లో చుట్టి మలద్వారంలోకి జొనిపి దాచుకోమని నిగర్ దేశపు ఏజెంట్ చెబుతాడు. కానీ తీరా చూస్తే తెలివి మీరిన లిబియా గార్డులు వచ్చిన వారందరి చేతా ఓ మందును తాగించి, వారి మలాన్ని పరీక్షిస్తారు. దొరికిపోయిన వారి దగ్గర డబ్బు తీసుకుని జైల్లో వేస్తారు. అలా మౌస్సా జైలుపాలౌతాడు. మరి కొందర్ని చిత్రహింసలకు గురిచేస్తూ, తమ ఇంటి వారికి ఫోన్ చేసి డబ్బు రప్పించమని ఆజ్ఞాపిస్తారు. డబ్బు తెప్పించలేక సెయిదూ

కట్టు బానిసగా చాలా రోజులు పనిచేస్తాడు. చివరికి పోల్చుకోలేనంత అనారోగ్య స్థితిలో బయటపడి ఒక పెద్దాయన ప్రోద్బలంతో నిర్మాణ కూలీగా లిబియాలో పనిచేస్తూ, తన సోదరుడు మౌస్సా కోసం గాలిస్తుంటాడు. జైలు నుండి పారిపోయే క్రమంలో మౌస్సాకు కాలిలో బులెట్ గాయమౌతుంది. రహస్యంగా ఒక సెనెగల్ వాసుల బస్తీలో తలదాచుకున్న మౌస్సాను కలుస్తాడు సెయిదూ. మౌసాకు దొంగతనంగా ప్రాథమిక చికిత్స చేయించాక, సర్జరీ కోసం, తమ కల నెరవేర్చుకోవడం కోసం ఇటలీ వెళ్ళడానికి వారిద్దరూ చివరి ప్రయత్నం చేస్తారు. ఏజెంట్లకు తగినంత డబ్బు ఇచ్చుకోలేక ఇటలీకి పోయే ఓడకు తనే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు సెయిదూ. ఓడ నడిపే అనుభవం లేకపోయినా ఒక రోజంతా నిద్రలేకుండా భయంకరమైన సముద్రయానం చేసి, చివరకు కళ్ళెదుట ఇటలీలోని సిసిలీ రేవు కనిపించే సరికి ఆనందాన్ని తట్టుకోలేక, "నేనే కెప్టెన్ని. ఒక్క ప్రయాణికుడికి కూడా హాని జరగనివ్వకుండా గమ్యానికి చేర్చిన ధీరుణ్ణి!" అని గొంతుచించుకుని అరుస్తాడు సెయిదూ.

"ఈ సినిమాను కొన్ని యదార్థ గాథల ఆధారంగా రూపొందించాము. యూరప్ వ్యక్తులుగా శరణార్థుల పట్ల మన దృక్కోణం ఒకలా వుంటుంది. కానీ ఈ సినిమాను బాధితుల దృష్టి కోణం నుండి నిర్మించాము" అని చెబుతాడు దర్శకుడు మాటియో గారోన్. పాలో కార్నెరా కెమెరా వివిధ భౌగోళిక ప్రాంతాల్ని కథనానికి అనుగుణంగా చిత్రీకరిస్తుంది. దుర్భర వాస్తవం అందమైన కలల సౌధానికి ఎలా దారితీస్తుందో చెప్పే రెండు దృశ్యాలు దర్శకుడి ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తాయి.

ఈ చిత్రం 80వ వెనిస్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గోల్డెన్ లయన్ కోసం పోటీ పడింది. మాటియో గారోన్ ఉత్తమ దర్శకుడిగా, సెయిదూ పాత్రను పోషించిన సెయిదూ సర్ ఉత్తమ నటుడిగా మార్సెల్లో మాస్ట్రోయాని అవార్డులను అందుకున్నారు. ఉత్తమ అంతర్జాతీయ చలనచిత్ర విభాగంలో ఇటాలియన్ ఎంట్రీగా అకాడమీ అవార్డ్సులోనూ, గోల్డెన్ గ్లోబ్ అవార్డ్సులోనూ పాల్గొంది ఈ సినిమా. ఇంకా లెక్కలేనన్ని అవార్డులు గెల్చుకుంది.

### Clara (2023) (రొమానియా) :

విడాకులు తీసుకున్న సింగిల్ మదర్ క్లారా. ఓ రొమానియా గ్రామంలో తన ముసలి తండ్రి, 12 ఏళ్ల కొడుకుతో కలిసి జీవిస్తోంది. ఆమె ఒక ప్రైవేట్ స్కూల్లో టెంపరరీ టీచర్‌గా పనిచేసేది. దేశంలో ఆర్థిక మాంద్యం కారణంగా స్కూల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. కాబట్టి ఇక 'నీ అవసరం లేద'ని స్కూలు అధికారులు చెప్పేశారు. కానీ జీవితాన్ని నెట్టుకు రావాలంటే జీతం కావాలి. దాని కోసం సొంత కొడుకును ముసలి తండ్రి పర్యవేక్షణలో వదిలేసి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో జర్మనీలోని ఉల్మ్ అనే పట్టణంలో ఓ సింగల్ ఫాదర్ కుమార్తెకు 'బేబీ సిట్టర్'గా వుద్యోగం వెతుక్కుని వెళిపోతుందామె. ఆరేళ్ల జొహన్నాకు సొంత తల్లికి మించిన ప్రేమను పంచుతూ తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తుంది క్లారా. సొంత వూరికీ, ఉద్యోగం చేస్తున్న వూరికీ మధ్య ఒకే నది ప్రవహిస్తోంది. ఆ నది పేరు డన్యూబ్. ఆ నదిని చూసే ప్రతిసారీ క్లారాకు తన వూరు గుర్తొస్తుంది. తన వారు గుర్తొస్తారు. ముఖ్యంగా తన కుమారుడు గుర్తొచ్చి మనసు కకావికలమైపోతుంది. ఓ రోజు రొమానియా నుండి క్లారాకు ఒక దుర్వార్త అందుతుంది – మూడు రోజులుగా తన కొడుకు కనిపించడం లేదనీ, పోలీసులు కూడా ఆచూకీ కనుక్కోలేక పోయారనీ! ఆ వార్త వినగానే క్లారా మనసు తన కుమారుడి కోసం విలవిల్లాడుతుంది. కొద్ది రోజులు సెలవు ఇవ్వమని తన యజమానితో ప్రాధేయపడుతుంది. వీలైనంత త్వరగా తిరిగి రావాలన్న షరతుపై సెలవు మంజూరౌతుంది. జొహన్నా పాప మాత్రం క్లారా ఆంటీని వదిలేలా లేదు. త్వరగా వస్తానని ఆమెకు నచ్చజెప్పి బస్సులో రొమానియాకు బయల్దేరుతుంది క్లారా.

దారి పొడుగునా ఆమె ప్రయాణం డన్యూబ్ నదికి సమాంతరంగా వున్న రోడ్డుపైనే సాగుతుంది. తమ వూరు చేరేసరికి తన బిడ్డ పోలీసులకు దొరికాడనీ, చేతులకు బాగా గాయాలు తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడనీ తెలుస్తుంది. ఆస్పత్రికి పోతే ఆ అబ్బాయి తన తల్లితో మాట్లాడడానికి నిరాకరిస్తాడు. చాలా కోపంగా ఉన్నాడతడు. తనకు దూరంగా ఉన్నందుకు అతడికి తల్లిపై కోపం. తన తల్లి వద్దకు చేరాలని ఒక చిన్న పడవను వేసుకుని డన్యూబ్ నది ప్రవాహానికి విరుద్ధంగా జర్మనీ వైపు ప్రయాణానికి సిద్ధపడి ప్రమాదంలో పడ్డాడు. నది ఒడ్డున పొదల్లో చిక్కుకున్న ఆ పడవను కనుక్కోవడానికి పోలీసులకు కూడా సమయం పట్టింది.

ఆసుపత్రి నుండి ఇంటికి తెచ్చాక తన కుమారుడిని శాంత పరచడానికీ, తన పరిస్థితిని అర్థం చేయడానికీ చాలా ప్రయత్నిస్తుంది క్లారా. అటునుండి జొహాన్నా పాప మాటిమాటికీ క్లారాకు వీడియో కాల్ చేసి, 'ఎప్పుడు తిరిగొస్తావని' వత్తిడి చేస్తుంటుంది. తన తల్లి మొబైల్‌లో జొహన్నా మొహం చూడగానే క్లారా కుమారుడికి తన తల్లిపై విపరీతమైన కోపం ముంచుకొస్తుంది. క్లారాకు ఏమీ చేయలేని స్థితి. కొడుకు కోసం స్వదేశంలో ఎలాంటి ఉద్యోగానికైనా సిద్ధపడినా, అర్జెంటుగా దొరికే అవకాశమేదీ కన్పించదు. వేగంగా తిరిగి రమ్మని అట్నుంచి డిమాండు పెరుగుతూనే వుంది. మరో వైపు పిల్లాడి బాధ్యతను తాతకు చట్టబద్ధంగా అప్పజెప్పక పోతే, ఆ పిల్లాడిని అనాథ శరణాలయంలో చేర్చుతామని ప్రభుత్వ సంక్షేమ శాఖ వారు హెచ్చరిస్తున్నారు. చివరికి వయసులో చిన్నవాడైన కొడుకే పెద్ద మనసుతో తల్లికి బస్ స్టాండులో వీడ్కోలు చెబుతాడు. క్లారా పాత్రను వేసిన ఓల్గా తొరొక్ అనే నటి రెండు రకాల మాతృత్వాల మధ్య సంఘర్షణను తన మౌన భావాల్లో కరుణరసాత్మకంగా పలికించింది. క్లారా లాంటి 5,00,000 మంది విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, వారిలో అత్యధిక భాగం తమ పిల్లలను స్వదేశంలోనే వదిలేశారనీ తెరపై ఎపిలాగ్ కనిపిస్తుంది. దర్శకుడు సబిన్ దొరొహొయ్ ఈ సినిమాను కోల్‌కతా ప్రేక్షకుల కోసం ప్రజెంట్ చేశాడు.

అక్రమ వలసదారులు, శరణార్థుల సమస్యలపై మరో ముఖ్యమైన, వివాదాస్పదమైన పోలాండ్ సినిమా!

### Green Border (2023) (Poland) (Dir: Agnieszka Holland):

గత కాలపు సోవియట్‌లో భాగమైన బెలారుస్ దేశ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకో. ఆయన 1994 నుండి ఆ దేశంలో అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఆ విధంగా యూరోపియన్ యూనియన్‌లో దీర్ఘకాలంగా పదవిలో వున్న వ్యక్తి ఆయన. ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణకు ఆయన వ్యతిరేకి. సరైన నిర్దిష్ట ప్రణాళిక లేకపోతే ప్రభుత్వ రంగం ఫ్రీ మార్కెట్‌తో పోటీపడలేదు. ఆ కారణంగా ఏర్పడిన సంక్షోభాన్ని తట్టుకోవడానికి

అతడు ఉద్యోగాల కుదింపు, సంక్షేమ పథకాల తగ్గింపు వంటి శ్రామిక వర్గ వ్యతిరేక చర్యలు చేపట్టాడు. సహజంగానే దానికి వ్యతిరేకంగా శ్రామికుల నుండి నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. అసలైన జాతీయ, అంతర్జాతీయ రైటిస్టులు ఈ పరిస్థితికి అజ్యం పోస్తారని మనకు తెలిసిందే. అలా చేసిన బాహ్య శత్రువుల్లో పోలాండ్‌లోని మితవాద ప్రభుత్వం, దాని వెనుక నాటో కూటమీ వున్నాయి.

బెలారుస్‌కు రష్యాతో చక్కని దోస్తీ వుంది. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా పక్షంలో బెలారుస్ ఉండటం వలన రష్యాతో పాటు బెలారుస్‌పై కూడా ఆర్థిక ప్రతిబంధకాలు విధించింది యురోపియన్ యునియన్. దీనికి పగ సాధింపుగా బెలారుస్ పాలకుడు ఒక ఎత్తుగడ వేశాడు. సిరియా, ఆఫ్ఘనిస్తాన్, సుడాన్ వంటి పశ్చిమాసియా, ఆఫ్రికా ఖండాల దేశాల శరణార్థులకు బెలారుస్ బోర్డర్ గుండా యూరోపియన్ యూనియన్‌లోకి చేరుకోవడానికి అపురూపమైన అవకాశం వుందని ప్రచారం చేయించాడు. సముద్రమార్గాల్లో యూరప్ చేరాలని బయల్దేరిన వారు దారిలోనే సముద్రంలో మునిగి చనిపోయిన సంఘటనలు మనకు తెలిసినవే. డైరెక్ట్‌గా విమానంలో బెలారుస్ చేరి, ఆ దేశపు బోర్డర్ గుండా యూరోపియన్ యూనియన్‌లోకి జొరబడడం బ్రహ్మాండమైనదిగా చాలా మంది శరణార్థులకు అనిపించింది. బెలారుస్ నుండి పోలాండ్, లిథువానియా, లాట్వియా దేశాలకు వెళ్ళే అవకాశం వుంది. అందుకే చాలా మంది శరణార్థులు బెలారస్‌కు చేరసాగారు. కానీ లుకాషెంకో చేపట్టిన ఈ చర్య యూరప్‌ను అస్థిర పరిచడానికి చేసిందని యూరోపియన్ యూనియన్ భావించింది. అందుకే పోలాండ్ తన దేశంలోకి జొరబడిన శరణార్థులను వెంటనే బెలారుస్‌లోకి వెనక్కి పంపాలని నిర్ణయించుకుంది. 'గ్రీన్ బోర్డర్' సినిమాను అర్థం చేసుకోవాలంటే ఈ ఉపోద్ఘాతం అవసరం.

**సినిమా కథ (నిజ సంఘటనే) :**

డాక్యుమెంటరీ మాదిరిగా సాగే ఈ నలుపు తెలుపుల థ్రిల్లర్ బెలారుస్ – పోలాండ్ బోర్డర్ సంక్షోభాన్ని భిన్న కోణాల నుండి విశ్లేషిస్తుంది. మొదటిది శరణార్థుల కోణం. అమీనా, బషీర్, బషీర్ ముసలి తండ్రి, వారి ఇద్దరు పిల్లలతో కూడిన సిరియన్ కుటుంబం విమానంలో బెలారుస్ వస్తారు. బోర్డర్ వైపు వెళ్తున్నప్పుడు వారికి లైలా అనే ఆఫ్ఘన్ టీచర్‌తో, అలాంటి మరికొందరితో పరిచయమౌతుంది. వారంతా చాలా ఆశతో పోలాండ్ బోర్డర్ దాటుతారు. అక్కడి నుంచి పోలాండ్ దేశపు చిత్తడి అడవి ప్రారంభమౌతుంది. దీన్నే 'గ్రీన్ బోర్డర్' అంటారు. ఆ అడవి దాటుతుండగా వారికి పోలాండ్ బోర్డర్ గార్డుల నుండి వ్యతిరేకత ఎదురౌతుంది. ఎటువంటి మానవ హక్కుల్నీ లెక్కచేయకుండా వారిని తిరిగి బెలారుస్ బోర్డర్‌లోకి విసిరేస్తారు పోలాండ్ గార్డులు. బెలారుస్ గార్డులు వారిని మళ్ళీ పోలాండ్‌లోకి పంపడం, పోలాండ్ వాళ్ళు మళ్ళీ వారిని ఫుట్బాల్ ఆడుకుంటున్నట్టు బెలారుస్‌లోకి పంపడం – ఈ సైనిక చర్యల్లో ఆ అభాగ్యులు సమిధలు కావడం, ఆ దృశ్యాలను మనం సినిమా మొత్తం గుండెను పిడికిలిలో పట్టుకుని చూడాల్సి ఉంటుంది.

పోలాండ్ అడవిని దాటాక లైలాకు పొలంలో పనిచేస్తున్న ఒక పోలాండ్ రైతు కనిపిస్తాడు. నీల్లడిగితే నీళ్ళు ఇస్తాడు. ఇచ్చాక ఒక ఇంటి వైపు చూపి అక్కడ మరికొంత సహాయం దొరుకుతుందని చెబుతాడు. ఆమె అటువైపు వెళుతుండగా ఎవరికో ఫోన్ చేస్తాడు. ఆమె అపాయం గ్రహించి అక్కడ్నుంచి పరుగు పెడుతుంది. బోర్డర్ గార్డులు ఆమెను వెంబడిస్తారు. ఒక బెలారుస్ గార్డుకు ఒక బాటిల్ నీళ్ళు అడిగితే అతడు బోలెడు డబ్బు గుంజుకుంటాడు. ఆ తర్వాత ఆ బాటిల్ నీరు కూడా నేలపాలు చేస్తాడు. ఏ మాత్రం దయచూపినా, ఈ శరణార్థులు పోలాండ్ వైపు కదలరని బెలారుస్ గార్డుల భయం. బషీర్ చిన్న కొడుకును తీసుకుని లైలా పోలండులోని మరో దిశలో పారిపోతుంది. కానీ దురదృష్టవశాత్తూ ఒక నీటి ఊబిలో చిక్కుకుంటుంది. ఆ చిన్నబ్బాయి అందులో మునిగి చనిపోతాడు. లైలాను ఓ పోలాండ్ మహిళ కాపాడుతుంది. ఆ ప్రయాణంలో కొంతమంది శరణార్థులు తిండిలేక చనిపోతారు. ఇంకొందరు చలిలో గడ్డకట్టి చనిపోతారు. ఆ దృశ్యాలన్నీ చూడటం చాలా కష్టమైన పని. ఈ భయంకర దృశ్యాలు ప్రపంచానికి తెలియకూడదని 'గ్రీన్ బోర్డర్'లోకి జర్నలిస్టులను అనుమతించడం లేదు.

ఇక సినిమాలోని రెండవ విభాగం పోలాండ్ వైపు వ్యక్తుల దృష్టి కోణాన్ని ఆవిష్కరిస్తుంది. జాన్ అనే పోలిష్ బోర్డర్ గార్డు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శరణార్థులపై ఉక్కుపాదం మోపుతూ వారిని సతాయిస్తుంటాడు. కానీ అతడి వ్యక్తిగత జీవితం కొంత మానవీయంగా వుంటుంది. గర్భవతి అయిన అతని భార్య అతడు శరణార్థులను తీవ్రంగా కొడుతున్న వైరల్ వీడియోను చూస్తుంది. ఆ విషయంపై అతడ్ని ప్రశ్నిస్తుంది. అక్కడి నుంచి అతడి ఆలోచనా ధోరణిలో కొంత మార్పు వస్తుంది. లైలాను తన ఇంటి వెనుక ఉన్న చిత్తడి అడవి ఊబి నుండి రక్షిస్తుంది జూలియా అనే పోలిష్ మహిళ. కొంతమంది రాడికల్ పోలిష్ యువ కార్యకర్తలు రహస్యంగా శరణార్థులకు శీతల వస్త్రాలూ, బెడ్డింగులూ, ఆహారపానీయాలు అందిస్తుంటారు. జూలియా ఆ కార్యకర్తలతో కలిసి పనిచేస్తూ కొంత మనశ్శాంతి పొందుతుంది. ఒక ట్రక్కులో రహస్యంగా యూరప్‌లోకి పోతున్న బషీర్ పరివారాన్ని చూసీ, చూడనట్టు వదిలేస్తాడు జాన్. ఉక్రెయిన్ శరణార్థులు లక్షలాది మందికి ఆశ్రయం కల్పిస్తున్న పోలాండ్ దేశం కొద్ది వేల మంది ముస్లిం శరణార్థులను భరించలేక పోతోంది అని తెరపై ఎపిలాగ్ రాస్తూ, ఆ దేశపు ద్వంద్వ వైఖరిని విమర్శిస్తుంది దర్శకురాలు.

ఈ సినిమా పోలాండ్‌కు విరుద్ధంగా ప్రచారం చేస్తున్న సినిమా అంటూ పోలాండ్ ప్రభుత్వం ఈ వృద్ధ దర్శకురాలిని వేధింపులకు గురి చేస్తోంది. గతంలో హోలోకాస్ట్ గురించి, ఇతర సంఘటనల గురించి 'Europa Europa' (1991), 'In Darkness' (2011) లాంటి సినిమాలు నిర్మించి మానవత్వం వైపు నిలబడ్డ ఈ దర్శకురాలు వెనక్కి తగ్గేది లేదని చెబుతోంది. ప్రగతిశీల సమాజం ఆమెకు సంఘీభావం తెలుపుతోంది.

జీవితాంతం శ్రామిక వర్గాల కోసమే సినిమాలు నిర్మించిన దర్శకుడు కెన్ లోచ్ తన 87వ ఏట నిర్మించిన సినిమా 'ది ఓల్డ్ ఓక్'. ఇదే తన ఆఖరు సినిమా అని చెప్పుకుంటున్నాడు. ఈ సినిమా ఈశాన్య ఇంగ్లాండులోని ఒక మైనింగ్ టౌన్‌కి సంబంధించిన కథ. సిరియా నుంచి ఆ ఊరిలో స్థిరవాసం ఏర్పరుచుకోవడానికి వచ్చిన సిరియన్ పరివారాలకూ, స్థానికులకూ మధ్య సంఘర్షణలకు సంబంధించిన మానవీయమైన కథ ఇది. ఒక వైపు ఇది శరణార్థుల కథ అయినా, వైషమ్యాలు పెరుగుతున్న ప్రపంచలో కార్మికుల వర్గ దృక్పథం ఎలా వుండాలో చెప్పిన కథ.

**(మిగతావి వచ్చే సంచికలో)** ✺

# చైతన్యవాహిని

**27-11-23, విజయవాడ :**

కార్పొరేట్ అనుకూల మూడు వ్యవసాయ నల్లచట్టాల రద్దు కోరుతూ మన దేశ రైతాంగం చలికీ, ఎండకీ, వ్యాపిస్తున్న కరోనాకు భయపడకుండా 12 నెలల 15 రోజులపాటు ఉద్యమాన్ని నిర్వహించారు. ఆ రైతాంగ ఉద్యమానికి మద్దతుగా, సంఘీభావంగా కవితలు, పాటలతో 'రైతు భేరి' సంకలనాన్ని జనసాహితి ప్రచురించింది.

నవంబర్ 27, 28 తేదీలలో విజయవాడలో జరిగిన రైతాంగ మహాధర్నా సందర్భంగా విజయవాడలోని కిళ్ళీ బీడీ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఉదయం 9 గం॥కు రైతుకూలీల మధ్య 'రైతు భేరి' కవితా సంకలనం ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభను జనసాహితి ప్రధాన కార్యదర్శి అరుణ నిర్వహించారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన రైతుకూలీల నాయకుడు, 'ప్రజాసాహితి' ప్రచారకుడు మారెళ్ళ అంజిరెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతుకూలీల సమస్యల మీద కవితల, పాటల సంకలనం రావటం ఆనందదాయకం అన్నారు. ప్రజల సమస్యల్ని రచయితలు పట్టించుకోవాలని – రైతుకూలీలను ఆలోచింపచేసే రచనలు, స్ఫూర్తినిచ్చే రచనలు ఇంకా రావాలన్నారు. ఈ సంకలనం ముద్రించి నందుకు జనసాహితికి అభినందనలు తెలియచేశారు. మొదటి కాపీలను విజయనగరం ఆదివాసీ సంఘం నాయకులు పీడిక అప్పారావుకు, వెంకటక్‌కు, కొండమొదలు గ్రామ సర్పంచ్ వేట్ల విజయకు, రైతుకూలీ సంఘం కార్యదర్శి ఎమ్.ఎస్. నాగరాజుకు అందించారు. 'రైతు భేరి' సంకలనం విశేషాలను, రైతు ఉద్యమం సాగిన తీరును, అంతిమ విజయం దాకా సాగే పోరులో సంఘీభావంగా, మద్దతుగా కలసి నడుస్తామని జనసాహితి అధ్యక్షుడు దివికుమార్ సభకు తెలియచేశారు.

**22-12-23, గుంటూరు :**

అరండల్ పేట వైన్స్ డీలర్స్ అసోసియేషన్ కళ్యాణమండపంలో విద్యా, ఉపాధి రంగాల సంక్షోభం – పాలకుల విధానాలు విద్యార్థి, యువజనుల కర్తవ్యాలు అంశంపై పిడిఎస్ఓ – ఎన్‌వైఎస్ రాష్ట్ర సదస్సు విజయవంతంగా జరిగింది. ఉదయం 10 గంటలకు హాల్ నుంచి మొదలైన ప్రదర్శన శంకర్ విలాస్ సెంటర్ వరకు అక్కడి నుండి తిరిగి హాల్ వరకు గంటపాటు PDSO, NYS జండాలతో విద్యార్థి, యువజనుల నినాదాల హోరుతో గంటపాటు ప్రదర్శన నిర్వహించారు.

ఈ సదస్సుకు ప్రారంభోపన్యాసకునిగా విచ్చేసిన జనసాహితి రాష్ట్ర అధ్యక్షులు దివికుమార్‌గారు మాట్లాడుతూ మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడులను, విదేశ కంపెనీలకు తీసుకువస్తున్నారు తప్ప ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను కూడా స్థాపించడం లేదు. విశాఖ ఉక్కు ఉద్యమం లాంటి ఉద్యమాలు చేసినప్పుడే పాలకులు భయపడ్డారు. అలాంటి ఉద్యమాలు విద్యార్థి యువతరం చేసి మన సమస్యలను పరిష్కరించుకోవాలి" విద్యార్థి, యువత అంతా విదేశీ కంపెనీలలో మేధో కూలీలుగా మారుతున్నారు అన్నారు.

ప్రధాన వక్తగా విచ్చేసిన కేంద్ర కేంద్ర రాష్ట్ర మాజీ సలహాదారు వైవిఎస్ మహాదేవ్‌గారు మాట్లాడుతూ "వందల మంది బలిదానాలతో ఏర్పడిన వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను అన్యాయంగా ప్రవేటు వాళ్లకి అమ్మేస్తున్నారు. మన దేశం నుంచి కొన్ని లక్షల కోట్లు గ్యాస్ రూపంలో విదేశాలని దేశాలకి తరలిపోతుంది. రాష్ట్ర విభజన చేసారు, కానీ మన రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వలేదు. పోలవరం నిర్వాసితులకు వసతిని కల్పించలేదు అన్నారు.

PDSO రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సురేష్ మాట్లాడుతూ "విద్యా కార్పోరేటీకరణ, కాషాయికరణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం – 2020 తీసుకువచ్చింది. దీంతో ఎన్.సి.ఇ.ఆర్.టి సిలబస్‌లో హిందూత్వ భావజాలాన్ని చొప్పిస్తూ, చరిత్ర వక్రీకరించి విద్యార్థు మెదళ్ళలో విషబీజాలు నాటుతున్నారు. మరోవైపు రాష్ట్రాన్ని విద్యారంగ ప్రయోగశాలగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మార్చి అటు ఉపాధ్యాయులను, ఇటు విద్యార్థులను గందరగోలపరుస్తున్నారు. పాఠశాలల విలీనం పేరుతో అనేక పాఠశాలలను మూసివేసారు. అలాగే ఒక ఏడాదిలోనే సిలబస్ అనేక రకాల మార్పులకు గురి చేసి సిబిఎస్ఇ, ఐబి సిలబస్ అనీ, టోఫెల్ పరీక్షలనీ అస్తవ్యస్త విధానాలను పిల్లలపై బలవంతంగా రుద్దుతున్నారు. ప్రభుత్వ చర్యలతో గత రెండు సంవత్సరాలలో ఏడున్నర లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు బాట పట్టారు. జాతీయ విద్యా విధానం –2020 అమలులో భాగంగా విద్యను ప్రైవేటీకరించాలని చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన కర్తవ్యం విద్యార్థుల ముందు ఉందన్నారు.

నవయువసమాఖ్య (NYS) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె.భాషా గారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు, కార్పోరేట్ శక్తులకు అప్పగిస్తూ నిరుద్యోగ సైన్యాన్ని పెంచి పోషిస్తున్నారనీ, మరోవైపు కుల, మత ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ విద్యార్థి, యువతను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 50 వేల పోస్టులను, కేంద్రంలో ఉన్న 60 లక్షల పోస్టులను కేంద్ర, రాష్ట్ర పాలకులు భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. మెగా డిఎస్సీను నిర్వహించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వరంగ సంస్థలన్నీటిని అమ్మివేస్తూ నిరుద్యోగులకు ద్రోహం చేస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితులే కొనసాగితే దేశం అధోగతి పాలవుతుందని, ఈ పరిస్థితులను మార్చాల్సిన బాధ్యత ఈ దేశ యువశక్తిదేనన్నారు.

పిడిఎస్ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్. భాను అధ్యక్షత వహించిన, ఈ సదస్సులో 'ఉపాధ్యాయ' ప్రధాన సంపాదకులు ఎస్.కె. జిలానీ, సైకాలజిస్ట్ డా॥ బి. అరుణ, పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. భాస్కర్, ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదులు మాట్లాడారు.




**ఎద మీటిన రాగాలు (కవిత్వం) – కాశీవరపు వెంకట సుబ్బయ్య**

రాయలసీమ ప్రాంత ప్రజా జీవితాన్ని ఉద్వేగంతో కవిత్వీకరిస్తున్న కవి – కాశీవరపు వెంకట సుబ్బయ్య. ధత కరువు – ముష్టి కరువు కాటులకు విలవిలలాడిన, డొక్కల కరువు – వలస కరువు వేటులకు చెల్లా చెదురైన ప్రజా జీవన కల్లోలాలను తన కవిత్వంలో తెలిపారు. రాళ్ళసీమలో ఒళ్ళు పగిలిన నేలతల్లి నెర్రలకు, పర్రెలకు – తన కలం ప్రకంపించింది. గంజి కేంద్రాల వెనుక రాజకీయ చలనాలను, ప్రజలకు ధీరత్వం నూరిపోసింది. "అటా! ఇటా! ఎటువైపు?! ఖచ్చితంగా ప్రజల్ని చైతన్యపరిచే పోరాటాలను పదును పెట్టే అక్షరాల ఆకురాయి కావాలి – కవి!! 'మంచివైపే నా నడకెప్పుడూ' అనటంతోపాటు కనుక – శ్రామికవర్గ దృక్పథాన్ని ఎంత పదును పెట్టుకుంటే అక్షరం అగ్ని క్షిపణిగా అంత శక్తివంతమవుతుంది.

1/8 డెమ్మీ; 100 పుటలు; చైతన్య సాహిత్య కళావేదిక – ప్రొద్దుటూరు ప్రచురణ; వెల : రూ. 150/–; ప్రతులకు : కాశీవరపు కళావతి, డో.నెం. 5/319, విజయనగరం వీధి, ప్రొద్దుటూరు – 516360. కడపజిల్లా, ఆంధ్రప్రదేశ్. చరవాణి : 98498 00389. e-mail : kasivarapu.vs@gmail.com

**అక్షరమా నీకు వందనం (కవితాసంపుటి) – బంగారు వి.బి. ఆచార్యులు.**

అరసం ఏలూరుజిల్లా ప్రచురణ.

కవి తనకూ సమాజానికీ సమన్వయం కుదిరేదాకా చేసే అంతర్, బహిర్ సంఘర్షణే కవిత్వం అంటాడు చలం. భాషకు ఎలా సమష్టితత్వం వుందో ఆ భాషలో వ్యక్తమయ్యే సాహిత్యానికి కూడా సమష్టితత్వం వుంటుంది. ఆ సమష్టితత్త్వం శ్రామికవర్గానిదా? దోపిడి వర్గానిదా? అనేదాన్నిబట్టే ఆ సాహిత్యం ఉనికి, అస్తిత్వం బట్టే ఆ కవి (సాహిత్యకారుని) ఉనికి, అస్తిత్వం ఆధారపడి వుంటుందనే అటువంటి భావజాలాన్ని తన కవిత్వానికి ప్రాణస్పందనగా స్వీకరించిన కవి బంగారు వి.బి. ఆచార్యులు. 'శ్రమే జీవనం – శ్రమే సర్వస్వం – శ్రమలేనిదే ఏదీలేదు' అనే తాత్వికతను ఇందులో కవితలు ప్రతిబింబిస్తాయి. అందుకే – **"ఏ అక్షరమూ మా స్వార్జితం కాదు / ఏ పదమూ ఎవరికీ సొంతం కాదు"** అని తెగింపుగా చెప్పారీకవి. 'సాహిత్యం సొంత ఆస్తికాదు' అనే సామ్యవాద భావజాలాన్ని బలోపేతం చేసారు. ప్రగతిశీల భావజాలంతో వి.బి. ఆచార్యులు శ్రామికతత్వాన్ని నింపుకున్న కలంతో రాసిన కవితా సంపుటి ఇది.

1/8 డెమ్మీ; 131 పుటలు; అరసం ఏలూరు జిల్లా ప్రచురణ; తొలిముద్రణ : జులై 2023; వెల : 130/– ప్రతులకు : బంగారు వి.బి. ఆచార్యులు, హైదరాబాద్. చరవాణి : 98495 79569. బొల్లినేని నాగార్జునసాగర్, చరవాణి : 96764 25951. మరియు తెలుగు రాష్ట్రాల్లో అన్ని పుస్తక కేంద్రాల్లోనూ.

**మణిపూర్ మంటలు (కవితాగ్రహం) ద్విభాషా కవితాసంకలనం** – సంపాదకవర్గం : **కొమ్మాలపాటి శరచ్చంద్ర జ్యోతిశ్రీ, బొల్లినేని నాగార్జునసాగర్, బంగారు వి.బి. ఆచార్యులు.**

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, ఏలూరు జిల్లాశాఖ ముద్రించిన 'తెలుగు–హిందీ' (ద్విభాషా) కవితా సంకలనం ఇది. రాజకీయ, ఆర్థిక, దోపిడీవర్గ గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం రెండు తెగల మధ్య మండించిన కక్షలూ, హంతక దాడుల పర్యవసానాలే మహిళలపై పైశాచిక హింస. ఈ నేపథ్యంలో ఈ ద్విభాషా కవితా సంకలనంలో 18 కవితలున్నాయి. (తెలుగు సృజన, ఇంకా హిందీ అనువాదం కూడా) హిందీ అనువాదం చేసినవారు రమాసుందరి. "రాక్షసుల రాజ్యంలో / మానవత్వం మంట కలిసింది / నాగరికత నివ్వెర పోయింది" అంటూ కంచె చేను మేసిన వైనాన్ని కవిత్వీకరించారు. "మీ మీ ప్రతీకారాలకి మా శరీరమే కదరా యుద్ధభూమి! / అవును మాకున్నది ఒకే ఆయుధం – ఒకే ఒక్క శరీరం!" అంటూ శరీరమే ఆయుధంగా మారాల్సిన పరిస్థితుల తీవ్రతని ఈ కవితా సంకలనం ఎక్కుపెట్టింది. "కుకీలమే / కుక్కిన పేనులం కాదు / వేట మాకు ఆకలి కోసం / వేటు మీకు ఆక్రమణ కోసం" అంటూ తమ బతుకు తెరువు వేటను జవాబుగా నిలబెడతారు. మణిపూరు ప్రజల పోరాటాన్ని ఆవిష్కరించిందీ కవితా సంపుటం.

1/8 డెమ్మీ; 114 పుటలు; ఆం.ప్ర. అభ్యుదయ రచయితల సంఘం, ఏలూరు జిల్లా ప్రచురణ; తొలిముద్రణ : ఆగస్టు 2023. ప్రతులకు : బొల్లినేని నాగార్జునసాగర్ (చరవాణి : 96764 25951), విశాలాంధ్ర, నవచేతన మరియు అన్ని పుస్తక కేంద్రాల్లో.

**మార్పు కోసం (వ్యాసాలు) – ప్రొ॥ జి. హరగోపాల్**

ఇవాళ భారతదేశం అర్ధఫాసిస్టు దశలో వుందనీ, ఎప్పుడూ కూడా ప్రజాస్వామిక శక్తులకు, ప్రగతి నిరోధక శక్తులకు ఘర్షణ జరుగుతూనే వుంటుందనీ – చెప్తున్న ప్రొ॥ హరగోపాల్ ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాన్ని – దాని వెనుక కారణాల్నీ తన వ్యాసాల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రజలకు అవగాహన అందిస్తున్నారు.

ఈ 'మార్పు కోసం' పుస్తకంలో 31 వ్యాసాలున్నాయి. పాలమూరు అధ్యయన వేదిక తరపున ప్రచురించారు. ఆంధ్రలో మారుతున్న రాజకీయాలు, ఎన్నికల తీరుతెన్నులు, ప్రపంచబ్యాంకు అప్పు ప్రధానం తెలుగు నేలపై ఎంత వుందన్న విశ్లేషణ 'మనుషులు విచ్చిన్నతను అధిగమించాలి' అంటూ విశ్లేషణ చేశారు. కరోనా నేర్పుతున్న కఠిన పాఠాలూ చెప్పారు. ఉచితాల అంతర్ధానం, నిర్బంధ చట్టాల వెనుక ఫాసిస్టు దాడులు – ఇలా దేశాన్ని పట్టి పల్లారుస్తున్న అనేక సమస్యలపై ఈ పుస్తకంలో వ్యాసాలున్నాయి.

1/8 డెమ్మీ; 160 పుటలు, వెల : 150/– పాలమూరు అధ్యయన వేదిక, మహబూబ్‌నగర్ జిల్లా ప్రచురణ; తొలిముద్రణ : జులై 2022. జులై 2023. ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రాల్లో.

**(ఇంకా వున్నాయి)** ✷

## నిజాలను నిర్భయంగా వెల్లడించిన ఆస్ట్రేలియా పాత్రికేయుడు జాన్ పిల్గెర్ మరణం

ఆస్ట్రేలియాకు చెందిన ప్రసిద్ధ పాత్రికేయుడు, రచయిత డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాత జాల్ పిల్గెర్ (John Pilger). తన 84వ యేట 30 డిసెంబరు 2023న మరణించారు. ఆయన సిడ్నీ ప్రాంతంలోని బొండిలో 9-10-1939న జన్మించారు.

ఆస్ట్రేలియాకు చెందిన పలు పత్రికలలో పనిచేసి ఇంగ్లండ్‌కు వెళ్ళి 1962 నుండి లండన్ కేంద్రంగా స్థిరపడ్డారు. యుద్ధ ప్రాంతాలలో విలేకరిగా వియత్నాం, కంబోడియా, బంగ్లాదేశ్, బయఫ్రాలలో పనిచేశారు. ఇంగ్లండ్‌లో బ్రిటిష్ యునైటెడ్ ప్రెస్, రాయిటర్, డెయిలీ మిర్రర్, న్యూస్ ఆన్ సండేలలో పనిచేశారు. 'న్యూ స్టేట్స్‌మన్', 'గార్డియన్' పత్రికలలో వ్యాసాలు రాసేవారు.

ప్రపంచవ్యాప్తంగా అణచబడ్డ ప్రజలపక్షాన నిలబడి వియత్నాం, కాంబోడియా, టీమీర్ వెస్టి, డియాగో గార్సియా, ఆఫ్రికా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, పాలస్తీనా, ఆస్ట్రేలియా మూలవాసుల బాధల గాథలను వినిపించాడు.

పాశ్చాత్య సామ్రాజ్యవాదపు, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్య వాదపు అవినీతికరమైన దుర్మార్గాలను బట్టబయలు చేశాడు. 50 డాక్యుమెంటరీలను నిర్మించాడు. 11 పుస్తకాలు రచించాడు.

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత అమెరికా 50 దేశాలలో ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలద్రోయడానికి 20 దేశాలలో జాతీయ ఉద్యమాలను అణచివేయడానికి చేసిన ప్రయత్నాలను ఆయన దుయ్యబట్టాడు. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత అమెరికా 52 దేశాలపై దాడి చేసిందని విమర్శించాడు. పాలస్తీనాను సమర్థిస్తున్న పిల్గెరును 1985లో డైలీ మిర్రర్ నుండి ఆనాటి నూతన యాదు యజమాని రాబర్ట్ మాక్స్‌విల్ తొలగించాడు.

## పాలస్తీనా ప్రజలపై దాడులను వ్యతిరేకిస్తూ 'న్యూయార్క్ టైమ్స్' మాగజైన్ కవిత్వ విభాగపు సంపాదకురాలు ఆనీ బోయర్ రాజీనామా!

'యుద్ధాలను ప్రజ్వలింపచేసే అబద్ధాల ప్రచారం వద్దు' అంటూ పులిట్జర్ బహుమతి గ్రహీత, 50 ఏళ్ళ ఆనీ బోయర్ 16 నవంబర్‌న తన పత్రికా ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆమె తన బహిరంగ ప్రకటనలో "అమెరికా మద్దతుతో ఇజ్రేయెల్ చేస్తున్న యుద్ధం ఎవరికీ ఉపయోగపడదు. ఇది పాలస్తీనా భూభాగంపై దాడులు, క్షిపణులతో దాడులు మాత్రమే కాదు. దశాబ్దాల నుండి తమ భూములను ఆక్రమిస్తున్న వారికి వ్యతిరేకంగా తమపై విధించిన ఆంక్షలనూ, నిఘాలనూ, చక్రబంధాలనూ, జైలు నిర్బంధాలనూ, చిత్రహింసలనూ ప్రతిఘటిస్తున్న ప్రజల మీద నిరంతర విధ్వంసకాండ కొనసాగింపు కూడా.

"నరకప్రాయమైన వార్తలను సుందరమైన కవితలుగా రూపొం దించలేను. యుద్ధాలను ప్రజ్వలింపచేసే అబద్ధాలను ప్రచారం చేయలేను.

"ఈ యుద్ధాలు ఆయుధ ఉత్పత్తిదారులకు బ్రహ్మాండమైన లాభాలను ఆర్జించిపెడతాయి".

నవంబర్ 3న ఇదే పత్రిక మరొక సంపాదకురాలు జాస్మిన్ హ్యూస్, రాజీనామా చేసి; - 'గాజాపై యుద్ధానికి వ్యతిరేక రచయితల' బహిరంగ లేఖపై సంతకం చేశారు.

జర్మనీలో జరిగే ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకమైన 16వ చిత్రకళా ప్రదర్శన, ఎన్నిక కమిటీలోని సభ్యుడు రంజిత్ హోస్కోటి. తనను 'సెమిటిజం వ్యతిరేకి' అని ఒక జర్మన్ దినపత్రిక చేసిన ఆరోపణను తిరస్కరిస్తూ తన పదవికి రాజీనామా చేశాడు. "ఇజ్రాయెల్ సిద్ధాంతమైన జియోనిజంను వ్యతిరేకించడం - సెమిటిజాన్ని వ్యతిరేకించడంగా భావించరాదు' అని తన రాజీనామాలో పేర్కొన్నారు.

## ఆదాయపు పన్ను శాఖలో ఉద్యోగాలు..

ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. ముంబయిలోని ఆదాయపు పన్ను శాఖ ముంబయి రీజియన్ జాబ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 291 స్పోర్ట్స్ కోటా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల కోసం క్రీడాకారుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ పోస్టులకు అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పోస్టులకు అప్లయ్ చేసుకునేందుకు జనవరి 19, 2024 చివరి తేదీ. కాబట్టి అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు త్వరపడండి. పూర్తి వివరాల కోసం https://incometaxmumbai.gov.in ఈ వెబ్‌సైట్‌ను సంప్రదించగలరు.

## పదో తరగతి అర్హతతో సెంట్రల్ బ్యాంకులో ఉద్యోగాలు..

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైంది. కేవలం పదోతరగతి అర్హతతోనే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ముంబయిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 484 పోస్టులతో నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 484 పోస్టులను భర్తీ చేయనున్నట్లు సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. జనవరి 9వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పూర్తి వివరాల కోసం https://centralbankofindia.co.in ఈ వెబ్‌సైట్‌ను సంప్రదించగలరు.

కవిత

# డిసెంబర్ 13 ఘటనలు

- రవి

మనోరంజన్.. సాగర్..నీలమ్...అమోల్...
పేర్లు ఏవైతేనేం?!
గౌడ.. శర్మ..వర్మ.. షిండే...
పుట్టిన కులాలు వేరైతేనేం?!
34.. 24.. 35.. 24...
ప్రాయాలు ఏవైతేనేం?!

కంప్యూటర్ ఇంజనీరింగ్ పట్టభద్రులొకరు...
దిగువ మధ్యతరగతి ఈతిబాధలతో
'పది' తో చదువునాపిన ఈ-రిక్షా డ్రైవర్ మరొకరు...
సంస్కృతంలో ఎంఫిల్ చేసి దశాబ్దమైనా
గౌరవప్రద వృత్తి వెతుకులాటలో ఒకరు...
జవానుగా దేశ రక్షణ చేయాలనే తపనను
పాలక ప్రేరేపిత కోవిడ్ సంక్షోభం హరించి వేయగా
వయోపరిమితి దాటిన నిస్పృహలో మరొకరు....
చదువులేమైతేనేం?! నేపథ్యాలేవైతేనేం?!
నిరుద్యోగ తీవ్రత, తీవ్ర అసంతృప్తి సామాన్యాంశాలు
లక్ష్యంతో పోలిక లేకున్నా,
భగత్‌సింగ్, గువేరాల ఆరాధకులు
ఒక సముఖానికి చేరిన 'ముఖ పుస్తక' స్నేహితులు

అంచలంచల సైనిక భద్రత,
అడుగడుగున తనిఖీ బండారాలు
యువత పూనికతో దిగదుడుపేనని చాటిన
డిసెంబర్ 13 ఘటనలు

★ ★ ★ ★

పార్లమెంటులో చొరబాటు సామూహిక నిర్ణయం
రంగుల పొగనొదలడం
కమ్ముకొస్తున్న కాషాయనీడకు సంకేతమేమో!
నిరుద్యోగ సమస్యపై గళమెత్తారు
నిరంకుశత్వం నశించాలని నినదించారు
మణిపూర్ అకృత్యాలను నిరసించారు

పదుగురిని గాయపరిచే యోచన లేదు
ప్రమాదకర విషవాయువు చిమ్మ లేదు
పారిపోయే ప్రయత్నం చేయలేదు
పరిణామాల తీవ్రత తెలియనిది కాదు
పోలీసుల చేత చిక్కినా మనోధైర్యం మాయలేదు

సామాజిక సమస్యలపై స్పందన
విస్తృత పుస్తకాధ్యయనం మినహా
నేర చరిత లేని వీరి ఈ చర్యలు -

గొప్ప వాగ్దానాల, వాగ్దాన భంగాల,
భంగచరితల పాలకుల మోసాలపై చురకలు!

ఉడుకునెత్తురు, నెత్తుటి జీవితాలు,
జీవిత సంఘర్షణాల కొరడా చరుపులు!
నిరంకుశత్వం, నిరుద్యోగం, మణిపూర్ ఘాతుకాలను
ఖండించిన విరుపులు!
చర్యల నుండి ఉద్దేశ్యాన్ని వేరు పరచరాదనే తాత్విక వినతులు!
వృత్తి-ఉపాధి-ఉద్యోగ లేమితో
కుతకుతలాడుతున్న యువజనుల
అగ్నిపర్వత అంతరంగాల ఆవిష్కరణలు!

ఎన్నికల రొచ్చులో చచ్చు రాజకీయ చర్చలలో
కాలం దొర్లించే నిస్తేజ, నిష్క్రియా ప్రతిపక్షాలు
ముప్పు ముంచుకొస్తోందని గొంతు చించుకోవటాలు...
మూల సమస్యకు మళ్లరని
మరో మారు రుజువైన సహజ స్వభావాలు...

★ ★ ★ ★

పోటీ ప్రవేశాలలో మేటి 'కోటా'లో
అనంతంగా విద్యార్థుల చావులు..
'అగ్నిపథ్' పై ఆగ్రహిస్తే నిర్బంధాలు, నిషేధాజ్ఞలు..
ఉద్యోగ పరీక్షల ఆటుపోట్లలో అక్కరకు రాని డిగ్రీలు..
దిక్కుతోచని 'ప్రవళిక'లనేకుల బలవన్మరణాలు..
'బర్రెలక్క'ల పేర్లతో రంగ ప్రవేశానికి
నీరాజనా రాజకీయాలు..
గంజాయి, మద్యం, మాఫియా, బెట్టింగ్ జూదాలు
క్లబ్బులు, పబ్బులు, పోర్న్, వ్యభిచారాలు
జంతువులు సైతం చీదరించుకొనే
జుగుప్సాకర చిత్ర రాజాలు
మత కుల ప్రాంతీయ భాషా తత్వాలు,
రౌడీ గుండాల హీరోయిజాలు
సవాలక్ష జాడ్యాలకు యువతను బలిచేసే
కుటిల పన్నాగాలు!
రెండు రోజుల సెలవు ఆశతో
ఐదు రోజుల పని వారంలో
ఏడు పదుల గంటల శ్రమదోపిడీకి
పాలకుల యత్నాలు!
పోరాట మార్గం కననీయక
యువత కనులకు కడుతున్న గంతలు!

★ ★ ★ ★

దోపిడీ పీడనల అంతమే
భగత్‌సింగ్ అంతిమ లక్ష్యం!
పీడితులను పోరాటాలకు ప్రోది చేయడమే
తక్షణ కర్తవ్యం!
యువత సుందర భవితకు
ఇదే అనివార్య అంతస్సూత్రం!

PRAJA SAAHITI January 2024 (TELUGU) Rs. 40/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2024-2026
No. of Pages : 68 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

# లెనిన్ లెనిన్ లెనిన్

– డా॥ ఆర్కే



లెనిన్ లెనిన్ లెనిన్
పదంపాడితే లెనిన్
కదం తొక్కితే లెనిన్
లెనిన్ లెనిన్ లెనిన్
కార్మిక విప్లవ శంఖారావంలో లెనిన్
రైతాంగ పోరాటాల వెల్లువలో లెనిన్
లెనిన్ లెనిన్ లెనిన్
పీడిత జన గుండెలలో లెనిన్
జాతుల విముక్తి యుద్ధాలలో లెనిన్
లెనిన్ లెనిన్ లెనిన్
నీవులేనిదెక్కడయ్యా
నిన్ను తలవని యోధుడెవరయ్యా
ఆనాటి నీమాట ఇప్పటికీ
మాకు స్వరాల మూట
ఆనాడు నీవు రాసిన అక్షరం
ఈనాడు మాకు రక్తాక్షరం
మా కలలలో నువ్వున్నావ్
మా జ్ఞాపకాలలో నువ్వున్నావ్
మా గుండె చప్పుళ్ళలో నువ్వున్నావ్
మా జీవన గమనంలో నువ్వున్నావ్
నీకు మరణం లేదు
నీ చరిత్రకు ముగింపు లేదు
సూర్య చంద్రులున్నంతకాలం
శ్రమ జీవులకు
వేగుచుక్కలా దారిచూపుతావ్.

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI